Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 112 • బుధవారం 2 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: శుద్ధ దశమి మ. 2.29 వరకు, అనంతరం ఏకాదశి; నక్షత్రం: అనూరాధ సా. 4.33 వరకు, అనంతరం జ్యేష్ఠ; అమృతకాలం: శే. 6.55 వరకు; వర్జ్యం: రా. 10.45 నుండి 12.31 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.42 నుండి 12.33 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు



నీతి ఆయోగ్‌కు పనగారియా గుడ్‌బై..!

కొలంబియా వర్సిటీ ప్రొఫెసర్‌గా ఉద్యోగం

2 లో

రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్‌గా

కుంతియా

కార్యదర్శిగా సతీష్ జార్కిహోలి

దిగ్విజయ్ ఇక మాజీ



రామచంద్ర కుంతియా



దిగ్విజయ్ సింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో కాంగ్రెస్ వ్యవహారాలు పర్యవేక్షించేందుకు ఎఐసీసీ కొత్త టీంను నియమించింది. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీగా డాక్టర్ రామచంద్ర కుంతియా, కార్య దర్శిగా సతీష్ జార్కిహోలి నియామకానికి ఎఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ మంగళవారం ఆమోదం తెలిపారు. ఇద్దరి నియామకంతో పాటు ప్రస్తుత ఇంచార్జీ దిగ్విజయ్ సింగ్ ఇంచార్జి బాధ్యతల నుంచి రిలీవ్ అయినట్లు ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ ద్వివేదీ మంగళవారం జారీ చేసిన నియామక ఉత్తర్వు ల్లో పేర్కొన్నారు. దిగ్విజయ్ స్థానంలో ఆయన వారసుడిగా కార్యదర్శిగా ఉన్న డాక్టర్ కుంతియాకే అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. ఒడిషాకు చెందిన కుంతియా గత నాలుగేళ్లుగా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. గడచిన 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి నమ్మినబంటుగా పేరుంది. నెమ్మదస్తుడనే పేరుంది. రాజ్యసభ సభ్యుడు కూడా అయిన కుంతియా రాష్ట్ర రాజకీయాలపై పూర్తి పట్టు ఉన్నందున ఆయన్ను ఇంచార్జీగా నియమిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర వ్యవహారాలు చూసిన గులాంనబీ ఆజాద్, దిగ్విజయ్ సింగ్‌లకు సహాయకుడిగా పని చేసినఅనుభవం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రాష్ట్ర వ్యవహారాల్లో దిగ్విజయ్‌కు సహాయకుడిగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలనే లక్ష్యంతో ఉన్న అధిష్టానం కుంతియానే సరైన వ్యక్తియని బాధ్యతలను ఆయనకే అప్పగించిందని చెబుతున్నారు. వివాదరహితుడిగా పేరున్న కుంతియా అందరు నాయకులతో కూడా సత్సంబంధాల ఉన్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్, సీఎల్పీ నాయకుడు 10వ పేజీలో...




నందుపై ప్రశ్నల వర్షం

10 లో

మూడు గంటల విచారణ
కాల్విన్, జిషన్‌లతో సంబంధాలపై ఆరా
తొలి అంకం పూర్తి
రెండో లిస్ట్ ఉన్నట్టా..? లేనట్టా..?
ఇకపై అంతా గోప్యమే

గురుకుల పోస్టుల వివాదం...

సర్కారుకు ఊరట



మహిళా అభ్యర్థులతో భర్తీకి మార్గం సుగమం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. గురుకుల విద్యాసంస్థల్లోని వివిధ పోస్టులను మహిళా అభ్యర్థులతో భర్తీ చేసే ప్రక్రియపై నిలుపుదల (స్టే) ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం ఎత్తివేసింది. దీంతో డిగ్రీ కళాశాలల అధ్యాపకుల నియామకం వ్రాత పరీక్షకు మార్గం సుగమమైంది..ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ అప్పీలు పై మంగళవారం విచారణ చేపట్టి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సింగిల్ జడ్జి వెలువరించిన స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ..జీవో 1274 జారీ చేయడంలో ప్రభుత్వం ఎలాంటి పొరపాటు చేయలేదని విన్నవించారు. గురుకుల కళాశాలల్లోని బోధన, బోధనేతర పోస్టులన్నీ మహిళలకు 10వ పేజీలో...

పాలాభిషేకాలు!


సీఎం కేసీఆర్ నిర్ణయంపై అభిమాన వెల్లువ

విద్యుత్ ఉద్యోగుల క్రమబద్ధీకరణతో ఆనందడోలికల్లో కుటుంబాలు
ఉద్యోగుల మనసుల్లో ఆరాధ్యుడిగా సరికొత్త గుర్తింపు



హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో కేసీఆర్ చిత్రపటానికి విద్యుత్ సిబ్బంది పాలాభిషేకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: పురాణ, చారిత్రక పురుషులు, పాలకులు, జాతిని సముద్ధరించిన నాయకులు, ప్రజల కోసం సర్వం త్యాగాలు చేసిన నేతలకు వివిధ సందర్భాల్లో పాలాభిషేకాలు చేయడం సహజం. అదికూడా వారు గతించిన అనంతరం వారి శిలా, కాంస్య విగ్రహాలకు ఈ పాలాభిషేకాలు జరుగుతుంటాయి. ఇవి వారిపట్ల తమకున్న అభిమానాన్నిచాటుకోవడంలో ఒక ప్రక్రియ. అయితే తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటాలకిప్పుడు పాలాభిషేకాలు జరుగుతున్నాయి. చేస్తున్నవారెవరూ ఆయన పార్టీ కార్యకర్తలుకారు. రాజకీయాభిమానులు కారు. ప్రభుత్వోద్యోగులు. సుమారు 20ఏళ్ళుగా చాలీచాలని జీతంతో ఔట్‌సోర్సింగ్ విధానంలో విద్యుత్‌శాఖలో రేయింబవళ్ళు శ్రమించి ఇంతకాలం పని చేసినవారు. ఇలాంటి 22వేలమందిని ఒకేసారి కెసిఆర్ పర్మినెంట్ చేసేశారు. వారి సేవల్ని రెగ్యులరైజ్ చేస్తున్నామన్న ఒకే ఒక ప్రకటనతో ఈ 22వేల కుటుంబాలే కాదు.. వారి మిత్రులు, బంధువులు కూడా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. దాన్నుంచి తేరుకునేందుక్కూడా వారికి చాలా సమయం పట్టింది. ఇది కలా.. లేక వైష్ణవ మాయా అంటూ ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఏళ్ళ తరబడి తమ ఉద్యోగాల్ని రెగ్యులరైజ్ చేయండంటూ పాలకులముందు మొకరిల్లినప్పటికీ ఎవరూ ఇంతకాలం పట్టించుకోలేదు. అలాంటిది కెసిఆర్ ఎలాంటి ఆంక్షల్లేకుండా.. షరతులు విధించకుండా కేవలం అర్హతే ప్రాతిపదికగా వారి ఉద్యోగాల్ని రెగ్యులరైజ్ చేసేశారు. ఈ చర్యతో కేసీఆర్ ప్రజల గుండెల్లో మరో మెట్టెక్కారు. ఉద్యోగుల పాలిట దేవుడిగా మారారు. కాంగ్రెస్ చెప్పింది వాస్తవమే. ఎందరో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ఇప్పుడు పర్మినెంట్ అయిన వారంతా గత 20ఏళ్ళుగా ఇదే ఉద్యోగం చేస్తున్నారు. అయితే సాధారణ ఉద్యోగుల్తో పోలిస్తే వీరికిస్తున్నది 25శాతమే. గరిష్టంగా వీరి జీతం 12వేలే. ప్రస్తుతం అదే శాఖలో వారికి ఏమాత్రం తీసిపోకుండా వీరూ సేవలందిస్తున్నారు. వీరంతా వృత్తి నైపుణ్యం పెంచుకున్నారు. వయసు రీత్యా 45దాటిపోయి 50కి చేరువవుతున్నారు. మహా చేస్తే పది పదమూడేళ్ళే సర్వీస్‌లో ఉంటారు. ఇప్పటికీ పర్మినెంట్ చేయకపోతే వారి జీవితాల్లో వెలుగునిండదు. ఇంతకాలం ప్రభుత్వానికి 3వ పేజీలో...



ఉద్దానం దూరాభారం!

పరిశోధనా కేంద్రంతో పనయ్యేనా? • అరకొర నిధులతో మరీ కష్టం

అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల ప్రబలతకు దారితీస్తున్న పరిస్థితులపై అధ్యయనానికి ప్రత్యేకంగా అదే ప్రాంతంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్ ఉద్దానం కిడ్నీవ్యాధి పీడితుల పట్ల ప్రత్యేక శ్రద్ద చూపిస్తున్నారు. స్వయంగా ఆయనాప్రాంతంలో పర్యటనలు జరిపారు. ఆరు మెడికల్ వర్సిటీలకుచెందిన వైద్యులు ఆయన ఆహ్వానం మేరకు బాధిత ప్రాంతంలో పర్యటించారు. అనంతరం పవన్ వారితో కలసి ముఖ్యమంత్రితో చర్చించడం, ప్రభుత్వపరంగా బాధితుల్ని ఆదుకోవడంతో పాటు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలంటూ కోరడం.. ఈ క్రమంలోనే ఉద్దానంలో కిడ్నీవ్యాధుల పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు 3వ పేజీలో...



యాదాద్రి తరహాలో భద్రాద్రి టెంపుల్ సిటీ

మాస్టర్ ప్లాన్ ఖరారు • అద్భుతంగా ఉందన్న చినజీయర్
• సీఎం ఆమోదం కోసం నమూనాలు
• ఆగస్టులోనే టెండర్లు పూర్తి చేయాలి • చినజీయర్‌ను కలిసి సలహాలు తీసుకున్న మంత్రి తుమ్మల బృందం

3




లష్కరే తోయిబా టాప్ కమాండర్ ఎన్‌కౌంటర్

భార్యను కలిసేందుకు వచ్చి హతమైన ఉగ్రవాది

11 లో

తాను తీసిన గోతిలో తానేపడ్డ విక్రమ్ గౌడ్!

అప్పుల బాధతోనే ఆత్మహత్య డ్రామా



కాల్పులు జరిపింది ఇండోర్ గ్యాంగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తనపై కాల్పులు జరిగితే, దానని హత్యాయత్నంగా చూపించి, తాను తీర్చాల్సిన అప్పులకు సంబంధించిన డబ్బులను తన తండ్రి ముఖేష్‌గౌడ్ నుంచి తీసుకోవచ్చన్న ఆలోచనతో విక్రమ్ స్వయంగా కాల్పుల డ్రామాకు తెరలేపాడని పోలీసులు తేల్చారు. కేసు విచారణ దాదాపుగా 5వ పేజీలో...





మోడీ ఎత్తులు... జిన్‌పింగ్ జిత్తులు



డ్రాగన్ రణ నినాదాలు • భారత్ దౌత్య విధానాలు
• కవ్వింతలు... మాటల తూటాలే • యుద్ధాలు వట్టిమాట! • పీఠాల సుస్థిరతకే ప్రాధాన్యం!!

ఎవరి కోసం... ఎందుకోసం?

న్యూఢిల్లీ: ఒకసారి అధికార పీఠాన్ని ఎక్కిన ఏ రాజకీయవేత్తా దాన్ని అంత తేలిగ్గా వదులుకోడు. ఎత్తుకు పైఎత్తులు, జిత్తులతోనే ముందుకు సాగుతాడు. ఈ విషయంలో ఇటు భారత ప్రధాని నరేంద్ర మోడీ, అటు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు ఒకే దారిలో నడుస్తున్నారు. మళ్లీ తిరిగి తమ పదవులను అలంకరించడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఇందుకు సంబంధించి ఎవరి ఎత్తులు వారు వేసుకుంటున్నారు. 2013లో అధ్యక్ష పదవిని అలంకరించిన జిన్‌పింగ్ మరోసారి ఎన్నికయ్యేందుకు ఈసారి ఏకంగా భారత్‌ను తమ ప్రత్యర్థిగా ఎంచుకున్నారు. డొకలామ్ వివాదాన్ని అందుకు అనుగుణంగా ఉపయోగించుకుంటున్నారు. పదేపదే ఒకేచైనా నినాదాన్ని ప్రస్తావిస్తూ, దాన్ని ఎవరూ విడగొట్టలేరని, అందుకు ప్రయత్నించే దురాక్రమణదారులను ఓడించగల సత్తా తమ సైన్యానికి ఉందని రెచ్చగొట్టే ప్రకటనలు చేసి దేశ ప్రజల మన్ననలు పొందడానికి ప్రయత్నిస్తున్నారు.

అలాగే, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న విదేశీ కంపెనీలను తమవైపు తిప్పుకునేందుకు భారీగా తాయిలాలు ప్రకటిస్తున్నారు. చైనా కంపెనీల ఉత్పత్తులను అడ్డుకునేందుకు భారత్ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు. భారత్ దేశీయ కంపెనీలను రక్షించుకోవడానికి చైనా అధునాతన ఉత్పత్తులను తన మార్కెట్‌ల నుంచి తరిమేస్తోందని చైనా మీడియా ఆరోపిస్తోంది. భారత్‌కు మద్దతుగా పాశ్చాత్య మీడియా వంత పాడడాన్ని కూడా చైనా మీడియా తప్పుపడుతోంది. సహజంగా బలహీనంగా ఉన్న వారికే ఎవరైనా మద్దతు ప్రకటిస్తారని, ఇక్కడ చైనా ముందు భారత్ బలహీనదేశం అయినందునే పాశ్చాత్య మీడియా భారత్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొంది. అంతేకాని, వాస్తవాలను పరిగణనలోకి పాశ్చాత్య మీడియా తీసుకోవడం లేదని చైనా మీడియా విమర్శిస్తోంది. భారత్ కూడా గతానికంటే భిన్నంగా వ్యవహరిస్తోందని, ఇంతకు ముందు దేశంలో ఏ ఇబ్బంది వచ్చినా విదేశీ శక్తులంటూ 8వ పేజీలో...

ఎవరినైనా ఓడిస్తాం

ఏ దాడినైనా తిప్పికొడతాం

మరోసారి చైనా రణన్నినాదం
డోక్లాం నేపథ్యంలో పలుమార్లు యుద్ధం వ్యాఖ్యలు
పీఎల్ఏ వార్షికోత్సవం సందర్భంగా జిన్‌పింగ్

8 లో

డబుల్ ఇళ్లకు రైల్వే స్థలం ఓకే!

- సూత్రప్రాయంగా అంగీకరించిన సురేష్‌ప్రభు
- ప్రభుతో దత్తన్న, మంత్రి, ఎంపీల భేటీ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం తెలంగాణ ప్రభుత్వం కోరిన రైల్వే స్థలం త్వరలోనే చేతికందనుంది. ఈ మేరకు రైల్వే మంత్రి సురేశ్ ప్రభు సూత్రప్రాయంగా అంగీకరించారు. మంగళవారం సురేశ్ ప్రభును కలిసిన తెలంగాణ రాష్ట్ర నేతలు అనంతరం ఈ విషయం వెల్లడించారు. పార్లమెంటులోని రైల్వే మంత్రి కార్యాలయంలో సురేశ్ ప్రభుతో తెలంగాణ రాష్ట్ర మంత్రి పద్మారావు, ఎంపీలు కవిత, వినోద్ సహా మరికొందరు ఎంపీలు భేటీ అయ్యారు. వారందరినీ కేంద్ర సహాయ మంత్రి బండారు దత్తాత్రేయ రైల్వే మంత్రి వద్దకు తీసుకెళ్లారు. సోమవారమే సురేశ్ ప్రభును కలవాలనుకున్నప్పటికీ ఆయన ఢిల్లీలో లేకపోవడం వల్ల సాధ్యపడలేదు. దీంతో కేంద్ర మంత్రి దత్తాత్రేయ ద్వారా మంగళవారం సురేశ్ ప్రభు అపాయింట్మెంట్ తీసుకుని నేతలంతా కలిసి వెళ్లారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం సికింద్రాబాద్ లాలాపేటలో రైల్వే ఆధీనంలోని 12.06 ఎకరాల స్థలాన్ని అప్పగించాల్సిందిగా గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అయితే ఈ స్థలాన్ని రైల్వే ల్యాండ్ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించామని రైల్వే శాఖ చెప్పడంతో, నేరుగా రైల్వే మంత్రి జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అందుకే నేరుగా మంత్రినే కలిసి ఈ పనిని వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి పద్మారావు, స్థానిక ఎంపీగా ఉన్న దత్తాత్రేయకు ఈ బాధ్యతల్ని అప్పగించారు. దీంతో వీరంతా కలిసి సురేశ్ ప్రభుకు పరిస్థితిని వివరించారు. ఆయన వెంటనే సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్‌తో మాట్లాడి సంబంధిత దస్త్రాలను సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారు.

రైల్వే మంత్రితో భేటీ అనంతరం టీఆర్ఎస్ ఎంపీ కవిత మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. లాలాపేట రైల్వే స్థలం అంశంతో పాటు ఎంపీలు తమ తమ నియోజకవర్గాల్లో రైల్వే శాఖ నుంచి పెండింగ్‌లో ఉన్న అంశాలను సురేశ్ ప్రభు దృష్టికి తీసుకెళ్లారని కవిత వివరించారు. ఈ సమస్యలన్నింటిపై త్వరలోనే దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి వెల్లడించారు. ఆ మీటింగులో పెండింగ్‌లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు, రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్లు, రైల్వే లైన్ డబ్లింగ్ సహా పలు ఇతర సమస్యల గురించి చర్చిస్తామని ఎంపీ కవిత తెలిపారు.

మళ్ళీ ప్రజాదర్బార్

- ప్రగతి భవన్‌లో ప్రతి రోజూ ఉదయం రెండు గంటల సమయం కేటాయింపు
- అందిన ప్రతి అర్జీ ఆన్‌లైన్ ఫైల్ ట్యాగింగ్
- సమగ్ర కుటుంబ సర్వే డాటాతో అనుసంధానం

●దసరా నుంచి సామాన్య ప్రజలకు అందుబాటులో సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్న అభిప్రాయాలను దృష్టిలో పట్టుకుని ప్రజా దర్బార్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిర్ణయించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పెరుగుతున్న అగా దాన్ని భర్తీ చేసేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. గత కొంత కాలంగా క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల జీవన విధానం, అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు, గ్రామీణ మౌలిక సదుపాయాలపై దృష్టి కేంద్రీకరించిన కేసీర్ అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యే దిశగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నెలకొన్న సమస్య లను తెలుసుకుని వాటిని పరిష్కరించడం ద్వారా ఆదరాభిమానాలు పొందవచ్చునని భావించిన సీఎం అందుకు ముహూర్తం ఖరారు చేశారు. విజయదశమి పర్వదినాన (సెప్టెంబర్ 30) ఉదయం 9.45 గంటలకు ప్రజా దర్బార్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయవలసిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ముఖ్యమంత్రి అధికార నివాసమైన ప్రగతి భవన్‌కు వచ్చి నేరుగా ముఖ్యమంత్రితో తమ సమస్యలను చెప్పుకునే అవకాశం త్వరలోనే అందు బాటులోకి రానుంది. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కేవలం ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకునేందుకే సమయం కేటాయించనున్నారు. గ్రామ సమస్యలు, తగాదాలు, వ్యక్తిగత సమస్యలు, సామాజిక సమస్యలను తెలుసుకుని అవసరమైతే అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజా దర్బార్ సమయంలో సంక్షేమ రంగాలకు సంబంధించిన ఉన్నతాధికారులు, ముఖ్యంగా గ్రామీణ వ్యవస్థతో, పేద ప్రజలతో ముడిపెట్టుకుని ఉన్న శాఖాధిపతులను దగ్గరే పెట్టుకుని వినతిపత్రాలను వారికి ఇవ్వడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరగడంతో పాటు అధికార యంత్రాంగంలో చిత్తశుద్ధి పెరుగు తుందన్నది ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం.

అయితే ఈ కార్యక్రమాన్ని గతంలో మాదిరిగా ఆశామాషీగా కాకుండా ప్రభుత్వానికి ఇచ్చిన అర్జీల పరిష్కారం ఏ దశలో ఉందో కూడా తెలుసుకునేందుకు వీలు కల్పిస్తూ ఆన్‌లైన్ ఫైల్ ట్రాకింగ్ విధానాన్ని కూడా అమలు చేయబోతున్నారు. సమగ్ర కుటుంబ సర్వే డాటాలో ధరఖాస్తులను అనుసంధానం చేసి సందర్శకులందరినీ ఆకట్టుకునే వ్యవస్థను నెలకొల్పవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి నుంచే ప్రజాదర్బార్‌ను మొదలుపెట్టాలని ముఖ్యమంత్రి అనుకున్నప్పటికీ కొన్ని కారణాల వల్ల అది సాధ్యం కాలేదు.

అధికారులకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు

ఏ సందర్భం వచ్చినా, సమాచారం తెలుసుకోవాలన్నా నేరుగా తానే జిల్లా కలెక్టర్లతో టెలిఫోన్‌లో మాట్లాడుతున్నారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి ప్రగతి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకాలు ఇస్తున్నారు. దీంతో ఒకప్పటి లాగా కాకుండా


జిల్లాల అభివృద్ధిపై సీఎం స్వయం పర్యవేక్షణ

అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారు. ఆ దిశగా ఎంచుకున్న లక్ష్యం మేరకు ముందడుగు వేస్తున్నారు. పునర్ వ్యవస్థీకరణ తర్వాత ఏర్పడిన 31 జిల్లాల్లోనూ ఒకే విధమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఆయన సంకల్పించారు. సీఎం మార్గ దర్శకాల మేరకు కొన్ని కీలకమైన శాఖల ఉన్నతాధికారులు కొత్త కార్యక్రమాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు. స్థానిక వనరులు, సహజ సంపదను ఉపయోగించి అన్ని జిల్లాలు స్వయం సమృద్ధి సాధించే దిశగా కార్యాచరణ ప్రణాళికలు ఉండాలని ఇదివరకే సీఎం జిల్లా కలెక్టర్లకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పురోగతిపై స్వయంగా ఆయనే దృష్టి కేంద్రీకరించారు. గతంలో ఉన్న సాంప్రదాయం మేరకు జిల్లాల్లోని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లోని తాజా పరిస్థితులను రాష్ట్రస్థాయిలో ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలోనే సమీక్షించేవారు. కానీ కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఆ బాధ్యతలను స్వయంగా ముఖ్యమంత్రే స్వీకరించారు.

నూతన ఒరవడితో కొత్త జిల్లాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన కేసీఆర్ సర్కారు ఏ కార్యక్రమం చేపట్టినా శాశ్వత ప్రాతిపదికన చరిత్రలో నిలిచిపోవాలన్న తాపత్రయంతో ప్రణాళికలు రచిస్తున్నారు సీఎం కేసీఆర్. ఆయన మార్గదర్శకాల మేరకు జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయి కార్యాచరణను ఇప్పటికే ప్రారంభించారు. ముఖ్యంగా పట్టణీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రాలైన పట్టణాలను

శాశ్వత కార్యక్రమాలకే కేసీఆర్ మొగ్గు

సుందరమైన నగరాలుగా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుద్ధ్య కార్యక్రమాలు, రహదారులను నిర్మించనున్నారు. అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపట్టకుండా జిల్లా కేంద్రాల్లోని ఇళ్ళ నిర్మాణ అనుమతుల మంజూరీకి కొన్ని ప్రత్యేకమైన నిబంధనలు విధించ బోతున్నారు. రానున్న ఇరవై సంవత్సరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని, భౌగోళిక విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా జిల్లా కేంద్రాల్లో పట్టణీకరణకు ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నారు. దీంతోపాటు ఆయా జిల్లాల్లో ఉన్న ఆదాయ వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు కూడా ప్రణాళికలు రచిస్తున్నారు. అంతకు ముందుగానే అవసరం మేరకు మానవ వనరులను సమకూర్చుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఆ మేరకు కలెక్టర్ల ద్వారా జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయిస్తున్నారు. ఆయన ఆలోచనా విధానాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.



క్షేత్రస్థాయిలో భారీ మార్పులు కనిపిస్తున్నాయి. రాష్ట్రస్థాయి పర్యవేక్షణ పెరుగడంతో అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంటోంది. ముఖ్యంగా ప్రభుత్వం ప్రారంభించిన ప్రతిష్టాత్మక పథకం డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణానికి సంబంధించి కొనసాగుతున్న చర్యలపై కేసీఆర్ దృష్టి పెట్టారు. ఈ అంశంపై ప్రజా దర్బార్ ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలను, వాస్తవ స్థితిగతులను తెలుసుకోనున్నారు.

శ్రీరాంసాగర్‌కు రూ. 2వేల కోట్లు

- పునర్జీవన పథకానికి రూ.వెయ్యి కోట్లు
- ఆధునీకరణకు రూ.వెయ్యి కోట్లు
- 10న సీఎం శంకుస్థాపన, భారీ బహిరంగ సభ : మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రాంత అభివృద్ధి, ప్రాజెక్టుల నిర్మాణం కోసం సీఎం చంద్రశేఖర్‌రావు ఒక ఇంజినీర్‌లాగ అధ్యయనం చేసి సాగు, తాగునీటికి సంబంధించిన ప్రాజెక్టులకు రూ. వేలాది కోట్లు వెచ్చిస్తున్నాడని మంత్రి హరీశ్ రావు తెలిపారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కు రూ. 2 వేల కోట్లు సీఎం కేసీఆర్ కేటాయించారని మంత్రి తెలిపారు. అందులో ఎస్సారెస్పీ పునర్జీవన పథకానికి రూ. 1, 000 కోట్లు, కాలువల ఆధునీకరణకు రూ. 1,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఎస్సారెస్పీ వద్దే పునర్జీవన పథకానికి సీఎం చంద్రశేఖర్‌రావు ఈ నెల 10న శంఖుస్థాపన చేస్తారని, అనంతరం భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ సభకు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన రైతులు హాజరవుతారన్నారు. మంగళవారం ఆయన టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మండలి విప్ బొడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. పునర్జీవన పథకం ద్వారా గోదావరి నుంచి కాలేశ్వరం కాలువ ద్వారా శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి నీళ్లను తీసుకువస్తామన్నారు. ఏ కాలంలోనైనా శ్రీరాం సాగర్‌లో సమృద్ధిగా నీళ్లు ఉండేందుకు అవకాశం ఉంటుందని మంత్రి చెప్పారు.

ఈ ప్రాజెక్టును 14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు 112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారని, ఇప్పుడు 80 టీఎంసీల వరకు పడిపోయిందన్నారు. గతేడాది తాగడానికి కూడా నీరు లేని పరిస్థితి ఏర్పడిందని, కాలేశ్వరం వరద కాలువతో నింపడం వల్ల సాగు, తాగునీటికి కొరత ఉండదని, రెండు పంటలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎస్సారెస్పీ నుంచి మొదటి ఫేజ్ నుంచి 9.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు ప్రతిపాదనలు ఉన్నా అందులో సగం ఆయకట్టుకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. పాత వరంగల్‌లోని భూపాలపల్లి, డోర్నకల్ అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వని దుస్థితి ఉందన్నారు. ఎస్సారెస్పీలో నీళ్లు నింపడం, కాలువల ఆధునీకరణ చేశాక 14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. వీటితో పాటు సదర్‌ఘట్ ఆనకట్ట మరమ్మత్తులకు రూ. 3 కోట్లు, మెదక్‌లోని ఘణపూర్ ఆనకట్ట ప్రాజెక్టులను ఆధునీకరణకు రూ. 100 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.

మేడిగడ్డ వద్ద గోదావరిలో 3 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నా, శ్రీరాం సాగర్‌కు చుక్క నీరు రావడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ కాకతీయ ద్వారా గొలుసుకట్టు చెరువుల మరమ్మత్తు, చెరువు లలలో పూడికతీత పనులు చేపట్టడం వల్ల భూగర్బ జాలలు పెరిగాయన్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగి అదనంగా 4 నుంచి 5 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం ఎక్కువగా వచ్చిందన్నారు. ప్రతి మండల కేంద్రంలో గోదాముల నిర్మాణం చేపట్టడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం నిల్వ చేశామని, సకాలంలో రైతులకు డబ్బులు కూడా చెల్లించినట్లు మంత్రి వివరించారు. అంతేకాకుండా వచ్చే ఏడాది నుంచి రైతుల పట సాగు ఖర్చుకు ముందుగానే నిధులు ఇవ్వనున్నట్లు, 2 వేల మంది వ్యవసాయ విస్తరణ అధికారులను కూడా ప్రభుత్వం నియమించిందని మంత్రి తెలిపారు. రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్నట్ల చెప్పారు.

నీతి ఆయోగ్‌కు పనగారియా గుడ్‌బై..!

- కొలంబియా వర్శిటీ ప్రొఫెసర్‌గా వెళ్ళనున్న ఆర్థిక వేత్త



న్యూ ఢిల్లీ: మోడీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నీతి ఆయోగ్ సంస్థకు వైస్ ఛైర్మన్‌గా సేవలందిస్తున్న ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ పనగరియా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 31వ తేదీన తన పదవికి చివరి రోజు కాగా, తన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన పదవి కాలం ముగిసిన వెంటనే కొలంబియా యూనివర్సిటీలో తిరిగి అధ్యాపక వృత్తి చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే... నూతన సంస్కరణల్లో భాగంగా ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి దాని స్థానే నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసింది. నీతి ఆయోగ్‌కు మొదటి ఉపాధ్యక్షుడిగా అన్ని విధాల సమర్థుడైన వ్యక్తిని నియమించాలనే ఆలోచనతో కొలంబియా వర్సిటీలో అధ్యాపకుడిగా ఉన్న పనగరియాకు ఆ బాధ్యతలు అప్పగించింది. ఆయనకు ప్రభుత్వం కేబినెట్ హోదా కూడా కల్పించింది. అయితే, తాను నీతి ఆయోగ్ నుంచి తప్పుకుంటున్న విషయం ఇదివరకే ప్రధాని నరేంద్ర మోడీకి తెలిపానన్నారు. సాధ్యమైనంత వరకు నీతి ఆయోగ్‌కు సేవలందించానన్నారు. కొలంబియా యూనివర్సిటీ నుంచి తాను అనుమతి తీసుకొని భారత్‌కు సేవలందించడానికి వచ్చానన్నారు. ఆగస్టుతో ఆ సమయం ముగుస్తుందన్నారు. తన సెలవు కాలాన్ని వర్సిటీ యాజమాన్యం పొడిగించదన్నారు. అందుచేత, మళ్ళీ యూనివర్సిటీకి వెళ్ళక తప్పదని వివరించారు.

తదుపరి నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడిగా ఎవరు వస్తాడన్న ప్రశ్నకు ఆయన ఎటువంటి సమాధానం చెప్పలేదు. ఆ నిర్ణయం ప్రభుత్వం చేతిలో ఉంటుందని సమాధానాన్ని దాటవేశారు. తాను ఎవరి పేరు ప్రభుత్వానికి సూచించలేదన్నారు. కాగా, పనగరియా అంతర్జాతీయంగా ప్రముఖ ఆర్థికవేత్తగా పేరొందిన విషయం తెలిసిందే. వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ తదితర ప్రతిష్టాత్మక సంస్థల్లోనూ పని చేసిన అనుభవం కూడా పనగరియాకు ఉంది.

వచ్చే జూన్ కల్లా ఎత్తిపోతల పథకాలు సిద్ధం

- సమీక్షలో మంత్రి హరీష్ రావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎత్తిపోతల సాగునీటి పథకాలకు అవసరమైన విద్యుత్ సరఫరా పనులు వచ్చే జూన్ నాటికి సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యుత్ , నీటిపారుదల శాఖల అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. ఎత్తిపోతల పథకాల విద్యుత్ పనులను ఈ సందర్భంగా మంత్రి సమీక్షించారు. జూన్ 2018 నాటికి కాళేశ్వరం పంపింగ్ స్టేషన్లు పనిచేసేందుకు అవసరమైన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గడువులోపే విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం , పంపిణీలైన్ల ఏర్పాట్లు పూర్తి చేస్తామని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు మంత్రికి వివరించారు. జూన్ నాటికి కాళేశ్వరంతోపాటు ఇతర ఎత్తిపోతల పథకాలకు మొత్తం 12500మెగావాట్ల విద్యుత్ అవసరమని మంత్రి అన్నారు. కాళేశ్వరం పంప్‌హౌస్ పనులు మార్చినాటికి పూర్తిచేయాలని గడువు పెట్టామన్నారు. వచ్చే డిసెంబర్ నాటికి ఆరు ప్యాకేజీల పనులన్నీ పూర్తవుతాయన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, పంప్‌హౌజ్‌ల పనులు పుంజుకున్నాయన్నారు. వీటిని మార్చినాటికి పూర్తిచేసి వచ్చే ఖరీఫ్‌లో సాగునీటిని అందించనున్నట్టు వెల్లడించారు. డిసెంబర్‌కు 6,8ప్యాకేజీల పంప్‌హౌస్‌ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, బ్యారేజీల పంప్‌హౌస్‌లతో పాటు పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులోనూ రిజర్వాయర్ల మీదుగా వెళ్తున్న 220కెవి,132కెవి, 33కెవి విద్యుత్ లైన్లను తరలించాలని మంత్రి కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన షెడ్యూల్ కన్నా ముందే పూర్తిచేసేందుకు విద్యుత్ సంస్థల సహకారం , తోడ్పాటు అవసరం అని మంత్రి పేర్కొన్నారు. 2018మార్చిలోగా పది సబ్‌స్టేషన్ల పనులు పూర్తిచేయాలని హరీశ్ రావు ఆదేశించారు. ఆరు 400కెవి సబ్‌స్టేషన్లు, మూడు 220కెవి సబ్‌స్టేషన్లు , రెండు 132 కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి కోరారు. కాళేశ్వరం 6,7,8,9,10,11,12 ప్యాకేజీలలో పంపింగ్ స్టేషన్ల ప్రోగ్రెస్‌ను మంత్రి సమీక్షించారు. విద్యుత్ టవర్ల నిర్మాణం, లైన్ల ఏర్పాటు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

గ్రేటర్‌లో నయా ట్రాఫిక్ రూల్స్

12 పాయింట్లు దాటితే లైసెన్స్ రద్దు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సరి కొత్త ట్రాఫిక్ విధానం అమలులోకి వచ్చింది. గ్రేటర్ పరిధిలోని మూడు కమీషనరేట్ల పరిదిలో ఆగస్టు ఒకటి నుండి అమల్లోకి వచ్చింది. ఇక మీదట రెండు సంవత్సరాల్లో 12 పాయింట్లు దాటితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుంది. రోడ్డు భద్రతలో భాగంగా వాహనాలు నడిపే వారికి కఠిన పరీక్షలు విధించనున్నారు. ఎలాంటి ఉల్లంఘనలైన ఉపేక్షించబోమనే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టడం, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా ప్రభుత్వం రోడ్డు భద్రతలో అనేక కఠిన చర్యలు తీసుకోనుంది. ఇక మీదట ట్రాఫిర్ ఉల్లంఘనలను పాయింట్ల వారిగా లెక్కిస్తారు. ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారుని ఖాతాలో పాయింట్ల వారిగా ఉల్లంఘనలను నమోదు చేయడం జరుగుతుంది. ఉల్లంఘనలను ఆర్టీఏ డాటా బేస్‌లో నమోదు చేయడం జరుగుతుంది. ఆటోలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించిన పక్షంలో ఒక పాయింట్ ఉల్లంగణ నమోదుచేస్తారు. అదే విధంగా సీట్ బెల్ట్ పెట్టుకోకుంటే, గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటే, రాంగ్ రూట్లలో వాహనాలు నడిపితే, చరవాణిలో మాట్లాడుతూ వాహనం నడిపితే, జాతీయ రహదారుల్లో రోడ్డు భద్రతను ఉల్లంఘిస్తే, నిర్దేశిత వేగం మించి వాహనం నడిపితే పాయింట్ల వారిగా ఫైన్ నమోదవుతుంది. మద్యం తాగి వాహనం నడిపితే శిక్ష తప్పదు. ఈ సరికొత్త విధానం అమలులోకి వచ్చింది. హైదరాబాద్ పరిధిలోని మూడు కమీషనరేట్లలో ఈ విధానం అమలుపర్చడం జరుగుతుంది.

ట్రాఫిక్ పెనాల్టీ పాయింట్లపై టీ-సాట్

దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న 12పాయింట్ల ట్రాఫిక్ నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాన్ని టీ-సాట్ (మనటీవీ) ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న నిబంధనలపై ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమీషనర్ రఘునాథ్ సలహాలు సూచనల ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని టీ సాట్ అందించనుంది. టీ-సాట్ నెట్‌వర్క్ ఛానల్‌లో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రసారమయ్యే ఈ కార్యక్రమ వివరాలను టీ-సాట్ సీఈవో ఆర్.శైలేష్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రవాణ, పోలీస్ ,న్యాయశాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వాహనచోదకులు 18004254038 నంబర్లకు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఉద్దానం దూరాభారం

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు సమ్మతించడం.. మూడేళ్ళ పాటు ఏటా ఐదేసి కోట్ల చొప్పున ఇందుకు కేటాయిస్తానని హామీనివ్వడం చకచకా జరిగిపోయాయి. ఈ చర్య కిడ్నీ బాధితులకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తుందన్న అంశమిప్పుడు ప్రశ్నార్ధకంగా మారింది. సహజంగా పరిశోధనా కేంద్రాలు విశ్వ విద్యాలయాల పరిధిలో పనిచేస్తాయి. లేదా ప్రభుత్వాలే వీటిని నెలకొల్పుతాయి. అయితే ఆయారంగాల్లో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు ఈ పరిశోధనా కేంద్రాలకొచ్చి పరిశోధ నలు చేసేందు కనువైన ప్రాంతాల్లోనే వీటినేర్పాటు చేస్తుంటారు. ముఖ్యంగా విమానయాన సదు పాయంతో పాటు భారీ నగరాల్లోని పరిశోధనా కేంద్రాలవైపే శాస్త్రవేత్తలు మొగ్గుచూపుతారు. కానీ ఉద్దానం జిల్లా కేంద్రానిక్కూడా 70కిలో మీటర్ల దూరంలో ఉంది. సమీప విమానాశ్రయం సుమారు 190కిలోమీటర్లపైబడ్డ దూరంలో ఉంది. పైగా ఉద్దానంలో వందకు పైగా గ్రామాలున్నప్పటికీ అన్నీ అతి చిన్నవే. ఎక్కడా తగిన మౌలికసదుపాయాల్లేవు. ఇలాంటి ప్రాంతం పట్ల శాస్త్రవేత్తలు ఆసక్తిచూపే అవకాశాలు ఇసుమంతైనా లేవు. అలాగని అంతర్జాతీయ స్థాయిలో వ్యాధుల నిర్ధారణ, మూలాల్ని శోధించ గలిగే నిపుణుల్ని బలవంతంగా ప్రభుత్వ మిక్కడికి రప్పించడం సాధ్యమయ్యే పనికాదు. అన్నింటికి మించి ఏడాదికి ఐదుకోట్లు ఏ మూలకు సరిపోవు. కేవలం భవనాలకు్కూడా మూడేళ్ళ పరిధిలో ఇచ్చే 15కోట్లు ఎందుకూ కొరగావు. ఇక ఒక్కొక్క నిష్ణాతుడైన శాస్త్రనిపుణుడిపైన చాలా మొత్తంలో వ్యయం చేయాల్సుంటుంది.


(ఫైల్ ఫోటో)

ఇవన్నీ పక్కనపెడితే ఇప్పటికే దేశంలో పలుచోట్ల కిడ్నీ వ్యాధుల మూలాల్ని కనుగొనే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఢిల్లీలోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థలో ఇందుకోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని నెలకొల్పారు. ఇక్కడ గత రెండు దశాబ్ధాలుగా కిడ్నీ రోగాలపై శాస్త్రపరిశోధనలు చేస్తున్నారు. ఇవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్తో పాటు వచ్చాక నివారణ మందుల తయారీలో ఈ కేంద్రం నిరంతరం శ్రమిస్తోంది. అంతేకాదు.. ప్రతివారం ఇక్కడ మూడు నుంచి నాలుగు వరకు కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈ వ్యాధి అధికంగా నమోదౌతున్న ప్రాంతాల్లో ఏయిమ్స్ శాస్త్రవేత్తలు శిబిరాల్ని పెట్టి రోగుల్ని గుర్తించడంతో పాటు మూలాల్ని కనుగొనే ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే బెంగుళూరులోని ఫోర్టీస్ ఆసుపత్రిలో కూడా మూత్రపిండ వ్యాధుల మూలల నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. విదేశాలకు చెందిన పలువురు వైద్య నిపుణులు కూడా ఇందులో భాగస్తు లౌతున్నారు. బెంగుళూరులోని మణిపాల్ ఆసుపత్రి లో కూడా గత దశాబ్ధంగా ఈ పరిశోధనలు సాగుతున్నాయి. అలాగే కోయంబత్తూరులోని కిడ్నీ ఆసుపత్రి లో కూడా కిడ్నీ అధ్యయన కేంద్రముంది. వేలూరు లోని క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో కూడా ఇలాంటి కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అహ్మదాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కిడ్నీ డీసెజెస్ అండ్ రిసెర్చ్ సెంటర్ ఉంది. కోల్‌కత్తాలోని ఫోర్టీస్ కిడ్నీ డీసెజెస్ సెంటర్ ఏర్పాటైంది. ఇవన్నీ భారతదేశంలో ఏళ్ళ తరబడి మూత్రపిండవ్యాధుల మూలాలుకనుగొనేందుకు కృషి చేస్తున్న సంస్థలే. ఇక అంతర్జాతీయ స్థాయిలోనూ దీనిపై పలు పరిశోధనలు సాగుతున్నాయి. ఇంటర్నే షనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అనే సంస్థ అమెరికా బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, చైనాల్లో పెద్దెత్తున ఈ అధ్యయనాల్ని నిర్వహిస్తోంది. హార్వార్డ్ వర్శిటీ లోనూ ఇందుకోసం ప్రత్యేక అధ్యయన కేంద్రముంది.

ఇదొక్కటే కాదు.. అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాధులకు కారణమౌతున్న జన్యువులపై పలు ప రిశోధనలు సాగుతున్నాయి. హార్వర్డ్ వంటి అంతర్జాతీయ వైద్యవిజ్ఞాన సంస్థలకు భారత్‌కు చెందిన పలువురు శాస్త్రవేత్తలు పరిశోధనల్లో భాగస్తులౌతున్నారు. వీరిలో పలువురు తెలుగువారు కూడా ఉన్నారు. అమెరికా ప్రభుత్వం అక్కడి తెలుగు విజ్ఞాన శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలకు ఇతోధికంగా సహకారమందిస్తోంది. ఆ దేశాధ్యక్షుడు కూడా అక్కడి తెలుగుశాస్త్రవేత్తల్ని ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. భారత ప్రధాని మోడి అమెరికా పర్యటన సందర్భంలో కూడా వీర్ని ప్రత్యేకంగా పిలిపించుకుని మరీ అభినందనల్తో ముంచెత్తిన సందర్భాలున్నాయి. అంతేకాదు.. వీరిలో కొందరికి దేశ అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీని కూడా ప్రధానం చేయడం జరిగింది. ఇంతటి అత్యున్నత వైద్యవిజ్ఞాన సంస్థలో మన తెలుగు శాస్త్రవేత్తలు అత్యద్భుతమైన ఫలితాలు రాబడుతున్నారు. కేన్సర్ కారకక్రిముల జాడను కనుగొనే పనిలో ఉన్నారు. అలాగే మధుమేహానికి వంశ పరంగా దారితీస్తున్న జన్యువుల పరిశోధనలో మునికితేలారు. ఈ రోగాల నివృతికి వందలాది సరికొత్త ఔషదాల్ని రూపొందించారు.

దేశవిదేశాల్లో ఇప్పటికే మూత్రపిండ వ్యాధుల మూలాలపై జరుగుతున్న పరిశోధనల నేపథ్యంలో కొత్తగా ఉద్దానంలో మరో అధ్యయన కేంద్రం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రయత్నం కంటే ఇప్పటికే ఈ దిశగా పరిశోధనలు జరుగుతున్న అధ్యయన కేంద్రాలకు ఉద్దానంలో మూలాల్ని కనుగొనే బాధ్యత అప్పగించడం మేలైన విధానమని సూచిస్తున్నారు. వారివద్ద అంతర్జాతీయస్థాయి సదుపాయాలు, నిపుణులు ఇప్పుడు అందుబాటులో ఉన్నారు. ఉద్దానం సమస్య పరిష్కారానికి వారి విలువైన మేథస్సును వినియోగించుకునే అవకాశం దీనివల్ల కలుగుతుందని విశ్లేషిస్తున్నారు.

ఇదిలా ఉంటే ఉద్దానం ప్రాంతంలో భూమితో పాటు భూగర్భ జలాలు కూడా కలుషితమైనట్లు ఇప్పటికే గుర్తించారు. ఇందులో మోతాకు మించి పాదరసంతో సహా పలు రసాయనాలున్నట్లుతేలింది. ఈప్రాంతంలో కొబ్బరి, జీడిమామిడి పంటలు అత్యధికం గా ఉన్నాయి. ఈ రసాయనాల అవశేషాలు ఇక్కడి భూగర్భ జలాల ద్వారా పంటలక్కూడా సోకే ప్రమాదాన్ని శాస్త్రవేత్తలు సందేహిస్తున్నారు. ఈ దశలో ఈ ప్రాంతంలో పూర్తిగా వర్షాధార పంటల్ని మాత్రమే ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తు న్నారు. ఇక్కడి భూగర్భ జలాల్ని తాగడంతో పాటు ఏ విధంగానూ వినియోగించే అవకాశాల్లేకుండా బావులు, చెరువుల్ని మూసేయాలని భూగర్భ జలాల వినియోగంపై కఠిన ఆంక్షలు అమలు చేయాలని కూడా సూచిస్తున్నారు. తాగేందుకు, ఇతర అవస రాలకు నీటిని ప్రభుత్వమే నేరుగా ట్యాంకర్లు, టిన్‌ల ద్వారా సరఫరా చేయాల్సిన ఆవశ్యకతుందని నొక్కి చెబుతున్నారు. ఉద్దానంలో కొబ్బరి దిగుబడి అధికంగా ఉంది. అయితే ఈ కొబ్బరి వినియోగించినా ఇందులోని నీరు తాగినా కూడా విషతుల్యాల ప్రభావం తప్పకపోవచ్చన్న భయం వెంటాడుతున్న నేపథ్యంలో వ్యవసాయపరంగా కూడా కఠినమైన ఆంక్షలు విధించాల్సిన అవసరాన్ని కూడా వీరు నొక్కిచెబుతున్నారు.

పాలాభిషేకాలు!

(మొదటిపేజీ తరువాయి)

చేసిన సేవలు వ్యర్థంగానే భావిస్తారు. ఇదివారిలో వ్యవస్థ పట్ల వ్యతిరేక భావనను పెంచుతుంది. ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తుంది. తామెందుకు చాలీచాలని జీతంతో ఇలా కునారిల్లాలన్న తిరుగుబాటు ధోరణికి దోహదపడుతుంది. పైగా ప్రభుత్వం వీరితో ఇప్పటికే పూర్తిస్థాయిలో పనిచేయించుకుంటుంది. కానీ ఇచ్చేది మాత్రం స్వల్పమొత్తమే. పర్మినెంట్ చేయడం వల్ల పెద్దగా నష్టంలేదు. ఇస్తున్న తాత్కాలిక జీతానికి సహజసిద్ధ జీతానికి మధ్యనున్న మొత్తాన్నే వారికి చెల్లిస్తే చాలు. కొత్తగా ఉద్యోగాలు పొందే వారితో పోలిస్తే వీరికి నైపుణ్యం అధికంగా ఉంటుంది. అన్నింటికి మించి ప్రభుత్వం దీర్ఘకాలంగా పొందిన సేవలకు తగిన గుర్తింపునిచ్చి ప్రోత్సహించిందన్న భావం వారిలో ఏర్పడుతుంది. ఇది ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య చక్కని అనుబంధాన్ని ఏర్పరుస్తుంది. ఏప్రభుత్వానికైన ఈ విశ్వసనీయత అతిముఖ్యం. దీన్ని మరెవరూ గుర్తించకముందే కెసిఆర్ గుర్తెరిగారు. ఎవరి విమర్శల్ని పట్టించుకోకుండా వీరికి ఉద్యోగాల్ని పర్మినెంట్ చేశారు. వారందరి మనస్సులో ఆరాధ్యుడిగా మారిపోయారు. వారికేకాదు.. ఇతర రాష్ట్రాల్లో దీర్ఘకాలంగా ఔట్‌సోర్సింగ్ సేవల్లో జీవితాల్ని బుగ్గి చేసుకుంటున్న ఉద్యోగులందరికీ ఇప్పుడు కెసిఆర్ అంటే పెద్ద హీరో.. పాలనామంత్రాంగం నడపడంలో ఆయనన్ను మించినవారులేరు. అన్నింటికి మించి దిగొచ్చిన దేవుడు. ఈ భావనతోనే వారంతా ఇప్పుడు కెసిఆర్‌కు పాలాభిషేకాలు చేస్తున్నారు. దేవుడిలా కొలిచేస్తున్నారంటూ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



బీసీల బలోపేతానికి పథకాలు

శాలివాహన ప్రతినిధులతో మంత్రి జోగురామన్న

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని బీసీలు ఆత్మగౌరవంతో బతికేలాగా పథకాలను రూపొందిస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీసీలు ఆర్ధికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మంగళవారం కుమ్మరి సంఘం ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. కుల వృత్తుల్లో అత్యాధునిక యంత్రాల వినియోగానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవల్సిన అవసరం ఉందన్నారు. కుమ్మరి వృత్తుల కోసం రాజస్థాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్ రాష్ట్రా ల్లో అమలు జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించేందుకు త్వరలోనే ఒకబృందాన్ని పంపించనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అశోక్ కుమార్, అదనపు కార్యదర్శి సైదా, అదనపు సంచాకులు అలోక్‌కుమార్, మల్లయ్య బట్టుతోపాటు కుమ్మరి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా ఉద్యోగిపై దాడి

నిందితుల పట్టివేత- కేసు నమోదు


దాడికి పాల్పడిన నిందితులు, ఇన్‌సెట్‌లో బాధితుడు మహేష్


కడ్తాల్, కెఎన్ఎన్ : రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం మైసిగండి గ్రామ సమీపంలోని శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా ఉద్యోగిపై సోమవారం రాత్రి దాడి చేసి గాయపరిచిన ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. దాడికి పాల్పడిన హైదరాబాద్ కి చెందిన అరుణ్ రెడ్డి, నిషిత్, సాయితేజ్ రెడ్డి, మనీష్ గౌడ్, సాయి కుమార్, అనిరుద్‌ల పై కేసు నమోదయినట్లు అయన పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి నిందితులు మైసిగండి ఆలయం వద్ద విందులో పాల్గొని కారులో హైదరాబాద్ కు తిరుగు ప్రయాణమై టోల్ ప్లాజా వద్ద డబ్బులు చెల్లించకుండా వెళ్తుం డడంతో ప్లాజా సూపర్ వైజర్ మాదారం మహేష్ వారి కారును అడ్డుకున్నట్లు ఆయన చెప్పారు. తమ కారును ఆపి డబ్బులు అడుగుతావా అని ఆయనతో వారు ఘర్షణకు దిగారు. ఈ సమయంలో నిందితులలో ఒకరైన అరుణ్ రెడ్డి తన వద్దనున్న కత్తితో మహేష్‌పై దాడి చేశాడని ఆయన చెప్పారు. దాడిలో ఆయన ఎడమ చేయి మోచేతి వద్ద , కుడిచేయి అరచేతిలో గాయమైనట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు దాడి చేసి పారిపోతున్న వాళ్ళను ప్రధాన రహదారి పై కడ్తాల్ సమీపంలో పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గాయపడిన మహేష్ ను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆసుపత్రికి తరలించి, నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ చెప్పారు.

చట్టప్రకారం చర్యలు తీసుకోండి: కేటీఆర్

ఔటర్ రింగుర్డోడు టోల్‌గోట్ ప్లాజా సిబ్బందిపై నగరానికి చెందన ఓ కార్పొరేటర్ కొడుకు దాడి చేసిన ఘటనపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ ఘటనలో పూర్తి వివరాలను సేకరించి నిందులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం తన ట్విట్టర్ ద్వారా కేటీఆర పేర్కొన్నారు. ఐపీసీ 307 సెక్షన్ కింద ఆరుగులు నిందుతలపైనా కేసు నమోదు అయిందని, కస్టడిలో ఉన్న వీళ్ళని రిమాండ్కు పంపుతున్నామని శంషాబాద్ ఏరియా డీసీపీ తెలిపిన సమాచారాన్ని కూడా కేటీఆర్ ట్విట్టర్‌లో తెలిపారు.

రేరాకు గ్రీన్‌సిగ్నల్?

- నేడో, రేపో ఉత్తర్వులు జారీ • నిబంధనలు మరింత కఠినం
- చట్టాన్ని అతిక్రమిస్తే బిల్డర్లకు మూడేళ్ల జైలు లేదా పెనాల్టీ




హైదరాబాద్, ఆంధ్రప్రభ: రేరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరి అథారిటి) చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధిం చిన ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో వెలువ డనున్నాయని సమాచారం. బిల్డర్ల మోసాలను నియంత్రించడానికి, నిబంధనలను మరింత కఠిన తరం చేయాలన్న ఉద్దేశ్యంలో రేరాను తీసుకు వస్తున్న విషయం తెలిసిందే.ఇప్పటి వరకు ఫ్లాట్, ఫ్లాట్ విక్రయాలలో డెవలపర్లు ఆడింది ఆట...పాడింది పాటగా సాగుతోంది. తప్పుడు ధృవీ కరణ పత్రాలతో కొనుగోలు దారులను యదేశ్చగా మోసం చేస్తున్న విషయం తెలిసిందే. కొనుగోలు దారులు డబ్బులు చెల్లించినా బిల్డర్లు తగు సమయంలో భవన నిర్మాణ పనులను పూర్తి చేయకుండా వారిని అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తు న్నారు. ఇకపై వారి ఆటలు సాగవు. రేరా నిబంధనల మేరకు నడుచుకోవాల్సిందే. కొనుగోలు దారులకు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చాల్సిందే. ఇప్పటి వరకు ఉన్న నిబంధనలకు విరు ద్ధంగా బిల్డర్లు ఫ్లాట్లు, ఖాళీ స్థలాలను విక్రయిస్తూ ప్రజలను పెద్దఎత్తున మోసం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యా దులు అందాయి. బిల్డర్ల మాటలు విని సామాన్య, మధ్య తరగతి ప్రజలు పైసాపైసా కష్టపడి సంపా దించిన డబ్బును పోగొట్టుకుని మోసపోతు న్నారు. ఈ నేప థ్యంలో బిల్డర్ల ఆగడాలకు ముకుతాడు వేయా లన్న లక్ష్యంతో రేరా చట్టానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తుది మెరుగులు దిద్దుతోంది. ఈ చట్టం కింద బిల్డర్, డెవలపర్ విధిగా ప్రతి పాజెక్టును రిజిష్టర్ చేయాల్సి ఉంటుంది. రిజిష్టర్ లేకుండా ప్లాట్, ఫ్లాట్‌ను విక్రయిస్తే దాదాపు మూడేళ్ళపాటు జైలు శిక్షను అనుభవించాల్సిందే. లేదా ప్రాజెక్టు మొత్తం వ్యయంపై 10శాతం మొత్తాన్ని పెనాల్టీగా బిల్డర్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సదరు సంస్థ ప్రచారం, మార్కెటింగ్, ప్రమోటింగ్ వ్యవహారాలను కూడా రేరా నిబంధనలకు లోబడే చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి ఈ చట్టాన్ని కొన్నాళ్ళ కిందట నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే కేంద్రం రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ 2016 చట్టాన్ని తీసుకవచ్చింది. ఈ చట్టానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం రేరా చట్టాన్ని నిబంధనలను రూపొందించింది. కేంద్రం రూపొందించిన చట్టం పలు రాష్ట్రా ల్లో గత మే నెల నుంచే అమలు జరుగుతోంది. అయితే మన రాష్ట్రంలో రేరా ముసాయిదాకు సిఎం నుంచి అనుమతులు లభించని కారణంగా చట్టం ఇంకా అమలులోకి రాలేదు. ఈ నిబంధనలపై ఇప్పటికే రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కూడా కూలంకషంగా పరిశీలించిన మీదటనే ముసాయిదా ముఖ్యమంత్రి పరిశీలనకు చేరింది. దీని ప్రకారం 500 చదరపుమీటర్ల స్థలం, లేదా ఆరు యూనిట్లు అంతే కంటే ఎక్కువ నిర్మించే నిర్మాణదారులు విధిగా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కొనసాగుతున్న ప్రాజెక్టుల వివరాలకు సంబంధించిన సమాచారాన్ని ఇస్తేనే సదరు రియల్టర్లకు,బిల్డర్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. అలాగే డెవలపర్లు విధిగా స్థలానికి సంబంధించిన టైటిల్ డీడ్, ఎన్‌కాంబ్రన్స్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం తదితర వివరాలను కూడా వెల్లడించాల్సి ఉంటుంది. అప్పుడే డెవలపర్లకు లైసెన్స్‌లను మంజూరు చేస్తారు. ఈ నిబంధనలను బిల్డర్లు అతిక్రమిస్తే కొనుగోలుదారులు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఉంటుంది. అగ్రిమెంట్ ప్రకారం బిల్డర్ అధికంగా డబ్బులు డిమాండ్ చేసినా లేక నిర్మాణంలో జాప్యం చేసినా, తగు సౌకర్యాలు కల్పించలేకపోయినా సరే బిల్డర్లకు ఇబ్బందులు ఎదుర్కొనే విధంగా చట్టం వస్తోంది.

కాలేజీ తప్పులకు మమ్మల్ని శిక్షిస్తారా?

ఢిల్లీలో ఫాతిమా కాలేజీ మెడికోల ఆవేదన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కాలేజి చేసిన తప్పులకు మమ్మెల్లెందుకు శిక్షిస్తున్నారంటూ ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. న్యాయం చేయాలని కోరుతూ వారం రోజుల క్రితం ఢిల్లీ చేరుకున్న విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస రావు తమ సమస్యను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విద్యార్థులంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో మీడియాతో మాట్లాడుతూ, ఇక తమకు ఆత్మహత్యే శరణ్యమని భావోద్వేగాలతో వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా తాము సీట్లు పొందామని, తమ కాలేజీకి అనుమతులు రద్దు చేసినప్పుడు మరే ఇతర కాలేజీలోనైనా తమ వైద్యవిద్యను కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వైద్యవిద్యా ప్రమాణాలకు అనుగుణంగా వసతులు లేవన్న కారణంతో 2014-15 విద్యా సంవత్సరంలో ఫాతిమా కళాశాల అనుమతులను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేసింది. అయితే అప్పటికే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ద్వారా ఈ కాలేజీలో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. అప్పటి నుంచి వారంతా న్యాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాసరావుకు అనేక మార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో వారంతా తల్లిదండ్రులతో పాటు వారం క్రితం ఢిల్లీ చేరుకుని కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశారు. అనంతరం మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీని, ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేను కలిసి తమకు పరిష్కారం చూపాల్సిందిగా అభ్యర్థించారు.

రుణాల కోసం రైతుల పడిగాపులు



వరంగల్, కెఎన్ఎన్ బ్యూరో : దేవుడు వరం ఇచ్చినా.. పూజారి కనుకరించడం చందంగా మారింది రైతుల పరిస్థితి...ఓవైపు ముఖం చాటేసిన వర్షాలు... మరోవైపు అదనకు అందని బ్యాంకు రుణాలతో అన్నదాత అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురిసినప్పటికి పంటలకు పెట్టుబడులు లేక రైతులు ఇబ్బందులు పడుతులన్నారు. అన్నదాతను ఆదుకోవాల్సిన బ్యాంకులు మొండి చేయి చూపుతున్నాయి...వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయడానికి ఆదేశాలు ఇచ్చినా... క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. రుణాలు ఇవ్వాల్సిన బ్యాంకులు కుంటి సాకులతో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. నెలల తరబడి బ్యాంకుల చుట్టు తిరిగినా... కనికరం చూపడంలేదు. వ్యవసాయ పనులు పక్కన పెట్టి రోజుల తరబడి బ్యాంకుల వద్దే పడిగాపులు పడుతున్న పరిస్థితి వరంగల్ రూరల్ జిల్లాలోని వర్దన్నపేటలో చోటుచేసుకున్నది. ఆ మండలంలోని డీసీ తండా గ్రామానికి చెందిన 30 మంది రైతులు పంట రుణాల కోసం వర్దన్నపేటలోని ఎస్‌బీఐ బ్యాంకు చుట్టు నెల రోజులుగా తిరుగుతున్నారు. గతంలో ఎస్‌బీహెచ్ దత్తత గ్రామమైన డిసి తండా బ్యాంకుల విలీనం తర్వాత ఎస్‌బీఐ పరిధిలోకి వెళ్లింది. దీంతో ఇంకా బ్యాంకు ఖాతాలు లావాదేవీల ప్రక్రియ పూర్తికాలేదని సాకుతో బ్యాంకు సిబ్బంది రైతులకు రుణాలు ఇవ్వకుండా కాలం గడుపుతున్నారు. ఆ గ్రామానికి చెందిన గుగులోతు చందు, ఆంగోతు డిప్లా,ఈరూ,లోడి, వెంకన్న తదితర గిరిజన రైతులు పంట రుణాల కోసం నెల రోజులుగా బ్యాంకు చుట్టు తిరుగుతున్నట్లు మంగళవారం నాడు కెఎన్ఎన్ ప్రతినిధి వెల్లడించారు. ప్రతిరోజు బ్యాంకు సమయానికే చేరుకుని సాయంత్రం వరకు ఇక్కడే ఉంటున్నామని సద్దులు తెచ్చుకుని బ్యాంకులోనే కునుకు తీస్తున్నామని వారు తెలిపారు.అయినా బ్యాంక్ అధికారులు కనికరం చూపడంలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

యాదాద్రి తరహాలో భద్రాద్రి

- మాస్టర్ ప్లాన్ ఖరారు • అద్భుతంగా ఉందన్న చినజీయర్ స్వామి • సీఎం ఆమోదం కోసం నమూనాలు

ఆంధ్రప్రభ, హైదరాబాద్ : చారిత్రాత్మక, పురాతన భద్రాద్రి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ మేరకు ఆలయ అభివృద్ధి తుది నమూనాను ప్రభుత్వం సిద్ధం చేసింది. తాజాగా ఆలయ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిం చిన చిన జీయర్ స్వామి అద్భుతంగా ఉందని ప్రశంసిం చారు. ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై ఆయన ఆశక్తి ప్రదర్శించి, నిర్మాణ నమూనాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. భద్రాద్రి ఆలయాన్ని టెంపుల్ సిటీగా మార్చాలన్న సీఎం కేసీఆర్ ఆకంక్షల మేరకు ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయి నమూనాలను రూపొందించారు. కాగా ఆయా నమూ నాలను పరిశీలించిన వేద పండితులు ఆగమన శాస్త్రం ప్రకారం మార్పులు, చేర్పులు సూచించారు. వారి సూచనల మేరకు ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయి తాను రూపొందించిన నమూనాల్లో మార్పులు చేసి తుది నమూనాలను ఖరారు చేశారు. ఆయా నమూనాలను చిన జీయర్ స్వామికి చూపారు. ఈ మేరకు సోమవారంనాడు ఆర్ అండ్ బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆలయ ఈవో శ్రీనివాస్‌తో పాటు పలువురు వేద పండితులు హైదరాబాద్‌లో చిన జీయర్‌ను కలిసి భద్రాద్రి నమూనాలను అందజేశారు.




సోమవారం హైదరాబాద్‌లో చిన జీయర్‌ను కలిసిన ప్రతినిధి బృందం భద్రాద్రి ఆలయ తుది నమూనాలో మార్పులను సూచించాలని కోరారు. ఆలయ నమూనాలను పరిశీలించిన చినజీయర్ స్వామి అద్భుతంగా ఉందని కొని యాడారు. మాస్టర్‌ప్లాన్ సమగ్రంగా ఉందని, మార్పులు అవసరం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుది నమూనాల్లో స్వల్పమైన మూడు ప్రాంగణాలకు చెందిన మార్పులు సూచించారు. మొదటి ప్రాంగణాన్ని రాతి కట్టడంతో నిర్మించాలని చిన జీయర్ సూచించారు. ఆ తర్వాతి రెండు, మూడు ప్రాంగణాలను ఇటుకలతోనైనా కట్టవచ్చని, దానికి పెద్దగా పట్టింపులు ఉండవని ఆయన తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఆర్కెటెక్టర్ ఆనంద్‌సాయి, వేద పండితులు తమతో తెచ్చిన మాస్టర్ ప్లాన్‌పై సందేశాన్ని స్వయంగా రాసి సంతకం చేశారు.

యాదాద్రి తరహాలో భద్రాద్రిని కూడా టెంపుల్ సిటీగా మార్చాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు శరవేగంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని, తుది నమూనా సిద్దమయ్యాక మరో మారు చిన జీయర్ సలహా తీసు కోవాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే కలిశామని తెలిపారు మంత్రి తుమ్మల. తుది నమూ నాపై చిన జీయర్ సంతృప్తి వ్యక్తం చేయడం ఆనం దంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేవా ల య పునర్ నిర్మాణం ఆగమన శాస్త్రం ప్రకారం చేస్తున్నామని, మాఢ వీధుల నిర్మాణానికి సంబం ధించి కొందరు ఇండ్లను కోల్పోతున్నారని అధికా రులు మంత్రి దృష్టికి తెచ్చారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని ఆలయ ఈవోను మంత్రి తుమ్మల ఆదేశించారు. భద్రాద్రి మాస్టర్ ప్లాన్‌కు అందరి సమ్మతి లభించడంతో దీనిని వెంటనే సీఎం కేసీఆర్‌కు పంపాలని ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి, అధికారులకు సూచించారు. తుది నమూనాతో కూడిన మాస్టర్ ప్లాన్‌కు సీఎం కేసీఆర్ ఆమోదం తెలపాల్సి ఉంది. సీఎం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే టెండర్లు ఖరారు చేయాలని ఆయన ఆదేశించారు. ఎట్టి పరిస్థి తుల్లోనూ ఆగష్టు మాసంలో పనులన్నీ పూర్తి చేసి టెండర్లకు వెళ్లాలని సూచించారు. వీలైనంత తొందరగా ఈ ప్రక్రియను పూర్తి చేసి టెంపుల్ సిటీకి శంఖుస్థాపనకు సిద్దం చేయాలన్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్

పాపిరెడ్డి పదవీ కాలం పొడగింపు

- ఇద్దరు వైస్‌చైర్మన్లకు కూడా
- సంకేతాలిచ్చిన సీఎం కార్యాలయం • నేడోరేపో ఉత్తర్వులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు తుమ్మల పాపిరెడ్డితో పాటు ఉపాధ్యక్షులు ఆచార్య కె.వెంకటాచలం, మల్లేశ్‌ల పదవీ కాలం మరో మూడేళ్ళ పాటు పొడిగించే ఆలోచ నలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నట్టు తెలుస్తోం ది. పాపిరెడ్డి పదవీకాలం ఈనెల 4వ తేదీతో ముగు స్తోంది. ఉపాధ్యక్షుల పదవీకాలం 5వ తేదీతో పూర్తి కాబోతోంది. ఈ నేపథ్యంలో వీరి పదవీకాలాన్ని మరో విడత పెంచాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న సీఎం కేసీఆర్ బుధవారం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని గురువారం ఉన్నత విద్యామండలి అధికారుల పదవీకాలం పొడిగిం పనకు సంబంధించిన దస్త్రంపై సంతకం చేస్తారని ఆ వర్గాలు చెబుతున్నాయి. కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక ఉన్నత విద్యామండలికి పాపిరెడ్డి, వెంకటాచలం, మల్లేశ్‌లను అధ్యక్షుడి, ఉపా ధ్యక్షులుగా నియమించిన సంగతి తెలిసిందే. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెండేళ్ళపాటు వీరు తమ కార్యాలయాన్ని చక్కబెట్టే పనిలోనే నిమగ్న మయ్యారు. రాష్ట్రం విడిపోయాక రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన దస్త్రాలు కూడా మండలి కార్యాల యానికి రాలేదు. దీంతో వీరికి పని లేకుండా పోయింది. ఇప్పుడిప్పుడే మండలిలో పని చేస్తున్న అధికారులు విశ్వవిద్యాలయాల అభివృద్ధి, డిగ్రీ, పీజీ కళాశాలల పనితీరుపై దృష్టి సారించారు. ఈ దఫా వీరి ముగ్గురి పదవీకాలాన్ని పొడిగించి వారి సేవలను వినియోగించుకోవాలన్న ప్రతిపాదనకు సీఎం వచ్చినట్టు చెబుతున్నారు. ముగ్గురిలో కొందరి పదవీకాలాన్ని పొడిగించి మిగతా వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తే తప్పుడు సంకేతాలు ప్రజలతో పాటు విశ్వవిద్యాలయ అధ్యాపకుల్లోకి వెళతాయని అలా కాకుండా ముగ్గురి పదవీకాలాన్ని పెంచితే బాగుంటుందన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్టు చెబుతున్నారు. కార్పొరేషన్ చైర్మన్ల పదవీకాలం విషయంలోనూ ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే మండలి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల నియామకాల్లోనే ఇదే పద్ధతిని అమలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఉన్నత విద్యామండలి పదవుల కోసం అనేక మంది విద్యావేత్తలు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ద్వారా పెద్దఎత్తున సిఫారసు చేయిస్తున్నట్టు ప్రచారం జరిగింది. తమకు అనుకూలమైన ప్రజా ప్రతినిధుల ద్వారా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు మండలి పదవుల కోసం తీవ్రస్థాయిలో పోటీ పడుతు న్నారు. కొంత మంది ఏకంగా సీఎం కేసీఆర్‌ను కలిసి తెలంగాణ ఉద్యమంలో తాము పాల్గొన్నామని ఈ దఫా తమకు అవకాశమిస్తే ఉన్నత విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తామని చెబుతున్నారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో పదవుల కోసం ఆశలు పెట్టుకున్న వారు ఏం చేస్తారో చూడాల్సి ఉంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 2 ఆగస్టు 2017

మంచిమాట ప్రతి వ్యక్తి కన్నీటిని తుడవడమే ప్రభుత్వాలు చేయాల్సిన ప్రధాన కార్యక్రమం. ● గాంధీజీ

నిరుద్యోగం, ఆకలి, సామాజిక అసమానతలను రూపుమాపడానికి అనుసరించాల్సిన వ్యూహాలనూ, పథకాలనూ రూపొందించడం వరకే ప్రణాళికా రచయితల బాధ్యత. వాటిని అమలు జేయాల్సింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన పంచవర్షప్రణాళికలు, కేంద్ర ప్రణాళికా సంఘం రూపొందించిన పథకాలు, వ్యూహాలు సక్రమంగా, సజావుగా అమలు జరిగి ఉండి ఉంటే మన దేశం అగ్రరాజ్యంతో పోటీ పడుతూ ఉండేది. కేంద్రం ప్రతిపాదించిన పథకాలను రాష్ట్రాలు తుచ తప్పకుండా అమలు జరిపి ఉంటే అవి విఫలమయ్యాయన్న మాట వచ్చి ఉండేది కాదు.

పనగారియా నిష్క్రమణ నీతి అయోగ్‌కి ఇబ్బందే!


దశాబ్దాలుగా కొనసాగుతున్న కేంద్ర ప్రణాళికా సంఘం రూపు మార్చాలన్న సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ రెండేళ్ళ క్రితం ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ ఇంకా బాలారిష్టాల దశలోనే ఉంది.ఆ సంస్థకు అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయకుండానే,ఆ సంస్థ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా వైదొలుగుతున్నారు. కొలంబియా యూనివర్శిటీ ప్రొఫెసర్ అయిన పనగారియా ప్రధాని ఆహ్వానంపై రెండేళ్ళ సెలవు మీద వచ్చారు. ఈ నెలాఖరుతో అది పూర్తి అవుతున్నందున తిరిగి అధ్యాపకవృత్తిని స్వీకరించేందుకు వెళ్తున్నట్టు ఆయన చెప్పినప్పటికీ, వేరే కారణం ఏదో ఉంటుందన్న ఊహాగానాలు షికారు చేస్తున్నాయి.దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం అంతమొందించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం ఈ సంస్థ ప్రధాన విధి. ఆరున్నర దశాబ్దాల్లో ప్రణాళిక సంఘం చేయని పనులు నీతి ఆయోగ్ రెండేళ్ళలో పూర్తి చేస్తుందనుకోవడం అత్యాశే. నిరుద్యోగం, ఆకలి, సామాజిక అసమానతలను రూపుమాపడానికి అనుసరించాల్సిన వ్యూహాలనూ, పథకాలనూ రూపొందించడం వరకే ప్రణాళికా రచయితల బాధ్యత .వాటిని అమలు జేయాల్సింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన పంచవర్షప్రణాళికలు, కేంద్ర ప్రణాళికా సంఘం రూపొందించిన పథకాలు, వ్యూహాలు సక్రమంగా, సజావుగా అమలు జరిగి ఉండి ఉంటే మన దేశం అగ్రరాజ్యంతో పోటీ పడుతూ ఉండేది. కేంద్రం ప్రతిపాదించిన పథకాలను రాష్ట్రాలు తుచ తప్పకుండా అమలు జరిపి ఉంటే అవి విఫలమయ్యాయన్న మాట వచ్చి ఉండేది కాదు. ఈ పథకాలు, కార్యక్రమాల అమలు విషయంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడం, రాజకీయాలు చోటు చేసుకోవడం వల్లనే ఎంతటి మంచి కార్యక్రమమైనా విఫలం అవుతోంది. కాంగ్రెస్, యూపీఏ పాలనల్లో ఈ మాదిరి రుగ్మతలు చోటు చేసుకోవడం వల్లనే ప్రణాళికా సంఘం స్థానే నీతి ఆయోగ్ (నేషనల్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (ఎన్ఐటి)ని మోడీ ఏర్పాటు చేశారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మేధావులూ, ఆర్థిక శాస్త్రవేత్తలతో కూలంకషంగా చర్చలు జరిపిన తర్వాతే దీనిని ఏర్పాటు చేయడం జరిగింది.అయితే, తమ ప్రభుత్వం నెలకొల్పిన సంస్థలన్నింటికీ మోడీ మంగళం పాడుతున్నారంటూ కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఆరోపించగా, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే ప్రతిపాదనలు ఉన్నాయంటూ ఇతర పార్టీల ముఖ్యమంత్రులు విమర్శించారు. అలా విమర్శించిన వారిలో కొద్దిరోజుల క్రితం అధికార కూటమి (ఎన్‌డిఏ)లో తిరిగి ప్రవేశించిన బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్(యు) నాయకుడు నితీశ్ కుమార్ కూడా ఉన్నారు. రాష్ట్రాలకు కేంద్రం గతంలో శాఖల వారీగా నిధులు కేటాయించేది. ఇప్పుడు నీతి ఆయోగ్ ఆ పద్ధతికి స్వస్థి చెప్పి పథకాల వారీగా కేటాయిస్తోంది.అదే సందర్భంలో గత సంవత్సరం ఆయా పథకాలకు ఎంత ఖర్చు చేసిందీ పరిశీలన జరిపి అందుకు అనుగుణంగానే కేటాయింపులు చేస్తోంది.దీని వల్ల తమ స్వేచ్ఛకు ఆటంకం కలుగుతోందని రాష్ట్రా లు ఫిర్యాదు చేశాయి. ఒక శాఖ నిధులను మరో శాఖకూ, లేదా వేరే పథకాలకు కేటాయించడానికి అలవాటు పడిన రాష్ట్రా లకు ఇది మింగుడు పడకపోవడమే కారణం.

అంతేకాక,కొన్ని శాఖల్లో నిధులు ఖర్చు కాకపోతే తదుపరి సంవత్సరంలో ఆమేరకు తగ్గించి నిధులు కేటాయించే పద్ధతి కూడా రాష్ట్రా లకు నచ్చలేదు.అందుకే ఇది రాష్ట్రా ల స్వేచ్ఛకు అవరోధమని ఫిర్యాదు చేశాయి. అంతేకాక, నీతిఆయోగ్‌కి నిర్దేశించిన ఐదేళ్ళ,పదిహేనేళ్ళ వ్యూహపత్రాల రూపకల్పన ఇంకా కొలిక్కి రాలేదు. కొత్త ఉద్యోగాల సృష్టికి కార్పొరేట్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడులు పెట్టాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. ఈ పెట్టుబడుల కోసమే విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల (ఎఫ్‌డిఐల) పరిమితులను మోడీ ప్రభుత్వం చాలా రంగాల్లో పెంచింది. అయినప్పటికీ ఆశించిన మేరకు రాలేదు.అయితే, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాత్రం ఎఫ్‌డిఐలు 28 శాతం పెరిగాయని అంటున్నారు. అయితే,అందుకు తగినట్టుగా ఉద్యోగాల కల్పన జరగలేదన్నది జనాభిప్రాయం. కొత్త ఉద్యోగాల సృష్టి జరగకపోగా, కార్మిక వ్యతిరేక విధానాలకు దోహదం చేసే సిఫార్సులను నీతి ఆయోగ్ చేసిందని ట్రేడ్ యూనియన్లు ఆరోపించాయి.వీటిలో మిత వాద కార్మిక సంఘాలు అంటే, సంఘ్ పరివార్ కార్మిక సంఘాలు కూడా ఉన్నాయి.ఎయిర్ ఇండియాలో వాటాలను అమ్మాలని నీతిఆయోగ్ సిఫార్సు చేసింది. తయారీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు కార్పొరేట్ సంస్థలకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని కూడా సిఫార్సు చేసింది.ఈ సిఫార్సుల్లో చాలా వాటిని కేంద్రం ఆమోదించింది. స్థూల జాతీయోత్పత్తి(జిడిపి)ని పెంచేందుకు ఉద్దేశించిన వ్యూహపత్రాలు ఇంకా రూపకల్పన దశలోనే ఉన్నాయి.అవి ఎప్పటికి పూర్తి అవుతాయో తెలియదు. ప్రస్తుత ప్రభుత్వ కాలపరిమితి ఇక రెండేళ్ళు కూడా లేదు.ఉద్యోగాల కల్పన విషయంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు అప్పుడే ప్రారంభమయ్యాయి. మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఆయన నోటంట వచ్చిన పథకాలు,వ్యూహాలు మాత్రమే అమలు అవుతున్నాయి.

ఉదాహరణకు రిజర్వు బ్యాంకు పూర్వపు గవర్నర్ రఘురామ్ రాజన్ పెద్ద కరెన్సీ రద్దును వ్యతిరేకించినట్టు వార్తలు వచ్చాయి. ఆయనను పొమ్మనలేక పొగ పెట్టినట్టు ఆయనపై బీజేపీ ఎంపీ డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి ద్వారా రోజుకో ఆరోపణ చేసేవారు.స్వామి నోరు అదుపు చేసేందుకు మోడీ ప్రయత్నించిన దాఖలాలు లేవు.అలాగే,విదేశాల్లో తలదాచుకున్న విజయ్ మాల్యా,లలిత్ మోడీ వంటి పన్ను ఎగవేత దారులను రప్పించి వారి నుంచి సొమ్మును వసూలు చేయాలని కూడా రఘురామ్ రాజన్ సిఫార్సు చేసినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. వాటిపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడం వల్లనే ఆయన మరో టరమ్ ఆ పదవిలో కొనసాగుదామనుకున్నా, అధ్యాపక వృత్తే తనకు ఇష్టమంటూ విదేశాలకు వెళ్ళిపోయారు. ఇప్పుడు పనగారియా విషయంలో అలాంటి లీక్‌లు వెలువడకపోయినా, సంఘ్ పరివార్ అనుబంధ కార్మిక సంఘంతో సహా కార్మిక సంఘాల విమర్శలకు నొచ్చుకుని ఉండవచ్చు.అంతేకాక,నీతిఆయోగ్ ఏ తీరులో ముందుకు వెళ్ళాలనేదానిపై ప్రభుత్వానికే స్పష్టత లేనప్పుడు దానికి సారథ్యంవహించడం కన్నా, అధ్యాపక వృత్తే నయమని పనగారియా భావించి ఉండవచ్చు. ఆయన వైదొలిగితే నీతి ఆయోగ్‌కు ఇబ్బందే.

ఆవిర్భావమే కానీ... పార్టీలలో ఐక్యతేది?

తెలంగాణాలో రాజకీయ పార్టీలు పుట్టుకొస్తున్నాయి. వారిలో ఐక్యత మాత్రం ఏకోశాన కనిపించడంలేదు. ఇటీవల ఆవిర్భవించిన ఇంటి పార్టీ అని, రాజ్యాధికార సాధన పార్టీ అంటూ రాజకీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. నాయకులు ఇంతవరకు వారి జెండా, ఎజెండాను నిర్మించుకొని ప్రజల వద్దకు వెళ్లిన దాఖలాలు కనిపించడంలేదు. అందరూ సామాజిక న్యాయం అంటున్నారు. రాజకీయంగా ఉద్యోగుల పరంగా సామాజిక న్యాయం కోరుకుంటున్నారు. దీనిని బట్టి చూస్తే దళిత, బడుగు, బలహీనవర్గాల నాయకులు చతికిల పడ్డట్టుగానే కన్పిస్తుంది. మరల ఉన్నత కులాల వర్గాల వారికే పట్టం కట్టక తప్పదనే సంకేతం ఇప్పటికే ప్రజలలోను ఉద్యోగ వర్గాలలోను మొదలైంది. క్రియాశీలకంగా, అందరినీ కలుపుకొని పని చేసినట్లయితే ఆర్థిక వనరులు వాటంతటవే వస్తాయన్నది నగ్నసత్యం. కింది వర్గాల వారిలో ఐక్యత లేక వారి వారి మనోభావాలను అర్థం చేసుకోలేకవారు సమూహంగా లేకనే దేశంలోను రాష్ట్రాలలోను ఇలాంటి దుస్థితి ఉంది అని చెప్పుకోవచ్చు. అట్టడుగు వర్గాలవారు అధికారంలోకి రావాలి అని అంటే దాని వెనుక కార్యదీక్ష చాలా అవసరం దానిని అమలు పరచే తీరు తెన్నులు ఉన్న నిర్మాణాత్మమైన క్రమశిక్షణ కార్యదక్షత కలిగిన ప్రతినిధులు చాలా అవసరం ఉంటుంది, అటు ఉద్యోగి మేధావుల వర్గం నుండి కానీ ఇటు ప్రజల క్షేత్రస్థాయి నుండి కాని నడిపించే సమర్థుడు చాలా అవసరం కాని ప్రస్తుతం వర్ధమాన నాయకులు పైవిధంగా ఏ ఒక్కరు కూడా ఆలోచించుట లేదు. ఇలాగే ఉంటే మరో రెండేళ్ళు గడిచిన మాటలు మూటలుగానే మిగిలిపోతాయి. ప్రజలు ఇప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. సమర్థవంతమైన నాయకుల పరిపాలనలో ఉండాలి అని అనుకుంటున్నారు. నియోజకవర్గాల్లో ఏ ఒక్క ప్రజా ప్రతినిధి తిరగి ప్రజల మన్ననలను అడిగి తెలుసుకున్న పాపాన పోవడం లేదు వారి వారి పనులు వారి వ్యాపార నిమిత్తం మానుకొనడం తప్ప ప్రజల గోడును పట్టించుకున్న ప్రజా ప్రతినిదులు లేరు. ఒకవేళ వారు కొంతలో కొంత పట్టించుకుంటే వారి వారి నియోజకవర్గాలలో అధికారులపై దురుసుగా ప్రవర్తించ డం అనగా సంబంధిత అధికారి మీదనో లేదా కలెక్టర్ల మీదనో వారి వారి ప్రగల్భాలు ఉపయోగించి పేపర్లకు ఎక్కడం జరుగుతోంది. ప్రజలు కావాలనుకొంటోంది ఇలాంటి ప్రజా ప్రతినిధులు కాదు వారు అనుకున్న రీతిలో ఎప్పుడు వారి వెన్నంటి ఉండి అందుబాటులో ఉండి వారి అవసరాలను తీర్చే ప్రజా ప్రతినిధులు కావాలని కోరుకుంటున్నారు. అటు అధికార పార్టీ వారైనను ఇటు ప్రతిపక్ష మరియు కొత్తగా ఆవిర్భావమైన పార్టీల వారైనను బుద్ధి చెప్పే రోజు త్వరలోనే ఉంది. ముఖ్యంగా పార్టీల అధినేతలు దీనిని గురించి దీర్ఘంగా ఆలోచించి ప్రతి విషయంపై శ్రద్ధ పెట్టి పనిచెయ్యాలని ప్రజలు కోరుకుంటున్నారు లేని యెడల తీవ్ర పరిణామాలు ఎదురుకావడం తథ్యం అని మెజారిటీ ప్రజలు అనుకుంటున్నారు. వలస వాదుల నుండి ముప్పు : ఇక అధికారంలోనున్న పార్టీల విషయానికొస్తే అభివృద్ధి కార్యక్రమాలు బాగానే జరుగుతున్నాయి. అది అంతా పార్టీ అధినేత చూసుకుంటారు అని ధీమాగా ప్రజా ప్రతినిధులు ఉంటున్నారు. కాని ప్రజా క్షేత్ర స్థాయిలో దీనికి భిన్నంగా కనబడుతుంది తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నది అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులే కారణమని చెప్పుకోవచ్చు కాని ఇప్పుడు అధికారంలో ఉన్న పెద్దలు ఏ ఒక్కరు ఉద్యో గులతో అనగా సకల జనుల సమ్మె నేప థ్యంలో కలిసి వచ్చిన ఆనవాలు అసలు లేవు, కొందరైతే తెలం గాణ వద్దే వద్దు దాని వలన మనకు ఏమి లాభం అని ఈసడించుకున్న దాఖలాలు చాలానే ఉన్నాయి. వలసవాదులు అటు కాంగ్రెస్ పార్టీ నుండి గాని ఇటు తెలుగుదేశం పార్టీ నుండి గాని వచ్చినవారు భవిష్యత్తు వ్యూహాత్మకంగా స్కెచ్ వేసుకొని వచ్చారు. రాష్ట్రం లో ఇలా వచ్చిన వలస వాదుల పెర్‌ఫార్మెన్స్ ఇదేవిధంగా ఉండి ఉంటుంది. ప్రజలలో అటు ఉద్యోగులలోను వ్యక్తం అవుతోంది అని సంఘాల సర్వేలు చెపుతున్నాయి.



--కోదాటి శ్యాంసుందర్,
అధ్యక్షుడు,
భారతీయ సామాజిక న్యాయ సమితి

పెద్దరికానికే చైనా ఆరాటం!



అమెరికాకో, రష్యాకో తోకలా మెలిగే దేశంలానే భారత్‌ను ఇంకా డ్రాగన్ భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ రాజకీయపుటెత్తులు, దౌత్యనీతి విధానాలను ఇంకా పసిగట్టలేకపోతోంది. మంగోలియాకు రుణ సాయం ప్రకటించడం భారత్ పన్నిన తిరుగులేని వ్యూహం. మన పక్కనున్న పాకిస్థాన్‌కు చైనా దురూహతో సైనికసాయం చేస్తూ, మనపైకి రెచ్చగొడుతుంటే.. భారత్ మాత్రం చైనా పక్కనున్న మంగోలియా అభివృద్ధికి కంకణం కట్టుకోవడం ప్రపంచ దేశాలన్నీ గమనిస్తున్నాయి. అభివృద్ధే మంత్రంగా సాగుతున్న భారత్‌ను ఎలా దెబ్బతీయాలనే తంత్రాలలో ఇంకా చీనీభాయ్ మునిగితేలుతున్నాడు.

డోక్లామ్ అనిశ్చితిపై చైనా మైండ్ గేమ్ ఆడుతోంది. ఆసియా ప్రాంతంలో పెద్దన్నగా మారాలన్నదే దాని ఉబలాటం. అందుకే మాటల యుద్ధానికి దిగుతోంది. తరచూ 1962 యుద్ధాన్ని గుర్తు చేస్తోంది. ఇటీవలి కాలంలో భారత్ దిగ్గజ శక్తిగా ఎదగడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఎలాగైనా భారత్ ఎదుగుదలను నిరోధించాలని కుయుక్తులు పన్నుతోంది. గత నాలుగు దశాబ్దాలుగా ఎన్నడూలేని విధంగా భారత్‌పై డ్రాగన్ విషం చిమ్ముతోంది. ఎప్పటిలాగే గట్టిగా హూంకరిస్తే భారత్ సైన్యం వెనుకడుగువేస్తుందని ఇంకా నమ్ముతోంది. అందులో భాగంగానే ప్రస్తుతం డోక్లామ్ పరిస్థితిని కావాలనే సృష్టించింది. వారం క్రితం ఉత్తరాఖండ్‌లోనూ అడుగుపెట్టింది. గతంలో మాదిరిగా రష్యాకో, అమెరికాకో చిన్న చేదోడు దేశంగానే మిగల్చాలన్నది చైనా దుష్టాలోచన. అందుకు అనుగుణంగా పాకిస్తాన్‌పై ఎనలేని అభిమానాన్ని కురిపిస్తోంది. భారత్‌కు దీటుగా ఉండేందుకు పాకిస్తాన్‌కు మిలిటరీ సాయం అందిస్తోంది. భారత్ వృద్ధి రేటును ఎలాగైనా తగ్గించాలని తహతహలాడుతోంది. భారత్‌లోకి విపరీతంగా ప్రవహిస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నిలువరించడానికి కుయుక్తులు పన్నుతోంది. భారత్‌ను మించి వృద్ధి రేటును ఎలాగైనా సాధించి ప్రపంచంలోనే అత్యంత అధికవృద్ధి రేటు సాధిస్తున్న దేశంగా గుర్తింపు పొందాలని దాని ఉద్దేశం.

పలచన చేసిన తప్పటంచనాలు

సరిగ్గా ఇక్కడే డ్రాగన్ భారత్‌ను తక్కువ అంచనా వేసింది. చైనా వ్యూహాత్మక నిపుణులు కూడా ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలను పసిగట్టలేకపోయారు. గత మూడేళ్లుగా మోడీ ప్రపంచ దేశాలను చుట్టి వస్తున్నారు. అన్ని దేశాలను ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కూడగట్టగలిగారు. మిగిలిన అంశాలు ఎలావున్నా, ఉగ్రవాదం మానవతావాదంపై దాడిగా మోడీ అభివర్ణించిన సిద్ధాంతాన్ని అందరూ ఒప్పుకున్నారు. అదే సమయంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నది పాకిస్తానేనన్న అంశాన్ని కూడా మోడీ ప్రపంచ దేశాల ముందు ఉంచగలిగారు. అన్ని దేశాలు పాకిస్తాన్‌ను రోగ్ (దుష్ట) స్టేట్ (దేశం)గా పరిగణించే సమయంలో చైనా తప్పటడుగు వేసింది. పాకిస్తాన్ వెన్నుతట్టి నిలబడడంతో ప్రపంచ దేశాల్లో పలచనైంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాల్లో పర్యటించిన మోడీ, ఉగ్రవాదంపై తమతో కలిసి పోరాడేందుకు ఒప్పించగలిగారు. ఉగ్రవాదానికి కేంద్రకంగా పాకిస్తాన్ మారిన నేపథ్యంలో దానికి వ్యతిరేక పోరులో ప్రధాన శక్తిగా భారత్ ఆవిర్భవించింది. అదే సమయంలో హిజ్బుల్ ముజాహుద్దీన్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజహర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించడానికి గతేడాది చైనా నిరాకరించి భారత్ పట్ల తనకున్న ద్వేషాన్ని వెళ్లగక్కింది. పాత ఎత్తుగడలతోనే ఈసారి కూడా ప్రయోజనం పొందాలని చైనా చూసింది. కాని, ప్రధాని మోడీ పాలనలో ఇటువంటి ట్రిక్కులు పనిచేయవని వెంటనే గ్రహించింది. సరిహద్దుల్లో భారత్ సైన్యం డ్రాగన్ బుసలకు ఏమాత్రం బెదరలేదు. పైగా అంగుళం కూడా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ముందుకు కదలకుండా అడ్డుకుంటోంది. దీంతో పరోక్షంగా భూటాన్‌కు కూడా సందేశం ఇచ్చినట్టయింది. భారత్ - భూటాన్‌ల మధ్య మిలిటరీ ఒప్పందం ఉన్న సంగతి విదితమే. ఇది పరోక్షంగా భారత్ చుట్టుపక్కల దేశాలకు కూడా భారత్ పట్ల విశ్వసనీయతను పెంచింది. భారత్ పక్కనుండగా విదేశీ దాడులకు వెరవనవసరం లేదని గ్రహించాయి.

దౌత్య నీతితో ఇరుకున చైనా..

కాగా, తాజాగా చైనా వ్యతిరేకిగా పేరొందిన మంగోలియాకు కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు ఖల్త్‌మా బుట్టుగ్గాను భారత్‌లో పర్యటించాల్సిందిగా ప్రధాని మోడీ ఆహ్వానించడం చైనాను దౌత్యపరంగా మరింత ఇరుకునపెట్టడంగా పరిశీలకులు భావిస్తున్నారు. మంగోలియాలో 2015లో పర్యటించిన మోడీ వంద కోట్ల డాలర్ల రుణాన్ని ప్రకటించారు. మంగోలియా ఉత్పత్తుల్లో 80 శాతం వరకూ చైనాయే కొనుగోలు చేస్తోంది. అయినప్పటికీ, చైనా వ్యతిరేక విధానాలతో అధికారంలోకి వచ్చిన అధ్యక్షుడు బుట్టుగ్గా భారత్ ప్రజాస్వామ్య విధానాలవైపే మొగ్గు చూపుతుండడం విశేషం. వాస్తవానికి చైనాపై ఆధారపడడాన్ని తగ్గించడానికే బుట్టుగ్గా ఐఎంఎఫ్ నుంచి 5.5 బిలియన్ డాలర్ల రుణంతో దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రణాళికలు వేసుకున్నారు. చైనా సరిహద్దు దేశమైనా మంగోలియా ఇప్పుడొక ప్రబల శక్తిగా అవతరించడాన్ని గుర్తించే మోడీ దానికి స్నేహహస్తం చాచారు. భారత్ నిన్నటి దేశం కాదని, డ్రాగన్ ఎత్తులకు పైఎత్తులు వేసి చిత్తు చేయగల సత్తా మోడీకి ఉందని ఇప్పుడు ప్రపంచ దేశాధినేతలకు సైతం స్పష్టమైపోయింది.

- గుళ్లపల్లి దిన్నా బాబు

అభివృద్ధి పేరిట సామ్రాజ్యకాంక్ష

అభివృద్ధి పేరుతో తమ దేశాల్లో చైనా అనుసరిస్తున్న వ్యవహారశైలిపై కూడా పునరాలోచనలో పడుతున్నాయి. ఇందుకు శ్రీలంక తన పోర్టు వ్యవహారంలో చైనాను కేవలం వాణిజ్య అవసరాలకే పరిమితం చేస్తున్నట్టు చేసిన ప్రకటనే దీనికి తార్కాణం. చైనా వన్ బెల్ట్ వన్ రోడ్‌కు ధీటుగా భారత్-మయన్మార్ కారిడార్‌కు విశేష ప్రాధాన్యం ఇచ్చి భారీగా నిధులను కూడా కేటాయించడం మరింతగా ప్రతిష్టను పెంచింది. మరోపక్క చైనా తన సరిహద్దు దేశాలన్నింటితోనూ పేచీయే! దక్షిణ చైనా సముద్రంలోనూ అదే పోకడ. వాస్తవానికి మోడీ అధికారం చేపట్టిన తర్వాత చైనాకు కూడా స్నేహ హస్తాన్నే అందించారు. జిన్ పింగ్‌ను భారత్‌కు ఆహ్వానించారు. వాణిజ్యం పెంపునకు, అన్ని వివాదాల పరిష్కారానికి కృషి చేయాల్సింది పోయి పాకిస్తాన్‌లో తిష్ట వేసింది. భారత్‌కు వ్యతిరేకంగా కుయుక్తులు పన్నుతోంది. ఉగ్రమూకల్ని భారత్ సరిహద్దు దాటించడానికి పరోక్షంగా తోడ్పడుతోంది. చైనా ఎంతగా కవ్వించినా, మాటల తూటాలు పేల్చినా భారత్ సంయమనాన్నే పాటిస్తోంది. ఓపిగ్గా అన్నింటినీ భరిస్తోంది. ఫలితంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, చైనా దూకుడుకు అడ్డు నిలిచే శక్తిగా భారత్ ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందింది. దీంతో చైనాకు మరింత చిర్రెత్తుతున్నా చివరకు వెనక్కు తగ్గక తప్పదని దక్షిణాసియా రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం ప్రపంచ దేశాల్లో పెరిగిన మోడీ పలుకుబడి కాగా, రెండవది వాణిజ్యం. భారత్‌లో పెరుగుతున్న తమ వాణిజ్య ఉత్పత్తులను పరిరక్షించుకునేందుకు అయినా డ్రాగన్ వెనక్కు తగ్గక తప్పదనేది వారి అంచనా. అలాకాకుండా, చైనా అడ్డగోలు దూకుడునే ప్రదర్శిస్తే నష్టపోయేది అదేనని పేర్కొంటున్నారు. ఇందుకు రెండో ప్రపంచ యుద్ధం ముందు నాటి పరిస్థితులను ఉదహరిస్తున్నారు. ఐరోపా దేశాలను ఇలాగే కవ్వించి యుద్ధానికి దిగిన హిట్లర్‌కు ఏ గతి పట్టిందో గుర్తు చేస్తున్నారు.

సాక్షియం

పాకిస్తానీ ప్రజాస్వామ్యం ఓ ప్రహసనం

సాధారణంగా రెండు రకాల ప్రజాస్వామ్యం గురించి చదువుకొంటాం. ఒకటి అధ్యక్ష తరహా, రెండోది పార్లమెంటరీ. అయితే పాకిస్తాన్‌ది మరో తరహా. పేరుకి పార్లమెంటరీ అయినా నిజానికి ప్రహసనప్రాయం. అందుకనే ఈ డెబ్బై ఏళ్లలో ఆ దేశంలో ఇంతవరకూ ఏ ప్రధాని కూడా తన పదవీకాలం పూర్తిచెయ్యలేకపోయారు. అయితే మిలిటరీ చేతిలోనో, లేదా అధ్యక్షుడి చేతిలోనో పదవీచ్యుతి పొందడం ఆ దేశ ప్రధానికి అనివార్యం. వచ్చే సంవత్సరం ఎన్నికల వరకూ ఆగి ఉంటే ప్రస్తుతం పదవీచ్యుతుడైన ప్రధాని నవాజ్ షరీఫ్ పూర్తికాలం పదవి నలంకరించిన మొదటి వ్యక్తి అయ్యుండేవారు. అయితే ఈసారి ఆయన్ని పదవినుండి తొలగించే బాధ్యత అక్కడి సుప్రీం కోర్టు తీసుకొంది. అదీ బలహీనమైన సాకు ద్వారా. పనామా పత్రాల ద్వారా నవాజ్ షరీఫ్ అవినీతి ఆరోపణలెదుర్కొంటున్నారు. ఆ కేసు పూర్తికాకముందే కొన్ని సాంకేతిక కారణాల ప్రాతిపదికన ఆయన ప్రస్తుత పదవినుండి తొలగించబడ్డారు. ఆ విధంగా పూర్తికాలం పదవిలో ఉన్న ప్రధానిగా చరిత్ర సృష్టించాల్సిన వ్యక్తి, మూడుసార్లు మధ్యలో తొలగింపబడిన నేతగా మిగిలిపోయారు. అయితే ఈ రకమైన అలంకార ప్రాయమైన ప్రజాస్వామ్యం పాకిస్తాన్‌కే ప్రత్యేకం. అక్కడ అసలు అధికారం సైన్యానిది. అయితే వాటివల్ల పొరుగు దేశాలకు కూడా అదనపు నష్టాలు. ఇప్పుడు పాకిస్తాన్ పరిస్థితి పిచ్చోడి చేతిలో రాయి. కనుక భారత్ మరింత అప్రమత్తంగా ఉండాలి. ఉగ్రవాద సమస్యపై, పాక్‌లో బందీగా ఉన్న కులభూషణ్ జాదవ్ కేసు విషయమై చొరవగా ముందుకెళ్లాలి.

-డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపి, పార్వతీపురం

సామాన్యుల సొమ్ముతో కట్టిన మేడలు నిలువవు!

ప్రభుత్వరంగ సంస్థ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆగస్టు 1 నుంచి సామాన్యుల ఖాతా (సేవింగ్స్ బ్యాంకు ఖాతా)దారులపై పిడుగుపాటి నిర్ణయం తీసుకుంది. టూ-టైర్ సేవింగ్స్ ఖాతా వడ్డీరేట్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌బీ ఖాతాకు 4 శాతం ఉండే వడ్డీరేటును 0.5 శాతానికి అంటే 3.5 శాతానికి తగ్గించింది. దీంతో అతి సామాన్యులు మెయింటెన్ చేసే తమ పొదుపు ఖాతా దారులను ఒకరకంగా మోసం చేసినట్లే. ఒకపక్క భారీ లాభాలతో ముందుకువెళుతున్న ఎస్‌బీఐ, పొదుపుఖాతాపై కన్నెర్ర చేయడం మంచిదికాదని అనుభవజ్ఞులు చెబుతున్నారు. రిటైరయి కేవలం బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌చేసి దానిపై ఆధారపడే వారికి మాత్రం ఇది చాలా ఇబ్బందికరమైన పరిస్థితే అని చెప్పవచ్చు.అతిసామాన్యులు తమ పొదుపు ఖాతాలను మెయింటెన్ చేసేదీ ఎస్‌బీ ఎకౌంట్‌లోనే. వారి ఖాతాలకే కొర్రి పెట్టి, వాటిపై వచ్చిన వడ్డీలతో మేడలు కడితే నిలవవు. పేదల సొమ్ముతో పైకివస్తున్న ఎస్‌బీఐకి ఇది రెండో తప్పిదం. మొదటిది మినిమమ్ బ్యాలెన్స్. రెండోది పొదుపు ఖాతాకు వడ్డీ తగ్గించడం. ఈ రెండు నిర్ణయాలతో ఎంతో నమ్మకంగా పొదుపుచేస్తున్న ఖాతాదారులను పోగొట్టుకుంటోంది. ఖాతాలో కోటి రూపాయలు కంటే ఎక్కువ బ్యాలెన్స్ ఉన్నవారి యథావిధిగా నాలుగు శాతం ఉంటుందని, అంతకంటే తక్కువ ఉన్న పొదుపు ఖాథాల్లో 3.5 మాత్రమే ఉంటుందని ఎస్‌బీఐ ప్రకటించింది. ఆర్థికంగా ఎంత ఎదిగినా పొదుపు ఖాతాలపై సంపాదించిన సొమ్ముతో కట్టిన మేడలు నిలవవని తెలుసుకోవాలి.

- కె.రాయుడు, హైదరాబాద్

యూరప్ నుంచి వచ్చారు... మనతో కలిసిపోయారు..!

(నేడు ఆంగ్లో ఇండియన్ దినోత్సవం)

బ్రిటిష్ వారి పాలనలో యూరోపియన్లు ఎంతోమంది భారతదేశానికి ఉద్యోగం రీత్యా వచ్చారు. వారిలో కొందరికి స్థానికులతో పరిచయాలు ఏర్పడి వైవాహిక బంధానికి దారితీసాయి. వీరిని మొదట్లో యూరోపియన్లుగా పిలిచేవారు. 1935 సంవత్సరంలో అప్పటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఆంగ్లో ఇండియన్లుగా కొత్త స్టేటస్ ఇచ్చింది. వీరికి ఉద్యోగాలలో రిజర్వేషన్లు కూడా ఉండేవి.

1962 లో ఈ రిజర్వేషన్లు రద్దు చేయబడినాయి. ఆంగ్లో ఇండియన్లుగా మైనారిటీ హోదాను అనుభవిస్తున్న వీరి మాతృభాష ఇంగ్లీషు. మతం క్రైస్తవం. ఆహారపు అలవాట్లు వేషధారణ యూరోపియన్ పద్ధతిలో ఉంటాయి. భారతదేశం వెలుపల (వివిధ దేశాలలో) సుమారు పదిలక్షల మంది వరకు వీరు ఉన్నారట. మన దేశంలో సుమారు ఎనిమిది లక్షలమంది ఉన్నారు. హైదరాబాద్‌లో మొదటిసారిగా 2.8.2005న ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుండి, వివిధ దేశాల నుండి అధిక సంఖ్యలో ఆంగ్లో ఇండియన్లు వచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలలోను, ఇతర రంగాలలోను తమకు ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. స్థానిక సంస్థలు, మైనారిటీ కార్పొరేషన్లు బోర్డుల లోను తమకు కూడా స్థానం కల్పించాలని అడుగుతున్నారు. వీరు ఆంగ్లోస్ ఇన్ ద విండ్ అనేక పక్ష పత్రికను వెలువరిస్తున్నారు. ఆంగ్లో ఇండియన్ అనే పదాన్ని నిర్వహించే చట్టం చేయబడిన రోజు 2.8.1935. కాబట్టి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించారు. వివిధ దేశాలలోని ఆంగ్లో ఇండియన్ అసోసియేషన్లు అన్ని కలిపి ది ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆంగ్లో ఇండియన్ అసోసియేషన్స్‌గా ఏర్పడ్డాయి.

ఆర్టికల్ 330 మరియు 331ల ద్వారా లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్‌లను, రాష్ట్రా లలోని విధాన మండలికి ఒక ఆంగ్లో ఇండియన్‌ను సభ్యులుగా నియమించే సౌకర్యం కల్పించబడింది. మనం కూడా వారిని గౌరవిద్దాం. అన్ని దేశాల ప్రజలను అక్కున చేర్చుకునే గుణం మన దేశానికి ఉంది. ప్రతి ఏటా ఈ దినోత్సవం రోజున వారు పండుగ వాతావరణంలో దినోత్సవాన్ని నిర్వహించుకుంటారు. భారతీయులంటే వారికి అమితమైన ప్రేమ, అభిమానం.

- కామిడి సతీష్ రెడ్డి
జడలపేట, జయశంకర్ జిల్లా


ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విక్రమ్‌గౌడ్ (ఇన్‌సెట్లో విక్రమ్ ఫైల్)

అప్పుల బాధతోనే ఆత్మహత్య డ్రామా

(మొదటిపేజీ తరువాయి)

ముగిసిందని, తండ్రిని బెదిరించాలన్నదే విక్రమ్‌గౌడ్ అసలు ఆలోచన అని పోలీసు వర్గాలు వెల్లడించాయి. తొలుత బహిరంగ ప్రదేశంలో ఈ ప్లాన్ అమలు చేయాలని విక్రమ్‌గౌడ్ భావించాడని పోలీసులు గుర్తించారు. అలా చేస్తే దొరికిపోయే ప్రమాదం ఉందని ఆలోచించి, ఇంట్లోనే నాటకానికి తెరలేపాడని పోలీసులు గుర్తించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విక్రమ్‌ను విచారణ చేయగా.. మొత్తం వ్యవహారం ఆయన నోటి నుంచే బయటకు వచ్చిందంటున్నారు. తనంటే ఎంతో ప్రేమ చూపించే తండ్రి నుంచి బకాయిలు తీర్చేందుకు అవసరమైన డబ్బును తీసుకోవాలన్న ఆలోచనతో ఇదంతా చేసినట్లు విక్రమ్‌గౌడ్ వెల్లడించాడని పోలీసులు గుర్తించారు. తద్వారా ఫైనాన్షియర్ల తల నొప్పులు ఉండవని భావించాడు. మాజీ మంత్రి మూల ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్ కేసులో మిస్టరీ వీడింది. తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ముగ్గురిని కర్నాటకలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రాజు, రాజశేఖర్, మురళీలుగా గుర్తించారు. వీరితో తనపై కాల్పులు జరిపించుకోవడం కోసం విక్రమ్ ఒప్పందం చేసుకున్నారు. ఈ ముగ్గురు నిందితులు కూడా విక్రంకు పరిచయస్తులేనని పోలీసులు తేల్చారు. అదుపులోకి తీసుకున్న ఆ ముగ్గురిని కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

హత్యాయత్నంగా మార్చేందుకు వ్యూహం

అంతకు ముందు విక్రమ్ ఆత్మహత్యాయత్నం చేసి దాన్ని హత్యాయత్నంగా మార్చేందుకు పథకం వేసినట్లు పోలీసులు ప్రాథమిక సాక్ష్యాధారాలు సేకరించారు. వీరు విక్రమ్ సూచనల మేరకే బైక్‌ను తీసుకువచ్చి అతని ఇంటి బయట తచ్చాడి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా పారిపోయినట్లు గుర్తించారు. ఇదంతా విక్రమ్‌గౌడ్ ఎందుకు చేశాడన్న దానిపై ఆధారాలు లభించకపోవడంతో మరోసారి అతనిని ప్రశ్నించారు. అతని ఫోన్‌లోని నంబర్లు, మెసేజ్‌లు పరిశీలించిన తర్వాత పోలీసులకు కొన్ని సందేహాలు ఏర్పడ్డాయి. వీటిని నివృత్తి చేసుకోవడానికి ఆధారాలు సేక రిస్తున్నారు.

ఘటనాస్థలంలో మాయమైన తుపాకీ కోసం గాలించారు. దానిని గుర్తిం చారు. విక్రమ్‌గౌడ, అతని భార్య షిపాలి నుంచి పోలీసులు పలు వివరాలు సేక రించారు. సాంకేతిక సాక్ష్యాధారాలతో విక్రమ్ ఇంట్లోకి ఎవరూ రాలేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. అతనే ఆయుధంతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. విక్రమ్ మాత్రం బయటి నుంచి వచ్చిన దుండగులు తనను కాల్చారని చెబుతున్నాడు. సెక్యూరిటీ గార్డ్ చెప్పిన సాక్ష్యాల ఆధారంగా విక్రమ్ సంఘటన జరిగిన రోజు అరగంట పాటు బయటకు వెళ్లారని గుర్తించారు. తలుపు వేయవద్దంటూ విక్రమ్‌గౌడ్ తనకు చెప్పినట్లు సెక్యూరిటీ గార్డు పోలీసులకు వాం గ్మూలం ఇచ్చాడు. విక్రమ్ ఇదంతా ఎందుకు చేశాడని ఆరా తీయగా.. రూ.కోట్లలో ఉన్న అప్పులను తీర్చేందుకు కుటుంబసభ్యుల నుంచి సహాయనిరాకరణ ఎదు రవడంతో ఇలా చేసుంటాడన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. కుటుంబసభ్యులను బెదిరించేందుకు ఇలా చేశాడా? తన ప్రాణానికి రక్షణ లేదు.. ఆయుధ లైసెన్సు అవసరమంటూ పోలీస్ శాఖ నుంచి సానుభూతి పొందేందు కు పథకం వేశాడా? అన్న ప్రశ్నలకు ఇంకా సమాధానాలు దొరకలేదని అంటున్నారు.

ఆర్థికంగా నష్టాలు చవిచూడటంతో...

కాగా, చేపట్టిన ఏ వ్యాపారంలోనూ రాణించలేకపోయిన విక్రమ్‌గౌడ్ ఆర్థికంగా నష్టాలు చవిచూస్తున్నారు. వార సత్వంగా వస్తున్న స్థిరాస్తులు కరిగిపోయాయి. తండ్రి ముఖేష్‌గౌడ్ కూడబెట్టిన ఆస్తులు తన బంధువు పేరుతో ఉండటాన్ని విక్రమ్ జీర్ణించుకోలేకపోయాడు. పైగా తనకు ఆస్తి దక్కకుండా బాబాయ్ కట్టడి చేస్తున్నాడనే భయం కూడా విక్రమ్‌గౌడ్‌లో ఉంది. ఓ వైపు సొంత ఆస్తి దక్కకపోవడం మరోవైపు వ్యాపారంలో నష్టాలు, ఇంకోవైపు నుంచి అప్పు ఇచ్చిన వారి నుంచి తీవ్ర ఒత్తిడి ఇవే విక్రమ్ ఆత్మహత్య డ్రామాకు కారణమని తెలుస్తోంది.

కాల్పులు జరిపింది ఇండోర్ గ్యాంగ్

విక్రమ్‌గౌడ్‌పై కాల్పులకు పాల్పడింది ఇండోర్‌కు చెందిన సుపారీ గ్యాంగ్ అని బంజారాహిల్స్ పోలీసులు తేల్చి చెప్పారు. సుపారీ గ్యాంగ్‌తో కాల్పులకు ఆరు నెలల నుంచి విక్రమ్‌గౌడ్ ప్లాన్ చేశాడని నిపుణుడైన ఓ షూటర్‌ని ఎంపిక చేసుకుని కాల్పులకు పథకం వేసు కున్నాడని పోలీసుల సమాచారం. కాల్పులు జరిపితే అన్ని రకాలుగా ఉప యోగపడుతుందని భావించిన విక్రమ్ తన ఇంటి లోపల, బయట సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడని సమాచారం. ఈ కాల్పుల ఘటనకు రెండు రోజుల ముందు ఆ నిపుణుడైన షూటర్ సహా మరో ఇద్దరు అక్కడికి వచ్చి వెళ్లారని, కాల్పులు ఎక్కడ జరపాలి, శరీరంపై ఎక్కడ గాయపర్చాలనే విషయమై విక్రమ్‌గౌడ్ ఓ ట్రయల్ రన్ వేశాడని పోలీసులు పేర్కొన్నారు. మూడు రౌండ్ల కాల్పులు జరపాలని సదరు షూటర్‌కు విక్రమ్ చెప్పాడని, కాల్పులు జరిపాక ఏ మార్గంలో పారిపోవాలో విక్రమ్ స్కెచ్ వేసి ఇచ్చాడని, సీసీ కెమెరాలు లేని రూట్‌ను నిందితులకు విక్రమ్ చూపిం చాడని సమాచారం. అయితే, రెండు రౌండ్ల కాల్పులకే భయపడిపోయిన సదరు షూటర్, మూడో రౌండ్‌కు ముందే పారిపోయాడని తెలిపారు. హైదరాబాద్ నగ రంలోని పలు ప్రాంతాల నుంచి సిటీ బయటకు నిందితులు పారిపోయారని, వారిలో నిపుణుడైన షూటర్ ఇండోర్‌కు, మరో ఇద్దరు అనంతపురం, ఇంకొకరు బెంగళూరుకు పారిపోగా, మూడు ప్రాంతాల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు. కాగా ఈ కేసులో ఏ1గా విక్రమ్‌గౌడ్, ఎ2గా ఇండోర్‌కు చెందిన షూటర్ నందు, హైదరాబాద్‌కు చెందిన అహ్మద్ ఖాన్‌తో పాటు మరో ముగ్గురు నిందితులపై 120,121బి, 420, 404, 27 ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

బీసీలను మోసం చేశారు

4 నుంచి రాష్ట్రవ్యాప్త నిరసనలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: జాతీయ బీసీ కమిసన్ బిల్లును రాజ్యసభలో ఆమోదించకుండా తిరిగి సవరణలతో లోక్‌సభకు పంపించడంపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం 4న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. జాతీయ బీసీ కమిషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదించకుండా 60 కోట్ల మంది బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. జాతీయ బీసీ కమిషన్ బిల్లును నీరుగార్చడం కోసమే అటు కాంగ్రెస్, ఇటు బిజెపి సవరణల పేరుతో తిరిగి లోక్‌సభకు పంపించడం సరికాదన్నారు. బీసీ కమిషన్‌కు జవసత్వాలు లేకుండా చేశాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పట్ల చిత్తశుద్ధి ఉంటే బిల్లుపై సందేహాలను నివృత్తి చేయడానికి రాజ్యసభ సెలెక్షన్ కమిటీకి ముందుగానే ఎందుకు లిఖితపూర్వకంగా తెలియజేయలేదని మండిపడ్డారు. బీసీలను మోసం చేసినందుకు నిరసనగా ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు జాజుల స్పష్టం చేశారు.

ట్రైనీ ఐఏఎస్‌లకు సేద్యంపై అవగాహన

సచివాలయంలో కార్యదర్శి పార్థసారథితో భేటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : శిక్షణలో ఉన్న యువ ఐఏఎస్ అధికారులకు తెలంగాణ వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి వ్యవసాయం, అనుబంధ రంగాలు, రైతుల స్థితిగతులపై అవగాహన కల్పించారు. మంగళవారం సచివాలయంలోని 'డి' బ్లాకులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తి, సమస్యలు, ప్రభుత్వం అందించే సహకారం, పథకాల అమలుపై సవివరంగా తెలియజేశారు. శిక్షణ నిమిత్తం వచ్చిన ఐఏఎస్ అధికారులు సచిన్, యోగిందర్ సింగ్, అశిక జైన్ తదితరులు వీరిలో ఉన్నారు. తెలంగాణ పంటలు, పంటల సరళి, సూక్ష్మసేద్యం, మార్కెటింగ్‌లో గిడ్డంగుల నిర్మాణంతో పాటు పలు అంశాలలో రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చొరవ గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంలో తెలంగాణ ప్రభుత్వం రైతులను అప్పుల బాధనుంచి విముక్తులను చేయడం కోసం రూ.16,105 కోట్లతో రుణమాఫీ చేసిందని తద్వారా 35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూ రిందని తెలిపారు. దీనితో పాటు రైతులకు ఇప్పటి వరకు 9 గంటలు నిరంతర, నిరవధిక ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, అలాగే ముమ్ముందు 24 గంటలు ఉచిత విద్యుత్ అందజేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇనామ్ నిర్వహణలో ప్రథమ స్థానంలో ఉందని, ఇప్పటికే 44 మార్కెటింగ్ కమిటీలు ఇనామ్ కింద ఎంపిక జరిగిందని, మరో 16 మార్కెటింగ్ కమిటీలను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీకి ప్రధానమంత్రి ఎక్సలెన్స్ అవార్డు వచ్చిందని తెలిపారు. ఇప్పటిదాకా శాస్త్రీయ పద్ధతిలో 300 గిడ్డంగుల నిర్మాణం జరిగిందని, తద్వారా 4 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం నుంచి 14.25 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పెరిగిందని చెప్పారు. మార్కెటింగ్ శాఖ ద్వారా ఆర్‌కేవైవీ కింద చేపడుతున్న మన కూరగాయల పథకాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఆఫీసర్స్ ట్రైనీస్ పలు ప్రశ్నలు వేసి పథకం గురించి తెలుసుకున్నారు.

లీజుకు మెట్రోరైల్ ఇంజన్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ మెట్రోరైల్ ఇంజన్లు, కోచ్‌లు ఇక లీజుకు ఇవ్వనున్నారు. ఈ మేరకు మహరాష్ట్రలోని నాగ్‌పూర్ మెట్రోకు ట్రయల్ రన్ కోసం వాటిని ఇచ్చేందుకు తెరాస ప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో రెండు ఇంజన్లు, ఆరు కోచ్‌లను నాగ్‌పూర్‌కు పంపించాల్సిందిగా హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు పనులను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టి సంస్థకు రాష్ట్ర సర్కార్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో నాగ్‌పూర్ మెట్రో అధికారులు ఈ నెల 15వ తేదీ నుంచి అక్కడ ట్రయల్ రన్‌ను నిర్వహించనున్నారు. ఈ లీజు మూడేళ్ళ పాటు అమలులో ఉంటుంది. హైదరాబాద్ మెట్రోరైల్ నిర్ణిత గడువులోగా పట్టాలు ఎక్కకపోవడం, పాతబస్తీ అలైన్‌మెంట్ విషయంలో ఇంకా ఒక క్లారిటీ రాకపోవడం, మెట్రో కారిడార్లలో ఆశించిన వేగంగా భూసేకరణ జరగకపోవడం తో పాటు పలు రకాల కారణాల వల్ల పనుల్లో అంతులేని కాలయాపన చోటు చేసుకుంది. దాంతోపాటు సుమారు నాలుగువేల కోట్ల అదనపు భారం మోయ డం ఎల్ అండ్ టి సంస్థకు సైతం భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు వ్యయానికి అధనంగా పెరిగిన మొత్తంలో కొంత మొత్తాన్ని భరించాల్సిందిగా ఎల్ అండ్ టీ సంస్థ కొన్నాళ్ళ క్రితమే తెరాస ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఎల్ అండ్ టీ సంస్థ కోరిన విధంగా చెల్లించడానికి సముఖంగా లేని రాష్ట్ర ప్రభుత్వం నాగ్‌పూర్ మెట్రోకు లీజు ఇవ్వడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పైగా ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో మొత్తం మూడు కారిడార్లలో 72 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టాలని నిర్ణయించింది. అయితే పనుల్లో జరిగిన జాప్యం కారణంగా ప్రస్తుతం నాగోల్ టూ మెట్టుగూడ, మియాపూర్ టూ ఎస్ఆర్ నగర్ వరకు రెండు కారిడార్లను ఈ సంవత్సరం చివరి నాటికల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని తలపెట్టారు. ప్రస్తుతం ఈ కారిడార్లలో మూడు, నాలుగు రైళ్ళు మాత్రమే ట్రయల్ రన్ కోసం వినియోగిస్తున్నారు.

సుజనా ఫోరం మాల్‌లో 4న ఎయిర్‌ఫోర్స్ బ్యాండ్ కన్సర్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత వైమానిక దళం (ఎయిర్స్‌ఫోర్స్) 4వ తేదీన హైదరాబాద్‌లోని సుజనా ఫోరం మాల్‌లో బ్యాండ్ కన్సర్ట్ నిర్వహించనుంది. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ మద్దతుతో సాయంత్రం 6.30 నుంచి ఈ కన్సర్ట్ నిర్వహించనున్నారు. ఎయిర్ ఫోర్స్ సింఫని ఆర్కెస్ట్రా కార్యక్రమంలో నగరవాసులు పాల్గొనవచ్చునని ఎయిర్‌ఫోర్స్ బ్యాండ్ కన్సర్ట్ వింగ్ కమాండర్ శ్యాంసుందర్ తెలిపారు.1947లో దేశానికి మొదటిసారి స్వాతంత్ర్యం వచ్చినపుడు ఆగస్టు 15న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సమక్షంలో మొదటిసారిగా అధికార కార్యక్రమంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బ్యాండ్ కన్సర్ట్ నిర్వహించాయి. 1971 నుంచి దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 22 మంది సభ్యులు గల ఎయిర్‌ఫోర్స్ బ్యాండ్ మ్యూజిక్ ప్లే చేస్తోంది. ఇందులో బ్రాస్, ఉడ్-విండ్, రీడ్-స్ట్రింగ్, ఎలక్ట్రానిక్, పెర్క్యూసన్ ఇన్‌స్టుమెంట్స్‌ను వినియోగించి మధురమైన సంగీత ప్రదమైన వాయిద్యాలను వినిపిస్తారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎల్. రమణకు స్వాగతం పలుకుతున్న తెదేపా నేతలు

హరితహారం జన్మజన్మలకో సహకారం

రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి



జనగామ, కెఎన్ఎన్ : హరిత హారం కార్యక్రమంలో ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే రాబోవు రోజులలో జన్మజన్మలకు సహకారం అందించిన వారం అవుతామని రాష్ట్రరోడ్డు రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జనగామ జిల్లాలో హరిత హారం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని పెంబర్తి గ్రామంలోని ఆర్‌టీసీ కార్యాలయ స్థలంలో, జనగామ ఆర్‌టీసీ డిపో ఆవరణలో హరితహారం మొక్కలు నాటారు. రాష్ట్రంలో అడవుల శాతం తక్కువ ఉండటంతోనే కాలుష్యం, అనారోగ్యం పెచ్చుమీరుతున్నాయని, వాటిని అధికమిం చేందుకు ప్రతీఒక్కరు చెట్లు నాటి వర్షాలు కురిసేందుకు దోహదపడుతాయని అన్నారు. ప్రతీ గ్రామంలో 40వేల మొక్కలు నాటడమే కాకుండా పెంచే లక్ష్యంతో ముందుకు సాగాలని, అప్పుడే హరిత తెలంగాణ లక్ష్యం నెరవేరు తుందని అన్నారు. ప్రతీఒక్కరు ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయ స్థలాలలో మొక్కలు నాటాలని అన్నారు. ఆర్‌టీసీ స్థలాలలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంపొందించేందుకు తమవంతు కర్తవ్యంగా పనిచేయాలని అన్నారు. 1400బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని, వరంగల్ జిల్లాకు 120 బస్సులు కెటాయించడం జరిగిందని, జనగామకు 32బస్సులు కెటాయించడం జరిగిందని అన్నారు. ప్రతీ జిల్లాకేంద్రం నుండి ప్రజల సౌకర్యార్థం ఏసి వజ్ర బస్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ నుండి హైదరాబాద్‌కు వెళ్లే ఏసీ వజ్ర, హైటెక్ బస్సులను నిలిపేందుకు చర్యలు చేపడుతామని అన్నారు. ప్రతీ జిల్లాకేంద్రంలో రోడ్డుభద్రత, రవాణా వ్యవస్థపై ప్రతీ మూడునెలలకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, తద్వారా రోడ్డుప్రమాదాలు జరిగే సంఖ్య తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ బండ పద్మా యాదగిరిరెడ్డి, జడ్పీటీసీ బాల్దె విజయ, ఎంపీపీ బైరగోని యాదగిరి, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టు శివలింగయ్య, కౌన్సిలర్లు గజ్జల నర్సిరెడ్డి, పసుల ఏబేలు, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఈడీ గరిమెల సత్యనారాయణ, తోట సూర్యకిరణ్, రాములు, శ్రీనివాస్‌నాయక్, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, కెఎన్ఎన్ : టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, పాలనలో వైఫల్యాలను బీజేపీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమాలను ఉధృతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వర్ని చౌరస్తాలో గల జనార్ధన్ గార్డెన్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పాలన కుంటుపడిందన్నారు. సీఎం కేసీఆర్, ఎంపి కవిత ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని ప్రభుత్వమే నడిపిస్తుందని ప్రకటనలు గుప్పించారని వారికిచ్చిన హామీకే గతి లేకుంటే ఇక మిగతా ప్రజాప్రతినిధుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అంతేగాకుండా ఫ్యాక్టరీకి యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించడంతో 20 నెలలుగా కార్మికులకు జీతాల్లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని దీనిపై ఎన్ఎస్ఎఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని దీనిపై బిజెపి ఆందోళనలు ఉధృతం చేస్తుందన్నారు.

అయేషా హత్య కేసును పునర్విచారించాలి

సామాజిక వేత్త రమామేల్కొటే డిమాండ్

సోమాజీగూడ, కెఎన్ఎన్: ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన అయేషామీరా హత్య కేసును పునర్విచారణ చేయాలని ప్రముఖ సామాజిక వేత్త రమా మేల్కొటి డిమాండ్ చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అయేషా తల్లిదండ్రులతో కలిసి అయేషా హత్య కేసుపై న్యాయం కోసం ప్రజాప్రయోజనవాజ్యం దాఖలు చేసినట్టు మీడియాకి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయేషా హత్య జరిగి ఏళ్లు గడుస్తున్నా హత్యకు కారకులైన వారు ఇప్పటి వరకు శిక్షింపబడక పోవడం బాధాకరమన్నారు. ఎనిమిది సంవత్సరాలు జైలులో శిక్ష అనుభవించి సత్యంబాబు విడుదలయ్యాక కూడా ఈ కేసులో పురోగతి లేకపోవడం సరికాదన్నారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్న అయేషా తల్లి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోలేక పోయిందన్నారు. ఈ క్రమంలో ఈ కేసులో నిజనిజాలను వెలికి తీసేందుకు హైకోర్టులో పిల్ వేయగా నేడు కోర్టు ఈ కేసును వారం రోజుల్లో పునర్విచారణ మొదలు పెట్టాలని చీఫ్ జస్టిస్ ఆదేశాలు జారీ చేసినట్టు ఆమె పేర్కొన్నారు. మహిళా సంఘాల నేత సంధ్య మాట్లాడుతూ కూతురు మృతిపై న్యాయం కోసం అయేషా తల్లి ఏళ్ల తరబడి పోరాడుతుందని ఎంతో మంది నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పినప్పటికి అయేషా తల్లి తనకు డబ్బు ముఖ్యం కాదని న్యాయం కావాలంటూ పోరాటం చేయడం గమనార్హం. ఈ క్రమంలో దేశంలో ప్రజాస్వామ్యం బ్రతికే ఉందన్న నమ్మకంతో ఈ కేసులో నిజాలు వెల్లడిచేసేందుకు కోర్టులో ప్రజాసంఘాల తరపున పిల్ దాఖలు చేసినట్టు వివరించారు.

తమకు కోర్టు కూడా మద్దతు తెలిపిందని త్వరలో నిజనిజాలు వెలికితీయాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీచేసినట్టు వివరించారు. అయేషా తల్లి షంషాద్ బేగం మాట్లాడుతూ తన కూతురు మృతికి కారణమైన అసలు నిందితులకు శిక్షపడేంత వరకు తన పోరాటం ఆగదన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న తనకు మద్దతు పలుకుతున్న ప్రజా సంఘాలు, సామాజిక వేత్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన కూతురు కేసును సరైన రీతిలో విచారించి దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మోడీ పాలనలో అభివృద్ధి దిశలో భారత్

బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



మహబూబ్‌నగర్, కెఎన్ఎన్ బ్యూరో : స్వాతంత్ర్య భారతంలో మునుపెన్నడూ లేని విధంగా మోడీ పాలనతో అభివృద్ధి దిశలో కొనసాగుతున్న భారత్ వైపు ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తుందని రాష్ట్ర బీజేపీ నేత ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యావర్గ సమావేశాల్లో పాల్గొనడానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తకోట, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాల్లో కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్య, లౌకిక భారత దేశంలో కుల, మత వర్గ బేధాలు లేకుండా అన్నదమ్ముల మాది రిగా మెలగడం భారతీయులకు ఉన్న గొప్ప లక్షణమని, ఈ దిశలోనే భారత్ ఆగ్రరాజ్యాల సరసన నిలిచే విధంగా పోటీపడుతుందన్నారు. స్వాతంత్ర్య కాంక్ష నెరవేరిన తర్వాత భారతదేశానికి దిశ, నిర్దేశం చేసిన ఏకైక పార్టీగా అతిపెద్ద పార్టీగా ప్రజల మన్ననలను పొందిన పార్టీగా భారతీయ జనతా పార్టీ నేడు యావత్ భారతంలో 18 రాష్ట్రాలను భారత ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన పరిపాలనను కొనసాగిస్తూ భారత ప్రజల శ్రేయస్సే పరమావతిగా సేవలు అందిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రజాకారుల పాలనను తలపించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కీలకమైన పదవులను తమ కుటుంబ సభ్యులకే కట్టబెట్టి మంత్రులను కీలు బొమ్మలుగా చేసుకొని తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ రాష్ట్రంలో నిరంకుష పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ లాంటి పార్టీలు కూడా తెలంగాణ ప్రాంతాన్ని మోసం చేసే దిశలో పరిపాలించాయన్నారు. బంగారు తెలంగాణ పేరు చెప్పు కనే కేసీఆర్ పాలన అందుకు విరుద్ధంగా సాగుతుందని, నిజమైన తెలంగాణ బంగారు తెలంగాణ మార్చడం భారతీయ జనతా పార్టీ వల్ల అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు పార్టీకి బ్రహ్మరథం పడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మజ్లీస్ వ్యవహార శైలి లౌకికవాదానికి తిలోదకాలు ఇచ్చే విధంగా ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉందని , స్వేచ్ఛను మించి ప్రవర్తించవద్దని అన్నారు. దేశ , రాష్ట్రాల్లో ప్రజలను, ప్రజల కష్టాలను తెలుసుకొని ప్రజారంజక పాలన సాంగించే దిశగా భారతీయ జనతా పార్టీ ఎప్పుడు ప్రజల పార్టీగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, శాంతికుమార్, కొండయ్య, జిల్లా అధ్యక్షురాలు పద్మజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్.. పరపతి తగ్గించుకోకు

జనసేనానికి ముద్రగడ విజ్ఞప్తి

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే ఆబద్ధాల్ని నిజమేనని నమ్మి ఆయన్తో ప్రయాణంచేసి మీకున్న పరపతిని తగ్గించుకోకండి అంటూ జనసేనాధిపతి, ప్రముఖ సినీహీరో పవన్‌కళ్యాణ్‌నుద్దేశించి కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనొక బహిరంగలేఖరాశారు. దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి 1994 ఆగస్టు 25న ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వు నెంబర్ 30ని గౌరవ హైకోర్టు ఫుల్‌బెంచ్ రద్దు చేసినట్లు, కాపు ఉద్యమకారులు బిసి రిజర్వేషన్ జిఓ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఒత్తిడి తెస్తున్నట్లుగా చంద్రబాబు పవన్‌కు చెప్పారంటూ వచ్చిన వార్తను చూసి తాను తీవ్రంగా కలతచెందినట్లు ఈ లేఖలో ముద్రగడ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు నెంబర్ 30 సక్రమంగానే ఇచ్చినట్లు ప్రముఖ పత్రికలు కూడా రాసిన విషయాన్ని ఈ సందర్భంగా ముద్రగడ గుర్తు చేశారు. గతేడాది ఫిబ్రవరి 2న మంత్రి అచ్చెన్నాయుడు తనను కలసి ఏడుమాసాల్లోగా కమిషన్ రిపోర్టు తెప్పించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామంటూ హామీనిచ్చిన విషయాన్ని కూడా ముద్రగడ తెలిపారు. అప్పట్నుంచి ఏడుమాసాలు ఆగలేరా అంటూ తమపై కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు తరచూ తిట్టారంటూ తెలిపారు. జగన్, మోడి, ట్రంప్‌ల సాయంతోనే కాపు ఉద్యమం జరుగుతోందంటూ ఎదురుదాడికి కూడా దిగారన్నారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చి మూడేళ్ళు పూర్తయింది. కమిషన్ నియమించి ఏడాదిన్నరైంది. పల్స్ సర్వే చేసి సంవత్సరం గడిచిపోయింది. అయినా ఇంకా ఇస్తాం.. ఇస్తాం.. అంటూ అరువు రేపటన్నట్లుగా ఆబద్ధాలు చెప్పడానికి పాలకులకు సిగ్గులేనప్పటికీ వినేందుకు తమకు విపరీతంగా సిగ్గేస్తుందంటూ పేర్కొన్నారు. వీటికి సంబంధించిన పేపర్‌కటింగ్‌లను కూడా ఆయన ఈ లేఖకు జతచేసి పవన్‌కళ్యాణ్‌కు పంపించారు.

సందర్శకులు లేక బోసిపోయిన సచివాలయం

సచివులు రారు.. వినతులూ లేవు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రతిరోజూ సుదూర ప్రాంతాల నుంచి తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చే సందర్శకుల తాకిడి తగ్గుతోంది. గతంలో రోజూ వందలాది మంది సచివాలయానికి రావడంతో ముఖ్యంగా మధ్యాహ్నం నుంచి ఆవరణ కళకళలాడుతూ ఉండేది. ఉదయం నుంచే మంత్రుల అనుచరులు, అధికార పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున వస్తుండగా, మధ్యాహ్నం నుంచి సామాన్య సందర్శకుల తాకిడి బాగా పెరిగేది. వ్యక్తిగత, తమ గ్రామ సమస్యకు క్షేత్రస్థాయిలో పరిష్కారం రానపుడు మంత్రులను కలిసి విన్నవించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సచివాలయంలో మంత్రులు అందుబాటులో లేకపోవడంతో సందర్శకులు కూడా రావడం తగ్గిపోయారు. మంత్రుల అనుచరులతో పాటు సామాన్య ప్రజలు సచివాలయానికి రాకపోవడంతో బోసి పోయింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ సచివాలయం అమరావతికి తరలిపోవ డంతో ఈ రాష్ట్రానికి కేటాయించిన భవనాల ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. దీంతో మొత్తం సచివాలయ ఆవరణ కేవలం అధికారులు, ఉద్యోగులకే పరిమితమై సందర్శకులు లేక నిశ్శబ్ధం తాండవిస్తోంది. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు కూడా సచివాలయానికి ప్రతిరోజు రాకపోవడంతో సందర్శకుల తాకిడి తగ్గిపోయింది. గతంలో వందలాది మంది గ్రామాల నుంచి సామాన్య ప్రజలు సైతం ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు ఇచ్చేవారు. సీఎం సచివాలయానికి రావడంతో మంత్రులు, ఉన్నతాధికారులు కూడా తమ శాఖల విధి నిర్వహణలో బిజిబిజీగా ఉండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏడాది పాటు సచివాలయం కళకళలాడుతూ ఉండేది. ఉభయ రాష్ట్రాలకు సందర్శకుల తాకిడి పెద్దఎత్తున ఉండడంతో జాతరను తలపించేది. అనంతరం ఆంధ్రప్రదేశ్ సచివాలయం అమరావతికి తరలిపోవడం, అదే సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రీన్‌ల్యాండ్స్‌లోని క్యాంపు కార్యాలయానికే పరిమితం కావడంతో మంత్రులు కూడా రావడం తగ్గించారు. దీంతో సచివాలయానికి సందర్శకుల తాకిడి తగ్గి ఇప్పుడు వెలవెలబోతోంది.



సులభతర వ్యాపారానికి రైట్ ఆఫ్‌వే అనుమతులు

ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో సులభతర వ్యాపారం చేసేందుకు అనువుగా కొన్ని శాఖలు నిర్వహించాల్సిన పనులు, ఇవ్వాల్సిన అనుమతులపై పారదర్శకత విధానాలు (రైట్ ఆఫ్ వే) పాటించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రోడ్ల నిర్వహణ, ప్రభుత్వ భూముల్లో రోడ్లు, అనుమతి, విద్యుత్ కనెక్షన్లపై సూచనలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. రోడ్లు, రహదారు, భవనాలు, పంచాయితీరాజ్, మునిసిపల్ పరిపాలనా, పట్టణాభివృద్ధి శాఖ, మౌలిక సదుపాయాల కల్పన, గిరిజన సంక్షేమం, కలెక్టర్ కార్యాలయాలు నిర్దిష్టమైన కార్యాచరణను పాటించాలని పేర్కొంది. ప్రభుత్వ భూముల్లో రోడ్లు వేయడంపై పారదర్శకత పాటించాలని, దీనికి సంబంధించి డిస్కంలు ఆన్‌లైన్ ద్వారా అంచనాలు వేసి రైట్ ఆఫ్ వే అనుసరించాలని ఆ ఉత్తర్వులో స్పష్టంచేసింది.



డోక్లామ్ ప్రభావం

గ్లాండ్ ఫార్మా టేకోవర్‌కు మోకాలడ్డు!

- 130 కోట్ల డాలర్ల ఫాసూన్ బిడ్‌కు బ్రేక్?
- కేంద్ర కేబినెట్ నిర్ణయం
- చైనా పెట్టుబడులపై ప్రభావం?

న్యూఢిల్లీ : షాంఘైకి చెందిన ఫాసున్ ఫార్మాస్యూటికల్స్ గ్రూపు భారత్‌కు చెందిన అతి పెద్ద ఫార్మా కంపెనీని 130 కోట్ల డాలర్లు పెట్టి టేకోవర్ చేయాలనుకునే ప్రతిపాదనకు ప్రభుత్వం గండికొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. చైనా నుంచి అతి పెద్ద టేకోవర్‌కు ఆదిలోనే అడ్డకట్టపడే అవకాశాలు పడబోతు న్నాయి.విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటిలో భారత్‌కు చెందిన గ్లాండ్‌ఫార్మాలో చైనా ఫార్మా కంపెనీ 86 శాతం వాటాలు కొనుగోలు చేయడానికి అడ్డకట్ట వేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. అయితే అధికారికంగా ఈ రెండు కంపెనీలు దీని గురించి ఎలాంటి ప్రకటన చేయకపోయినా ప్రైవేట్ సంభాషణల్లో మాత్రం ఈ డీల్ అటకెక్కిందని అంటున్నారు.

దీనికి ప్రధాన కారణం ... భారత్ - చైనాల సరిహద్దులో ఉద్రిక్తత వాతావరణం నెలకొనడమే. 1962 తర్వాత తాజాగా ప్రస్తుతం హిమాలయపర్వత ప్రాంతాల్లో తీవ్రమైన ఉద్రికత్త నెలకొంది. చైనా క్రమంగా భారత్ భూభాగాన్ని అక్రమంగా ఆక్రమించు కుంటూపోతోంది. దీనిపై భారత్ తమ నిరసనను వ్యక్తం చేస్తోంది. తాజాగా ఈ టేకోవర్ ఒప్పందం విఫలమైతే మాత్రం ఫాసన్‌ఫార్మాకు పెద్ద దెబ్బే. ఎందుకంటే గ్లాండ్‌ఫార్మాకు చెందిన జెనరిక్ ఇంజెక్టబుల్ మెడిసిన్స్‌లను అమెరికా మార్కెట్ కోసం తయారీ చేసి విక్రయించుకోవడానికి అనుమతి దక్కించుకుంది. తాజా పరిస్థితి ఎలా ఉందంటే చైనా కంపెనీలపై ఆంక్షలు విధించినట్లుగా ఉందని ముంబైకి చెందిన విలీనాలు.. టేకోవర్‌లకు చెందిన లాయర్ అభిజిత్ జోషి చెప్పారు. తాజా పరిస్థితిని చూస్తే చైనా వ్యాపారులకు భారత్‌లో స్థానం లేదని సంకేతాలు ఇవ్వడమేనని ఆయన చెబుతున్నారు. చైనా దేశసరిహద్దులో చొరబాటుకు పాల్పడితే దానికి ప్రతీకారంగా తాము వాణిజ్యపరంగా చేయాల్సింది చేస్తామని భారత్ హెచ్చరిక చేసినట్లుంది.

ఫాసన్‌ఫార్మా విషయాకి వస్తే చైనాకు చెందిన బిలియనీర్ గువో గువాన్‌చాంగ్ మంగళవారం నాడు స్టాక్ మార్కెట్లకు సమాచారం అందిస్తూ.. గ్లాండ్‌ఫార్మాకు టేకోవర్ గురించి ప్ర భుత్వం నుంచి ఎలాంటి నోటీసు అందుకోలేదని తెలిపారు. ఇదిలా ఉండగా చైనాకు చెందిన ఫాసున్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఫాసున్ ఫర్మా .. గత ఏడాది జులైలో గ్లాండ్‌ఫార్మాను టేకోవర్‌కు అంగీకరించింది. గ్లాండ్‌ఫార్మాలో అతి పెద్ద ఇన్వెస్టర్ గ్రూపు కెకెఆర్ అండ్ కంపెనీని వాటాలను కొనుగోలు చేయడానికి ఫాసున్ ఆమోదం తెలిపింది.


ఇదిలా ఉండగా గ్లాండ్‌ఫార్మా కొనుగోలుకు ఇప్పటికే భారత్‌కు చెందిన పలు నియంత్రణా సంస్థల అనుమతులకు దరఖాస్తు క ూడా చేసుకుంది. ఈ దరఖాస్తులను విదేశీ పెట్టుబడులు ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ)కూడా సమీక్ష నిర్వహించింది. దీనిపై ప్రధానమంత్రి కార్యాలయం అధికార ప్రతినిధి జగదీశ్ టక్కర్ నోరు మెదపడం లేదు. కేబినెట్ సెక్రెటరీ ప్రదీప్‌కుమార్‌కు పంపిన ఈ మెయిల్‌కు జవాబులేదు. అదే సమయంలో గ్లాండ్‌ఫార్మా ప్రతినిధుల నుంచి కెకెఆర్ నుంచి కూ డా స్పందన లేదు.

ఇదిలా ఉండగా ఫాసున్ జులై 27వ తేదీన హాంగ్‌స్టాక్ మార్కెట్లో ఫైలింగ్ చేస్తే.. చైనా ప్రభుత్వ అధికారుల నుంచి టేకోవర్‌కు సంబంధించి అన్నీ అనుమతులు తీసుకున్నామని, అయితే భారత్ ప్రభుత్వానికి చెందిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని హాంగ్‌కాంగ్ స్టాక్ మార్కెట్‌కు సమాచారం అందించింది. దీంతో టెర్మినేషన్ (కాంట్రాక్టు రద్దు) తేదీని సెప్టెంబర్ 26 వరకు పొడిగించినట్లు ఫైలింగ్‌లో పేర్కొంది. ఇంతకుచైనా ఫార్మా దిగ్గజం ఫాసున్ ఫార్మా గ్లాండ్‌ఫార్మాపై ఎందుకు మక్కువ చూపుతున్నట్లు .. ఎందుకంటే ఫార్మాకు ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్ అమెరికా.. ఈ మార్కెట్లో కాలుమోపాలని చూస్తోంది. ఈ ఏడాది వాలియెంట్ ఫార్మాస్యూటికల్స్ ఇంటర్నేషనల్ ఐఎన్‌సీని చైనాకు చెందిన సాన్‌పవర్ గ్రూపు కంపెనీకి చెందిన డెన్‌డ్రాయెన్ ఫార్మాసూటికల్స్ యూనిట్‌కు 820మిలియన్ డాలర్లకు విక్రయించింది. అలాగే హ్యూమన్‌వెల్ **హెల్త్‌కేర్ గ్రూపు కంపెనీ..** ఈ చైనా కంపెనీ అనెస్తిషియా, (మత్తు) కాంట్రాసెప్టివ్ (గర్భనిరోధక) మందులను తయారు చేసే కంపెనీ ఈ ఏడాది జూన్‌లో అమెరికాకు చెందిన రిట్‌డోస్‌ను 605 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసుకోవడానికి అంగీకరించింది.

ఇకచైనా కంపెనీల విషయానికి వస్తే ఆలీబాబా గ్రూపు హోల్డింగ్ లిమిటెడ్, టెన్‌సెంట్ హోల్డింగ్ లిమిటెడ్, జియోమి కార్పొరేషన్‌లు భారత్ మార్కెట్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాయి. అలీబాబాకు చెందిన ఫైనాన్స్ యూనిట్ పేటియం బోర్డులో కూడా స్థానం సంపాదించుకుంది. ఇక టెన్‌సెంట్ విషయానికి వస్తే ఆన్‌లైన్ సర్వీసెస్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్‌లో వాటాలు ఉన్నాయి. జియోమి విషయానికి వస్తే భారత్ 500 మిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టాయి. వచ్చే మూడు నుంచి ఐదు సంవత్సరాల కాలంలో మరో విడత పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉంది. భారత్ చైనాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గత ఏడాది 72.3 బిలియన్ డాలర్లకు చేరింది. కాగా దీంట్లో చైనా ఎగుమతులే 84 శాతం వరకు ఆక్రమించాయి. తాజా పరిణామాల నేపథ్యంలో చైనా కంపెనీలు భారత్‌లో టేకోవర్‌లు చేసుకోవడానికి వెనుకంజ వేస్తాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చైనా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తాయి. చైనా వద్ద పుష్కలంగా నిధులున్నాయి. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో స్వల్పకాలానికి భారత్‌లో పెట్టుబడులు రావడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రిలయన్స్ పవర్ లాభంలో 32% ఆవిరి

పెరిగిన వ్యయమే కారణం



ముంబై : అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 32 శాతం క్షీణించింది. కంపెనీపై వ్యయం భారం విపరీతంగా పడింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నికరలాభం రూ.230.85 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాదితో రూ.340.49 కోట్లతో పోల్చుకుంటే 32 శాతం తగ్గింది. ఆదాయం విషయానికి వస్తే ఫ్లాట్‌గా రూ.2753.32 కోట్లు కాగా.. క్రితం ఏడాది కూడా రూ.2748.38 కోట్లు నమోదు చేసింది. వ్యయం విషయానికి వస్తే నాలుగు శాతం పెరిగి రూ.2425.40 కోట్లకు చేరింది. దీంతో పాటు పన్నుల భారం కూడా పెరిగి రూ.96.07 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.78.52 కోట్లన్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

జీసీపీఎల్ లాభంలో 8.7% క్షీణత



ముంబై : గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జీపీసీఎల్) మార్చితో ముగిసిన త్రైమాసికంలో పన్ను చెల్లించిన తర్వాత నికరలాభంలో 8.7శాతం క్షీణించి రూ.225.2 కోట్ల దిగివచ్చింది. ప్రచారంతో పాటు ఇతర ఖర్చులు గణనీయంగా పెరిగిపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. కొన్ని సర్దుబాట్లు చేసిన తర్వాత ఏకీకృత నికరలాభం రూ.232.7 కోట్లకు చేరింది. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే 8.8 శాతం క్షీణించింది. ఏకీకృత నికర అమ్మకాలు మాత్రం 2.9శాతం పెరిగి రూ.2,177.3 కోట్లకు చేరగా..క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2117కోట్లని తెలిపింది.

పీసీ జ్యువెలరీస్ ఆదాయంలో 27.4% వృద్ధి


న్యూఢిల్లీ : పీసీ జ్యువెలరీస్ స్టాండ్‌ఎలోన్ నికరలాభం ఏకంగా రూ.135.83 కోట్లకు ఎగబాకింది. అమ్మకాలు జోరందుకోవడంతో లాభాలు కూడా పెరిగిపోయాయని బీఎస్‌ఈకి సమాచారం అందించింది. కాగా క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.106.59 కోట్లుగా ఉంది. కాగా నికర ఆదాయం విషయానికి వస్తే 27.79శాతం పెరిగి రూ.2140.03 కోట్లకు చేరుకోగా..క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1674.60 కోట్లు నమోదైంది. దేశీయ అమ్మకాల విషయానికి వస్తే రూ.1382.55 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1049.79 కోట్లు. కాగా ఎగుమతుల విషయానికి వస్తే రూ.735.99 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.614.68 కోట్లని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 0.31 శాతం పెరిగి రూ.256 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.

జేఎస్‌డబ్ల్యు స్టీల్ లాభంలో 44%క్షీణత

అయినా మార్కెట్ అంచనాలను దాటింది

న్యూఢిల్లీ : దేశంలో అతి పెద్ద ఉక్కు తయారీ కంపెనీ జెఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 44 శాతం క్షీణించింది. అయితే ఫలితాలు మాత్ర విశ్లేషకుల అంచనాలను మించిపోయాయి. వస్తు సేవల పన్ను అమల్లోకి వచ్చినందువల్ల అమ్మకాలపై ప్రభావం పడింది. అమ్మకాల విషయానికి వస్తే 3.51 మిలియన్ టన్నులు కాగా, దీంతో కొంతపాటు కొంత సరకు నిలబడిపోయింది. క్యూ1లోకంపెనీ నికరలాభం క్షీణించి రూ.626 కోట్లకు దిగిరాగా..క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1,120 కోట్లుగా నమోదు చేసింది.

ఆసియా సంపన్నుల్లో ముఖేష్‌కు రెండో స్థానం



న్యూఢిల్లీ: భారత్‌లో అత్యంత సంపన్నుడు ముఖేష్ అంబానీ హాంగ్‌కాంగ్‌కు చెందిన రియల్ ఎస్టేట్ దిగ్గజం లి కా- షింగ్‌ను వెనక్కినెట్టి ఆసియాలో అత్యంత సంపన్నుల్లో రెండవ స్థానం దక్కించుకున్నారు. తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ 4జీ టెలికం రంగంలో ఎంట్రీ ఇచ్చి ఈ రంగంలో సంచలనం సృష్టిస్తోంది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ సమాచారం ప్రకారం రిల్ చైర్మన్ సంపద ఏకంగా 12.5 బిలియన్ డాలర్లు పెరిగింది. రిలయన్స్ జియో ఫోన్ ప్రారంభించిన తర్వాత రిలయన్స్ షేరు ధర భారీగా పెరిగిపోయింది. ముఖేష్ అంబానీ టెలికం వ్యాపారంలో సుమారు 3100 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టారు. కాగా రిల్ రెవెన్యూలో 90 శాతం రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ వ్యాపారం నుంచే వస్తోందని బ్లూమ్‌బర్గ్ నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో కంపెనీ అప్పులు కూడా 15 సంవత్సరాల గరిష్ఠానికి ఎగబాకాయి. ఇటీవల జరిగిన కంపెనీ 40 వార్షిక సమావేశంలో రిలయన్స్ జియో వచ్చే దశాబ్ద కాలంలో మదుపరులకు మంచి విలువను సంపాదించిపెడుతుందన్నారు. అదే సమయంలో వాటాదారులకు 1:1 బోనస్‌ను ప్రకటించారు. మరో కీలకమైన అంశం ఏమిటంటే రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో 1977లో రూ.1,000 పెట్టుబడి పెట్టి ఉంటే ఈ రోజు దాని విలువ రూ.16,54,503 లకు చేరింది. సుమారు 1600 రెట్లు పెరిగిందని అంబానీ వివరించారు. గత ఐదు సంవత్సరాల నుంచి షేరు ధర 122 శాతం లేదా 885 పాయింట్లు పెరిగింది. తాజాగా బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం చూస్తే ముఖేష్ అంబానీ లి కా షింగ్‌ను ఈ ఏడాది ఏప్రిల్‌లో కొన్ని రోజుల పాటు అటు తర్వాత జులై 7న అధిగమించారు. అంబానీ సంపద ప్రస్తుతం 34.8 బిలియన్ డాలర్లకు చేరింది. భారతీయ కరెన్సీ ప్రకారం రూ.2,22,720 కోట్లని చెప్పవచ్చు. (ఇటీవల కంపెనీ బోనస్ ప్రకటించింది. మెజారిటి షేర్లు ముఖేష్ అంబానీకి చెందినవే ఉన్నాయి) కాబట్టి ఆయన సంపద విపరీతంగా పెరిగిపోయింది. దీంతో అంబానీ ర్యాంకు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్‌లో 19వ ర్యాంకుకు దిగివచ్చింది.

కార్ల అమ్మకాలకు జీఎస్టీ జోష్



న్యూఢిల్లీ : దేశీయ ప్యాసింజర్ కార్ల అమ్మకాలు గత నెలలో ఏకంగా 15శాతం పెరిగాయి. ఈ కేలండర్ సంవత్సరంలో అత్యధికంగా అమ్మడయ్యింది గత నెలలోనే. జూన్‌లో అమ్మకాలు 11 శాతానికి చేరుకోగా.. జులై నుంచి జీఎస్టి అమల్లోకి వస్తున్నందు కార్ల కంపెనీలు పెద్దెత్తున డిస్కౌంట్లు ఆఫర్ చేసి అమ్మకాలు పెంచుకున్నాయి. అతి పెద్ద ఆరు కంపెనీలు మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) హోండా, టయోటా అమ్మకాలు డబుల్ డిజిట్ చేరాయి. మారుతి సుజుకి అమ్మకాలు 153,298 యూనిట్లు విక్రయించింది. గతేడాదితో పోల్చుకుంటే 22 శాతం పెరిగాయి. హ్యూందాయ్ అమ్మకాల్లో నాలుగు శాతం పెరిగి 43,007 యూనిట్లకు చేరాయి . జపాన్‌కు చెందిన టయోటా 17,758 యూనిట్లు విక్రయించగా.. టాటామోటార్స్ జులై అమ్మకాల్లో పది శాతం వృద్ధి కనిపించింది. 14,933 యూనిట్ల విక్రయించినట్లు కంపెనీ ప్రెసిడెంట్ మయాంక్ పారిక్ చెప్పారు. దీనికి వ్యతిరేకంగా రెండు కంపెనీలు రెనో, నిస్సాన్ అమ్మకాలు తగ్గాయి. ఈ రెండు కంపెనీలు అమ్మకాల గణాంకాలు వెల్లడించలేదు. రెనో మాత్రం తమ అమ్మకాలు 25 శాతం తగ్గి 8,949 యూనిట్లు విక్రయించినట్లు తెలిపింది. కాగా నిస్సాన్ అమ్మకా ల్లో 32 శాతం క్షీణించి 4360 యూని ట్లు విక్రయించింది. జీఎస్టిలో కార్లపై పన్ను తగ్గించడం ధరలు తగ్గాయి. కంపెనీలకు అమ్మకాలు పెరిగాయి.

విదేశాలకు వెళ్లొద్దు ఎస్‌కుమార్స్ అధినేతకు

కర్ణాటక హైకోర్టు ఆదేశాలు



బెంగళూరు: బ్యాంకుల్లో వేలకోట్ల రూపాయలు అప్పులు చేసి లండన్ పారిపోయిన విజయమాల్యా పలువురి కి గుణపాఠం నేర్పాడు. తనలాంటి వారితో ఎలా వ్యవహరించాలో కోర్టులకు కూడా తెలిపాడు. మాల్యా అనుభవంతో కావచ్చు కర్ణాటక హైకోర్టు ఎస్ కుమార్స్ కంపెనీ ప్రమోటర్ నితిన్ శంభుకుమార్ కస్లీవాల్‌కు పాస్‌పోర్టు తిరిగివ్వడానికి నిరాకరించింది. మాల్యా చేసిన కుంభకోణం మళ్లీ జరగకూడదన్న ఉద్దేశంతో కోర్టు జారీ చేసిన ఆదేశాలతో కుమార్‌కు విదేశాలకు వెళ్లే అవకాశం లభించలేదు. కుమార్ కేస్లీవాల్ వివిధ బ్యాంకుల నుంచి రూ. 6,500 కోట్లు రుణాలు తీసుకున్నారు. వాటిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్, జమ్మూ కశ్మీర్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఐడీబీఐ ఉన్నాయి. నిరుడు డిసెంబర్‌లో కేస్లీవాల్‌ను కోర్టు ఎగవేతదారుగా ప్రకటించింది. దీంతో డెబ్ట్ రికవరీ ట్రిబ్యూనల్ ఆయన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుంది. తాను విదేశాలకు వెళ్లడానికి అనుమతినివ్వాలని కోర్టులో కేస్లీవాల్ పిటిషన్ దాఖలు చేసారు. డీఆర్‌టీకి తన పాస్‌పోర్టును స్వాధీనం చేఊసుకునే అధికారం లేదని వాదించారు. అయితే.. ప్రాసిక్యూషన్ మాత్రం విజయ్ మాల్యాలా కేస్లీవాల్ కూడా విదేశాల్లోనే ఉండిపోయే అవకాశం ఉందన్న అనుమానం వ్యక్తం చేసింది. తన పాస్‌పోర్టు తీసుకోవడానికి అవసరమైన నియమాలన్నీ పాటించానని కేస్లీవాల్ వాదించినా లాభం లేకపోయింది. ఎస్‌కుమార్స్ కంపెనీ ఆర్థిక మాంద్యం రోజుల్లో నష్టాల్లో కూరుకుపోయింది. దీంతో తీసుకున్న రుణాలను కుమార్ కేస్లీవాల్ తీర్చలేకపోయారు. అప్పుడు కొన్ని బ్యాంకులు ఆయనను ఎగవేతదారుగా ప్రకటించాయి.

తయారీ రంగం పీఎంఐ ధమాల్

- జులైలో 47.9పాయింట్లకు
- 8సంవత్సరాల కనిష్టానికి



న్యూఢిల్లీ: పెట్టుబడులకు ఊతం ఇచ్చేందుకు వడ్డీరేట్లు తగ్గించాలని పెద్దెత్తున డిమాండ్ వస్తున్న నేపథ్యంలో జులైనెల తయారీరంగం మొట్టమొదటిసారి తగ్గముఖం పట్టిందని ప్రైవేట్ సర్వేలో వెల్లడైంది. నిక్కి ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఫిబ్రవరి 2009 తర్వాత అత్యంత కనిష్ఠానికి జులై నెలలో పడిపోయింది. జులైలో 47.9 పాయింట్లకు దిగిరాగా.. జూన్‌లో అత్యధికంగా 50.9 పాయింట్లకు ఎగబాకింది. పీఎంఐ సూచి 50 పాయింట్లు దాటితే తయారీరంగం పర్వాలేదని, 50 కంటే తగ్గితే మాత్రం ఆర్థిక వ్యవస్థ మందగమనంలో కొనసాగుతుందని అర్థం. ఈ ఏడాది మొత్తానికి చూస్తే కీలక రంగాలు తయారీరంగంతో పాటు ఇంటర్మీడియెట్ గూడ్స్ రంగాలు డీలాపడ్డాయని మంగళవారం నాడు నిక్కీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెండు రోజుల పాటు జరిగే ద్రవ్యపరపతి సమీక్ష మంగళవారం నుంచి మొదలైంది బుధవారం నాడు వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకుంటుంది. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం అత్యంత కనిష్ఠానికి దిగిరావడంతో ప్రభుత్వంతో పాటు పరిశ్రమ కూడా కనీసం 25 బేసిస్ పాయింట్లు వడ్డీరేట్లు తగ్గిస్తాయని ఆశిస్తున్నాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గిస్తే ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలున్నాయిన ఐహెచ్ఎస్ మార్కిట్ ప్రిన్సిపల్ ఆర్థికవేత్త పోల్లోయానా డీ లామా తాజా నివేదికలో వెల్లడించారు.

ఆటో షేర్ల అండ

సెన్సెక్స్ సరికొత్త రికార్డుకు



ముంబై: సెన్సెక్స్, నిఫ్టీలు రెండో రోజు కూడా సరికొత్త రికార్డును బద్దలు కొట్టాయి. ఆటో రంగానికి చెందిన ఐచర్‌మోటార్స్ అమ్మకాలు జోరందక ుకోవడంతో ఈ రంగానికి చెందిన షేర్లు పుంజుకున్నాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ 37.55 పాయింట్ల లాభంతో 10,114.65 వద్ద, బీఎస్ఈలో 60.23 పాయింట్లతో 32,575.17 వద్ద ముగిశాయి. అయితే ఈరెండు సూచిలు ఇంట్రాడేలో జులై నెల తయారీరంగానికి చెందిన పీఎంఐ క్షీణించడంతో మార్కెట్లు స్వల్పంగా వెనక్కితగ్గాయి. జులై 1 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి రావడంతో తయారీరంగంలో ఫిబ్రవరి 2009 తర్వాత అత్యంత కనిష్ఠానికి పడిపోయింది. తిరిగి బీఎస్ఈ విషయానికి వస్తే ఆటోరంగానికి చెందిన సూచి అత్యధికంగా 1.57శాతం లాభపడింది. తర్వాతి స్థానం మెటల్ 1.02 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 0.48 శాతం, చమురు సహజవాయువు 0.36 శాతం, దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన సూచిల విషయానికి వస్తే కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.75 శాతం, క్యాపిటల్‌గూడ్స్ 0.37 శాతం, విద్యుత్ 0.08 శాతం, పీఎస్‌యు 0.07 శాతం ఉన్నాయి. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన ఐదు షేర్లు ఇలా ఉన్నాయి. హీరోమోటోకార్ప్ 2.05 శాతం, మారుతి 1.96 శాతం, విప్రో 1.82 శాతం, ఎంఅండ్ఎం 1.77 శాతం, హెచ్‌యూఎల్ 1.73 శాతం. దీనికి వ్యతిరేకంగా భారీ నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. లూపిన్ 1.36 శాతం, ఓఎన్‌జీసీ 1.21 శాతం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 1.2 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.98 శాతం, కొటక్ బ్యాంకు 0.67 శాతంగా నమోదు చేశాయి.

లాభాల స్వీకరణ

మదుపరులు బ్యాంకు ఆఫ్ బరోడా, కెనెరా బ్యాంకు లిమిటెడ్ షేర్లపై లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. వరుసగా రెండు రోజుల పాటు లాభాలతో జోరందకున్న తర్వాత ఈ షేర్లు కుంగాయి. ఎస్‌బీఐ 1 శాతం క్షీణించింది. సోమవారం ఎస్‌బీఐ డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గించడంతో షేరు పుంజుకున్నాయి. మంగళవారం నాటికి సీన్ రివర్స్ అయ్యింది. మారుతి సుజుకి విషయానికి వస్తే జులై అమ్మకాలు 21 శాతం పెగడంతో షేరు కూడా 2.2 శాతం వరు పెరిగింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే మిశ్రమ స్పందన కనిపించింది.

ఆర్బీఐ వడ్డీరేట్లు తగ్గించేనా?

- నేడే ఆర్బీఐ పరపతి సమీక్ష
- 0.25% తగ్గే అవకాశం
- ఆర్థికవేత్తల అంచనా

న్యూఢిల్లీ : రిజర్వ్‌బ్యాంకు ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో 25 బేసిస్ పాయింట్ల లేదా పావు శాతం వడ్డీరేట్లు తగ్గించేఅవకాశాలు కనిపిస్తున్నాయి. తయారీరంగం పూర్తిగా డీలాపడ్డంతో పాటు, రిటైల్ ద్రవ్యోల్బణం అత్యంత కనిష్ఠానికి దిగిరావడంతో వడ్డీరేట్లు తగ్గించడానికి పరిస్థితులు అనుకూలంగా మారాయని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతు న్నారు. రెండు రోజుల పాటు ఆర్‌బీఐ మానటరీ పాలసీ కమిటి మంగళవారం నుంచి మొదలైంది. బుధవారం నాడు వడ్డీరేట్ల నిర్ణయం ప్రకటిస్తుంది. ఇండియా రేటింగ్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్రపంత్ మాట్లాడుతూ.. తమ అంచనా ప్రకారం ఆర్‌బీఐ పాతిక శాతం వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలున్నాయని, అయితే ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గించినా.. బ్యాంకులు ఆ లబ్దిని వినియోగదారుడికి బదలీ చేస్తాయా లేదా వేచి చూడాల్సిందేనని అన్నారు. ఒకవేళ బ్యాంకులు వడ్డీరేటు తగ్గిస్తే.. ముఖ్యంగా కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో, గృహ రంగాలకు డిమాండ్ పెరగుతుందని పంత్ అంచనా వేశారు.

జీఎస్టీ దెబ్బకు తయారీరంగం కుదేల్


జులై 1 నుంచి ప్రభుత్వం ఆఘమేఘాల మీద వస్తు సేవల పన్ను (జీఎస్‌టి) అమల్లోకి తెచ్చినందువల్ల దాని ప్రభావం తయారీరంగం పీఎంఐపై కనిపించిందని ఐహెచ్ఎస్ మార్కిట్ ఆర్థికవేత్త పొల్లాయన్నా డీ లామా పేర్కొన్నారు. తాజా జీఎస్టితో కంపెనీల ఉత్పత్తి తగ్గిపోయింది. కొత్త ఆర్డర్లు లేవు కొనుగోళ్ల లావాదేవీలు కూడా 2009 తర్వాత అత్యంత కనిష్ఠానికి పడిపోయాయని ఆయన తెలిపారు. గత నెలలో తయారీ రంగానికి చెందిన కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపో యాయి ఎనిమిది సంవత్సరాల కనిష్ఠానికి పడిపోయాయి. జీఎస్టి అమల్లోకి రావడంతో దీని ప్రభావం తయారీరంగంపై భారీగా కనిపించిందని ఆమె వివరించారు. ఇక రిటైల్ **ద్రవ్యోల్బణం విషయానికి వస్తే..** జూన్ నెలలో ఐదు సంవత్సరాల కనిష్ఠానికి 1.54 శాతానికి దిగివచ్చింది. రాబోయే నెలల్లో కూడా ఇదే పరిస్థితి కనిపించవచ్చునని చెబుతున్నారు. దీంతో బుధవారం నాడు ఆర్‌బీఐ వడ్డీరేట్లతో కోత విధిం డచా నికి అవకాశాలు బలంగా ఉన్నాయని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.



పారిశ్రామికోత్పత్తి డీలా..

పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కూడా పెద్ద ప్రోత్సాహకరంగా లేవు. మేనెలలో 1.7 శాతంగా నమోదు కాగా.. అంతకు ముందు నెల 3.1 శాతంగా నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం పెద్దనోట్ల రద్దు అని చెప్పవచ్చు. జూన్ నెల ఐఐపీ కూడా అంతంత మాత్రంగానే ఉంటుందని పంత్ అభిప్రాయప డుతున్నారు. మొత్తానికి ఆర్థికవేత్తలు చెప్పేదేమిటంటే పారిశ్రామిరంగంలో ప్రభుత్వం పెట్టుబడులు సమకూర్చడంలో ప్రభుత్వానికి తలనొప్పులు ఎక్కువగా ఉంటాయని, ఎందుకంటే బ్యాంకు తమ బ్యాలెన్స్‌షీట్లను క్లినప్ చేసేవారు రుణాలు ఇవ్వడానికి ముందుక ు రావని చెబుతున్నారు.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో21% వృద్ధి



న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం జులై 15 వరకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.1.80 లక్షల కోట్ల వరకు వసూలు అయ్యాయి. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే 21.4 శాతం వృద్ధి కనిపించింది. ఆర్థిక వ్యవస్థ మందిస్తుందన్న ఆందోళన కూడా మటుమాయం అయ్యింది. ప్రభుత్వం బడ్జెట్ అంచనా వేసిన 15.32 శాతం వృద్ధితో పోల్చుకుంటే ప్రస్తుతం వృద్ధిరేటు ఎక్కువగా ఉందని ఆర్థికశాఖ సహాయమంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరం 2017-18లో ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.9.8 లక్షల కోట్లు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ప్రత్యక్ష పన్నుల వసూళ్లు వృద్ధిరేటు సంతృప్తికరంగా ఉందని.. ఇక్కడి నుంచి తగ్గే అవకాశాల్లేవన్నారు. ప్రభుత్వం ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ 2017-18లో పలు చర్యలు తీసుకుందన్నారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ.. దేశంలో సైబర్ నేరాలు క్రెడిట్‌కార్డు, ఏటీఎం, డెబిట్‌కార్డు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ మోసాలు స్వల్పంగా 4.4 శాతం పెరిగాయని చెప్పారు. 2014-15లో 13,083 నుంచి 2016-17 నాటికి ఇది కాస్తా 13,653కు చేరాయని తెలిపారు.

భారత రాజపత్రము: అసాధారణ [భాగం-II, సెక్షన్ 3, ఉప సెక్షన్ (ii)]

రోడ్డు రవాణ మరియు రహదార్ల మంత్రిత్వ శాఖ

(భారత ప్రభుత్వం)

ప్రకటన

కొత్త ఢిల్లీ, 26 జులై, 2017

ఎస్.ఓ. 2325 (ఇ).- జాతీయ రహదార్ల చట్టం, 1956 (48, 1956) (ఇకపై చట్టముగా వ్యవహరించబడును) యొక్క సెక్షన్ 3A యొక్క ఉపసెక్షన్ (1) ద్వారా కలిగిన అధికారములు వినియోగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లాలో కి.మీ. 39.980 నుండి 66.210 (సంగారెడ్డి-నాందేడ్-అకోలా సెక్షన్) వరకు విడివిగా గల భూమి స్ట్రెచ్‌లో జాతీయ రహదారి నెం. 161లో నాలుగు వరుసలు నిర్మించుటకు (వెడల్పు చేయుట /నాలుగు వరుసలు కల్పించుట వగైరాలకు) నిర్వహించుట, మేనేజ్‌మెంట్ మరియు నడుపుటకు అవసరమైన దిగువ షెడ్యూలలో క్లుప్తముగా వివరించబడిన భూమి ప్రజోపయోగార్థము అవసరమై ఉన్నదని సంతృప్తి చెంది కేంద్ర ప్రభుత్వము అట్టి భూమిని సేకరించుటకు తన ఉద్దేశ్యమును ఇందుమూలముగా అధికారికంగా ప్రకటిస్తుంది.

సదరు భూమిపై ఆసక్తి గల వ్యక్తి ఎవరైననూ సదరు చట్టపు సెక్షన్ 3C యొక్క ఉప-సెక్షన్ (1) క్రింద పైన తెలుపబడిన ప్రయోజనము కొరకు అట్టి భూమిని ఉపయోగించుటలో ఆక్షేపణలు ఉన్నచో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరువది ఒక్క దినములో అట్టి ప్రతి ఆక్షేపణనూ సమర్థ ప్రాధికారి, అనగా, రెవిన్యూ డివిజనల్ అధికారి, మెదక్ వారికి వ్రాతపూర్వకంగా దానికి గల కారణములు తెలుపవలెను మరియు సమర్థ ప్రాధికారి ఆక్షేపణదారుకు స్వయంగా కానీ లేదా లీగల్ ప్రాక్టీషనరు ద్వారాగాని విచారణకు అవకాశమును కల్పించవచ్చు మరియు అట్టి అన్ని ఆక్షేపణలూ విన్న తరువాత మరియు వాటిపై ఉన్నచో ఏదేని తదుపరి విచారణ నిర్వహించిన మీదట సమర్థ ప్రాధికారి అవసరమని భావించినచో, ఉత్తర్వు ద్వారా ఆక్షేపణలను అనుమతించవచ్చును లేక నిరాకరించవచ్చును.

సదరు చట్టపు సెక్షన్ 3C ఉప-సెక్షన్(2) క్రింద సమర్థ ప్రాధికారిచే ఇవ్వబడిన ఏ ఉత్తర్వు అయిననూ అదే తుది నిర్ణయము కాగలదు.

భూమి ప్లానులు మరియు ఈ ప్రకటన క్రింద కవర్ చేయబడిన భూముల ఇతర వివరములు అందుబాటులో ఉన్నవి మరియు ఆసక్తి గల వ్యక్తిచే సమర్థ ప్రాధికారి యొక్క ముందు పేర్కొనబడిన కార్యాలయము వద్ద తనిఖీ చేసుకొనవచ్చును.

షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ రహదారి నెం. 161లో కి.మీ. 39.980 నుండి 66.210 (సంగారెడ్డి-నాందేడ్-అకోలా సెక్షన్) వరకు భూమి స్ట్రెచ్ పరిధిలో కట్టడములు ఉన్ననూ, లేకున్ననూ సేకరించదలచిన భూమి యొక్క క్లుప్త వివరణ.

క్రమ సం.	జిల్లా పేరు	తాలూకా / మండలం పేరు	గ్రామం పేరు	సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం (చ.మీ.లలో)
1	2	3	4	5	6	7	8
1	మెదక్	1. అల్లాదుర్గ్	(1) చిల్వేర	757	ప్రభుత్వ	మెట్ట	454.22
				758	ప్రైవేట్	మెట్ట	2332.40
				756	ప్రైవేట్	మెట్ట	571.42
				759 /1	ప్రైవేట్	మెట్ట	3037.04
				760	ప్రైవేట్	మెట్ట	2960.44
				761	ప్రైవేట్	మెట్ట	1542.12
				762	ప్రైవేట్	మెట్ట	1068.94
				763	ప్రైవేట్	మెట్ట	2207.75
				764	ప్రైవేట్	మెట్ట	4419.88
				782	ప్రైవేట్	మెట్ట	4997.51
				783	ప్రైవేట్	మెట్ట	1909.31
				789	ప్రైవేట్	మెట్ట	17215.60
				790	ప్రైవేట్	మెట్ట	5810.26
				791	ప్రైవేట్	మెట్ట	8132.25
				792	ప్రైవేట్	మెట్ట	343.02
				793	ప్రైవేట్	మెట్ట	3009.70
				794	ప్రైవేట్	మెట్ట	1251.03
				794 /1	ప్రైవేట్	మెట్ట	1098.43
				794 /7			2045.36
				794 /2			4807.00
				794 /3			534.86
				357	ప్రభుత్వ	మెట్ట	1199.90
				356	ప్రైవేట్	మెట్ట	3729.83
				352	ప్రైవేట్	మెట్ట	8416.35
				351	ప్రైవేట్	మెట్ట	4602.10
				346	ప్రభుత్వ	మాగాణి	12175.62
				342	ప్రైవేట్	మాగాణి	2674.98
				343	ప్రైవేట్	మాగాణి	830.17
				344	ప్రైవేట్	మాగాణి	298.26
				345	ప్రైవేట్	మాగాణి	1031.40
				340	ప్రైవేట్	మాగాణి	563.52
				338	ప్రైవేట్	మాగాణి	950.71
				337	ప్రైవేట్	మాగాణి	616.45
				336	ప్రైవేట్	మాగాణి	1176.12
				335	ప్రైవేట్	మాగాణి	741.57
				334	ప్రైవేట్	మాగాణి	2172.18
				333	ప్రైవేట్	మాగాణి	439.98
				329	ప్రైవేట్	మాగాణి	337.51
				332	ప్రైవేట్	మాగాణి	3153.02
				327	ప్రైవేట్	మాగాణి	1444.00
				328	ప్రైవేట్	మాగాణి	494.02
				330	ప్రైవేట్	మాగాణి	176.17
				294	ప్రైవేట్	మాగాణి	1219.29
				293	ప్రైవేట్	మాగాణి	713.13
				292	ప్రైవేట్	మాగాణి	1017.34
				291	ప్రైవేట్	మాగాణి	1966.82
				279	ప్రైవేట్	మాగాణి	178.58
				290	ప్రైవేట్	మాగాణి	1279.16
				285	ప్రైవేట్	మాగాణి	2699.49
				284	ప్రైవేట్	మాగాణి	3567.05
				282	ప్రైవేట్	మాగాణి	2525.36
				281	ప్రైవేట్	మాగాణి	484.95
				280	ప్రైవేట్	మాగాణి	5912.03
				253	ప్రైవేట్	మాగాణి	1557.78
				251	ప్రైవేట్	మాగాణి	4020.46
				249	ప్రైవేట్	మాగాణి	932.51
				248	ప్రైవేట్	మాగాణి	2814.37
				247	ప్రైవేట్	మాగాణి	3299.67
				152	ప్రైవేట్	మెట్ట	3223.53
				151	ప్రైవేట్	మెట్ట	3869.45
				150	ప్రైవేట్	మెట్ట	2803.41
				429 /1	ప్రభుత్వ	మెట్ట	395.73
			(2) అల్లాదుర్గ్	393	ప్రైవేట్	మెట్ట	11984.53
				396	ప్రైవేట్	మెట్ట	9009.56
				420/1	ప్రైవేట్	మెట్ట	2118.98
				395	ప్రైవేట్	మెట్ట	7872.85
				394	ప్రైవేట్	మెట్ట	7071.19
				264	ప్రైవేట్	మెట్ట	10855.91
				261	ప్రైవేట్	మెట్ట	995.70
				263	ప్రైవేట్	మెట్ట	7684.05
				262	ప్రైవేట్	మెట్ట	2830.80
				281	ప్రైవేట్	మెట్ట	9642.49
				283	ప్రైవేట్	మాగాణి	3779.01
				402	ప్రైవేట్	మెట్ట	252.74
				18	ప్రైవేట్	మాగాణి	2602.40
				19	ప్రైవేట్	మాగాణి	12334.63
				21	ప్రైవేట్	మెట్ట	6461.00
				22/1	ప్రైవేట్	మెట్ట	18427.05
				23	ప్రైవేట్	మెట్ట	154.66
				36	ప్రైవేట్	మెట్ట	10131.51
				68	ప్రైవేట్	మాగాణి	5980.72
				71	ప్రైవేట్	మెట్ట	2895.70
				72	ప్రైవేట్	మాగాణి	8275.71
				73	ప్రైవేట్	మాగాణి	422.50
				75	ప్రైవేట్	మాగాణి	617.13
				76	ప్రైవేట్	మాగాణి	364.39
				77	ప్రైవేట్	మాగాణి	550.89
				78	ప్రైవేట్	మాగాణి	2282.15
				80	ప్రభుత్వ	మాగాణి	2440.91
				82	ప్రైవేట్	మాగాణి	155.87
				83	ప్రైవేట్	మాగాణి	426.16
				139	ప్రైవేట్	మాగాణి	46.95
				84	ప్రైవేట్	మాగాణి	9322.41
				103	ప్రైవేట్	మాగాణి	1399.44
				104	ప్రైవేట్	మాగాణి	3762.90
				149/1	ప్రైవేట్	మాగాణి	4207.89
				201	ప్రైవేట్	మాగాణి	2334.40
				204	ప్రైవేట్	మాగాణి	2322.38
				211	ప్రైవేట్	మాగాణి	10435.05
				224	ప్రైవేట్	మాగాణి	94.75
				225	ప్రైవేట్	మాగాణి	275.50
				228	ప్రైవేట్	మాగాణి	1904.07
				234/1	ప్రైవేట్	మాగాణి	5144.49
				234/2	ప్రైవేట్	మాగాణి	127.16
				234/5	ప్రైవేట్	మాగాణి	322.34
				240/2	ప్రైవేట్	మాగాణి	270.95
				260	ప్రభుత్వ	మెట్ట	444.68
				268	ప్రైవేట్	మెట్ట	7461.50
				85	ప్రైవేట్	మెట్ట	3108.91
				86	ప్రైవేట్	మాగాణి	4922.15
				91	ప్రైవేట్	మాగాణి	62.48
				87	ప్రైవేట్	మాగాణి	1953.84
				88	ప్రైవేట్	మాగాణి	2384.72
				269	ప్రైవేట్	మెట్ట	5328.38
				89	ప్రైవేట్	మాగాణి	757.98
				239	ప్రైవేట్	మెట్ట	70.90
			(3) ముస్లాపూర్	266/2	ప్రైవేట్	మెట్ట	432.45
				196	ప్రైవేట్	మెట్ట	13840.78
				263	ప్రైవేట్	మెట్ట	8662.22
				197	ప్రైవేట్	మెట్ట	1035.33
				198	ప్రైవేట్	మెట్ట	8803.51
				212	ప్రైవేట్	మెట్ట	2257.18
				208	ప్రైవేట్	మెట్ట	24.01
				209	ప్రైవేట్	మెట్ట	404.88
				214 /1	ప్రైవేట్	మెట్ట	54886.35
				214 /2			2423.60
				210	ప్రైవేట్	మెట్ట	1751.47
				211	ప్రైవేట్	మెట్ట	8735.13
				213	ప్రైవేట్	మెట్ట	4633.97
				170	ప్రైవేట్	మెట్ట	8001.13
				169	ప్రైవేట్	మెట్ట	2701.50
				168	ప్రైవేట్	మెట్ట	3695.52
				165	ప్రైవేట్	మెట్ట	5417.76
				164	ప్రైవేట్	మెట్ట	4710.06
				162	ప్రైవేట్	మెట్ట	2424.31
				161	ప్రైవేట్	మెట్ట	1375.92
			(4) పెద్దాపూర్	353	ప్రైవేట్	మెట్ట	6469.78
				357	ప్రైవేట్	మెట్ట	5698.41
				358	ప్రైవేట్	మెట్ట	16984.63
				313	ప్రైవేట్	మెట్ట	5475.82
				363	ప్రైవేట్	మెట్ట	1379.29
				310	ప్రైవేట్	మెట్ట	8826.10
				311	ప్రైవేట్	మెట్ట	4845.26
				173	ప్రైవేట్	మెట్ట	1953.33
				137	ప్రైవేట్	మెట్ట	713.25
				135	ప్రైవేట్	మెట్ట	1487.59
				318	ప్రైవేట్	మెట్ట	8654.32
				315	ప్రైవేట్	మెట్ట	294.50
				316	ప్రైవేట్	మెట్ట	220.60
				317	ప్రైవేట్	మెట్ట	1138.18
				136	ప్రభుత్వ	మెట్ట	485.81
		2. శంకరంపేట(ఎ)	(1) వెంకటాపురం [కట్టెల]	91/1	ప్రైవేట్	మెట్ట	6803.58
				55	ప్రైవేట్	మెట్ట	7701.01
				54	ప్రైవేట్	మెట్ట	1530.63
				84	ప్రైవేట్	మెట్ట	7109.15
				85	ప్రైవేట్	మెట్ట	108.58
				91/21	ప్రైవేట్	మెట్ట	933.10
			(2) కొల్లాపల్లి	65	ప్రైవేట్	మెట్ట	4300.74
				66/13	ప్రైవేట్	మాగాణి	608.72
				68	ప్రైవేట్	మాగాణి	1838.75
				184	ప్రైవేట్	మెట్ట	6533.44
				185/17	ప్రైవేట్	మెట్ట	653.99
				185/21	ప్రైవేట్	మెట్ట	914.98
				69/18	ప్రైవేట్	మెట్ట	55.14
				232	ప్రైవేట్	మెట్ట	533.33
				185/23	ప్రైవేట్	మెట్ట	1927.02
				185/24	ప్రైవేట్	మెట్ట	832.53
				185/25	ప్రైవేట్	మెట్ట	1272.38
				185/26	ప్రైవేట్	మెట్ట	1839.13
				185/27	ప్రైవేట్	మెట్ట	762.55
				185/41	ప్రైవేట్	మెట్ట	500.29
				185/42	ప్రైవేట్	మెట్ట	1989.31
				191	ప్రైవేట్	మెట్ట	10697.48
				193	ప్రైవేట్	మెట్ట	2420.02
				205	ప్రైవేట్	మెట్ట	1152.80
				206	ప్రైవేట్	మెట్ట	2186.00
				207	ప్రైవేట్	మెట్ట	1231.49
				212	ప్రైవేట్	మెట్ట	1355.97
				213	ప్రైవేట్	మెట్ట	163.04
				214	ప్రైవేట్	మెట్ట	545.79
				218	ప్రైవేట్	మాగాణి	490.14
				219	ప్రైవేట్	మెట్ట	549.38
				220	ప్రైవేట్	మెట్ట	633.07
				221	ప్రైవేట్	మెట్ట	426.10
				231	ప్రైవేట్	మాగాణి	341.36
				236	ప్రైవేట్	మాగాణి	154.89
				237	ప్రైవేట్	మాగాణి	451.11
				241	ప్రైవేట్	మెట్ట	72.42
				242/1	ప్రైవేట్	మెట్ట	460.82
				243	ప్రైవేట్	మాగాణి	3226.01
				246	ప్రైవేట్	మాగాణి	1890.32
				247	ప్రైవేట్	మాగాణి	496.77
				248	ప్రైవేట్	మాగాణి	404.56
				249	ప్రైవేట్	మాగాణి	888.54
				250	ప్రైవేట్	మాగాణి	406.45
				251	ప్రైవేట్	మాగాణి	2770.35
				253	ప్రైవేట్	మాగాణి	673.35
				244	ప్రైవేట్	మాగాణి	655.70
				254	ప్రైవేట్	మాగాణి	424.45
				252	ప్రైవేట్	మాగాణి	90.13
			(3) తిరుమలాపూర్	203	ప్రైవేట్	మెట్ట	7288.70
				236	ప్రైవేట్	మాగాణి	213.97
				235	ప్రైవేట్	మాగాణి	1355.07
				233	ప్రభుత్వ	మెట్ట	2093.90
				232	ప్రైవేట్	మెట్ట	2588.72
				231/5	ప్రైవేట్	మాగాణి	179.47
				231/4			832.80
				231			2757.71
				231/1			2669.76
				231/2			1934.02
				166	ప్రైవేట్	మాగాణి	2696.09
				163	ప్రైవేట్	మాగాణి	4416.28
				162	ప్రైవేట్	మాగాణి	2306.42
				135	ప్రైవేట్	మాగాణి	1301.15
				161	ప్రైవేట్	మాగాణి	1432.12
				136	ప్రైవేట్	మాగాణి	1264.42
				137	ప్రైవేట్	మాగాణి	4979.29
				133	ప్రైవేట్	మాగాణి	1664.96
				139	ప్రైవేట్	మాగాణి	66.01
				131	ప్రైవేట్	మాగాణి	2483.82
				138	ప్రైవేట్	మాగాణి	1169.32
				147	ప్రైవేట్	మాగాణి	745.75
				125	ప్రైవేట్	మెట్ట	480.98
				128	ప్రైవేట్	మాగాణి	2495.91
				126	ప్రైవేట్	మాగాణి	1702.55
				261	ప్రైవేట్	మెట్ట	2859.56
				267	ప్రైవేట్	మెట్ట	3307.62
				268	ప్రైవేట్	మెట్ట	3432.92
				1	ప్రభుత్వ	మెట్ట	11376.75
				4	ప్రైవేట్	మెట్ట	1037.53
				5	ప్రైవేట్	మెట్ట	5397.57
				16	ప్రైవేట్	మాగాణి	9103.18
				10	ప్రైవేట్	మెట్ట	6888.18
				9/1	ప్రైవేట్	మెట్ట	5064.06
				12	ప్రైవేట్	మెట్ట	14327.95
				31	ప్రైవేట్	మెట్ట	13340.34
				30	ప్రైవేట్	మాగాణి	1126.69
				28/1	ప్రైవేట్	మాగాణి	29850.70
				28/2		మెట్ట	768.23
				28/3			3073.27
				29	ప్రైవేట్	మెట్ట	4885.60
				26	ప్రైవేట్	మెట్ట	574.02
				27	ప్రైవేట్	మెట్ట	3015.54
				204	ప్రైవేట్	మెట్ట	1104.95
				234	ప్రైవేట్	మాగాణి	36.73
				231/7	ప్రైవేట్	మాగాణి	28.86
				254	ప్రభుత్వ	మెట్ట	979.20
				160	ప్రైవేట్	మాగాణి	187.48
				140	ప్రైవేట్	మాగాణి	320.95
				164	ప్రైవేట్	మాగాణి	831.24
				237 /1	ప్రభుత్వ	మెట్ట	15821.84
			(4) ఉత్‌లూర్	361	ప్రభుత్వ	మాగాణి	250.12
				362	ప్రైవేట్	మెట్ట	8079.44
			(5) కమలాపూర్	9	ప్రైవేట్	మాగాణి భూమి	1493.92
				10	ప్రైవేట్	మాగాణి	2152.44
				6	ప్రైవేట్	మెట్ట	3466.34
				15	ప్రైవేట్	మెట్ట	2806.23
				5	ప్రైవేట్	మెట్ట	2365.81
				16	ప్రైవేట్	మెట్ట	3846.56
				3	ప్రైవేట్	మెట్ట	1523.67
				2	ప్రైవేట్	మెట్ట	1100.12
				1	ప్రైవేట్	మెట్ట	2626.44
				11	ప్రైవేట్	మాగాణి	151.09
				125	ప్రైవేట్	మెట్ట	416.55
				8	ప్రైవేట్	మెట్ట	8.24
				126	ప్రైవేట్	మెట్ట	643.85
			(6) సి.హెచ్. లక్ష్మాపూర్(డిపి)	43	ప్రైవేట్	మాగాణి	10288.30
				47	ప్రైవేట్	మాగాణి	5272.94
				46	ప్రైవేట్	మాగాణి	545.78
				48	ప్రైవేట్	మెట్ట	2763.58
				45	ప్రైవేట్	మెట్ట	22.89
				15	ప్రైవేట్	మాగాణి	172.47
				49 /1	ప్రైవేట్	మెట్ట	3429.21
				6	ప్రైవేట్	మెట్ట	2035.59
				1	ప్రైవేట్	మెట్ట	1181.72
				93 /1	ప్రైవేట్	మెట్ట	42.78
				93 /2	ప్రభుత్వ	మెట్ట	12624.48
				91	ప్రైవేట్	మెట్ట	2827.62
				2	ప్రైవేట్	మెట్ట	341.68
				83 /1	ప్రైవేట్	మెట్ట	5825.42
				83/2	ప్రైవేట్	మెట్ట	194.95
				82/1	ప్రైవేట్	మెట్ట	1251.61
				82/2			3436.51
			(7) జాంబికుంట	279	ప్రభుత్వ	మెట్ట	5974.74
				341	ప్రైవేట్	మెట్ట	5643.66
				340	ప్రైవేట్	మెట్ట	9194.13
				350	ప్రైవేట్	మెట్ట	64.94
				351	ప్రైవేట్	మెట్ట	3712.71
				352	ప్రైవేట్	మెట్ట	5012.59
		3. టెక్మాల్	(1) బోడ్మట్‌పల్లి	115/2	ప్రైవేట్	మెట్ట	10722.78
				కాలువ	ప్రభుత్వ	మెట్ట	3308.21
				కాలువ	ప్రభుత్వ	మెట్ట	5409.90
				240	ప్రభుత్వ	మెట్ట	7139.37
				115	ప్రైవేట్	మెట్ట	4031.02
				113/1	ప్రైవేట్	మెట్ట	3678.10
				133	ప్రైవేట్	మెట్ట	50.67
				132	ప్రైవేట్	మెట్ట	1913.70
				131	ప్రైవేట్	మెట్ట	2115.23
				130/2	ప్రైవేట్	మెట్ట	3582.51
				130	ప్రైవేట్	మెట్ట	346.61
				227	ప్రైవేట్	మెట్ట	1802.08
				65	ప్రైవేట్	మెట్ట	422.40
				130	ప్రైవేట్	మెట్ట	2191.77
				145/2	ప్రైవేట్	మెట్ట	12066.71
				145	ప్రైవేట్	మెట్ట	3378.07
				146/2	ప్రైవేట్	మెట్ట	4437.25
				146	ప్రైవేట్	మెట్ట	1485.35
				143	ప్రైవేట్	మెట్ట	1091.76
				201/1	ప్రైవేట్	మెట్ట	4950.36
				202	ప్రైవేట్	మెట్ట	75.39
				203	ప్రైవేట్	మెట్ట	1647.42
				64	ప్రైవేట్	మెట్ట	1594.91
				247	ప్రైవేట్	మెట్ట	2917.65
				242	ప్రైవేట్	మెట్ట	13985.77
				202			
				208	ప్రైవేట్	మెట్ట	7321.73
				209			
				239	ప్రభుత్వ	మెట్ట	150.43
				219	ప్రభుత్వ	మెట్ట	3385.66
				239	ప్రభుత్వ	మెట్ట	2998.09
				225	ప్రైవేట్	మెట్ట	10010.46
						మొత్తం	1084253.36

[F.No.NHAI/PIU-HYD/NH-161/S-N-A/GC/1/2016]

(రాజేష్ గుప్తా), డిప్యూటీ సెక్రటరీ, భారత ప్రభుత్వము

రవాణా రంగంపై జీఎస్టీ ప్రభావం

పడిపోయిన సరకు రవాణా – అత్యధిక లారీల నిలిపివేత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రవాణా రంగం పై జీఎస్టీ ప్రభావం తీవ్రంగా ఉంది. సరకు రవాణా 40 శాతానికి పైగా పడిపోయింది. సుమారు 30 శాతం లారీలు నిలిచిపోయాయి. రవాణా రంగం భారీ మొత్తంలో నష్టపోతుంది. ఈ రంగం పై ఆధారపడిన డ్రైవర్, క్లీనర్, హమాలీలు ఉపాధి కోల్పోతున్నారు. సరుకులపై జీఎస్టీ విధించడంలో స్పష్టత లేకపోవడం, రూ. 50 వేల విలువైన సరుకు రవాణాకు కూడా వే బిల్ జారీ చేయాల్సి రావడంతో వ్యాపార, వాణిజ్య, ఉత్పాదక, పారిశ్రామిక వర్గాలు సరకులను రవాణా చేయడం తగ్గించారు. సరకులను రవాణా చేయాలంలేనే భయపడిపోతున్నారు. జీఎస్టీ పెను భారంగా మారిందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడం తప్ప మరో ఆలోచన చేసినట్టుగా లేదనే నిరసన వ్యక్తం చేస్తున్నారు. అత్యధికులైన ఉత్పత్తిదారులు పాత సరుకును నిల్వ చేసుకున్నారు. ఇప్పటి వరకు అదే సరుకు మార్కెట్‌లో అందుబాటులో ఉంది. కొత్తగా ఉత్పత్తి చేయడానికి, సరుకును రవాణా చేసేందుకు భయపడిపోతున్నారు. జీఎస్టీ స్లాబుల్లో స్పష్టత ఉన్నప్పటికీ ఆచరణలో అనేక లొసుగులు ఉన్నాయని పేర్కొంటున్నారు. ప్యాకింగ్ చేయబడిన సరుకులకు జీఎస్టీలో అధిక పన్ను విధించారు. ఇటీవలి కాలంలో ప్యాకింగ్ చేయకుండా ఏ సరుకును రవాణా చేయడం లేదు. ప్యాకింగ్ లేని సరుకులను వినియోగదారులు కూడా కొనడం లేదు. ప్యాకింగ్ గూడ్స్ పేరుతో సరకు రవాణా రంగం నుండి ఎడా పెడా పన్నులు రాబట్టే ప్రభుత్వ ఆలోచన ఈ రంగాన్ని ఆందోళనకు గురి చేస్తుంది. వ్యాపారులు ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు. పూర్తిగా అధ్యయనం చేసి ఆచరించే సమయం వరకు సరిపడా పాత సరుకులను నిల్వ చేసుకోవడంతో రవాణా రంగం కుదేలవుతుంది. ప్రధానంగా సిమెంట్, ధాన్యం, ఐరన్, ఎరువుల రవాణా భారీగా తగ్గిపోయింది. సరకు రవాణాపైన నాలుగు స్లాబ్‌లలో జీఎస్టీ వసూలు చేయాలని జీఎస్టి మండలి నిర్ణయించింది. అత్యవసర సరుకుల రవాణా పైన 5 శాతం, ప్రామాణిక సరుకుల రవాణా పై 12 శాతం, విలావ వస్తువుల పైన 18 శాతం, సరుకులు - సేవలపైన 28 శాతం జీఎస్టీ అమలు చేయాలని నిర్ణయించారు. అత్యవసర సరుకుల పై 5 శాతం జీఎస్టీ అని నిర్ణయించినప్పటికీ ప్యాక్ చేయబడిన వస్తువులుగా భావించి 18 శాతం జీఎస్టీని అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు అత్యవసర సరుకులపై 5 శాతం జీఎస్టీ అమలైన దాఖలాలు లేవని రవాణా రంగం ప్రతినిధులు పేర్కొన్నారు. పన్ను విధించడం, ఆచరించడం అమలు పర్చడం పై స్పష్టత లేక పోవడంతో సరకు రవాణా రంగం ఆందోళనకు గురవుతుంది. జీఎస్టీ ప్రభావం రవాణా, నిర్మాణ రంగం పై తీవ్రంగా కనబడుతుంది. సిమెంట్ రవాణా 40 శాతానికిపైగా పడిపోయింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పరిధిలో రవాణా రంగం క ుదేలయింది. సరకు రవాణా బుకింగ్స్ లేకపోవడంతో 30 శాతానికి పైగా లారీలు నిలిచిపోయాయని తెలంగాణ లారీ యజమాన్యాల సంఘం అధ్యక్షులు ఎన్. భాస్కర్‌రెడ్డి ఆంధ్రప్రభకు తెలిపారు. జీఎస్టీ అమలులో స్పష్టత లేకపోవడంతో సిమెంట్, బియ్యం, ఉక్కు, ఎరువుల రవాణా తగ్గిపోయిందని వెల్లడించారు. లారీల బాడీ బిల్డింగ్‌కు సంబంధించి జీఎస్టీ నెంబర్ పొందిన సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఏ ఒక్కటి లేక పోవడం గమనార్హం. జీఎస్టీ నెంబర్ లేని కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని బాడీ బిల్డింగ్ చేయించుకున్న లారీల యజమానులను ఇబ్బందుకు గురవుతున్నారు. జీఎస్టీ నెంబర్ లేని సంస్థల్లో బాడీ బిల్డింగ్ చేయించరాదనే ఆదేశాలు అమలులో ఉండటంతో సుమారు 250కి పైగా లారీలను ఆర్టీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం నిలిపివేశారు. ఫలితంగా ఈ లారీలన్ని వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. లారీలను వినియోగంలోకి తేలేకపోయినప్పటికీ బ్యాంకు రుణాల వాయిదాలు చెల్లించక తప్పని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. తెలంగాణలోని లారీ యాజమాన్యాలు ఇప్పటికే తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

ప్రభుత్వ కాదు..పాలన కనిపించాలి



అమరావతి, ఆంధ్రప్రభ: ఇకపై ప్రజలకు కనిపించాల్సింది ప్రభుత్వం కాదని, పాలన కనిపించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ రోజు రోజుకు అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. దీనికి అనుగుణంగా మనమూ మారకపోతే ప్రజలు విశ్వసించే అవకాశం లేదన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఈ-ప్రగతి శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ హైదరాబాద్‌లో తన శాఖను ప్రారంభించేందుకు వెనుకంజ వేసిందని, ఆ సమయంలో తాను చూపిన కృషి, పట్టుదల కారణంగా అది హైదరాబాద్‌లో ఏర్పాటైందన్నారు. ఆ తరువాత ట్రిపుల్ ఐటీ, నల్సార్ యూనివర్శిటీలు వచ్చాయని, దీంతో హైదరాబాద్‌కు ప్రపంచ పటంలో ఒక సుస్థిర స్థానం లభించిందన్నారు. 20 సంవత్సరాల క్రితం బిల్‌గేట్స్ చేసిన నూతన ఆలోచనతో ఇంటర్నెట్, ల్యాప్‌టాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా తయారు చేశారని చంద్రబాబునాయుడు అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సంపద సృష్టి, ఉద్యోగాల కల్పన, పరిపాలనలో పారదర్శకత వస్తుందన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పేరిట మరో సరికొత్త సాంకేతిక విప్లవం ప్రస్తుతం నడుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ముందస్తు సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఒకప్పుడు పొలం పనులకు వెళ్లిన రైతులు పిడుగుపాటుకు గురై మరణించేవారని, ఇప్పుడు వచ్చిన నూతన సాంకేతిక విధానంతో పిడుగు పడటానికి 45 నిమిషాల ముందుగానే ఏప్రాంతంలో పడుతుందో హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వపరంగా అన్ని సేవలను ప్రజలకు సులువుగా అందాలన్న లక్ష్యంతో క్లౌడ్ డేటాను వినియోగిస్తున్నామని, దీన్ని వినియోగిస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ముఖ్యమంత్రి తెలిపారు. అంతేకాకుండా తీర ప్రాంతాల్లో వర్షాలు, తుపానుల సమాచారాన్ని ఖచ్చితంగా చెప్పగల సాంకేతిక పరిజ్ఞానాన్ని నేడు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏకరూప పన్ను విధానం దేశ వ్యాప్తంగా అమలు కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన వస్తువులు కూడా జీఎస్టీ పరిధిలోకి వచ్చాయన్నారు. ఆనాడు విశాఖపట్నంలో హుదూద్ తుపాను సంభవించినప్పుడు అక్కడి ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. అప్పుడు తాను ఆలోచించిన వినూత్న విధానంతో విద్యుత్ సమస్యను వారం రోజుల్లోనే పరిష్కరించి వీధి దీపాలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేశామన్నారు. వీటన్నిటినీ డ్యాష్ బోర్డుకు అనుసంధానం చేయటం ద్వారా విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ఎక్కడ వీధిదీపాలు వెలుగకపోయినా తెలుసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. వీధి దీపాలకు ఎల్ఈడీ బల్బులను అమర్చటం వలన రూ. 40వేల కోట్లు ప్రభుత్వానికి ఆదా అవుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రాయగడ-టిట్లాఘర్ మధ్య రైళ్ల దారి మళ్లింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాయగడ - టిట్లాఘర్ సెక్షన్‌లోని శంబల్‌పూర్ డివిజన్‌లో వరదలు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో ప్రయాణం చేసే అనేక రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. హటియా - యశ్వంత్‌పూర్, అసన్‌సోల్ - చెన్నై, టాటానగర్ - యశ్వంత్‌పూర్, హటియా - ఎర్నాకులం, తిరుపతి - బిలాస్‌పూర్ రైళ్లను బిలాస్‌పూర్, రాయపూర్, నాగ్‌పూర్ బల్లార్షా, విజయవాడ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నారు.

పామును పట్టుకోవడం
ఇంత తేలికా!



అవునండి... చాలా నిజం. తేలిగ్గా పామును పట్టేసుకోవచ్చని నిరూపించింది ఆ యువతి. ఆస్ట్రేలియాలోని ఓ టీవీ చానెల్ న్యూస్ రూమ్‌లోకి ఎలా వచ్చి కూర్చుందో.. ఓ రెండు మీటర్ల పొడవున్న పాము చేరింది. కంప్యూటర్‌కు చుట్టచుట్టుకుని కూర్చున్న ఆ పామును చూసిన యువతి బెదిరిపోలేదు.. కేకలు పెట్టలేదు... పారిపోలేదు... ఓ హ్యాంగర్‌లాంటిది తీసుకుని పాముని అదిలించింది. కాస్త కదలగానే.. ఆమె పామును తటాలున పట్టుకుంది. దీన్ని గమనించిన మరో ఉద్యోగి.. ఓ బ్యాగ్ తీసుకొచ్చాడు. అంతే ఆమె పామును ఆ సంచిలో వేసింది. జాగ్రత్తగా పట్టుకెళ్ళి.. అడవిలో విడిచిపెట్టేశారు. 9 న్యూస్ చానెల్ దీనికి సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో పెట్టింది. ఈ వీడియోనూ.. అందులో ఆ యువతి కనబరిచిన సాహసాన్ని చూసిన వారు నోళ్ళు వెళ్ళబెడుతున్నారు...

ఉత్తర అమెరికాలో
డైనోసార్ల నాటి మొక్క!



డైనోసార్లు గతించి వేల ఏళ్ళు గడిచింది. కానీ ఆ కాలం నాటి మొక్కొకటి జీవించే ఉంది. గ్రీన్ ఆల్గా జాతికి చెందిన ఆ మొక్క పేరు లైకోథామ్నస్ బార్బటస్. అర్జెంటీనాలోని పశ్చిమ భాగంలో ఇది మనుగడలో ఉండేదట. ఇప్పుడు ఆ మొక్క ఉత్త అమెరికాలోని సరస్సుల సమీపంలో కనిపించింది. యూరోప్, ఆస్ట్రేలియాలలో కూడా ఇది కనిపించేది. విస్కాన్సిన్ ప్రాంతంలోని 14 సరస్సులనుంచి దీనికి సంబంధించిన నమూనాలను శాస్త్రవేత్తలు సేకరించారు.

ఎయిరిండియా సిబ్బందికి
దెయ్యాల బెడద!



అయ్యబాబోయ్ దెయ్యా లున్నాయం టున్నారు. ఎయిర్ ఇండియాకు చెంది న ఉద్యోగులు. చికాగోలోని ఓ హోటల్‌లో తాము ఉండలేకపోతున్నా మని వారంటున్నారు. ఊహాతీతమైన శక్తులేవో తమను వెంటాడుతున్నట్లూ.. నెగటివ్ ఎనర్జీ ఏదో తమ శరీరంలో ప్రవేశిస్తున్నట్లు తమకు అనిపిస్తోందని వారు ఫిర్యాదు చేశారు. గత నవంబరు నుంచి ఇలాగే ఉంటోందనీ తెలిపారు. గదిలో ఒక్కరే నిద్రించాలంటే భయంగా ఉంటోందనీ, ఇద్దరు చొప్పున ఉంటున్నామనీ తెలియజేశారు. ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్నామని ఎయిర్ ఇండియా అధికార ప్రతినిధి తెలిపారు.

మోడీ ఎత్తులు...జిన్‌పింగ్ జిత్తులు

(మొదటిపేజీ తరువాయి)

పాకిస్తాన్ వైపు వేలు చూపించేదని చైనా మీడియా పేర్కొంటోంది. అయితే మారిన పరిస్థితుల్లో, బలహీన పాకిస్తాన్‌ను వేలెత్తి చూపితే దేశ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని గమనించిన భారత్ నాయకత్వం సహజంగానే చైనాను బూచిగా చూపిస్తోందని ఆరోపిస్తోంది. ఏది ఎలా ఉన్నా పరిస్థితిని తనకు అనుకూలంగా మలచుకునేందుకే జిన్‌పింగ్ నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. తిరిగి తాను అధ్యక్ష పదవికి ఎన్నికయ్యే వరకూ భారత్‌తో గిల్లికజ్జాలను కొనసాగించేందుకే జిన్‌పింగ్ ఇష్టపడుతున్నారు. ఇటు భారత్‌తో అటు దక్షిణచైనా సముద్రం వివాదాలతో పాశ్చాత్య దేశాలతో కూడా ఉద్రిక్తతలను కొనసాగిస్తేనే దేశీయంగా తనకు మద్దతు లభిస్తుందని జిన్‌పింగ్ నమ్ముతున్నారు. అందుకు అనుగుణంగానే ఆయన పావులు కదుపుతున్నారు. ఇక భారత్ విషయానికి వస్తే, దేశీయంగా రాజకీయ పరిస్థితులు ప్రధాని మోడీకి తిరుగులేనివిధంగానే ఉన్నా, అంతర్జాతీయ పరిస్థితులను కూడా తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో మోడీ ఉన్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. దేశీయంగా పరిస్థితులు ఒకవేళ మారినా, మారే అవకాశం ఉన్నా కూడా మోడీ ఎటువంటి పరిస్థితుల్లోనూ తిరిగి తానే అధికారం చేపట్టేవిధంగా వ్యవహారాలను చక్కబెడుతున్నట్టు కనిపిస్తోంది. ఇందుకు దేశీయ పరిస్థితులు అనుకూలించకపోతే అంతర్జాతీయ పరిస్థితులను ప్రధానంగా చూపించాలనేది ఆయన యోచనగా కనిపిస్తోందంటున్నారు. పాకిస్తాన్‌ను బూచిగా పదేపదే చూపించినా దేశీయంగా ఉపయోగం ఉండదని ఆయన గ్రహించినట్టే కనిపిస్తోంది. సర్జికల్ స్ట్రైక్స్ జరిపినా ఉగ్రవాదులు జొరపడుతూనే ఉన్నారు. ఎంత కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేసినా అమర్‌నాథ్ యాత్రికులపై దాడులు జరిగాయి. ఇకపై పాకిస్తాన్‌ను చూపించి పబ్బం గడపడం సాధ్యం కాదు. అందుకే అధినాయకత్వం చూపు డ్రాగన్ వైపు మళ్లినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. తన కంటే బలహీనమైన దేశాన్ని దోషిగా చూపించినంత మాత్రాన దేశ ప్రజల అభిమానాన్ని ఎంతోకాలం పొందలేమని గ్రహించిన నాయకత్వం సరైన ఉజ్జీగా బీజింగ్‌ను ఎంచుకొందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగానే భూటాన్‌తో ఉన్న రక్షణ ఒప్పందాన్ని ఉటంకిస్తూ డొకలామ్ వివాదంలో భాగంగా మారింది. భూటాన్ సాయం అందించాలని అభ్యర్థించకుండానే తనంతట తాను డొకలామ్ వివాదంలో తల దూర్చింది. అయితే, ఇక్కడే మోడీ తన పైఎత్తుతో ప్రత్యర్థిపై పైచేయి సాధించారు. జిన్‌పింగ్ వలె నోరు పారేసుకోలేదు. రణ నినాదాలు చేయలేదు. ఎంతో ఓపిగ్గా ఉన్నట్టు వ్యవహరిస్తూ, దౌత్య మార్గాన్ని ఎంచుకున్నారు. దీంతో ఇటు దేశ ప్రజలను, అటు పాశ్చాత్య దేశాలను ఆకట్టుకున్నారు. ఆశించిన ప్రయోజనాన్ని మోడీ పొందారనే చెప్పాలి. అయితే, దీన్ని మరింత ముందుకు సాగదీసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. తాజాగా, భారత్‌కు చెందిన గ్లాండ్ ఫార్మాను టేకోవర్ చేసేందుకు చైనాకు చెందిన ఫోసన్ ఫార్మా 130 కోట్ల డాలర్లను వెచ్చించనుంది. అయితే, చివరిక్షణంలో భారత్ దీన్ని అడ్డుకుంది. ఫోసన్ భారత్‌లో ప్రవేశిస్తే దేశీయ ఔషధ రంగం ఇబ్బందులను ఎదుర్కొంటుందని వాదిస్తోంది. అయితే, ఇతర రంగాల్లో ఇప్పటికే డ్రాగన్ కంపెనీలు లెక్కకు మిక్కిలిగా భారత్‌లో ప్రవేశించాయి. ప్రత్యక్ష పెట్టుబడులను పెట్టాయి. వివిధ స్థాయిల్లో ఆయా పరిశ్రమలు ఉన్నాయి. మరికొన్ని ఒప్పందాలు కుదుర్చుకుని రావడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు వాటన్నిటి భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్న. చైనా ఉత్పత్తులను భారత్ మార్కెట్ల నుంచి తరిమివేస్తే తక్షణ ఉపశమనంగా కనిపించవచ్చు. కాని, దీర్ఘకాలంలో ఇది ఎంతవరకూ మేలు చేస్తుందన్నది అసలు ప్రశ్న. అయితే, ఇరు దేశాధినేతలు అక్కడివరకూ వెళ్లకపోవచ్చునని, కేవలం తమ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకునే ఇలా పరస్పరం పందెం కోళ్లవలె మొగ్గు చూపుతున్నాయే కాని, మిలిటరీ లేదా ఆర్థిక యుద్ధాలు చేసుకునే పరిస్థితుల్లో లేవని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.



ఎవరినైనా ఓడిస్తాం

•ఏ దండయాత్రపైనా తిప్పికొడతాం •మరోసారి చైనా రణ నినాదం • డోక్లాం నేపథ్యంలో పలుమార్లు యుద్ధం వ్యాఖ్యలు

బీజింగ్: అసందర్భంగా చైనా మళ్లీ రణన్నినానాదానికి పాల్పడింది. ఏ దండయాత్రనైనా, ఎవరినైనా ఓడించగల సామర్థ్యం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి ఉందని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. మంగళవారం పీఎల్ఏ 90వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఒక కార్యక్రమంలో ప్రసంగించారు. ఏ భూభాగాన్నైనా విడగొట్టే అవకాశాన్ని ఏ దేశానికి లేదా సంస్థకు చైనా ఇవ్వబోదని ఆయన స్పష్టం చేసారు. తాము ఎవరిపైనా దాడికి వెళ్లబోమని, దేశాన్ని విస్తరించాలనే కాంక్ష కూడ లేదని అయితే.. తమ దేశ భూభాగాన్ని ఏ మాత్రం విడగొట్టాలని ప్రయత్నించినా సహించరాదని సైన్యానికి ఆయన ఉద్బోధించారు. పీఎల్ఏ వార్షికోత్సవాలకు ఈ ప్రాముఖ్యత, వివిధ కార్యక్రమాల్లో జిన్‌పింగ్ రణన్నినాదాలన్నీ కూడా డోక్లాంలో భారత్, చైనాల మధ్య ప్రతిష్టంభన కారణంగానేనని విశ్లేషకుల అంచనా. భారత్‌ను, ఆ దేశాన్ని సమర్థిస్తున్న అమెరికాకు, చైనా ఇటీవల పరోక్షంగా హెచ్చరికలు జారీ చేయడం కూడా ఇందులో భాగమే. పీఎల్ఏ ఉత్సవాల సందర్భంగా జిన్‌పింగ్ చైనా సార్వభౌమత్వం, అభివృద్ధి, భద్రత గురించి పలుమార్లు మాట్లాడారు. సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు అధినేత కూడా అయిన జిన్‌పింగ్.. చైనా అధ్యక్ష హోదాలో రెండు మూడు రోజులకొకసారి పలు మార్లు ప్రత్యర్థులను బెదిరించేలా మాట్లాడడం భారత్‌ను హెచ్చరించడానికేనని అంచనా.డోక్లాం ప్రతిష్టంభన భారత్‌కు భద్రతా కారణాల వల్ల తలెత్తింది. భూటాన్ అభ్యర్థనతో మన దేశం చైనాను అక్కడ రోడ్డు నిర్మించకుండా అడ్డుకుంది. అయితే.. ఈ విషయంలో భారత్‌కు సంబంధం లేదన్న చైనా, ఆ మాట మీదే నిలబడి పలుమార్లు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇటీవల ఎన్ఎస్ఏ దోవల్ చైనా పర్యటనలో ఉండగా, పీఎల్ఏ ఉత్తరాఖండ్‌లో భారత సరిహద్దులోకి చొరబడింది. ఐటీబీపీ దళాలు అడ్డుకోగా వెనక్కు మరలింది. గతంలో జిన్‌పింగ్ భారత్ పర్యటనలోనూ చైనా ఇదే విధంగా ప్రవర్తించడం గమనార్హం. తమతో సామరస్యంగా లేకుంటే పనులు జరగవని, చర్చల్లో తెలివితేటలకు తాము లొంగబోమని చైనా భారత్‌కు స్పష్టం చేస్తోంది. దీంతో భారత్ కూడా చైనాను తట్టుకునేందుకు అమెరికా, జపాన్, రష్యాలతో కూడి పలు ఒప్పందాలు చేసుకుంటోంది. పాక్ కట్టడికి ఇరాన్‌తోనూ చెలిమిని పెంచుకుంటోంది. ఆ విధంగానే చైనాను కట్టడి చేయగలమని భారత్ వ్యూహకర్తలు నమ్ముతున్నట్లు కనబడుతోంది.

దివ్యాంగులకు న్యాయం చేయండి

ఆంధ్రప్రభ కథనంపై స్పందించిన వరంగల్ అర్బన్ కలెక్టర్

వరంగల్, కెఎన్ఎన్ బ్యూరో : ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసిన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు న్యాయం చేయాలని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి కాటా ఆదేశించారు. వరంగల్ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం వలన ఫేయిలైన 35 మంది దివ్యాంగ విద్యార్థులకు జరిగిన నష్టంపై ఆమె ఓపెన్ స్కూల్ అధికారులతో మాట్లాడారు. దివ్యాంగుల జీవితాల్లో చీకటి నింపిన విద్యాశాఖ శీర్షికన గత నెల 30న ఆంధ్రప్రభలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ప్రజావాణి సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు కలెక్టర్ అమ్రపాలిని కలిసి తమకు జరిగిన అన్యాయంపై ఆంధ్రప్రభలో ప్రచురితమైన కథనాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పత్రిక కథనాన్నే విజ్ఞాన పత్రంగా వారు ఆమెకు అందజేశారు. ఆ కథనాన్ని పూర్తిగా చదివిన కలెక్టర్ చలించారు. వెంటనే విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేసి విషయం తెలుసుకున్నారు. వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థులు మంగళవారం ఆంధ్రప్రభకు తెలిపారు. వరంగల్‌కు చెందిన ఎండి. తబ్రేజ్ ఖాన్ అనే ఓపెన్ స్కూల్ దివ్యాంగ విద్యార్థి కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి తనకు జరిగిన అన్యాయంపై వెల్లడించారు. మూగ, చెవిటి విద్యార్థులకు పరీక్షలు రాసే సమయంలో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఇన్విజిలెటర్లుగా నియమించారు. జంబ్లింగ్ విధానం నుంచి మినహాయింపు పరీక్ష రుసుంలో రాయితీ, భాషా పరీక్షలో ఏదేని ఒక పరీక్ష మాత్రమే రాయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు పట్టించుకోకపోవడం వలన వరంగల్ జిల్లాలో 35 మంది విద్యార్థులు నష్టపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంఖ్య మూడు వేలకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ విషయాన్ని జులై 30న ఆంధ్రప్రభ మెయిన్ పేజీల్లో చీకటి నింపిన విద్యాశాఖ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని వరంగల్ కలెక్టర్ అమ్రపాలి చదివి ఓపెన్ స్కూల్ అధికారులను మందలించారు. దివ్యాంగ విద్యార్థులకు జీఓ 33 ప్రకారం 20 శాతం మార్కులు వస్తేనే ఉత్తీర్ణత. 30 మార్కులు వచ్చిన విద్యార్థులను సైతం ఫేయిల్ చేస్తూ మెమోలు జారీ చేశారు. మరికొంత మంది తమ మెమోలను రివాల్యువేషన్ చేయాలని ఓపెన్ స్కూల్ అధికారులకు విన్నపించారు.





చీకటి నింపిన విద్యాశాఖ

వానాకాలంలో
ఎండ తీవ్రత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వానాకాలం అయినప్పటికీ తెలంగాణ వ్యాప్తంగా భానుడు సెగలు కక్కుతున్నాడు. సోమ, మంగళ వారాల్లో హైదరాబాద్ నగరంలో 35.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవి సాధారణం కన్నా 5 డిగ్రీలు ఎక్కువేనని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకు ప్రస్తుత సమయంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు మించరాదు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో వర్షపాతం ఆశాజనకంగా లేకపోవడంతో పొడి వాతావరణం ఏర్పడింది..

డ్రగ్స్ కేసు విచారణ వేగవంతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో నైజీరియన్ డ్రగ్ ముఠా గుట్టును రట్టు చేసిన రాచకొండ పోలీసులు కేసు దర్యాప్తు లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితురాలు, విజయవాడకు చెందిన సంగీత నేపథ్యం విస్తుగొలుపుతోంది. నైజీరియర్ల డ్రగ్స్ దందా లావాదేవీల నిర్వహణకు బ్యాంకు ఖాతా తెరిచి మరీ సహకరించినందుకు ఎల్బీనగర్ పోలీసులు ఆమెను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు సంగీతతో పాటు మరో ముగ్గురు నైజీరియన్లను న్యాయస్థానం అనుమతితో వారం రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం విజయవాడకు చెందిన సంగీతకు ముందు నుంచే ఆఫ్రికన్ల విషయంలో ఆసక్తి ఎక్కువ. ఈ క్రమంలోనే వారితో ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకుంది. అనంతరం ఢిల్లీ వెళ్లి నైజీరియన్లతో కలిసి అక్కడే ఉండిపోయింది. కుటుంబసభ్యులు ఒత్తిడి తెచ్చి ఆమెను తిరిగి విజయవాడకు తీసుకొచ్చి పెళ్లి చేశారు. పెళ్లయ్యాక కొద్ది రోజులకే భర్త చనిపోయాడు. ఆమె మరోసారి నైజీరియన్లతో జట్టు కట్టింది. ఈ సారి హైదరాబాద్‌కు మకాం మార్చింది. 2012లో భారత్‌కు వచ్చిన నైజీరియన్ ఒజుకు కాస్మోస్‌తో రాజేంద్రనగర్ సన్‌సిటీలోని ఓ అపార్టుమెంట్‌లో ఉండిపోయింది. వీసా గడువు ముగిసి అక్రమంగా ఉంటున్న అతడితోనే కలిసి డ్రగ్స్ దందాకు తెరతీసింది. గాబ్రియేల్ అనే మరో నైజీరియన్ ద్వారా నగరానికి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయించే కాస్మోస్‌తో కలిసి వ్యాపారం నిర్వహించింది. ఆన్‌లైన్‌లో డబ్బు లావాదేవీల నిర్వహణ కోసం తన పేరిట ఖాతా తెరిచింది. ఖాతాదారులకు డ్రగ్స్ సరఫరా చేసిన అనంతరం ఖాతాదారులు ఈ ఖాతాకే డబ్బులు పంపిచేవారు. అలా నైజీరియన్లతో కలిసి పీకల్లోతు అక్రమాల్లో మునిగిపోయిన సంగీత వ్యవహారం.. అరెస్ట్‌తో బహిర్గతం కావడం కలకలం రేపింది.

గాబ్రియెల్ చిక్కితే..

డ్రగ్స్ దందాలో కీలక సూత్రధారిగా భావిస్తున్న గాబ్రియెల్ హైదరాబాద్‌లోనే ఉండి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతడే కాస్మోస్ ముఠాకు డ్రగ్స్ సరఫరా చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. గోవా, ముంబయికి చెందిన ముఠాలతో గాబ్రి యేల్‌కు సంబంధాలున్నట్లు ఆధారాలు లభించడంతో అతడి కోసం వేట మొదలు పెట్టారు. గతంలో ఈస్ట్ మారేడ్‌పల్లి పోలీసులకు 20 గ్రాముల కొకైన్ సహా చిక్కిన కేసులో గాబ్రియెల్‌ను నిందితుడిగా గుర్తించారు.

యువతులతో అసభ్య ప్రవర్తన
నిందితుల కోసం పోలీసుల గాలింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : షాపింగ్ ముగించుకుని ఆటోలో ఇంటికి బయల్దేరిన ఇద్దరు యువతుల పట్ల ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించారు. ఆటో డ్రైవర్‌ని బెదిరించి లోపల కూర్చున్న ఆకతాయిలు.. అమ్మాయిలను వేధింపులకు గురిచేశారు. అంతేకాదు, విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరింపులకు కూడా దిగారు. బాధితురాలి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. జైరా భాను అనే యువతి షాపింగ్ ముంగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో.. ఆరుగురు యువకులు ఆమె ప్రయాణిస్తున్న ఆటోను వెంబడించారు. మార్గమధ్యంలో ఆటోను అడ్డగించి. బలవంతంగా ఆటో ఎక్కారు. ఆటోలో వున్న ఇద్దరు యువతుల పట్ల దురుసుగా ప్రవర్తించి బయటకు లాగేందుకు ప్రయత్నించారు. ఆకతాయిల్లో ఓ వ్యక్తి తనను పెళ్లి చేసుకోవాలంటూ బలవంతపెడుతూ అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధిత యువతి తన ఫిర్యాదులో పేర్కంది. ఘటనను తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన యువతి దానిని పోలీసులకు అందజేసింది. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఆరుగురు నిందితుల్లో ముగ్గురిని ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నిందితులు శాస్త్రిపురానికి చెందిన వారుగా గుర్తించినట్లు సమాచారం.

ఏ అధికారంతో కేసును ఎత్తివేశారు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రకాశం జిల్లా, గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్ రెడ్డి పై దాఖలైన క్రిమినల్ కేసులను విరమిస్తూ ఏ అధికారంతో జీవో జారీ చేశారో వివరించాలని ఉమ్మడి హైకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అలాగే ఆ జీవో ద్వారా ఎమ్మెల్యే పై కేసును ఉపసంహరించుకోవాల్సిందిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎలా ఆదేశించారో తెలుసుకోవాలనుకుంటున్నామని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేసింది. ప్రకాశం జిల్లా, గిద్దలూరు ఎమ్మెల్యేపై పోలీసు జీపు ను తగులబెట్టిన వ్యవహారంలో కేసు నమోదైంది. ప్రస్తుతం తెదేపా లో చేరిన సదరు ఎమ్మెల్యే పై దాఖలైన క్రిమినల్ కేసును ఉపసంహరిస్తూ ప్రభుత్వం జీవో 379 జారీ చేసింది. ఆ జీవోను సవాలు చేస్తూ షేక్ మస్తాన్ వలీ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.




పిడుగుపాటుకు ముగ్గురు మృతి

దొనకొండ, కెఎన్ఎన్ : పొలం పనులు చేస్తుండగా పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతి చెందిన సంఘటన ప్రకాశం జిల్లా దొనకొండ మండలం యర్రబాలెం గ్రామ పొలాల్లో మంగళవారం సాయంత్రం జరిగింది. యర్రబాలేనికి చెందిన మోడి గురవయ్య (34), మోడి లక్ష్మీ (29) అనే దంపతులు పొలంలో పని చేస్తున్నారు. అలాగే కురిచేడు మండలం పడమర గంగవరంనకు చెందిన పులి సుబ్బారెడ్డి (55) తాను కౌలుకు తీసుకున్న పొలంలో పని చేసుకుంటున్నాడు. మంగళవారం సాయంత్రం వర్షం కురుస్తుండటంతో పొలం పక్కనే ఉన్న గుడిసె వద్దకు ముగ్గురూ చేరారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పిడుగుపాటు పడటంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన మోడి గురవయ్య, లక్ష్మీలకు ఇద్దరు సంతానం. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు పొలాల్లోకి పరుగులు తీశారు. సంఘటనా స్థలంలో మృతదేహాలను చూసి గ్రామస్తులు, బంధువులు భోరున విలపించారు.

విద్యుత్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
కార్మిక సంఘాల విజయమే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని విద్యుత్ శాఖలో పని చేస్తున్న 20,903 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వెనుక కార్మిక సంఘాల పోరాటం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. టీఆర్ఎస్ అనుబంధ సంఘం తప్ప మిగతా సంఘాలు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పోరాటాలు చేశాయని చెప్పారు. కార్మిక సంఘాల వత్తిడి లేకపోతే పర్మినెంట్ చేసేవారా అని ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సహకరించిన మీరాకుమార్ సభకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమని విమర్శించారు. కరీంనగర్, సిరిసిల్ల రాజన్న జిల్లాలకు చెందిన ప్రజలు ఇసుక మాఫియా అఘాయిత్యాలకు విసిగిపోయారని, అందుకే పెద్ద సంఖ్యలో మీరాకుమార్ కార్యక్రమాలకు హాజరయ్యారని చెప్పారు. 8 మంది దళితులు, బీసీలు చిత్రహింసలకు గురైతే కేసీఆర్, కేటీఆర్ ఎందుకు నోరువిప్పరని ప్రశ్నించారు.



నేరెళ్ల ఘటనపై జ్యుడీషియల్ విచారణకు మల్లు రవి డిమాండ్

నేరెళ్ల ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని, రాజ్యహింస పేట్రెగిపోతోందని ఆరోపించారు. దళితులను అణగదొక్కేందుకే కేసీఆర్ సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచిన బాల్కసుమన్ రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని మల్లురవి సూచించారు.

మియాపూర్ అక్రమ రిజిస్ట్రేషన్లు..
పూర్తి వివరాలతో ప్రమాణ పత్రం
పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మియాపూర్ భూ అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే పూర్తి వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని కూడా హైకోర్టు పిటిషనర్ కు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి ధర్మాసనానికి ఓ నివేదికను సమర్పించారు. ఆ భూములను రిజిస్ట్రేషన్లు చేయరాదని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ 5 రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ ..ఆ భూములు ప్రభుత్వ భూములా కాదా అని ప్రశ్నించింది.మియాపూర్ లో రూ.వెయ్యి కోట్ల విలువైన 692 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూ కుంభకోణంపై సీబీఐ చేత దర్యాప్తు జరిపించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ తెలంగాణ భాజాపా అధికార ప్రతినిధి, న్యాయవాది మాధవనేని. రఘునందన్ రావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ రఘునందన్ రావు (పార్టీ ఇన్ పర్సన్) వాదనలు వినిపిస్తూ...శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని 692 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించి ట్రినిటీ ఇన్‌ఫ్రా వెంచర్స్ లిమిటెడ్ పేరు మీద అక్రమంగా బదలాయించబడిందని తెలిపారు. ఈ భారీ భూ కుంభకోణం లో రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన అధికారులు కుమ్మక్కైనట్లు పిటిషనర్ విన్నవించారు. ఈ కుంభకోణంపై కూకట్ పల్లి పోలీస్ ఠాణాలో క్రైం. సంఖ్య .633/2017 తో కేసు నమోదైంది. కానీ విచారణ నత్తనడకగా సాగుతోందన్నారు. రాజకీయ నాయకులు, అధికారుల పాత్ర ఉన్నందువల్ల దర్యాప్తును సీబీఐ కి అప్ప గించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ వ్యవహారంపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని, పూర్తి వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని పిటిషనర్ ను ఆదేశించారు.

రెండు జిల్లాలకు వారధి నిర్మాణం



మంథని, కెఎన్ఎన్ : వచ్చే ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం నాటికి ఖమ్మంపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని, రెండు జిల్లాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుతుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా, ముత్తారం మండలం ఖమ్మంపల్లి - మానేరుపై రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జికి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, ప్రభుత్వ సలహాదారు వివేక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పెద్ద పెద్ద పథకాలను చూసి ప్రతిపక్షాలు ఇవి సాధ్యం కాదని రెండేళ్ల వరకు ఇంట్లోనే కూర్చున్నారని, ఇప్పుడు అవి సాధ్యమవుతున్నాయని తెలిసి తమ పరువు పోతుందంటూ భయాందోళనలకు గురవుతూ బయటకు వచ్చి చిన్న చిన్న గొడవలను సృష్టిస్తూ కులమత కలహాలను రేపుతున్నారని ఆయన వాపోయారు. ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ తనకు ఆరువేల కోట్లు కేటాయించారని, దానిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రూ.2880కోట్లు మంజూరీ చేయించుకున్నాడని వీటిలో ఆయన శిష్యుడు పుట్ట మధు రూ.283కోట్లు మంథని నియోజకవర్గ అభివృద్ధికి తీసుకువచ్చాడని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని కాళేశ్వరం, సీతారామ, డిండీ, పోలవరం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

సామాజిక న్యాయమెక్కడ?



హైదరాబాద్,ఆంధ్రప్రభ : బంగారు తెలంగాణ అనే పేరుతో పాలకులు అవినీతి తెలంగాణగా మారుస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. అబద్దాలను ప్రచారం చేయడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం చంద్రశేఖర్‌రావు మించిపోతున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. మంగళవారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'తెలంగాణ సమగ్ర అభివృద్ధి- సామాజిక న్యాయం ' అనే పేరుతో సీపీఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సీపీఐ చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణంగా మద్దతిస్తామని పలువురు నేతలు వెల్లడించారు. ఈ సదస్సుకు సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీజేఏసీ చైర్మన్ కోదండరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, విమలక్కతో పాటు వామపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ బంగారు తెలంగాణలో ప్రజల సమస్యలు ఎందుకు ఉంటున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణ 60 ఏళ్ల పోరాట ఫలితాలను కేసీఆర్ కుటుంబమే అనుభవిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. ప్రపంచంలోనే కేసీఆర్‌లాంటి మోసగాడు ఉండరని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కేసీఆర్ విశ్వాకునిగా ఉంటున్నాడని ఆయన విమర్శించారు. రాష్ట్రలోని నియంత పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం వచ్చిందని నారాయణ పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం మౌనదీక్ష



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని ఇచ్చిన హామీని బీజేపీ నేతలు విస్మరించారని తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి ఆరోపించారు. షెడ్యూల్డ్ కులాలను ఏబీసీడీగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది మద్దతుదార్లతో కలిసి ఢిల్లీలో మౌనదీక్ష చేపట్టారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. సత్వరమే ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అడ్డు పెట్టుకొని వెంకయ్యా నాయుడు ఉప రాష్ట్రపతి బరిలో నిలిచారని రవి విమర్శించారు. ప్రధాని మోడీ మాదిగలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన తొలి అసెంబ్లీ సమావేశంలోనే సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని నేరుగా ప్రధానికి సమర్పించారని గుర్తు చేశారు. అయినా ఆయన స్పందించక పోవడం దళిత వ్యతిరేక విధానానికి నిదర్శనమని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు.

కార్పొరేషన్ రద్దు ప్రచారం అవాస్తవం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను రద్దు చేస్తున్నారంటూ పత్రికల్లో వస్తున్న కథనాలపై ఆ సంస్థ ఛైర్మన్ జూపూడి ప్రభాకర రావు మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థను మూసే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. దళితుల్లో గందరగోళం సృష్టించేందుకే కొన్ని పత్రికల్లో అవాస్తవ కథనాలు ప్రచురితం చేస్తున్నారంటూ జూపూడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ సంస్థ చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.2,713 కోట్ల బడ్జెట్ కేటాయించి 20 లక్షల దళిత కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలిగేలా వివిధ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

కాకతీయ టెక్స్‌టైల్ పార్కు

భూ సేకరణలో మినహాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు సేకరించే భూములు, చెల్లించే నష్టపరిహారం, బాధితులకు పునరావాసం కల్పించే నిబంధనలోని చాప్టర్ 2, 3ల నుంచి వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు మినహాయించారు. చాప్టర్-2 ప్రకారం పంట భూములు, చాప్టర్-3 ప్రకారం భూ యజమానుల అంగీకారం లేనప్పటికీ భూ సేకరణ చేయాలని స్పష్టంచేస్తున్నాయి. ఈ పార్కుకు సాధ్యమైనంత వరకు తక్కువ భూమిని సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్కు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రతిపాదించిన దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్కుకు భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు, పునరావాసంలో చాప్టర్ 2, 3ల నుంచి ప్రభుత్వం మినహాయించింది.

2034 వరకు ఆగాల్సిందే

•అసెంబ్లీ సీట్ల పెంపుకు తప్పని నిరీక్షణ •మరోసారి తేల్చి చెప్పిన కేంద్రం •లేదంటే రాజ్యాంగ సవరణ అనివార్యం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు అంశం సుదూర స్వప్నంగా మారింది. ఇప్పటికే తెలంగాణ సీఎం కే. చంద్రశేఖర రావుతో జరిగిన భేటీలో ప్రధాని నరేంద్ర మోడీయే స్వయంగా పెంపు లేదన్న సంకేతాలిచ్చారు. తాజాగా మంగళవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, మాగంటి మురళీ మోహన్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ సమాధానమిచ్చారు. రాజ్యాంగ సవరణ లేకుండా రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యమే కాదని తేల్చి చెప్పారు. రాజ్యాంగ సవరణతో సంబంధం లేకుండా సీట్లు పెంచాలంటే 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల వరకు ఆగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ లెక్కన 2031లో జరిగే జన గణన అనంతరం ఈ పెంపు జరుగుతుందని దానర్థం.

''ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సెక్షన్ 26(1) ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతమున్న 175 సీట్ల నుంచి 225 స్థానాలకు, తెలంగాణలో 119 సీట్ల నుంచి 150 స్థానాలకు పెంచాల్సి ఉంది. ఈ అంశంపై కసరత్తు చేపట్టిన న్యాయశాఖ, తొలుత అటార్నీ జనరల్ అభిప్రాయం కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3)ని సవరిస్తే తప్ప అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచడం కుదరదని అటార్నీ జనరల్ అభిప్రాయపడ్డారు. లేదంటే 2026 తర్వాత జరిగే తొలి జన గణన ఆధారంగా సీట్ల సంఖ్యను పెంచడం జరుగుతుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ సవరణ చేస్తే తప్ప సీట్ల సంఖ్య పెంచే ప్రసక్తే లేదు'' అని కేంద్ర హోంశాఖ ఇచ్చిన జవాబులో పేర్కొన్నారు.

రాజ్యాంగ సవరణ అయ్యే పనేనా?

అయితే విభజన చట్టంలో పేర్కొన్న హామీని అమలు చేయడానికి కేంద్రం రాజ్యాంగ సవరణ చేయలేదా అన్న ప్రశ్న ఏపీ తెలుగుదేశం నేతల నుంచి వ్యక్తమవుతోంది. రాజ్యాంగ సవరణకు ఉభయ సభల్లో రెండింట మూడొంతుల మెజారిటీ అవసరం. ఇప్పటికే సాధారణ మెజారిటీతో పాస్ చేసే బిల్లులకే రాజ్యసభలో మోక్షం లభించడం లేదు. ఇలాంటి పరిస్థితిలో మిగతా రాజకీయ పార్టీల మద్ధతు లేకుండా రాజ్యాంగ సవరణ సాధ్యం కాదు. మిగతా రాజకీయ పార్టీలు సైతం తమకు ప్రయోజనం కలిగించని చర్యకు మద్ధతిచ్చే అవకాశాలు చాలా తక్కువ. ఇప్పటికే సీట్ల పెంపు వల్ల సామాన్యులకు ఒరిగేది ఏముంది అని అటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ విమర్శిస్తున్నాయి. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, అలా తమ పార్టీలో చేరిన నేతలకు సీట్లు సర్దుబాటు చేయడం కోసమే సీట్లు పెంచాలని తెలుగుదేశం నేతలు కోరుతున్నారని వైకాపా నేతలు మండిపడుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రత్యేక హోదా, రైల్వే జోన్ వంటి అంశాలను వదిలేసి తమ పార్టీ ప్రయోజనాలు కాపాడుకోవడం కోసం సీట్ల పెంపు అడుగుతున్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం విమర్శిస్తున్నారు. ప్రతిపక్షాల విషయం పక్కన పెడితే, బీజేపీ నేతలే పెంపు కోసం తొందరేముందని అంటున్నారు. సొంత రాష్ట్రంలోనే ఈ పరిస్థితి ఉంటే, మిగతా రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు ఎంతమేర సహకరిస్తాయన్నది ఊహించుకోవచ్చు. పైపెచ్చు పనిలో పనిగా తమ రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ సీట్లు పెంచాలని పేచీపెట్టే అవకాశం కూడా ఉంటుంది.



ఇద్దరు సీఎంలు కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవాలి: మురళీ మోహన్, ఎంపీ

తన ప్రశ్నకు ప్రభుత్వమిచ్చిన సమాధానంపై తెలుగుదేశం పార్టీ ఎంపీ మాగంటి మురళీ మోహన్ కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంటులో మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ ''2026 తర్వాత జరిగే జనగణన అంటే 2031. ఆ గణాంకాల ప్రకారం పెంచినా, అవి 2034లో జరిగే ఎన్నికల్లో అమల్లోకి వస్తాయి. ఈలోపే సీట్లు పెంచాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రం చెబుతోందని, రాజ్యాంగ సవరణ కోసం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసికట్టుగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని మురళీమోహన్ అభిప్రాయపడ్డారు.

దిగొస్తున్న కూర'గాయాల'ధరలు!

•కిలో రూ.100 నుంచి రూ.50కి తగ్గిన టమాట •మిర్చితో పాటు మిగతా రకాల కూడా కాస్త అందుబాటులోకి •సాగు సంక్షోభ నివారణకు ప్రభుత్వ చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తీవ్రమైన కొరత కారణంగా ఊహించనంతగా పెరిగిపోయిన కొన్ని రకాల కూరగాయల ధరలు క్రమేపీ అదుపులోకి వస్తున్నాయి. నిత్యావసరాల్లో ప్రధానమైన టమాటోలు కిలో రూ.100 నుంచి రూ.50కి తగ్గాయి. సుమారుగా రెండు నెలల క్రితం కిలో రూ.60 వరకు పలికిన టమాటో ధర అనంతరం రూ.20 వరకు పడిపోయింది. జూలై మూడో వారం తర్వాత పచ్చిమిర్చితో పాటు టమాటోకు తీవ్రమైన కొరత తలెత్తింది. దీంతో ఒక్కసారిగా కిలో రూ.120కి చేరుకున్న పచ్చిమిర్చి ప్రస్తుతం రూ.60 వద్ద స్థిరపడింది. అదే సమయంలో ఉల్లిపాయల ధర మరోసారి పెరిగింది. మొన్నటివరకు కిలో రూ.10 నుంచి రూ.15 పలికిన ఉల్లి ప్రస్తుతం కిలో రూ.25కు చేరుకుంది. నాసిరకం ఉల్లిపాయలు కూడా కిలో రూ.20 దాటి పలుకుతున్నాయి. మిగతా అన్ని కూరగాయల ధరలు రూ.30 నుంచి రూ.50 మధ్య కొనసాగుతున్నాయి.

తగ్గుతున్న దిగుబడులే కారణం

వాతావరణం సమతుల్యత కోల్పోతున్న కారణంగా, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పాదకత సాధ్యంకావడంలేదు. అదేసమయంలో ప్రధానమైన కూరగాయలకు ఎన్ని ప్రయత్నాలు చేసినా కొరత తీర్చలేని పరిస్థితి నెలకొంటోంది.



ప్రతియేటా పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోతూ ఉంటే, ధరల అదుపుకు అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యలు కూడా నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. అందుకు తోడు మధ్య దళారీలు, హోల్‌సేల్ వ్యాపారులు ఇదే అదునుగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న కొన్ని రకాల కూరగాయలను అమాంతం ధర పెంచేస్తున్నారు. సందర్భాన్ని బట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. పండగ సందర్భాల్లో మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ విధానాలకు పాల్పడుతున్నారు.

పండగ సందర్భాల్లో దళారుల ప్రమేయం

కొరత నేపథ్యంలో పండగలు, ప్రత్యేక దినాలు వస్తే చాలు దళారుల ప్రమేయం పెరిగిపోతోంది. కొన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను అమాంతం పెంచేసి నిలువునా దోచుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఎన్ని నిధులు ఖర్చుచేసినా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు న్యాయం జరుగడంలేదు. అదే సమయంలో తరతరాలుగా వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతున్న బడుగు రైతు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మందగిస్తున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఎంత కష్టపడినా అన్నదాతలకు మూడుపూటలా తిండి దొరకడం కూడా గగనమైపోతోంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఇక నిత్యావసర సరుకుల ధరలు తగ్గుతాయన్న నమ్మకం కలుగడంలేదు. సమీప భవిష్యత్తులో ధరల అదుపు సర్కారుకు సైతం చేదాటిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవాలను గుర్తించిన ప్రభుత్వం సాగు కొరత నివారణ చర్యలు చేపట్టింది.

ప్రస్తుతం మార్కెట్లో పెరిగిన వివిధ రకాల కూరగాయల ధరలు సరాసరిగా ఇలా ఉన్నాయి.

రకం	ధర రూ.		
టమాటో	50	పచ్చిమిర్చి	60
వంకాయ	40	బీన్స్	50
బెండకాయ	50	కీరా	30
దొండకాయ	40	బీట్‌రూట్	60
కాకరకాయ	40	క్యాప్సికమ్	45
బీరకాయ	50	క్యాబేజీ	30
చిక్కుడు	50	కందగడ్డ	50
గోరుచిక్కుడు	40	ఆలుగడ్డ	30
		సొరకాయ	15 (ఒకటి)
		పొట్లకాయ	15 (ఒకటి)

ఆగస్టు 15లోపు అనాథ బాలలు ప్రవేశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని అనాథ బాలలు, అణచివేతకు గురైన బాలలను అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చేర్పించే ప్రక్రియను ఆగస్టు 15 లోపు పూర్తి చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీరి కోసం ప్రత్యేకంగా జిల్లాకొక యుఆర్ఎస్ స్కూల్‌ను ప్రారంభించనున్నారు. ఇప్పటికే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం విద్యా శాఖ తరపున వీటిని పర్యవేక్షించనుంది. మంగళవారం వీటిలో ప్రవేశాల కోసం విద్యశాఖతోపాటు హోం, రెవిన్యూ, మహిళా,శిశు సంక్షేమ శాఖలతో విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య సమీక్షనిర్వహించింది. ఈ సమావేశం అనంతరం అన్ని జిల్లాల్లోనూ పోలీసులు, రెవిన్యూ, విద్యాశాఖ, శిశు సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో ఈ స్కూల్స్‌లో విద్యార్థులను చేర్పించనున్నారు. కేవలం అబ్బాయిలను మాత్రమే వీటిలో చేర్పిస్తారు. అనాథలుగా మారిన వారి వివరాలు ఇప్పటికే పోలీసు శాఖ దగ్గర ఉండటంతో వాటి ఆధారంగా విద్యార్థుల ప్రవేశాలను చేపట్టనున్నారు.

కార్పొరేట్ స్కూళ్ళ గ్రేడింగ్ తపన

•ఎస్ఎస్‌సీ రీవెరిఫికేషన్‌లో 80శాతం దరఖాస్తులు కార్పొరేట్ స్కూల్ విద్యార్థులవే •మొత్తం దరఖాస్తుల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలవి 60 నుంచి 70శాతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కార్పొరేట్ పాఠశాలలు తమ విద్యార్థులకు గ్రేడ్ పాయింట్ యావరేజ్(జిపిఏ) 10కి 10 రావడం కోసం ఎంతో తాప్రతయ పడుతున్నాయి. వార్షిక పరీక్షలు ముగిసిన తరువాత కూడా గ్రేడింగ్ కోసం తంటాలు పడుతున్నాయి. గ్రేడింగ్ పెంచుకోవడం కోసం వార్షిక పరీక్షలు ముగిసిన తరువాత రీవెరిఫికేషన్ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను యాజమాన్యాలే పెట్టిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తమ స్కూల్ నుంచి జిపిఏ 10కి 10 వచ్చిన వారి సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పించుకోవడానికి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులను చేయిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. జిపిఏ పేరు చెప్పి వారి స్కూల్స్‌లో ప్రవేశాలు ఎక్కువ పొందడం కోసం ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు ఘాటుగా విమర్శిస్తున్నాయి. కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు అయితే వారి స్కూల్ విద్యార్థులకు జిపిఏ 10కి 10 వచ్చిన విద్యార్థుల సంఖ్య పదుల్లో ఉంటే వందల్లో వచ్చినట్టు వార్షిక ఫలితాలు వచ్చిన సందర్భంలో ప్రచారం చేసుకుంటున్నాయి.

దరఖాస్తుల్లో 80 శాతం కార్పొరేట్ విద్యార్థులవే

గత రెండు సంవత్సరాలుగా రీవెరిఫికేషన్‌కు వచ్చిన దరఖాస్తుల్లో 80 శాతం ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులవే ఉన్నాయి. గత ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల దరఖాస్తులు రీవెరిఫికేషన్ కోసం రాగా వాటిలో 16000పైగా కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులవే ఉన్నాయి. ఈ ఏడాదిలో 18000 దరఖాస్తులు రాగా వాటిలో సైతం సుమారు 15000 పైగా దరఖాస్తులు కార్పొరేట్ స్కూల్స్ నుంచి వచ్చినవే ఉన్నట్టు సమాచారం.

హైదరాబాద్, రంగారెడ్డి నుంచి ఎక్కువ దరఖాస్తులు

రీవెరిఫికేషన్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో 60 నుంచి 70 శాతం దరఖాస్తులు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే వస్తున్నాయి. కార్పొరేట్ స్కూల్స్ ప్రధానంగా ఈ రెండు జిల్లాల్లోనే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ రెండు జిల్లాల నుంచే రీవెరిఫికేషన్ దరఖాస్తుల్లో ఎక్కువ శాతం వస్తున్నాయి.



జిపిఏ 9.8 వచ్చిన వారు కూడా దరఖాస్తు

వార్షిక పరీక్షల్లో జిపిఏ 9.8 వచ్చిన వారు కూడా రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. వారికి ఒక మార్కు కలిసినా వారి జిపిఏ గ్రేడ్ మారుతుంది. అది కాస్త విద్యార్థికి ఉపయోగపడుతుందని కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. రీవెరిఫికేషన్‌లో తరువాత కూడా కొందరు విద్యార్థులు పిటిషన్లు సైతం పెడుతున్నట్టు తెలుస్తోంది. రీవెరిఫికేషన్ సందర్భంగా విద్యార్థులకు జవాబు పత్రాల నకళ్లను ఇస్తారు వాటిలో సంబంధిత సబ్జెక్టులకు సంబంధించి వారికి తక్కువ మార్కులు వేసినట్టు గుర్తించిన విద్యార్థులు దానిని సైతం ప్రశ్నిస్తూ పిటిషన్లు పెడుతున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం వీటికి అవకాశం కల్పించిన నేపథ్యంలో విద్యార్థులు వీటిని కూడా ఉపయోగించుకుంటున్నారు. అయితే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వీటిపై అంతగా అవగాహన లేకపోయినప్పటికీ కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యం వారికి అవగాహన కల్పించి వారితో ఇలా చేయిస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. జిపిఏ కోసమే ఇలా వ్యవహరిస్తున్నాయని తెలుస్తోంది.

ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు తక్కువ

ప్రభుత్వ స్కూల్స్‌లో చదివిన విద్యార్థుల నుంచి రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తులు రావడం లేదు. ఒకవేళ దరఖాస్తులు వస్తే వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోతేనే దరఖాస్తులు చేస్తున్నారు. ఒక మార్కుతో ఫెయిల్ అయిన వారు రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటున్నట్టు సమాచారం. అంతే గానీ జిపిఏ పెంచుకోవడం కోసం ఎటువంటి దరఖాస్తులు రావడం లేదు.

ఎంసెట్ బైపీసీ సీట్ల కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎంసెట్ బైపీసీ విద్యార్థుకు బీ ఫార్మసీ, ఫార్మా డీలో సీట్ల కేటాయింపును పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 నుంచి 29 వరకు విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీల జరిగింది. 13,176 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాగా వారిలో 12,250 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. రాష్ట్రంలో బీ ఫార్మసీలో 6264 సీట్లు ఉండగా వాటిలో అన్ని సీట్లను కేటాయించారు. ఫార్మా డీలో 1061 సీట్లను, బయో టెక్నాలజీలో 42 సీట్లు ఉండగా వాటిలో 42 సీట్లను కేటాయించారు. మొత్తంగా రాష్ట్రంలో ఉన్న 7367 సీట్లకు 7367 సీట్లను మంగళవారం కేటాయించారు. సీట్లు పొందిన వారు 2 నుంచి 7 వరకు ఫీజులను చెల్లించి 9లోపు కాలేజీల్లో చేరాలని అడ్మిషన్ల ప్రక్రియ కన్వీనర్ వాణి ప్రసాద్ తెలిపారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గడువును పొడిగిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. జూలై 31 వరకు ప్రవేశాల కోసం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పొడిగిస్తూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలను ఆగస్టు 10 వరకు తీసుకోవడానికి అవకాశం కల్పించినట్టు బోర్డు కార్యదర్శి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

అపెక్స్ కమిటీ ముందు ఉంచారా?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించిన బీ ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా హత్య, కేసులో దర్యాప్తు సక్రమంగా నిర్వహించని బాధ్యులైన అధికారులపై చట్ట ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు వీలుగా ఈ వ్యవహారాన్ని అపెక్స్ కమిటీ ముందుంచారా?, లేదా ?, ఉంచితే ఆ కమిటీ ఇంత వరకు ఏమి చేసిందో ? వివరాలు సమర్పించాలని ఏపీ హోంశాఖను హైకోర్టు ఆదేశించింది. ఒకవేళ ఆ కమిటీ కి నివేదించకపోతే అందుకు గల కారణాలేమిటో తెలపాలని హైకోర్టు తేల్చి చెప్పింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 8కి వాయిదా వేసింది. అయేషా మీరా హత్యకేసులో పిడతల సత్యం బాబును నిర్దోషి అని పేర్కొంటూ ఈ ఏడాది మార్చి 31న హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ..అసలు దోషులను శిక్షించేందుకు ఈ కేసుపై పునర్ దర్యాప్తు జరిపేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఉస్మానియా వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ రమా ఎస్.మేల్కోటే, పాత్రికేయురాలు కె.సజయ, సామాజిక ఉద్యమకారిణి సంధ్యారాణి .వల్లూరుపల్లి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాది వసుధా నాగరాజ్ వాదనలు వినిపిస్తూ ..సత్యంబాబును నిర్దోషిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పులో దర్యాప్తు జరిపిన తీరు ఆక్షేపణీయమన్నారు. ఈ కేసు విషయంలో దర్యాప్తును సక్రమంగా నిర్వహించని బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు అపెక్స్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ వ్యవహారాన్ని అపెక్స్ కమిటీ ముందుంచాలని హైకోర్టు తన తీర్పులో పేర్కొందన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ..అపెక్స్ కమిటీ కి సమర్పించారా.లేదా, తదితర వివరాలను సమర్పించాలని ఏపీ హోంశాఖ తరపు ప్రభుత్వ న్యాయవాది పద్మావతిని ఆదేశించింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

పరిహారం వివరాలివ్వండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతుల భూముల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్ లైన్ల వ్యవహారంలో పరిహారం చెల్లించే విషయంపై వివరాలు సమర్పించాలని ఉమ్మడి హైకోర్టు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులైన రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యుత్ నియంత్రణ మండళ్లను, వివిధ విద్యుత్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. రైతుల భూముల్లో విద్యుత్ టవర్లు, లైన్ల ఏర్పాటు చేస్తున్నా రైతులకు మాత్రం పరిహారం చెల్లించడం లేదని పేర్కొంటూ కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ (సీఐఎఫ్ఏ) ప్రధాన సలహాదారు పి.చంగల్ రెడ్డి రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి స్వీకరించిన విషయం తెలిసిందే.

345 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు

టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వైద్య, ఆరోగ్య శాఖలో 345 పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 274 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 65 మంది ట్యూటర్లు, లెక్చరర్ రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో 6 పోస్టులు మంజూరు చేశారు.

వీటి భర్తీ కోసం సంబంధించిన పూర్తి రిజర్వేషన్లవివరాలను ప్రకటించింది. వీటికి సంబంధించిన నియామకాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయనున్నారు.

తిరుమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

తిరుమల, కెఎన్ఎన్ : తిరుమల మొదటి ఘాట్‌లో ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈప్రమాదంలో పలువురు భక్తులు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలావున్నాయి. తెలంగాణకు చెందిన భక్తులు తిరుమల శ్రీవారి దర్శనాది కార్యక్రమాలు ముగించుకుని మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మొదటి ఘాట్‌లో ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనం 33 వ మలుపు వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఓ వ్యక్తి తీవ్రంగానూ, నలుగురికి స్వల్పంగా గాయపడ్డారు

.ఈ సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

వార్తాపత్రికలకు మొబైల్ యాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వార్తాపత్రికలన్నింటినీ ఒకే వేదికపై అందించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రారంభించినట్టు యాప్ సీఈఓ జెవి కార్తీక్ వెల్లడించారు. పేపర్‌బాయ్ పేరుతో నిర్వహిస్తున్న ఈ యాప్ రోజువారి దినపత్రికలు చూడలేదన్న లోటును తీరుస్తుందన్నారు.ఈ యాప్ రూపకల్పనకు 15నెలలపాటు అకుంఠిత దీక్షతో శ్రమించినట్టు తెలిపారు.స్థానిక భాషల్లోని వార్తాపత్రికలు, మాగజైన్లను ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కార్తీక్ ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పీఎంకేఎస్‌వై అమలుకు రూ.138 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) పథకం అమలుకు తెలంగాణ ప్రభుత్వం రూ.138 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ సహకార శాఖ కార్యదర్శి సి.పార్థసారథి జీవో విడుదల చేశారు.

ట్రాన్స్‌కోకు రూ.27కోట్లు విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ఇంధనశాఖ టీఎస్ ట్రాన్స్‌కోకు రూ.27.96కోట్లు విడుదల చేసింది. సబ్సిడీల కింద ఈ మొత్తాన్ని విడుదల చేసింది. 2015-16కుగాను ట్రాన్స్‌కోకు విద్యుత్ సరఫరా చేసిన బయోమాస్ విద్యుత్ అభివృద్ధి సంస్థల బకాయిలకు ఈ మొత్తాన్ని చెల్లించనున్నారు.

డ్రగ్స్ విచారణ తొలి ఘట్టం పూర్తి

నందుపై సిట్ ప్రశ్నల వర్షం

- సినీ ప్రముఖులను రెండు వారాలపాటు విచారించిన సిట్
- 12 మందిని 91 గంటల పాటు విచారణ
- కెల్విన్, జిషన్‌లతో సంబంధాలపై ఆరా
- రెండో లిస్టు ఉన్నట్టా? లేనట్టా?
- అబ్కారీ కార్యాలయం వద్ద మీడియా పాయింట్ ఎత్తివేత
- ఇకపై విచారణ అంతా గోప్యమేనట...?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాల్విన్, జిషన్‌లతో సంబంధాలు? నవదీప్ పబ్‌కు వెళతారా? మీకు డ్రగ్స్ అలవాటుందా? పరిశ్రమలో డ్రగ్స్ సరఫరాదారులెవరు? వంటి ప్రశ్నలతో గాయని గీతామాధురి భర్త యువ నటుడు నందును ఎక్సైజ్ సిట్ ఉక్కిరి బిక్కిరి చేసినట్లు తెలుస్తోంది. డ్రగ్స్ కేసులో నోటీసులు అందుకున్న సినీ ప్రముఖుల్లో చివరివాడైన నందు తన తండ్రి, మేనమామతో కలిసి సిట్ కార్యాలయానికి మంగళవారం హాజ రయ్యాడు. నందును మూడు గంటల పాటు ఎక్సైజ్ సిట్ విచారించింది. మంగళవారం సిట్ విచారణకు హాజరయ్యే ముందు ఆలయంలో పూజలు నిర్వహించి వచ్చినట్లు సమాచారం. ఇప్ప టివరకు ఎక్సైజ్ సిట్ విచారించిన వారిలో అతి తక్కువ సమయం విచారణతో బయటపడ్డ నటుడు నందుయే కావడం గమనార్హం. విచారణకు హాజరైన సమయంలోనూ.. వెళ్లిపోయే సమ యంలోనూ నందు ఉల్లాసం, ఉత్తేజంతో కనిపించారు. ఎక్సైజ్ సిట్ అడిగిన పలు ప్రశ్నలకు తనకేం తెలియదని సమాధానమిచ్చినట్లు సమాచారం.

కొన్ని ప్రశ్నలకు మాత్రమే నిక్కచ్చిగా నందు సమాధానం చెప్పాడని సమాచారం. మిగతా సమాధానాలన్నింటికీ ఆచితూచి స్పందించినట్లు తెలుస్తోంది. నందుతో సినీ ప్రము ఖుల విచారణ ముగిసింది. దీంతో గత రెండు వారాలుగా జరిగిన సినీ స్టార్స్ విచా రణపై ఎక్సైజ్ సిట్ వివరణ ఇచ్చే అవకాశం వుందని అంతా భావించారు. అలాంటిదీ ఏమీ జరుగకపోగా అక్కడి మీడియా పాయింట్‌ని సైతం ఎత్తేశారు. ఈ కేసులో ఇప్పటివరకూ ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కెల్విన్, జిషన్, మైక్ కమింగాలతో సహా మొత్తం 20 మందిని అరెస్ట్ చేసిన అధికారులు త్వరలో వారిపై ఛార్జి షీట్ వేసేందుకు రంగం సిద్ధం చేస్తు న్నారు. ఇప్పటివరకూ 12మంది(యువ నటుడు నందుతో సహా) సినీ ప్రముఖులను దాదాపు 91 గంటల పాటు విచారించిన సిట్, అరెస్టయిన నిందితులకు డ్రగ్స్ దందాపై పై స్థాయిలో వున్న లింకులను ఛేదిం చలేకపోయిందని తెలుస్తోంది. విచారణను ఎదు ర్కొన్న వారిలో ఇద్దరు సినీ ప్రముఖుల అరెస్ట్ తప్పదంటూ వార్తలు వచ్చినప్పటికీ.. వారు కూడా తప్పించుకున్నట్లేనని సమాచారం. వీరందరినీ సాక్షులుగా పేర్కొనే అవకాశాలు ఉన్నట్లు సిట్ వర్గాలు వెల్ల డించాయి. కాగా, కేసులో మొత్తం 29 మం దిని ఎక్సైజ్ సిట్ విచారించగా ఆ 29 మందిని సాక్షులుగా చేర్చాలని ఎక్సైజ్ సిట్ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.




డ్రగ్స్ వ్యవహారంలో మరోసారి తనదైన శైలిలో స్పందించారు వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్‌వర్మ. డ్రగ్స్ కేసులో సినీ నటులు, దర్శకులకు నోటీసులు జారీ చేసిన నాటి నుంచి ఎక్సైజ్ శాఖ, సిట్‌పై ఆరోపణలు చేస్తున్న వర్మ..

మరోసారి వర్మ సంచలన వ్యాఖ్యలు

తాజాగా సినీ ప్రముఖులపై చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. ఇటీవల నిర్వహించిన యాంటీ డ్రగ్స్ ర్యాలీ (డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ)కి ఒకరిద్దరు మినహా సినీ ప్రముఖులు ఎవరూ పెద్దగా హాజరు కాలేదు. దీంతో వారినుద్దేశించి వర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యాంటీ డ్రగ్స్ ర్యాలీకి హాజరు కాని సినీ ప్రముఖులు ఏదో ఒక రూపంలో డ్రగ్స్‌కు కనెక్ట్ అయ్యారా? అనే సందేహాన్ని వర్మ వ్యక్తపరిచారు.

రెండో లిస్టు ఉన్నట్టా? లేనట్టా??

ఆద్యంతం ఆసక్తి రేపిన డ్రగ్స్ కేసులో యువ నటుడు నందు విచారణతో తొలి అంకం పూర్తయింది. అయితే, ఈ కేసులో రెండో లిస్టు సిద్ధమైందని, ఆ లిస్టులో సైతం కొందరు సినీ ప్రముఖులు ఉన్నారన్న వార్తలు వెలువడ్డాయి. భావి భారత పౌరులైన 8,9వ తరగతి చదివే పాఠశాల విద్యార్థులలో కొందరు విద్యార్థులనుసైతం డ్రగ్స్‌కు బానిసలుగా చేసిన వైనం ప్రతి ఒక్కరినీ కలిచి వేసింది.సినీ రంగాన్నే టార్గెట్ చేయడమేంటి? అనే ఆరో పణలు ఒక్కసారిగా వెల్లువెత్తాయి. తాము ఏ వర్గాన్ని టార్గెట్ చేయడం లేదని, కేసులో ప్రమేయముందనుకుంటున్న అన్ని వర్గాలను విచారిస్తున్నామని ఆనక స్పష్టం చేశారు. ప్రధానంగా నటి ఛార్మి విచారణ సందర్భంగా పోలీసులకు పట్టుబడ్డ మైక్ కమింగా నుంచి ప్రధానంగా సినీ రంగానికి సంబంధించి.. ఇతర రంగాలకు సంబంధించి డ్రగ్స్ వాడే వారి జాబితా ఎక్సైజ్ సిట్ సేకరించిందని సమాచారం. కమింగా సమాచారంతో టాలీవుడ్‌లో పెద్దలు వణికిపోయారని తెలుస్తోంది. ఇదే క్రమంలో మరోవైపు ఎక్సైజ్ సిట్‌కు కూడా ఒత్తిడి తీవ్రమైందని సమాచారం. నటి ఛార్మి విచారణ ఎదుర్కొనే రోజు కంటే ఒక రోజు ముందు ఎక్సైజ్ సిట్ విచారణ సక్రమంగా లేదంటూ హైకోర్టులో రిట్ వేసింది. ఇదే క్రమంలో తన అనుమతి లేకుండా తన బ్లడ్ శాంపిల్స్ తీసుకోకూడదని స్పష్టంచేస్తూ కోర్టుకు అందజేసిన పిటిషన్‌లో పేర్కొంది. ఈ దందాలో విపక్షాలు ఏకంగా ప్రభుత్వంలోని పెద్దల అండదండలున్నాయన్న వాదనను తెరపైకి తీసు కొచ్చారు. అప్పటిదాకా మాంఛి స్పీడు ముందున్న ఎక్సైజ్ సిట్ దర్యాప్తుకు ఒత్తిడుల పరంపర కొనసాగినట్లు తెలుస్తోంది. సినీ ప్రముఖులలో చివరివాడైన యువనటుడు నందు విచారణ పూర్తయిన వెంటనే నోటీసులందజేయనున్న రెండో లిస్టును విడు దల చేయాలని ఎక్సైజ్ సిట్ భావించింది. అయితే వరుస పరిణామాల నేపథ్యంలో మరోవైపు డ్రగ్స్ వాడకం దారులంతా బాధితులుగానే చూడాలని ప్రభు త్వం స్పష్టం చేసిన దరిమిలా.. ఇతరత్రా ఒత్తిడి కారణాలతో సెకండ్ లిస్టు ఉంటుం దా? ఉండ దా? అన్న అనుమానాలకు బలం చేకూరినట్లైంది. అందుకు అనుగుణంగానే నందు విచారణను చిత్రం ఎక్సైజ్ సిట్ మూడు గంటల్లో ముగించడం గమనార్హం. అయితే తీవ్ర ఒత్తిడి నేపథ్యంలో సిట్ అధికారులు విచారణను ఇక్కడితో ముగుస్తారా? ఇంకా కొనసాగిస్తారా? అన్నది తేలాల్సి ఉంది. మొదటి దశలో విచారించిన వారం దరీ వాంగ్మూలాన్ని చార్జిషీట్‌లో ఉంచుతామని అధికారులు మీడియాకు వివ రించారు. కేసు ఎఫ్ఐఆర్, నిందితుల అరెస్ట్ అనంతరం 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేసే అవకాశముంటుంది. అయితే అధికారులు ఎప్పుడు చార్జిషీట్ దాఖలు చేస్తారన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు. ఇదిలా ఉండగా, ఇకపై నోటీసు లిచ్చేవారందర్నీ గోప్యంగా విచారించాలన్న యోచనలో సిట్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, రెండో లిస్టు విడుదలవుతుందా? లేదా? అన్న విషయంలో మాత్రం ఎక్సైజ్ సిట్ వద్ద క్లారిటీ లేకపోవడం గమనార్హం. ఏతావాతా సిట్ విచా రణ ఆసాంతం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా సాగిందనేది పలువురి భావనగా ఉంది.



తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపిన డ్రగ్స్ దందాలో సిట్ విచారణ తీరు పట్ల తనకెన్నో అభ్యంతరాలు ఉన్నాయని దర్శకుడు పీసీ ఆదిత్య అన్నాడు. ప్రధాన నిందితుడు కాల్విన్ సెల్ ఫోన్‌లో 248 కాంటాక్టు నెంబర్లుండగా, కేవలం 12 మందిని, అది కూడా సినీ

సినీ రంగాన్నే టార్గెట్ చేశారు: దర్శకుడు పీసీ ఆదిత్య

ప్రముఖులనే మాత్రమే సిట్ విచారించడాన్ని తప్పుబట్టిన ఆయన, ఈ విచారణను ఎదుర్కొన్న వారి కుటుంబసభ్యుల్లో ఎంతో మానసిక క్షోభ ఉందని అన్నారు. తన తదుపరి చిత్రం డ్రగ్స్‌కు బానిసలుగా మారిన యువతను బయటపడేయటమెలా? అనే ఇతివృత్తంతో ఉంటుందని తెలిపారు.

డ్రగ్స్ వినియోగ నియంత్రణపై నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీల బోధనా సిబ్బందికి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) నిర్వహించనుంది. ప్రివెన్షన్ ఆఫ్ డ్రగ్ అబ్యూజ్ నినాదంతో 2, 3, 4 తేదీలలో ఆస్కీ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ పీఆర్‌వో డాక్టర్

డ్రగ్ నియంత్రణపై కాలేజీల్లో అవగాహన తరగతులు

- ఆస్కీ పీఆర్‌వో డాక్టర్ ఎస్. రాము

ఎస్.రాము తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్రీయ ఉచితార్ శిక్షా అభియాన్ సహకారం అందిస్తుండగా, ఆస్కీ సెంటర్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. డ్రగ్ వినియోగ నియంత్రణపై కళాశాల విద్య కమిషరేట్ కీలకంగా వ్యవహరి స్తుందని, ఈ అవగాహన కార్యక్రమం చేపట్టడం ఆస్కీకి ఒక అవకాశంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రముఖ శాస్త్రవేత్త భార్గవ్ కన్నుమూత



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పీఎం భార్గవ (89) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. భార్గవకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి మనోరమ ఏడాది క్రితమే మృతి చెందారు. భార్గవ భౌతికకాయాన్ని ఉప్పల్‌లోని ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఉంచారు. 1928, ఫిబ్రవరి 22న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జన్మించిన ఆయన 22 ఏళ్ళకే సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన అందించిన సేవలకుగానూ 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. డాక్టర్ పీఎం భార్గవ ప్రజాస్వామ్యం, లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం నిబద్ధతో పోరు సలిపిన శాస్త్రవేత్తల్లో ప్రముఖుడు. అమెరికన్ సామ్రాజ్యవాదులు ఇరాక్‌పై దాడిచేసినపుడు భార్గవ నేతృత్వంలోని వంద మందికిపైగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేక కమిటీని ఏర్పాటుచేసి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అమెరికా సామ్రాజ్యవాదం, మతోన్మాదికి వ్యతిరేకంగా ఆయన తన భావాలను నిర్మోమహటంగా వ్యక్తీకరించేవారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమించారు. జ్యోతిష్యం శాస్త్రం కాదంటూ ఆయన నిలదీశారు. 2001, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన ఎఐటియూసీ జాతీయ మహాసభల సందర్భాన్ని పురస్కరించుకుని విద్య కాషాయికరణ అన్న అంశంపై నిర్వహించిన సదస్సులో ప్రధానవక్తగా ప్రసంగించారు. హోమియో వైద్యంలో శాస్త్రీయత లేదని ఆయన వ్యాఖ్యానించడంతో ఆ రంగానికి చెందిన ప్రముఖులు ఆయనను తీవ్రంగా తప్పుబట్టారు. అయినా ఆయన ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన వాదనికి కట్టుబడి శాస్త్రీయపరంగా వైద్యం లేదన్నారు. భార్గవ మరణవార్త తెలుసుకున్న సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, మాజీ డైరెక్టర్లు మోహన్‌రావు, లాల్‌జీ సింగ్, పలువురు శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అభిమానులు ఆయన నివాసానికి వచ్చి పార్థివదేహానికి నివాళులర్పించారు.

గురుకుల పోస్టుల వివాదం...

సర్కారుకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించినవేనన్నారు. పైగా ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉందన్నారు. తెలంగాణ అడ్వకేట్ జనరల్ వాదనలు విన్న అనంతరం ధర్మాసనం సింగిల్ జడ్జి జారీ చేసిన స్టే ఉత్తర్వులను ఎత్తివేసింది.. అయితే పరీక్ష తుది ఫలితాలు మాత్రం కోర్టు వెలువరించే తుది తీర్పుకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది. తెలంగాణ సర్కారు జారీ చేసిన జీవో 1274 ప్రకారం గురుకుల విద్యాసంస్థల్లో వివిధ పోస్టులను మహిళా అభ్యర్థులతో భర్తీ చేసే ప్రక్రియపై తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల (స్టే) చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్ పీఎస్ సీ)కార్యదర్శి, తెలంగాణ సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సంఘాల కార్యదర్శులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్.రామచంద్ర రావు ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ చేపట్టి , ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సాధారణ పరిపాలనా శాఖ 2016 జూన్ 4న జారీ చేసిన జీవో 1274 చట్టబద్ధతను సవాలు చేస్తూ వరంగల్ జిల్లా నగరం గ్రామానికి చెందిన కె.సత్యనారాయణ, మరొకరు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

డీఎల్ అర్హతపై స్టే ఎత్తివేత


- 1274 జీవోపై కొనసాగుతున్న స్టే

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గురుకులాల పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల నియామకాలకు మహిళలకే అవకాశం ఇవ్వడంపై విధించిన స్టేను ఉమ్మడి హైకోర్టు మంగళవారం ఎత్తేసింది. డిగ్రీ లెక్చరర్లుగా కేవలం మహిళలకే అవకాశం ఇవ్వ డంపై నిరుద్యోగులు కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ప్రభు త్వం కోర్టుకు ఇచ్చిన వివరణతో కోర్టు మంగళవారం స్టేను ఎత్తేస్తున్నట్టు ప్రకటిం చింది. ఈ నేపథ్యంలో కోర్టు పరీక్ష జరగాల్సిన జూలై 30వ తేదికి ముందు స్టే విధిం చింది. జూలై 30న జరిగాల్సిన పరీక్షను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వాయిదా వేసింది. హైకోర్టు స్టేను తొలగించిన నేపథ్యంలో డీఎల్ పరీక్షను నిర్వహించడానికి అవకాశం ఏర్పడింది. అయితే పరీక్ష ఎప్పుడు ఉంటుందనేది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించాల్సి ఉంది. అయితే గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ నియామక పరీక్షల కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 1274పై స్టే కొనసాగుతోంది.

పోలీసుల తీరు అమానుషం: ఉత్తమ్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాజన్న సిరిసిల్ల నియోజకవర్గంలో 5 మంది దళి తులు, ముగ్గురు బీసీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత అమానుషంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌తో పాటు తాము కూడా జైలుకు వెళ్లామని, ఎస్పీ విశ్వజిత్ నేతృత్వం లో పోలీసులు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. అసలు మనం భారత్‌లో ఉన్నామా ? ఎక్కడో అనాగరిక దేశంలో ఉన్నామా అని అనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని, రాజ్యహింస పేట్రెగిపోతోందని ఆరోపించారు. దళితులను అణగదొక్కేందుకే కేసీఆర్ సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచిన బాల్కసుమన్ రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని మల్లురవి సూచించారు.

నేరెళ్ల బాధితులకు లక్ష్మణ్, వరవరరావు పరామర్శ



కరీంనగర్, కెఎన్ఎన్ బ్యూరో : కరీంనగర్ జైల్లో ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల బాధితులను మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, విరసం నేత వరవరరావులు వేర్వేరుగా పరామర్శించారు. ములాఖత్ ద్వారా బాధితులను కలుసుకున్న వీరు వారి ఒంటిపై ఉన్న గాయాలను చూసి చలించిపోయారు. ఈ ఘ టనలో బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. ఈ ఘటనలో పోలీసుల తీరును తీవ్రంగా ఖండించిన ఆయన ప్రభుత్వం ఇప్పటికైనా ఘటనకు కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, బాధితులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోకుంటే ప్రజాపోరా టాలతోపాటు న్యాయపోరాటం చేస్తామని అన్నారు. సాయంత్రం కరీంనగర్ జైల్‌లో నేరెళ్ల బాధితులను పరామర్శించిన తరువాత విలేకరులతో విరసం నేత వరవరరావు మాట్లాడుతూ దోషులను బాధితులను చేశారని, బాధితులను దోషు లు చేశారని, ఇసుక మాఫియాపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై న్యాయవిచారణ జరపాలని, ఇసుకమాఫియా ఆస్తులు వేలం వేసి బాధితులకు పరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ పతనం సంజయ్‌గాంధీతో ఎలా ఆరంభమైందో కేసీఆర్ పతనం ఆయన కుమారుడు మం త్రి కేటీఆర్‌తో ప్రారంభమైందని, నేరెళ్ల నుంచి ప్రభుత్వ పతనం ప్రారంభమైం దన్నారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని అన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా కుంతియా

(మొదటిపేజీ తరువాయి)

కె జానారెడ్డి, మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్, సీఎల్పీ ఉప నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరులతో కూడా సత్సంబంధాలు ఉన్నాయి. నాయకులను సమన్వయ పరుస్తారని నమ్మడంతో పాటు అధిష్టానం నమ్మినబంటు అయినందున ఆయన్ను పార్టీ పెద్ద బాధ్యతలను అప్పగించిందని పార్టీ వర్గాలు తెలి పాయి. డాక్టర్ కుంతియాకు సహకారం అందిచేందుకు కార్యదర్శిగా నియమితులైన సతీష్ జార్కిహోలి కర్నాటకకు చెందిన వారు. బెల్గాం జిల్లా యెంకన్నమర్ది నియోజక వర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రస్తుతం కర్నాటక రాష్ట్ర చిన్నతరహాపరిశ్రమల మంత్రి గా కూడా ఉన్నారు. యువకుడైనందున ఆయనకు పార్టీ బాధ్య తలు ఇచ్చింది. 55 ఏళ్ల జార్కిహోలి చురుకైన వ్యక్తిగా పేరుంది. సమస్యలను పరిష్క రించడంలో చొరవ చూపుతారు. ప్రస్తుతం ఎఐసీసీ కార్యదర్శి హోదాలో ఉన్నారు. రాష్ట్ర పార్టీ నాయక త్వానికి దిశ, దశ నిర్దేశించ డంలో ఆయన సహకారం తోడవుతుందని భావించి కార్యదర్శిగా నియమించారని సమాచారం.

ఆరునెలల పాటు పాదయాత్ర

రెండు సార్లు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా పని చేసిన దిగ్విజయ్ సింగ్ సొంత రాష్ట్రంపై దృష్టిసారించారు. పదేళ్ల పాటు మధ్యప్రదేశ్ సీఎంగా ఉన్న దిగ్విజయ్ తన హయాంలో అనే క సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ స్వరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలవలేకపోయింది. అందువల్ల స్వరాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో దిగ్విజయ్ సింగ్ తన సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో సెప్టెం బర్ నెలలో మహాపాదయాత్ర చేపట్టనున్నారు. ఆరు నెలల పాటు దాదాపు 3,500 కిలోమీటర్లు పాదయాత్ర జరపాలని నిర్ణయించారు. తాను పాదయాత్ర చేపడు తున్నందున బాధ్యతల నుంచి నెలరోజుల క్రితమే దిగ్విజయ్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీ అనుమతి కోరారు. అన్నీ ఆలోచించిన అధిష్టానం దిగ్విజయ్ పాద యాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాదయాత్రకు ముందు కనీసం నెలరోజులైన విరా మం ఉండాలని భావిస్తున్నందున నెలరోజుల ముందే రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ బాధ్యతల నుంచి ఆయన్ను తప్పించినట్లు తెలిసింది. పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చా క పాదయాత్రకు దిగ్విజయ్ రూపకల్పన చేశారు.

పార్టీని ఏకతాటిపై నడపలేకపోవడం కూడా కారణమా ?

ఇదిలా ఉండగా , ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించడానికి మరి కొన్ని కార ణాలను కూడా చెబుతున్నారు. రాష్ట్ర పార్టీని ఏకతాటిపై నడపడంలో విఫల మయ్యారని, తనకు అనుకూలమైన వారికే కొమ్ము కాశారని, వారిపై ఆరోపణలు వస్తే అధిష్టానానికి చేరకుండా మధ్యలోనే అడ్డుకట్టవేసేవారని విమర్శలున్నందున పార్టీ ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించిందని టీపీసీసీలో మరొకవర్గం ఆరోపణ. గోవాలో పార్టీకి మెజారిటీ సీట్లు వచ్చినప్పటికీ అక్కడ అధికారం చేపట్టకపోవడం వెనుక ఇంచార్జీగాఉన్న దిగ్విజయ్ వైఫ్యల్యమేనని, అందుకే ఆక్కడి బాధ్యతల నుంచి అధిష్టానం తప్పించింది. టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో తన సమక్షంలోనే ఇద్దరు నాయకులు కొట్టుకున్న సంఘటనలను తేలికగా తీసుకోవడం కూడా ఆయనపై విమర్శలకు దారి తీసింది. ఈకారణాలతో కూడాఆయన బాధ్యతల నుంచి తప్పుకుంటానని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లడం, పార్టీ వెన్వెంటనే ఆమోదించడం కూడా జరిగిందని దిగ్విజయ్ వ్యతిరేకులు ఆరోపిస్తున్నారు.

అండకోల్పోయిన కోమటిరెడ్డి బ్రదర్స్

ఎమ్మెల్యే కోమటిరెడ్డి బ్రదర్స్‌కు పెద్దదిక్కుగా ఉన్న దిగ్విజయ్ సింగ్ బాధ్యతల నుంచి రిలీవ్ కావడంతో పెద్దఅండను కోల్పోయినట్లే చెప్పవచ్చు. పార్టీలో కోమిటిరెడ్డి బ్రదర్స్‌కు దిగ్విజయ్ గ్రూప్‌గా పేరుంది. దిగ్విజయ్ కూడా హైదరాబాద్ కు ఎప్పుడు వచ్చినప్పటికీ సమయం ఉంటే వారి నివాసంలో అల్పాహారం తీసుకునేవారు. దిగ్విజయ్ ఇంచార్జీగా ఉన్నందున తమలో ఒకరికి పీసీసీ అధ్యక్ష పదవి దక్కుతుందనే నమ్మకంతో ఎమ్మెల్యే వెంకటరెడ్డి, ఆయన సోదరుడు ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉండేవారు. ప్రైవేట్ సంభాషణల్లో కూడా తమకు దిగ్విజయ్ ఉన్నారనే ధీమాతో మాట్లాడేవారు.

సత్తా చాటుకునేందుకు ఉత్తమ్‌కి ఛాయిస్

పీసీసీ అధ్యక్షుడిగా తన సత్తా చాటుకునేందుకు ఉత్తమ్‌కుమార్ రెడ్డికి పూర్తిగా లైన్ క్లియర్ అయిందని చెప్పవచ్చు. తన పీఠానికి ఎసరు పెట్టే నేత ఎవరు కూడా లేకపోవడంతో తన బాధ్యతల విషయంలో వేగం పెంచే అవకాశం వచ్చింది. ఉత్తమ్ పీసీసీ పీఠం పదిలం అని ఆయన సన్నిహితులు చెప్పారు. దిగ్విజయ్ ఇంచార్జీగా ఉన్నందున ఎప్పుడు తమ పదవి ఊడుతుందోఅనే ఆందోళనతో ఉండేవారమని, ఆయన స్థానంలో కుంతియా రావడం సంతోషంచదగ్గ విషయమని అన్నారు.

8మందికి బెయిల్

కరీంనగర్, కెఎన్ఎన్ బ్యూరో : రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్లపల్లి మం డలం రామచంద్రాపూర్ స్టేజీ వద్ద ఇసుక లారీ ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిం చిన సంఘటనపై జరిగిన లారీ దహ నం, విధ్వంసంపై దాఖలైన మూ డు కేసుల్లో ఎనిమిది మంది నింది తులకు కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జీ శ్రీనివాసులు మంగళవారం షరతుల తో కూడిన బెయిలు మంజూరు చేశారు. వివరాలలోకి వెళితే జులై 2న క్వారీ నుంచి ఇసుక నింపుకొని వెలుతున్న లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా లారీ నడపడంతో జరిగిన ప్రమాదంలో రామచంద్రాపూర్ స్టేజీ వద్ద సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో నేరెళ్ల గ్రామా నికి చెందిన భూమయ్య (60) అక్కడి కక్కడే చనిపోయాడు. ఈ కేసులలో నేరెళ్ల గ్రామానికి చెందిన పెంట బాన య్య, గంధం గోపాల్, చెప్పాల బాలరా జు, కోల హరీష్, పూసాల ఈశ్వర్ కుమా ర్, జిల్లెల్లకు చెందిన చీకోటి శ్రీనివాస్, కోరుకంటి గణేశ్, రామచంద్రాపూర్‌కు చెందిన బత్తుల మహేశ్‌లను అరెస్టు చేసి గత నెల 8న కోర్టుకు హాజరుపరచగా కోర్టు జూడిషియల్ రిమాండ్‌కు తరలి ంచింది. వీరు దాఖలు చేసుకున్న బెయిల్ పిటీషన్‌ను విచారించిన జడ్జి ఎనిమిది మంది నిందితులు బెయిల్ పొందిన నాటి నుంచి నెలరోజుల పాటు వేముల వాడ పట్టణంలో నివాసం ఉండాలని, ప్రతి ఆది, బుధ వారాలలో వేముల వాడ పోలీస్ స్టేషన్‌లో హాజరు ఇవ్వాల ని, కోర్టు అనుమతి లేనిది వేములవాడ పట్టణం దాటి వెళ్లరాదని షరతులు విధిస్తూ బెయిల్ మంజూరు చేశారు.

'నేరెళ్ల'పై చర్చకు సిద్ధమా?

- మరోసారి కేటీఆర్‌కు కాంగ్రెస్ సవాల్
- టీఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలి
- మీరాకుమార్‌ను విమర్శించే అర్హత మీకెక్కడిది: టీపీసీసీ నేతలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నేరెళ్లలో పోలీసుల చిత్రహింసలకు గురైన దళితులు,బీసీలను ఇంత వరకు పరామర్శించకపోవడం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు మానవత్వం లేదని నిరూపించుకున్నారని కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. లోక్‌సభ స్పీకర్‌గా పని చేసిన మీరాకుమార్‌పైనే విమర్శలు చేయడం టీఆర్ఎస్ నేతలకు సరికాదని పేర్కొంది. ఐఏఎస్ అధికారిగా ఎన్నో విప్లవాత్మకపథకాలకు శ్రీకారం చుట్టిన ఎఐసీసీ ఎస్సీసెల్ ఛైర్మన్ కొప్పుల రాజుపై కూడా విమర్శలు చేసి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారని మండిపడింది. నేరెళ్ల ఉదంతంపై బహిరంగ చర్చకు సిద్ధమని, తేదీ,వేదిక ఎక్కడో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రకటించాలని మరోవారు సవాల్ చేసింది. మీరాకుమార్ సభకు అనుమతివ్వకుండా కేసీఆర్ తనలోని అప్రజాస్వామిక నైజాన్ని చాటుకున్నారని ఆరోపించింది. మంగళవారం ఇక్కడ గాంధీభవన్‌లో సీనియర్ ఎమ్మెల్యే డాక్టర్ జె గీతారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షులు మల్లు రవి, మహేష్‌కుమార్ గౌడ్ విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

సీనియర్ ఎమ్మెల్యే డాక్టర్ జె గీతారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సందర్భంగా బిల్లు ఆమోదం కోసం శక్తివంచన లేకుండా కృషి చేసిన మీరాకుమార్‌పైనే టీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ,వారికి ఆమెను విమర్శించే హక్కుఉందా ? అని ప్రశ్నించారు. ఆమెతో తాము అబద్ధాలు చెప్పించామా ?చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అబద్ధాలు చెబుతారా ? జూలై 2 న 8 మంది దళిత, బీసీ వర్గాలకు చెందిన పోలీసులు కరెంట్ షాక్‌తో చిత్ర హింసలు పెడితే నెలరోజులైనా స్పందించని మీరు కాంగ్రెస్ పార్టీ నేతలపైనే విమర్శలు చేస్తారా ? సోమవారం మీరాకుమార్‌తో పాటు తాను కూడా జైలులో నేరెళ్ల కు చెందిన బాధితుల పరిస్థితిని చూశానని, వారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని,ఎస్పీ విశ్వజిత్‌తో పాటు పోలీసులు అజ్ఞాత ప్రదేశానికి వారిని తీసుకువచ్చి ఇష్టంవచ్చినట్లుగా కొట్టారని ఆరోపించారు.వారి పరిస్థితి చూసి మీరాకుమార్‌తో పాటు తామంతా కంటతడిపెట్టుకున్నామని తెలిపారు. ఇసుకమాఫియా లారీని ఢీకొని చనిపోయిన వ్యక్తి గిరిజన సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, నలుగురు దళితులు, ముగ్గురు బీసీలను పోలీసులు అక్రమంగా థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో హింసించారని చెప్పారు. వారిని పోలీసులు రిమాండ్ చేస్తే జైలర్ వారిని తీసుకోవడానికి అంగీకరించకపోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. గతంలో కూడా ఇసుక మాఫియా లారీల కింద పడి చనిపోయిన వాళ్లు చాలా మందే ఉన్నారని, వాళ్ల భార్యలు, పిల్లలతో మాట్లాడామని చెప్పారు. ఇసుక మాఫియాను అరికట్టాల్సింది పోయి..,నలుగురు దళితులకు గాయాలైతే ఇంత రాద్ధాంతం చేస్తారా అని అంటున్నారు..వాళ్లు మనుష్యులు కారా ? వారు ఈ దేశానికి చెందిన వారు కాదా ? అని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గంలో ఓట్లేయించుకుని గెలిచిన కేటీఆర్ బాధితులకు పరామర్శించలేకపోయారని ప్రశ్నించారు. ప్రతి రోజు ఎన్నో ప్రకటనలు చేసే సీఎం కేసీఆర్ స్పందించకపోవడానికి కారణమేంటని అడిగారు. జనం చస్తుంటే..పోలీసుల అమానుషానికి బలవుతుంటే పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యం కాదా ?ఒక ప్రధాన ప్రతిపక్షంగా తాము పరిస్థితిపై స్పందిస్తున్నామని, బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తేతప్పా ? ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని గీతారెడ్డి డిమాండ్ చేశారు.

దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ, సిరిసిల్లలో మీరాకుమార్ పర్యటన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌లకు కర్రు కాల్చి వాతపెట్టినట్లుందని వ్యాఖ్యానించారు. దొంగ ఇసుక వ్యవహారంలో కేసీఆర్ కుటుంబానికి సంబంధం ఉందని, అందుకు సంబంధించిన ఆధారాలను తాము నిరూపిస్తామని, కేటీఆర్‌కు దమ్ముంటే .., బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. చర్చ ఎప్పుడో ? ఎక్కడో ? వేదికను కూడా కేటీఆర్ ఎంపిక చేయాలని, అది టీఆర్ఎస్ భవన్ లేదా గాంధీభవన్ లేదా అమరవీరుల స్థూపం ఎక్కడికైనా తాను వస్తానన్నారు.కాంగ్రెస్ నేతలపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బాల్క సుమన్ తదితరులు విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ ముక్కు కోస్తా ?ముక్కు నేలకు రాస్తా ? హైదరాబాద్‌లో కేసీఆర్‌ను తిరగనివ్వను అని సవాల్ చేయడమే గాక తెలంగాణ రాకుండా అడ్డుకున్న తలసాని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రిగాఉన్న రాజయ్యను తడిగుడ్డతో కేసీఆర్ గొంతు కోశారని, అలాంటి రాజయ్య కూడా కొప్పుల రాజు, మీరాకుమార్‌పై విమర్శలు చేయడం సరికాదని దుయ్యబట్టారు. బాల్కసుమన్ క నాడా అంబేడ్కర్ వారసుడిగా వ్యవహరించాలి తప్ప కేసీఆర్ తొత్తుగాకాదని సూచించారు. మేధావులు మౌనం దుర్మార్గుల దౌర్జన్యాలకన్న అత్యంత ప్రమాదమని , కాబట్టి మేధావులు మౌనం వీడాలని శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు.

జ్యుడీషియల్ విచారణకు డిమాండ్

నేరెళ్ల ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి డిమాండ్ చేశారు. మల్లురవి ప్రస్తుతం రాష్ట్రంలో రాజ్యహింస రాజ్యమేలుతోందని విమర్శించారు.


లష్కరే కమాండర్ హతం

● పుల్వామాలో ఎన్‌కౌంటర్ ● భార్యను కలిసేందుకు వచ్చి మృతి ● ఎల్ఈటీకి కోలుకోలేని దెబ్బ

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తోన్న లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజనా ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. మంగళవారం ఉదయం పుల్వామా జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో 27 ఏళ్ళ అబుతో పాటు మరో ఉగ్రవాది మృతిచెందారు. హక్రీపోరా గ్రామంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఆ క్రమంలో అబు దుజనా తలదాచుకున్న ఇంటిని కనుకొన్నారు. దీంతో ఉగ్రవాదులు కాల్పులు జరపగా భద్రతా దళాలు తిరిగి కాల్పులు జరిపాయి. చివరకు ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు. వారిలో ఒకర్ని లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజనాగా గుర్తించారు.

లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజనాను భద్రతా బలగాలు పక్కా ప్లాన్‌ను హతమార్చినట్లు తెలుస్తోంది. జమ్ముకశ్మీర్ పుల్వామా జిల్లాలోని హక్రిపోరా గ్రామంలోని తన భార్యను కలిసేందుకు అతడు వచ్చాడు. గతంలో కూడా ఇదే విధంగా వచ్చినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో ఓ ఇంట్లో అబుదుజానాతోపాటు అతడు సన్నిహితుడు ఉన్నట్లు భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో వెంటనే అక్కడకు వెళ్లి రెండు గంటలపాటు మాటు వేశారు. ఎలాంటి అలికిడి లేకుండా సైలెంట్‌గా ఆ ఇంటిని చుట్టుముట్టి కాల్పులు జరిపారు. ఉగ్రవాదులు ఎదురు కాల్పులు జరపడంతో చివరకు అబుతోపాటు అతడి సన్నిహితుడు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

అబు దుజనా ఎవరు?



పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని గిల్గిట్-బాల్టిస్తాన్ ప్రాంతానికి చెందిన అబు దుజానా, జమ్ము కశ్మీర్‌లో లష్కరే తోయిబా కార్యకలాపాలకు చీఫ్‌గా వ్యవ హరిస్తున్నాడు. దక్షిణ కశ్మీర్‌లోని ఉగ్రదాడు లకు అతడు ప్రధాన సూత్రధారి. పోలీసుల కళ్ళుగప్పి 12 సార్లు తప్పించుకున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అయిన అబుదుజానా కోసం కొంత కాలంగా గాలిస్తున్నారు. అతడిపై రూ.10 లక్షల రివార్డు కూడా ప్రకటించారు. అబు దుజనా ఎన్‌కౌంటర్‌తో లష్క రే తోయిబాకు కోలుకోని దెబ్బ తగినట్లయ్యింది.



కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా హక్రీపోరా గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగిన ఇల్లు ఇదే

రాళ్ళు రువ్విన ఆందోళనకారులు.. కాల్పుల్లో ఒకరు మృతి

లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజనా ఎన్‌కౌంటర్ తెలిసిన వెంటనే స్థానికులు అల్లర్లకు పాల్పడ్డారు. భద్రతా దళాలపై రాళ్లతో దాడి చేశారు. దీంతో టీయర్ గ్యాస్ ప్రయోగించడంతో పాటు రక్షణ కోసం కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఓ పౌరుడు మృతి చెందగా మరొకరు గాయపడినట్లు తెలుస్తోంది.

మొబైల్, ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేత


లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజనా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారకుండా ఉండేందుకు జమ్ముకశ్మీర్‌లో మొబైల్, ఇంటర్నెట్ సేవలు నిలివేశారు. కశ్మీర్ లోయలోని పలు స్కూళ్లు, కాలేజీలను కూడా మూసి వేశారు.

కిరేన్ రిజిజు, ఫరూక్ ప్రశంస



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరేన్ రిజిజుతో పాటు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా భద్రతా దళాలను ప్రశంసించారు. లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజనా ఎన్‌కౌంటర్ లాంటివి కొనసాగాలని అప్పుడే కశ్మీర్‌తో శాంతి నెలకుంటుం దని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు కూడా ఫరూక్ స్పందనకు మద్దతు తెలిపారు.

పాక్ ప్రధానిగా అబ్బాసీ



ఇస్లామాబాద్: షాహిద్ ఖాన్ అబ్బాసీ పాకిస్థాన్‌కు కొత్త ప్రధాన మంత్రిగా ఎన్నికయ్యారు. నవాజ్ షరీఫ్‌ను ఆ దేశ సుప్రీం కోర్టు అనర్హుడిగా ప్రకటించాక దేశానికి కొత్త ప్రధాని ఎన్నిక అవసరమైంది. నవాజ్ తన సోదరుడు, పంజాబ్ ముఖ్యమంత్రి షాబాజ్ షరీఫ్‌ను వారసుడిగా ప్రకటించినా, ఆయన ఇంకా ఎంపీ కాకపోవడంతో తాత్కాలిక ఏర్పాటు కింద అబ్బాసీని పాక్ పార్లమెంటు మంగళవారం ఎన్నుకుంది. పాక్ జాతీయ అసెంబ్లీలో 342 మంది సభ్యులుండగా, అబ్బాసీకి అనుకూలంగా 221 ఓట్లు పడ్డాయి. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీకి చెందిన నవీద్ కమర్‌కు 47 ఓట్లు వచ్చాయి. ఇమ్రాన్ ఖాన్ పార్టీ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ అభ్యర్థి షేక్ రషీద్ అహ్మద్‌కు 33 ఓట్లు వచ్చాయి. ఫలితాలను ప్రకటించిన తరువాత స్పీకర్ అయాజ్ సాదిక్ అబ్బాసీని ప్రధాని సీట్లో కూర్చుని సభను ఉద్దేశించి ప్రసంగించాలని కోరారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ ముస్లిం లీగ్ (ఎన్) సభ్యులు నవాజ్ షరీఫ్ పోస్టర్లను తీసుకుని వచ్చారు. దీనికి స్పీకర్ అభ్యంతరం చెప్పారు.

పాశ్చాత్య మీడియాపై చైనా అక్కసు



బీజింగ్: భారత్‌పై ప్రాశ్చాత్య దేశాలు సానుకూల వైఖరితో ఉండటాన్ని చైనా జీర్ణించుకోలేపోతుంది. ఈ విషయంలో భారత్‌పై మరోసారి తన అక్కసును వెల్లడించింది. భారత్‌పై ప్రాశ్చాత్య దేశాల మీడియా సంస్థలు కూడా సానుకూల దృక్పథంతో ఉన్నాయని ఆరోపించింది. భారత్ ఏం చేసినా అనుకూలంగా వార్తలు రాస్తున్నాయని విమర్శించింది. ఈ మేరకు చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో పేర్కొంది. చైనాతో పోలిస్తే భారత్ తక్కువ స్థాయిలో ఉండ టం మూలంగానే ఆ దేశం పట్ల ఆయా దేశాల మీడియా సంస్థలు సానుభూతి చూపిస్తున్నాయన్నారు. భారత్‌ను బాధిత దేశంగా ప్రాశ్చాత్య మీడియా చిత్రికరిం చడంపై గ్లోబల్స్ టైమ్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అక్రమంగా తమ భూభా గంలోకి చొరబడిన భారత్‌ను ఇసుమంతైన ప్రాశ్చాత్య మీడియా ప్రశ్నిం చకపో వడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి భూటాన్-చైనా సరిహద్దు వివాదంలో జోక్యం చేసుకున్నా మాట మాత్రం కూడా ప్రశ్నించడం లేదని వెల్లడించింది. పైగా, తామే దూకుడుగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. భారత్‌కు అనుకూలంగా వార్తలను ప్రసారం చేస్తున్నా యంది. భారత్‌లో ప్రాశ్చాత్య రాజకీయ సంస్కృతి అమలు అవుతుందని, ప్రజా స్వామ్యం ముసుగులో ఆ దేశం ఇష్టారీతిన వ్యవహరి స్తుందని ఆరోపించింది. వందలాది సంవత్సరాలుగా శాంతియుత దేశంగా పేరొందిన భారత్, బ్రిటిష్ పాలకుల నుంచి అహింసా మార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించిం దని చెప్పింది. అందుచేతనే ఆయా దేశాల మీడియా అదే కోణంలో భారత్‌ను చూస్తున్నాయని వివరించింది.

ఈ బ్లాక్ బాక్స్ మరింత భద్రం



న్యూ ఢిల్లీ: సాధారణంగా విమానం గల్లంతయితే దాన్ని పట్టుకోవడం చాలా కష్టం. అటువంటి సమయాల్లో అందులోని ప్రయాణికులు సముద్రంలో కలసిపోవడమో జరుగు తుంది. కొన్నిసార్లయితే సదరు విమానం శిథిలాలు కూడా దొరకవు. విమాన ప్రమాదం గురించి సమాచారం ఇచ్చే బ్లాక్ బాక్స్‌లు కూడా కనపడవు. కానీ తాజాగా రూపొందించిన బ్లాక్ బాక్స్‌లు విమానాల భద్రతకు మరింత ఉపయోగపడనున్నాయి. విమానాలు గల్లంతైన సమయాల్లో ముఖ్యమైన సమాచారాన్ని కొల్పోకుండా ఈ బ్లాక్ బాక్స్‌లు సదరు విమానం నుంచి స్వయంగా పక్కకు వెళతాయి. దీన్ని డీఆర్‌డీఓ రూపొందించింది. తన మార్గంలో పయనిస్తున్న విమానం సంకేతాలు తప్పిన వెంటనే ఆ బ్లాక్ బాక్స్ సంబంధిత విమానం నుంచి పక్కకు తప్పుకొంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మేకిన్ ఇండియా'లో భాగంగా ఈ బ్లాక్ బాక్స్‌ను తయారు చేసినట్లు తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహించే సమయంలో బ్లాక్ బాక్స్‌ల ఉపయోగం అధికంగా ఉంటుందని చెప్పారు. 2016లో ఏఎన్32 విమాన ప్రమాదం సంఘటనలు వంటివి పునరావృతం కాకుండా చూడొచ్చని చెప్పారు. తాము రూపొందించిన బ్లాక్ బాక్స్ రికార్డర్ విశాఖపట్నంలోని నావల్ సైన్స్ ల్యాబ్‌లో పరీక్షించినట్లు తెలిపారు. దీన్ని విమానం వెనకభాగంలో అమర్చుతారని చెప్పారు. ఏటీసీ సిగ్నల్స్ నిలిచిపోయిన వెంటనే విమానం నుంచి ఈ బాక్స్ వేరవుతుందని చెప్పారు. విమానం ప్రమాదానికి గురైై గల్లంతయినా, బ్లాక్‌బాక్స్ దొరికే అవకాశం ఉంది. ఆ సమాచారం ఆధారంగా ప్రమాద కారణాలతో పాటు విమానం గల్లంతైతే దానినీ కనుగొనవచ్చు.

నోటా తంటా

● రాజ్యసభ ఎన్నికల్లో నోటాతో కాంగ్రెస్‌లో భయం
● ఈసీ నిర్ణయంపై రాజ్యసభలో దుమారం

న్యూఢిల్లీ: గుజరాత్ నుంచి జరుగనున్న రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో నోటా ఆప్షన్‌ను అమలు చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. నిర్ణయంపై రాజ్యసభలో దుమారం రేగింది. రాజ్యసభ ఎన్నికల్లో నోటాను అమలు చేయడాన్ని కాంగ్రెస్ సహ ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకించాయి. కాంగ్రెస్ సభ్యులు గులాంనబీ ఆజాద్, ఆనంద్ శర్మ తదితరులు నోటాను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. చాలా ముఖ్యమైన అంశాన్ని ఎన్నికల కమిషన్ ఒక నోటీసుతో సరిపెట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల సమయంలోనే నోటాను అమలులోకి తీసుకురావడం..వెనకున్న ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యుల ఆందోళనలతో రాజ్యసభ పలుమార్లు వాయిదా పడినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఎస్పీ సభ్యుడు రాంగోపాల్ యాదవ్ మాట్లాడుతూ...గుజరాత్ నుంచి హేమాహేమీలు బరిలో దిగిన సమయంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం గర్హనీయమని అన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకోవాల్సిన నిర్ణయాన్ని ఒకేఒక్క సర్క్యులర్ ద్వారా పూర్తి చేయడం మంచిపద్ధతి కాదన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో నోటాను ప్రవేశపెట్టడం ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయమేనని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించే ఈసీ నోటాను అమలు చేస్తోందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపే నోటాపై సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించిందని గుర్తు చేశారు.

వరద సాయం రూ. 2000 కోట్లు

● ఈశాన్య రాష్ట్రాలకు ప్రధాని మోడీ ప్రకటన ● అసోంకే రూ.1200 కోట్లు
● వరద సమస్య శాశ్వత పరిష్కారం కోసం అధ్యయనం ● సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు



గువాహతిలో అసోం ముఖ్యమంత్రి శర్బానంద్ సోనావల్ వరద పరిస్థితిని సమీక్షిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ


గువాహతి: ఈశాన్య రాష్ట్రాలకు వరద సాయంగా ప్రధాని నరేంద్ర మోడీ రూ. 2000 కోట్లు ప్రకటించారు. మంగళవారం అసోం రాజధాని గువాహతిలో వరదపరిస్థితిని సమీక్షించిన మోడీ ఈశాన్య రాష్ట్రా ల్లో వరద సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని పేర్కొన్నారు. అసోంలో ఈ ఏడాది వరదలను జాతీయవిపత్తుగా ప్రకటించాలన్న డిమాండ్‌పై స్పందించిన మోడీ, ఇక్కడి వరదలెప్పుడూ జాతీయ విపత్తులే నన్నారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన అసోం ఆర్థిక మంత్రి హిమాంత బిస్వా శర్మ, బ్రహ్మపుత్ర వరదల గురించి అధ్యయనం చేసి దీర్ఘకాల పరిష్కారం కనుగొనడానికి ఒక సాంకేతిక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాని నిర్ణయిం చారని చెప్పారు. ఈ అధ్యయనం కోసం రూ. 100 కోట్లను ప్రధాని కేటాయించారని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలకు కేటాయించిన రూ. 2000 కోట్లతో రూ. 1200 కోట్లు అసోంకు వస్తాయన్నారు. ఇప్పటికే రూ. 250 కోట్లను కేంద్రం విడుదల చేసిందని చెప్పారు.

అతి ఎత్తైన గ్రామంలో నీరు లేదు

● హిమాలయాల మధ్యన వింత స్థితి
● పర్యావరణ మార్పులే కారణం

కోమిక్ (హిమాలయాలు): అబ్బురపరిచే వినీలా కాశం, వెనకంతా మంచుతో నిండిన హిమాలయాలు, ప్రపంచంలోనే ఎత్తైన గ్రామం.. నీటి కొరతతో సత మతం. భారత, టిబెట్ సరిహద్దుల్లో బౌద్ధులతో ఉండే గ్రామం కోమిక్ సముద్ర మట్టానికి 4,587 మీటర్ల ఎత్తులో ఉంది. ఏదో సైనిక పటాలమో లేదా పరిశోధక కేంద్రమో కాకుండా మానవ నివసిత గ్రామం ఈ ఎత్తులో ఉండడం ఎక్కడా లేదు. ఇంత గొప్ప హోదా కలిగిన ఈ గ్రామంలో నివసిస్తున్న 130 మందికి జీవితం దుర్భరమవుతోంది. ఈ ప్రాంతాన్ని హిమాలయ ఎడారి అని పిలవొచ్చు. స్పిటి లోయలో ఉన్న ఈ గ్రామం భారత దేశం నుంచి మంచు కారణంగా ఆరు నెలల పాటు సంబంధం లేకుండా ఉంటుంది. పర్వతాల మీద రహదారులను మంచు కప్పేయడమే ఇందుకు కారణం. ఇక ఫోన్లు, ఇంటర్నెట్ వంటివైతే అసలు వీరు వాడి ఎరుగరు. స్పటి లోయలో మొత్తం 12,000 మంది నివసిస్తున్నారు. వీరందరూ పచ్చ బఠానీలు, బార్లీ పండించి జీవితాన్ని వెళ్లదీస్తుంటారు. వారికి ఏరుఉ, నదులు, చెరువులు నీటికి ఆధారం. అయితే.. వీటిలో నీరు ఎండిపోతోంది. వారి సంప్రదాయ జీవన శైలికి ఎసరు వస్తోంది. హిమాలయాల మధ్యనే ఉన్నా ఈ ప్రాంతంలోకి నీరు సరిగా రావడం లేదు. భారత దేశంలో భూగర్భ జలాలు తరిగిపోయి నీటి ఎద్దడి వస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. దేశంలో మెజారిటీ ప్రాంతానికి నీరిచ్చే హిమాలయాల మధ్యలోనే నీటికి కటకట ఏర్పడడం మానవ జీవితాన్ని దుర్భరం పర్యావరణ మార్పులకు సంకేతమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ లోయలో నిరుడు మంచు సరిగా కురవలేదు. దీంతో వసంత కాలం తరువాత ఏరులన్నీ మంచు కరగడం కారణంగా వచ్చే నీరు లేక ఎండిపోయాయి. ఈ విచిత్ర స్థితి భూగోళం వేడెక్కడం కారణంగానే వస్తోందని నిపుణుల అంచనా. ఈ గ్రామంలోకి లేదా ఈ లోయలోకి వేరే ప్రాంతాల నుంచి వేసవి కాలంలో మాత్రమే వెళ్లగలం. వీళ్లు ఏడాదికి ఒకసారి మాత్రమే పంట వేయగలరు. ఆ ఒక్క పంట విఫలమైతే వీరికి పస్తులే. ఇటీవల చలికాలం వ్యవధి తగ్గి, వేసవి నిడివి పెరిగిపోవడంతో వీరికి కష్టాలు మొదలయ్యాయి. చలికాలం వ్యవధి తగ్గి కురిసే మంచు కూడా తగ్గడంతో వేసవిలో మంచు కరిగి వచ్చే నీరు కూడా తగ్గిపోతోంది. దీంతో కోమిక్‌తో పాటు స్పిటి లోయలో పలు గ్రామాల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

స్పీటి లోయలోని కోమిక్ గ్రామం



నితీశ్‌పై సుప్రీంలో కేసు



న్యూఢిల్లీ: బీహార్ సీఎం నితీశ్ కుమార్ మండలి సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మంగళవారం విచారణకు స్వీకరించింది. 1991లో బర్హాలో కాంగ్రెస్ నేత సీతారామ్ సింగ్ హత్యకు గురయ్యారు. ఇందుకు సంబంధించి నితీశ్‌పై కింద కేసు నమోదైంది. 2012లో తప్ప 2004 నుంచి ఆయన దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లో ఈ క్రిమినల్ కేసు విషయాన్ని ప్రస్తావించనందున నిబంధనల మేరకు నితీశ్ శాసన మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఎమ్ఎల్ శర్మ సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు.

నర్మదా బాచావో ఆందోళనలోచామ్‌స్కీ



న్యూఢిల్లీ: నర్మదా వాలీ ప్రాజెక్టు (పీఏపీ) బాధితుల పోరాటానికి ప్రముఖ అమెరికన్ చరిత్రకారుడు, తత్వవేత్త నోమ్ చోమ్‌స్కీ మద్దతు పలికారు. మధ్యప్రదేశ్ లోని సర్దార్ సరోవర్ డ్యామ్ కారణంగా ముంపునకు గురైన వారికి న్యాయం చేసే విషయంలో ప్రధాని మోడీ జోక్యం చేసు కోవాలని చోమ్‌స్కి ఆన్‌లైన్ పిటిషన్ దాఖలు చేశారు. నర్మదా నదిపై పెద్ద ఆనకట్టలకు వ్యతిరేకంగా చేసే పోరాటా న్ని నర్మదా బచావో ఆందోళన చేస్తున్న విషయం పాఠకులకు విదితమే. ఈ ఆందోళనను మాజీ ఐఐఎమ్, కోల్‌కత ప్రొఫెసర్, పర్యావరణ వేత్త జయంత బందోపాధ్యాయ ప్రారంభించారు. ప్రజల హక్కుల కోసం అహింసాత్మక, ప్రజాస్వామికంగా పోరాటం చేయడం అవసరమ న్నారు. నర్మదా వాలీప్రాజుక్టు వల్ల ముంపునకు గురైన ప్రజలను ప్రధాని మోడీ రక్షించాలని వారి కోరుతున్నట్లు పిటిషన్‌లా చోమ్‌స్కీ పేర్కొన్నారు. గతంలో మధ్య ప్రదేశ్‌లోని చిక్కాల్దా గ్రామంలో సామాజిక కార్యకర్త మేధా పాట్కర్, 12 మంది పీఏపీ బాధితులు నిరవధిక నిరాహారదీక్ష చేశారు. ఈ ప్రాజెక్టు వలన ప్రభావితమైన ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించాలని అధికారులను డిమాండ్ చేశారు. పర్యావరణం, నది మరియు అటవీ ప్రాంతాలపై ప్రాజెక్టు ప్రభావాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయాలని చోమ్‌స్కి పేర్కొన్నారు.

అట్లాంటాలో ఖీర్ ఆలయ ప్రతిరూపం

వాషింగ్టన్: కాశ్మీర్ లోయలోని పవిత్ర ఖీర్ ఆలయం యొక్క ప్రతిరూపం అట్లాంటాలో నిర్మిస్తున్నట్లు అమెరికా లోని కాశ్మీరీ ప్రవాసులు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణం కోసం 20 వేల డాలర్లు (రూ.12,00,000)సేకరించారు. కాశ్మీరీ ఓవర్సీస్ అసోసియేషన్ (కేఓఏ)కి చెందిన వాస్తు శిల్పి తేజ్ కౌల్ మాట్లాడుతూ 11.4 ఎకరాల స్థలంలో ఖీర్ భవాని ఆలయం యొక్క ప్రణాళిక రూపకల్పన అమెరికా లో ఇప్పటికే జరుగుతోందన్నారు. ఇది కాశ్మీర్‌లోని శాంతమైన ఆలయంగా ఉంది. ఆలయం లోపల పాలరాయి పందిరి కింద విగ్రహాలను ప్రతిష్టించేందుకు అనువుగా ఉంది.

పీవోకేగా పీవోకే

● పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చైనా ప్రాజెక్టులు
● భారత్‌కు వ్యతిరేకంగా వైరి దేశాల జట్టు
● పీవోకేలో తిరగబడిన స్థానికులకు కఠిన శిక్షలు


జమ్ము: పాక్ ఆక్రమిత కశ్మీర్- పీవోకె లో చైనా పెత్తనం రోజురోజుకూ పెరిగిపోతోంది.చైనా నుంచి వివిధ రూపాల్లో వెల్లువలా నిధులు వస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్ ఆధీనంలోని కశ్మీర్ అనేకంటే చైనా ఆధీనం లోని కశ్మీర్ అనడమే సమంజసమన్న వాదనలు వినిపిస్తున్నాయి.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్జిట్- బాల్టిస్తాన్ లో చైనా అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టులలో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పాల్గొనడంతో ఆయా ప్రాంతాలపై పట్టుకోసం చైనా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బాల్టిస్తాన్‌లోని భూములను చైనా వాసులకు అమ్మడంలోనూ స్థానికులకు నష్టపరిహారం చెల్లించకుండా పాకిస్థాన్ వ్యవహరిస్తోంది. ఇరుదేశాలు క్విడ్ ప్రోకో మాదిరిగా సహకరించుకుంటూ స్థానికులను హింసిస్తున్నాయి. పాకిస్థాన్ కు మేలు చేయడం కోసం చైనా పర్యావరణ అంశాలను కూడా మరిచింది. పాక్ దుశ్చర్యను వ్యతిరేకించిన బాల్టిస్థాన్ ప్రజలను జైళ్లలో పెట్టి హింసిస్తున్నారని స్థానిక జర్నలిస్ట్ తెలిపాడు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రస్తుతం చైనా- పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ గా మారుతోందని ఎమానం వ్యక్తం చేస్తున్నారు. పీవోకేలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో స్థానికులను కాకుండా చైనా నుంచి తీసుకువచ్చిన వారిని నియమించడంపై స్థానికులు ఉపాధి కోల్పోతున్నారు. చైనా కార్మికులను ప్రతిఘటించేందుకు కూడా అవకాశంలేకుండా భద్రతా పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ చైనా తమ పనులకు ఆటంకం కలగకుండా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీతోపాటు చైనా మిలిటరీని వాడుకుంటోంది.



పీవోకేలో ఉగ్రవాదలకు శిక్షణ

ఉగ్రవాదుల కేంద్రంగా తయారైన పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 30మతాలు, జిహాదీ గ్రూపులకు చెందిన వారంతా కలిసి దైఫా-ఇ-పాకిస్థాన్ పేరుతో ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రదళాలను తయారు చేయడమే దైఫా-ఇ-పాకిస్థాన్ లక్ష్యంగా తెలుస్తోంది. ఇలాంటి ర్యాలీయే పాకిస్థాన్ లోని లాహోర్ మాల్ రోడ్‌లో దైఫా-ఇ-పాకిస్థాన్ నిర్వహించడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ ర్యాలీలో నిషేదిత ఉగ్రవాద సంస్థలు లష్కర్-ఇ-తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాయిదీన్, జమాయిత్ ఉల్ ముజాయిదీన్ వంటి సంస్థలు పాల్గొన్నాయి. ఉగ్రవాద సంస్థలు ర్యాలీ సందర్భంగా భారత్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తూ ప్రచారం చేశాయి. ఇది హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ హత్య తర్వాత పాకిస్థాన్ ప్రేరేపిస్తున్న చర్యగా తెలుస్తోంది. హిజ్బుల్ ఉగ్రవాద సంస్థ అధినేత హాఫీజ్ సయాద్‌ను అమెరికా గ్లోబల్ టెర్రరిస్టుగా ప్రకటించి..ఉగ్రవాదులను అరెస్ట్ చేసినా రివార్డు ప్రకటించడంతో ఉగ్రవాద సంస్థలన్నీ భారత్‌పై విషం చిమ్ముతున్నాయి. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఉగ్ర కార్యకల్లోకి యువతను మళ్లించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నాయి. హాఫీజ్ సయీద్ కుమారుడు, మాజీ ఐఎస్ఐ చీఫ్ హమీద్ గుల్ కుమారుడు కూడా భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను తయారుచేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని సమాచారం. సరిహద్దుల నుంచి భారత్ లోకి చొరబడేందుకు ఉగ్రవాదులను ప్రేరేపిస్తున్నది కూడా పీవోకేలోని ఉగ్రసంస్థలు అని నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది తొమ్మిదిసార్లు చొరబాటు జరగడం కూడా ఇందులో భాగమేనని పేర్కొన్నాయి. కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనకు కూడా దైఫా-ఇ-పాకిస్థాన్ హస్తం ఉందని తెలుస్తోంది.

భూమికి సమీపంలో జీవం కనబడలేదు



న్యూ ఢిల్లీ: భూమికి సమీపంలో జీవరాశుల మనుగడకు ఆస్కారం లేదని నేషనల్ ఏరొనాటిక్స్ అండ్ స్పెస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) ప్రకటించింది. పరిమాణంలో భూమిలాగా ఉండి, సౌర వ్యవస్థకు అవల ఉన్నటువంటి ప్లానెట్-బీపై చేసిన అధ్యయనంలో భాగంగా నాసా శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్లానెట్-బీలో వాతావరణం లేకపోవడం వల్లనే అక్కడ జీవరాశుల మనుగడ లేదన్నారు. దాని సోలార్ వ్యవస్థలో నక్షత్రం అతినీలలోహిత కిరణాలను నిలుపుదల చేయలేకపోవడంతో ప్లానెట్‌బీ గ్రహం ఉపరితలంపైకి హానికర రేడియేషన్ కిరణాలు చేరుతున్నాయి. దీంతో ఆ గ్రహంపై సరైన వాతావరణం ఉండటం లేదన్నారు. జీవరాశుల మనుగడ సాధ్యం కావడం లేదని నాసా శాస్త్రవేత్త కేథరిన్ పేర్కొన్నారు. అయితే, ఈ గ్రహంపై ఎంతమేర రేడియేషన్ ఉత్పత్తి అవుతుందన్న విషయాన్ని తాము గ్రహించినట్లు తెలిపారు.



ఇక రెండో టెస్ట్‌పై గురి

కొలంబో : ఇప్పటికే మూడు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంతో ఉన్న కోహ్లీసేన గురువారంనుంచి మొదలయ్యే రెండో టెస్టులో సైతం విజయకేతనాన్ని ఎగురవేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో భారత జట్టు ఇప్పటికే రవిశాస్త్రి నేతృత్వంలో ముమ్మరంగా సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో ప్రాక్టీస్ చేస్తోంది. ఆతిథ్యజట్టు లంకను తొలి టెస్టులో 304 పరుగుల భారీతేడాతో చిత్తుచేసిన ఇండియా అదే తరహాలో ఈ టెస్టులోనూ తన సత్తా ప్రదర్శించేందుకు సిద్ధమైంది. గాలెలో మెరుగైన రికార్డు ఉన్న లంకపై తొలి ఇన్నింగ్స్‌లో 600 పరుగులు భారీస్కోరు చేయగలిగిన భారత్, రెండో ఇన్నింగ్స్‌లోనూ 240 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ కోహ్లీ శతకంతో అలరించాడు. ఆపై బౌలింగ్‌లో కూడా అమోఘంగా రాణించిన లంకను తొలి ఇన్నింగ్స్‌లో 291 పరుగులకే ఆలౌట్ చేసింది. లంకకు 550 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా దాన్ని సాధించడానికి దిగిన జట్టు నాలుగోరోజుననే ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. ఇదే తీరులోనూ ఇండియా రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించాలన్న పట్టుదలతో ఉంది.

రాహుల్ ఓపెనర్‌గా దిగుతాడా?

తొలి టెస్టుకు వైరల్ జ్వరంతో బాధపడుతూ ఆడలేకపోయిన రాహుల్ ఈ టెస్టులో ఆడే అవకాశాలున్నాయి. అభినవ్ ముకుంద్‌కంటే ప్రతి టెస్టులోనూ స్థిరంగా రాణిస్తున్న రాహుల్‌కే భారత సారథి కోహ్లీ మొదటి అవకాశం ఇచ్చే వీలుంది. మంగళవారంనాడు నెట్స్‌లోనూ రాహుల్ తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. అయితే రాహుల్ ఆడతాడా? లేదా అన్న విషయంపై సమాధానం చెప్పడానికి ప్రధాన కోచ్ రవిశాస్త్రి నిరాకరించాడు. రాహుల్ చక్కటి ఆటగాడు. అతడిని దగ్గరగా గమనిస్తున్నామని చెప్పాడు. గత 2,3 రోజులుగా అతడు ఆస్పత్రిలో చికిత్స పొంది వచ్చాడు. అందుకే అతడిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని చెప్పాడు. రెండో టెస్టుకైతే రాహుల్ ఫిట్‌నెస్‌తో ఉన్నాడు.

బలమైన రిజర్వ్ జట్టు ఉండడం మంచిది : శాస్త్రి

కెప్టెన్ కోహ్లీ మాదిరిగానే బలమైన రిజర్వ్ బెంచ్ జట్టు ఉండడం మంచిదని కోచ్ రవిశాస్త్రి చెప్పాడు. తుది జట్టులో గట్టిపోటీ ఉండడం ఆరోగ్యకరమైదని వ్యాఖ్యానించాడు. అన్ని పార్మాట్‌ల్లో ఆడుతున్నప్పుడు ఎవరెప్పుడు గాయపడతారో తెలియదని, అందువల్ల రిజర్వ్‌గా మరొకరు ఉండడం మంచిదన్నాడు. శ్రీలంకతో రెండు టెస్టు నేపథ్యంలో శాస్త్రి మాట్లాడుతూ రాహుల్ బాగా ప్రాక్టీస్ చేస్తున్నాడని చెప్పాడు.

ప్రస్తుతం భారతకోచ్‌గా తాను బాధ్యతలు చేపట్టినప్పటికీ, డ్రస్సింగ్‌రూమ్‌లో మార్చేది ఏమీలేదంటూ తెలిపాడు. నాకైతే గత సంవత్సరం వదిలేసిన డ్రస్సింగ్‌రూమ్‌లోకి మళ్లీ ప్రవేశించినట్లే ఉంది. కొత్త నియమ నిబంధనలంటూ ఏమీ లేవన్నాడు. కోచ్‌గా సంవత్సరం తర్వాత బాధ్యతలు చేపట్టి తిరిగి వచ్చిన అనంతరం ఏమీ మిస్సయ్యారు? అంటూ సంధించిన ప్రశ్నకు సమాధానమిస్తూ...కేవలం 12 నెలలుగానే అక్కడ (డ్రస్సింగ్‌రూమ్)లేను. కానీ తిరిగి వచ్చిన తర్వాత నాకైతే కొత్త మార్పులు ఏమీ కనిపించలేదు. అలాగే ఆటగాళ్లకు కూడా నానుంచి ఏం కావాలో తెలుసునని అన్నాడు. డ్రస్సింగ్‌రూమ్‌లో వాతావరణం ఇప్పుడు మారిందన్న ప్రశ్నకు శాస్త్రి సమాధానమిస్తూ..10 నెలల క్రితం ఎలా ఉండేదో..నాకు తెలియదన్నాడు. నా వరకైతే తిరిగి ప్రవేశించాను . గతంలో ఎలా ఉందో ఇప్పుడే అలా నాకు కన్పిస్తోందని చెప్పాడు. ఎలాంటి మార్పు నాకు కనిపించలేదని తెలిపాడు.

గాలె విజయంపై శాస్త్రి స్పందిస్తూ...జట్టు రెగ్యులర్‌గా స్థిరంగా ఆడుతోంది. గత టెస్టు మ్యాచ్‌లోనూ వారు అద్వితీయంగా ఆడారు. కాకపోతే కొన్ని ఏరియాల్లో ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందన్నాడు. దీనిపై ఇప్పటికే చర్చించాం. జట్టునుంచి ఏం కావాలో..దానికి సంబంధించి సమైక్యంగా స్థిరంగా అందుకోవడానికే ప్రయత్నిస్తాను.ఇది ఒక గేమ్‌లో ఒకవిధంగా..తర్వాత దానికి మరొకరకంగా ఉండదు. స్థిరంగా రాణించడం ద్వారా పురోగమించాల్సి ఉందన్నాడు.

ప్రస్తుత జట్టు చక్కగా ఉంది: ప్రస్తుత విరాట్ కోహ్లీ సేన, గత జట్లకంటే చాలా మెరుగ్గా ఉంది. భారత క్రికెట్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళ్లడంలో వీరు తప్పకుండా రాణిస్తున్నారు. ఈ సీజన్ అనంతరమే అసలైన పోటీ ఉంది. ముఖ్యంగా దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లతో పోరు ఓ సవాలే. ఒకటి మాత్రం చెప్పగలను. ప్రస్తుత జట్టు అనుభవంతో కూడుకుని ఉంది. తమ కెరీర్‌లో గతంలో పలువురు దిగ్గజ క్రికెటర్లు, జట్లు సాధించని విజయాలు, రికార్డులు ప్రస్తుత ఆటగాళ్లు సాధిస్తున్నారు. ఉదాహరణకు (శ్రీలంకతో) ఇక్కడ సిరీస్‌ను 20 సంవత్సరాల తర్వాత సాధించాం. అదే 20 ఏళ్లుగా ఎందరో ఆటగాళ్లు ఆడారు. వారు శ్రీలంకకు చాలాసార్లు వచ్చారు. కానీ సిరీస్ గెలుచుకోలేకపోయారు. అయితే ఈ జట్టు సాధించగలిగింది. అలాగే గత 20 ఏళ్లుగా లంకలో వన్డే సిరీస్ గెలుచుకోలేకపోయారు. కానీ ఈ జట్టు అది సాధించింది. ఓవర్సీస్‌లో ఆస్ట్రేలియా సిరీస్ గురించి మరిచిపోండి. సౌతాఫ్రికా, ఇంగ్లండ్ పర్యటనలు తప్పకుండా క్లిష్టమైన క్రికెట్ ఆడాల్సిందే. ఒకరకంగా జట్టుకు ఇదో మంచి అవకాశం. ఈ జట్టు ఆ పర్యటనల్లో సైతం అద్వితీయంగా రాణించగలదని ఆశిస్తున్నట్లు రవిశాస్త్రి తెలిపాడు.


రెండో రౌండ్‌లో కశ్యప్, ప్రణయ్

న్యూజిలాండ్ ఓపెన్



న్యూఢిల్లీ : భారత షట్లర్స్ హెచ్‌ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్ న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ రెండోరౌండ్‌కు చేరుకున్నారు. ఇటీవల యుఎస్‌ఓపెన్ సాధించిన నాలుగోసీడ్ ప్రణయ్ తొలిరౌండ్‌లో ఇండోనేషియాకు చెందిన షిసర్ హిరెన్ రుస్తావిటోను ఏకపక్షంగా సాగిన పోరులో 21-14 21-16 తేడాతో వరుససెట్లలో 36 నిమిషాల్లోనే ఓడించాడు. మరోవైపు కశ్యప్ ఇండోనేషియాకు చెందిన ప్రత్యర్థి డియానిసిస్ హయామ్ రుంబాకాను 21-5, 21-10 తేడాతో చిత్తుచేశాడు. ఇదిలాఉంటే మరో భారత ఆటగాడు రెండోసీడ్ అజయ్ జయరామ్ 19-21, 13-21 తో హంగ్ లూపై మొదటిరౌండ్‌లోనే ఓటమి చవిచూశాడు.

టాప్‌లో జడేజా.. ఆ వెనుకే అశ్విన్



దుబాయ్ : ఐసీసీ తాజార్యాంకింగ్‌ల్లో బౌలర్ల జాబితాలో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ మొదటి రెండుస్థానాల్లో నిలిచారు. మరోవైపు బ్యాటింగ్‌లో ఇటీవల టెస్టుల్లో అద్వితీయంగా రాణించడంతో భారత ఓపెనర్ శిఖర్ ధావన్, ఇంగ్లండ్‌కు చెందిన బెన్‌స్టోక్స్ తమ ర్యాంక్‌లను మెరుగు పర్చుకున్నారు. ప్రస్తుతం జడేజా 897 పాయింట్లతో ఉండగా, అశ్విన్ 849 పాయింట్లతో ఉన్నారు. మూడోస్థానంలో శ్రీలంకకు చెందిన రంగన హెరాత్ ఉన్నాడు.

వేలంలో కోహ్లీ జెర్సీకి రూ.3లక్షలు



కొలంబో : పాకిస్తాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిదికి ఇచ్చిన విరాట్‌కోహ్లీ జెర్సీని వేలం నిర్వహించారు. అఫ్రిది ఓ స్వచ్ఛంద సంస్థను ఎస్‌ఏ పౌండేషన్ పేరుతో నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారంనాడు లండన్‌లో అఫ్రిది ఓ ప్రత్యేక విందుకార్యక్రమం ఏర్పాటు చేసి తన దగ్గర ఉన్న క్రికెట్ వస్తువులను వేలం నిర్వహించాడు. ఇందులో కోహ్లీ జెర్సీ రూ 4300 యూరోలకు (రూ 325740) అమ్ముడుపోయింది. దీంతో పాటు తన వద్ద ఉన్న పలువురి ఆటగాళ్ల జెర్సీలను సైతం వేలం నిర్వహించాడు. ఇందులో వచ్చిన నగదును తన పౌండేషన్‌కు ఇచ్చి దాని ద్వారా చిన్నారుల విద్యకోసం వినియోగించనున్నాడు.

2016 లో భారత్‌లో నిర్వహించిన టీ 20 ప్రపంచకప్‌టోర్నమెంట్ సమయంలో కోహ్లీ తన జెర్సీని అఫ్రిదికి అందించిన విషయం తెలిసిందే. దీనిపై భారత ఆటగాళ్లు అంతా తమ సంతకాలు చేశారు. కాగా అఫ్రిది లండన్‌లో నిర్వహించిన వేలంపాటకు క్రికెటర్లు అమీర్‌తోపాటు ఇమాద్ వసీం హాజరయ్యారు.



మహిళల ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీరాజ్‌కు మంగళవారంనాడు గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో బీఎండబ్ల్యు కారును బహుమతిగా అందచేస్తున్న తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్

బదిర ఒలింపిక్ విజేతలకు పరాభవం

- విమానాశ్రయంలో నిరసనతో అధికారుల పరుగులు
- క్రీడాకారులకు మొక్కుబడిగా సన్మానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: బదిర ఒలింపిక్ విజేతలకు దేశ రాజధానిలో పరాభవం ఎదురైంది. టర్కీలో జరిగిన బదిర ఒలింపిక్ క్రీడల్లో 5 పతకాలు సాధించినా, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి కనీస ఆహ్వానం కూడా కరవైంది. దీంతో విజేతలు విమానాశ్రయంలోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సాధారణ క్రీడాకారులు ఒక్క పతకం సాధిస్తేనే ఎంతో ఘనంగా స్వాగతం పలుకుతున్న ప్రభుత్వాలు తమను చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో బైఠాయించారన్న సమాచారం తెలుసుకున్న వెంటనే అధికారులు పరుగు పరుగున అక్కడికి చేరుకున్నారు. అనారోగ్య కారణాలతో క్రీడాశాఖ మంత్రి విజయ్ గోయల్ ముఖం చాటేశారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) అధికా రులు విజేతలను నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియానికి తీసుకొచ్చారు. అక్కడ వారిని సత్కరించారు. ఈ బృందానికి నాయకత్వం వహించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జఫ్రీన్‌ను అభినందించారు.

లీగ్‌కు దూరమైన హర్మన్

న్యూఢిల్లీ : గాయం కారణంగా భారత మహిళా క్రికెట్ జట్టు వైస్‌కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కియా సూపర్ లీగ్ టీ 20కి దూరమైంది. ఇంగ్లండ్‌లో ఆగస్టున 10న ఈ టోర్నమెంట్ ఆరంభం కానుంది. ప్రపంచకప్ సమయంలోనే భుజంనొప్పితో బాధపడిన హర్మన్‌కు అది మరింత బాధిస్తుండడంతో లీగ్‌లో ఆడడంలేదు. ముంబైలోని ఓ ఆస్పత్రిలో స్కానింగ్ తీయించుకోగా డాక్టర్లు నెలరోజుల పాటు విశ్రాంతి తీసుకొమ్మని సూచించారు. దీంతో ఆమె ఆగస్టు 10 నుంచి ప్రారంభమయ్యే కియో సూపర్ లీగ్‌కు దూరమవుతోంది.

ప్రపంచ చాంపియన్‌షిప్‌పై బోల్ట్ కన్ను



4 నుంచి మొదలు

పరుగుల చిరుత ఉసేన్ బోల్ట్ ఆఖరి పరుగు మరో మూడురోజుల్లో ప్రారంభం కానుంది. తన 16 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో రికార్డులు కొల్లగొట్టిన ఈ జమైకా స్ప్రింటర్ లండన్‌లో 4 నుంచి మొదలయ్యే ప్రపంచ చాంపియన్‌షిప్ అనంతరం ఇక విశ్రాంతి తీసుకోనున్నాడు. 8 సార్ల ఒలింపిక్ చాంపియన్ బోల్ట్ 100 మీటర్లలో తిరిగి టైటిల్ నిలబెట్టుకునేందుకు బరిలోకి దిగుతున్నాడు. ఈసారి అతడు 200 మీటర్లలో పోటీచేయడం లేదు. గత సంవత్సరం ఈ రెండింటిలోనూ అతడు ప్రపంచ రికార్డు బ్రద్దలు కొట్టాడు. దశాబ్దకాలంగా ఎదురులేకుండా ట్రాక్‌లో పరుగులు తీసిన ఈ మానవ పరుగుల మెషిన్ ఇప్పటివరకు 11 ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ పతకాలు అందుకున్నాడు. ఒక్క 100 మీటర్లలో బంగారు పతకం సాధించి తప్పుకోవాలని బోల్ట్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతడికి ఈ పోరులో కెనడాకు చెందిన ఆండీ డిగ్రాస్‌నుంచి గట్టి పోటీ ఎదురు కానుంది.

టైటాన్స్‌కు హ్యాట్రిక్ ఓటమి

హైదరాబాద్ : తెలుగు టైటాన్స్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓటమి పాలైంది. మంగళవారంనాడిక్కడ యుపి యోధతో గచ్చిబౌలి స్టేడియంలో తలపడిన ఆ జట్టు 13 పాయింట్ల భారీతేడాతో కంగుతింది. ఈ సీజన్‌లో కేవలం ఆరంభ మ్యాచ్‌లోనే విజయం అందుకున్న టైటాన్స్ అక్కడి నుంచి వరుసగా ఓటమి పాలవుతూ వచ్చింది. అలాగే ఈ సీజన్ నుంచే అరంగేట్రం చేసిన యుపి యోధ తొలి విజయాన్ని అందుకుంది.ఆ జట్టు అమోఘంగా రాణించి 31-18 తేడాతో రాహుల్ చౌదరి జట్టును చిత్తుచేసింది. తన జట్టును ఓటమినుంచి గట్టెక్కించడానికి చౌదరి తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. మరోవైపు యుపి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇరుజట్లు వరుసగా రైడ్లతో పోటీపడి చివరకు ఆరంభంలో 4-4 పాయింట్లతో సమంగా నిలిచాయి. కానీ ఇక్కడినుంచి యోధ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వరుసగా దాడులతో రెండు పాయింట్లు సాధించిన ఆ జట్టు అదే ఊపుతో ఆధిక్యం దిశగా సాగింది. యోధ ముందు చౌదరి అద్వితీయమైన రైడ్స్ ఏమీ ఫలించలేదు. ఈ క్రమంలో యోధ 10-8 కిదూసుకుని పోయింది. అదే దూకుడుతో యోధ వెళ్లినప్పటికీ మూడు పాయింట్లతో టైటాన్స్ కరాడా దాదాపు పర్యాటక జట్టు ఆధిక్యాన్ని ఒక పాయింట్ తేడాకు తీసుకుని వచ్చింది. దీంతో ప్రథమార్థం ముగిసేసరికి 12-11 గా ఉన్నాయి. ఇక ద్వితీయార్థంలో యుపి చక్కటి డిఫెన్స్‌ను ప్రదర్శించి టైటాన్స్‌ను బాగా నియంత్రించింది. ఈ పోటాపోటీనుంచి సురేందర్ సింగ్ సూపర్ రైడ్‌తో యోధ ఏకంగా 17-13 తేడాతో పైచేయిలో నిలిచింది. యోధ ఇదే దూకుడుతో తొలి ఆలౌట్ సాధించడం ద్వారా టైటాన్‌ను పూర్తిగా అడ్డుకోగలిగింది. దీంతో స్కోరు 23-14 కి యోధ తీసుకుని వెళ్లింది. ఇక ఇక్కడి నుంచి యోధ వెనక్కి చూసుకోలేదు. 8 పాయింట్లు అందుకోవడం ద్వారా ప్రత్యర్థిపై తిరుగులేని ఆధిక్యాన్ని సాధించగలిగారు. తెలుగు టైటాన్స్‌లో రాహుల్ 7 పాయింట్లు సాధించాడు. అదే యోధలో నితిన్ తోమర్ 6 పాయింట్లు రిశాంక్ 5, నితేశ్ కుమార్ 5 పాయింట్లు సాధించి పెట్టారు.

ప్రొ కబడ్డీలో యోధ గెలుపు



టైటాన్స్ - యోధ మ్యాచ్ దృశ్యం

ప్రొ కబడ్డీలో నేడు

మొదటి మ్యాచ్

గుజరాత్ పార్చూన్ జెయింట్స్ వర్సెస్ హర్యానా స్టీలర్స్
(గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం-హైదరాబాద్ రా 8గంనుంచి)

రెండో మ్యాచ్

తెలుగు టైటాన్స్ వర్సెస్ బెంగాల్ వారియర్స్
(గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం-హైదరాబాద్ రా 9 గంనుంచి)

గుజరాత్ గెలుపు

తొలి మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్ జట్టు 26-20 తేడాతో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. ఈ సీజన్‌లోనే తొలిసారిగా ప్రవేశించిన జెయింట్స్ అమోఘంగా రాణించి ప్రొ కబడ్డీలో తొలి గెలుపు అందుకుంది. ప్రథమార్థం ముగిసేసరికి 15-5 తేడాతో పూర్తి ఆధిక్యంలో ఉన్న జెయింట్స్ ద్వితీయార్థంలో మాత్రం వెనుకబడిపోయి కేవలం 11 పాయింట్లే సాధించగలిగింది. అయినప్పటికీ ఆరంభంలో సాధించిన ఆధిక్యం కారణంగా విజయాన్ని అందుకోగలిగారు. గుజరాత్‌కు సచిన్ 3 పాయింట్లు, ఫజల్ 4 పాయింట్లు సాధించగా దబాంగ్‌కు శ్రీరామ్ 5 టాప్ డిఫెండర్ అయిన సునీల్ 2 పాయింట్లు సాధించి పెట్టాడు.

నవంబర్‌లో శ్రీలంకతో హోం సిరీస్

ఖరారు చేసిన బీసీసీఐ

న్యూఢిల్లీ : శ్రీలంకతో హోం సిరీస్‌ను బీసీసీఐ ఖరారు చేసింది. నవంబర్ -డిసెంబర్‌లో శ్రీలంక జట్టు భారత్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భారత, శ్రీలంక 3 టెస్టులు ఆడతాయి. ఈ టెస్టులు కోల్‌కతా, నాగపూర్, ఢిల్లీలో జరుగుతాయి. ఆస్ట్రేలియాతో అక్టోబర్‌లో ఓ టీ 20 మ్యాచ్‌ను గౌహతిలో కొత్తగా నిర్మించిన బర్సాపారా స్టేడియంలో నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి బోర్డ్ టూర్స్, ఫిక్సర్స్ కమిటీ మంగళవారంనాడు నిర్ణయం తీసుకుంది. భారత జట్టుకు ఇది పెద్ద హోం సీజన్‌గా చెప్పొచ్చు. మొత్తం 3 సిరీస్‌లను నిర్వహిస్తారు. మొత్తం 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే తేదీలను మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. పండుగలు తదితర అన్నీ చూసుకున్న తర్వాతనే తేదీలను ఖరారు చేయనున్నామని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి తెలిపారు. కాగా సెప్టంబర్ నుంచి ఈ సీజన్ ఆరంభం కానుంది. ఈ క్రమంలో ఐదు వన్డే మ్యాచ్‌లను ఆస్ట్రేలియాతో (చెన్నై, బెంగళూరు, నాగపూర్, ఇండోర్, కోల్‌కతా) నిర్వహిస్తారు. అదేవిధంగా ఆస్ట్రేలియాతో మూడు టీ 20 మ్యాచ్‌లను హైదరాబాద్, రాంచీ, గౌహతిలో జరుపుతారు. తదుపరి అక్టోబర్ న్యూజిలాండ్‌తో సిరీస్ జరుగనుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు మూడు వన్డేలు..పుణషీ, ముంబై, కాన్పూర్‌లో ఆడుతుంది. తదుపరి మూడు టీ 20 మ్యాచ్‌లు ఢిల్లీ, కటక్, రాజ్‌కోట్‌లో జరుగుతాయి. ఇక చివరగా నవంబర్ మధ్య నుంచి శ్రీలంకతో సిరీస్ మొదలవుతుంది. తొలి టెస్టును కోల్‌కతాలో నిర్వహించనుండగా రెండోదాన్ని నాగపూర్, ఆఖరి టెస్టును ఢిల్లీలో నిర్వహిస్తారు. ఆపై నిర్వహించే మూడు వన్డేలు ధర్మశాల, మొహాలీ, విశాఖపట్టణంలో జరుగుతాయి. తదుపరి మూడు టీ 20 మ్యాచ్‌లు కోచీ లేదంటే తిరువనంతపురం రెండోదాన్ని ఇండోర్, ఆఖరి వన్డేను ముంబైలో జరుపుతారు.

శ్రీలంక పర్యటనను ముందుగా నిర్వహించడంపై చౌదరిని ప్రశ్నించినప్పుడు శ్రీలంకలో ఓ ఇండిపెండెన్స్‌కప్‌ను నిర్వహిస్తున్నందున ఇండియాతో సిరీస్‌ను కాస్తా ముందుకు జరిపినట్లు చెప్పారు. సహజంగా శ్రీలంక, ఇండియాతో అన్ని విషయాల్లో సహకరిస్తున్నందున వారికి అనుగుణంగా తాము సహకరించామన్నారు.

ఆస్ట్రేలియాతో...

5 వన్డేలు -చెన్నై, బెంగళూరు, నాగపూర్, ఇండోర్, కోల్‌కతా
3 టీ 20 మ్యాచ్‌లు -హైదరాబాద్, రాంచీ , గౌహతి

న్యూజిలాండ్‌తో...

3 టెస్టులు - కోల్‌కతా, నాగపూర్, ఢిల్లీ
3 వన్డేలు - ధర్మశాల, మొహాలీ, విశాఖపట్టణం
3 టీ 20 మ్యాచ్‌లు -కోచీ లేదా తిరువనంతపురం, ఇండోర్, ముంబై

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.





హర్షిత్ శర్మ.... పదహారేళ్ల కుర్రాడు... గూగుల్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. ఇతని వార్షిక వేతనం 1.44 కోట్లు. ప్రస్తుతం ప్రభుత్వ కాలేజిలో పన్నెండవ తరగతి చదువుతున్నాడు. నాలుగు లక్షల స్టైఫండ్‌తో ఏడాది పాటు ఇతనికి శిక్షణ ఉంటుంది. తరువాత నెలకు పన్నెండు లక్షల జీతంతో ఉద్యోగంలో కొనసాగుతాడు. పదేళ్ల వయసులో మేనమామ వద్ద గ్రాఫిక్ డిజైనింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. బాలివుడ్ హాలివుడ్ సినిమాలకు పోస్టర్లు డిజైన్ చేసి నెలకు నలభై యాభై వేలు సంపాదించేవాడు. గూగుల్ లో జాబ్ కొట్టాలని ప్రయత్నించి విజయం సాధించాడు. ఇతను ప్రధాని కార్యాలయం నిర్వహించిన డిజిటల్ ఇండియాలో గెలుపొంది... 7వేలు రివార్డు సాధించాడు. పెద్ద కలలు కనండి...అంతకంటే పెద్ద ఛాలెంజ్ లను తీసుకుని విజయాలు సాధించండి...అనే సందేశంతో హర్షిత్ శర్మ తన తోటి పిల్లలకు స్ఫూర్తిగా నిలిచాడు.





ముంబయికి చెందిన 14ఏళ్ల కుర్రాడు. అంథేరిలోని ఇంటర్నేషనల్ స్కూల్లో తొమ్మిది చదువుతున్నాడు. పైలట్ కావాలని, రష్యాకు వెళ్లి శిక్షణ తీసుకోవాలని కలలు కనేవాడు. కానీ అదే రష్యాలో పుట్టిన ఒక వీడియో గేమ్‌కి బలైపోయాడు. ఉన్నత కలలుకనే ధైర్యమున్న అతడిని సరిగ్గా గైడ్ చేసి ఉంటే పైలటే అయి ఉండేవాడేమో. కానీ చెడు అతడిని సమర్థవంతగా గైడ్ చేసింది. అందుకే బ్లూ వేల్ అనే ఆన్‌లైన్ సూసైడ్ ఛాలెంజ్ గేమ్ బారినపడి ప్రాణాలు తీసుకున్నాడు. రష్యాలో పుట్టిన ఈ క్రీడ 50 లక్ష్యాలను ఇస్తుందని...చివరగా ఆత్మహత్యకు పురికొల్పుతుందని తెలుస్తోంది. ఆ కుర్రాడు తీసుకున్నది కూడా అతి పెద్ద ఛాలెంజే...ఇతను కూడా అసాధారణ కుర్రాడే. ఒక ఆటకోసం ప్రాణాలను పణంగా పెట్టగల తెగువ తెగింపు ఉన్న కుర్రాడు...అచ్చంగా హర్షిత్ శర్మ అంతటి తెలివైన వాడే అయ్యుంటాడు కూడా. కాకపోతే హర్షిత శర్మ..టీనేజి దశలో తనలో ఉన్న క్రియేటివిటీని, శక్తి సామర్థ్యాలను ప్రగతివైపు మళ్లిస్తే....ఇతను పతనం వైపు వెళ్లాడు.

టీనేజి ఛాలెంజ్!

ప్రగతా...పతనమా!?

టీనేజి అమ్మాయి లేదా అబ్బాయి....తన ఇంట్లోనే తానో అపరిచితుడు... అపరిచితురాలు. అంతేనా తమకు తామే అపరిచితులు కూడా. ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఆలోచనల అలలు...ఆడా మగా అనే వ్యక్తిత్వ గుర్తింపునిస్తున్న శారీరక మార్పులు, నువ్వూ ఓ మనిషివి నీ అభిప్రాయాలకు విలువుంది...అంటున్న అంతరాత్మ. వెరసి ప్రపంచమంతా కొత్తకొత్తగా పచ్చపచ్చగా కనిపించేవయసు. ఏ విషయమైనా తీవ్రంగా ఆకర్షించే తరుణం. ఇదో రెండు రోడ్ల కూడలి. ఎటు వెళతావు...అంటూ అంతరాత్మ ఘోష. ఆకాశానికి నిచ్చెనలు వేయడానికైనా, అథఃపాతాళానికి పడిపోవడానికైనా తగిన శక్తి బాంఢాగారాన్ని తలపై మోస్తున్న వయసు. అందుకే..హార్మోనల్ ఇంబాలన్స్ అని కొట్టి పారేయకుండా...ఆ వయసుని మంచిపనుల వైపు మళ్లించాలి...అప్పుడే హర్షిత్ శర్మలు తయారవుతారు. లేకపోతే అదే వయసు అథః పాతాళానికి దూకేయమంటుంది.. బ్లూవేల్ సూసైడ్ ఛాలెంజ్‌ని తీసుకుని ఏడంతస్తుల పైనుండి దూకేసిన కుర్రాడిలా....

ఒకే వయసులో ఉన్న కొంతమంది పిల్లలు అద్భుతాలు చేసి చూపుతుంటే కొంతమంది మాత్రం ఎందుకిలా జీవితాలను పణంగా పెట్టి పెడదోవ పడుతున్నారు. ఒకటి నిజం.... మన సమాజంలో మంచివైపు పిల్లలను ఆకర్షించే విషయాలకంటే తాత్కాలిక ఆనందం, ఉత్తేజాలను ఇచ్చే వాటివైపు పిల్లలను ఆకర్షిస్తున్న అంశాలు ఎక్కువగా ఉన్నాయి. టీనేజిలో ఉన్న పిల్లల శక్తిని ఛానలైజ్ చేయటం అనేది చాలా ముఖ్యం. వారికి లక్ష్యాన్ని నిర్దేశించడం...ఆ లక్ష్య సాధన దిశగా ప్రోత్సహించడం, నిరంతరం మోటివేట్ చేయటం...ఇవన్నీ చాలా తక్కువగా జరుగుతుంటే... పిల్లలను చెడువైపు ఆకర్షిస్తున్న అంశాలు ఎక్కువగా ఉన్నాయి. స్కూలు పిల్లలు డ్రగ్స్ తీసుకుంటున్నారని ఈ మధ్యకాలంలో గగ్గోలు పెట్టాం. వారు డ్రగ్స్‌ని తీసుకోవటం కంటే...అవి వారికి అందుబాటులోకి రావటం, డ్రగ్స్ తీసుకోవాలనిపించే మానసిక స్థితిలో వారు ఉండటం...అనేవి మరింత ఘోరమైన విషయాలు. టీనేజిలో తెలుసుకోవాలనే ఉత్సాహం, తమ ఐడెంటిటీని నిరూపించు కోవాలనే ఆత్రుత ఎక్కువగా ఉంటాయి. ఈ గుర్తింపు అనేది సరైన మార్గాల ద్వారా రాకపోతే...ఆ వయసు చెడు మార్గాలను వెతుక్కుం టుంది. తల్లిదండ్రులు పిల్లలపై చూపించే శ్రద్ధ, గురువుల నుండి ప్రోత్సాహం, సమాజం నుండి సరైన మార్గదర్శనం వారిని మంచి విషయా లవైపు మళ్లించే అంశాలు . ఇవి మూడు ఇప్పుడు ఎంతగా కరువై పోయాయో... ముంబయి కుర్రాడి ఉదంతం చెబుతోంది. కంప్యూటర్‌ని ఇంటర్‌నెట్‌ని వినియో గించుకుని హర్షిత్ శర్మ ఒక విద్యలో నిష్ణాతుడు అయ్యాడు. ప్రపంచంలోని యువతకే మార్గదర్శకంగా నిలిచాడు. అదే కంప్యూటర్, ఇంటర్నెట్‌తో... అతని తోటిపిల్లలే ఇలా ప్రాణాలతో చెలగాటమాడే ఆటలు ఆడి ప్రాణాలు తీసుకుం టున్నారు.

టెక్నాలజీయే కారణమా...

ఇలాంటి విషయాలు విన్నప్పుడల్లా మనం టెక్నాలజీనే ముందుగా తప్పు ఎడుతూ పోతున్నాం. ఇంటర్‌నెట్ ద్వారా పిల్లలకు అందుతున్న చెడుగురించి మాట్లాడుకుంటున్నాం. కానీ దాన్ని నియంత్రించలేమని...మంచి కోసం దాన్ని పెంచుతున్న కొద్దీ...చెడు కూడా అంతేస్థాయిలో బయటకు వస్తుందని తెలిసిపోయింది. ఇక నియంత్రణ అనేది టెక్నాలజీకి కాదు...దాన్ని లోపలికి తీసుకోవాలా...వద్దా...అనే మెదడు దగ్గరే జరగాలని తేటతెల్లంగా తెలిసి పోయింది. హర్షిత్ శర్మ, అంథేరీ కుర్రాడు...ఇరువురు పుట్టిపెరిగిన వాతావరణం, పరిస్థితులు, వారి తల్లిదండ్రుల ఆలోచనలు, వారిని ప్రభావితం చేసిన వ్యక్తులు...ఇవన్నీ అధ్యయనం చేయాల్సిన అంశాలు. పిల్లలు బాగుపడటానికి, చెడిపోవడానికి మనం అనేక కారణాలను చెబుతుంటాం. కానీ ఏ ధాన్యాన్ని మరపట్టిస్తే...ఆ పిండే వస్తుంది అనటం ఎంత నిజమో...పిల్లల్లో మనం ఏ గుణాలు నింపుతామో...అవే బయటకు వస్తాయి అనేది అంత నిజం.

మన చేతుల్లో ఏమీ లేదా....

చాలామంది తల్లిదండ్రుల వాదన ఇది. నిజం కూడా. పిల్లలు తల్లిదండ్రులతో ఉండటం కంటే...స్కూల్లో, ట్యూషన్లలో, కంప్యూటర్ల ముందు, స్నేహితులతో ఎక్కువ సమయం ఉంటున్నారు. వారు ఏ సమయంలో ఎవరి వలన ఎలా ప్రభావితం అవుతున్నారో తెలుసుకోవటం కష్టం. వారిని మార్చడమూ కష్టమే. దీనికి ఏకైక పరిష్కార మార్గం...వారికి మంచి లక్ష్యాలను నిర్దేశించడమే. లేదా వారే లక్ష్యాలను నిర్దేశించుకునేలాంటి పరిస్థితులు కల్పించడం. ఎలా ఉండ కూడదో..మనం వందసార్లు చెబుతాం. కానీ ఎలా ఉండాలో స్పష్టంగా చెప్పలేము. బాగా చదువు, ఉద్యోగం సాధించు, డబ్బు సంపాదించు...అని కట్టె కొట్టె తెచ్చే లాంటి లక్ష్యాలు పిల్లలను మార్చలేవు. వారిని వారివైన కలల వెంట వెళ్లనివ్వాలి. వారికి నచ్చిన విషయంలో ప్రోత్సహించి విజయాలు సాధిం చనివ్వాలి. విజయాలంటే...మెడల్స్ ట్రోఫీలే కాదు...పాటలు నేర్చుకున్న అమ్మా యి...పబ్‌కి వెళ్లేబదులు తనపాటలో ఆనందాన్ని వెతుక్కోవడమూ విజయమే. టీనేజిలో పిల్లలు అలా కలల వెంట వెళ్లకపోతేనే...ఇలాంటి వలలు వారిని పట్టుకుంటాయి.

ఆ లక్షణాలు సాధారణం...ఎటు మళ్లిస్తున్నాం అనేదే ముఖ్యం

టెన్షన్, ఒత్తిడి, ఏం చేయాలో తెలియకపోవటం, ఎంజాయిమెంట్ గుర్తింపుల కోసం వెతుకులాట, అయోమయం గందరగోళం...ఇవన్నీ టీనేజిపిల్లలను ఒక ఆట ఆడిస్తుంటాయి. స్పష్టత, ప్రశాంతత, ఏం చేయాలో తెలిసి ఉండటం, ఏం అక్కర్లేదు అనేది అంతకంటే బాగా తెలిసి ఉండటం....ఇవీ విజయాలు సాధించే వారి లక్షణాలు. ముఖ్యంగా మనల్ని ఎప్పుడూ ఆలోచనలే నడిపించవు. లక్ష్యం బలంగా మరింత బలంగా మారిన కొద్దీ అది ఉద్వేగంగా మారిపోతుంది. ఆ పనిని చేయకుండా ఉండలేని స్థితి ఏర్పడుతుంది. హర్షిత్ శర్మని కూడా అలాంటి బలమైన ఉద్వేగమే నడిపించి ఉంటుంది. టీనేజి పిల్లలను నెగెటివ్ వైపు మళ్లించేవారు కూడా వారి మానసిక ఉద్వేగాలతో ఆడుకుంటారు. కుతూహలం, సాహస మనస్తత్వం..ఛాలెంజింగ్‌గా ఉండేతత్వం...ఏది విన్నా నిజమని నమ్మే అమాయకత్వం ఇవన్నీ పిల్లల్లో ఉండే సాధారణ లక్షణాలు వాటిని మంచివైపు మళ్లిస్తే...పిల్లలు హర్షిత శర్మలవుతారు. లేకపోతే.. .అన్యాయంగా టెక్నాలజీకో, మాదకద్రవ్యాలకో, బద్ధకానికో, చెడు మార్గాలలో అయినా డబ్బుని సంపాదించాలనే ప్రలోభాలకో లొంగిపోతారు.

మన దగ్గర కస్టమైజ్ డ్ సైకాలజీ లేదు

పిల్లలకు వారి శరీరానికి సరిగ్గా సరిపోయేలా బట్టలు కొంటాం. ఆభరణాలు కొంటాం...చెప్పులు షూలు కొంటాం. అంటే ఎవరికి తగినట్టుగా వారికి అన్నీ



దొరుకుతాయి. కానీ ప్రతి అమ్మాయికి అబ్బాయికి తగినట్టుగా సలహాలు సూచనలు ఇచ్చే విధానాలు లేవు. టీనేజి సైకాలజీ...అంటున్నాం...కానీ అది ఆకాశం, సముద్రం... అన్నంతగా సాధారణీకరించిన పదం. కానీ ప్రతి అల, ప్రతి కెరటం, ప్రతి మబ్బు వేరుగా ఉన్నట్టే...ప్రతి అమ్మాయి అబ్బాయి చాలా ప్రత్యేకం. వారికి సరైన వయసులో సరైన సలహాలు ఇచ్చే మనుషులు కావాలి. వారికి వారికోసం ప్రత్యేకంగా సైకలాజికల్ కౌన్సెలింగ్ కావాలి. లేకపోతే పిల్లలు సినిమాల్లో వచ్చే పాటలు, ఫేస్‌బుక్కుల్లో వచ్చే ప్రేమ కొటేషన్లు నిజమనుకుంటారు. చివరికి ఇలాగే జీవితంలో ఏం చేయాలో...జీవితాన్ని ఏం చేసుకోవాలో తెలియని స్థితికి చేరతారు. 'నీకేమనిపిస్తుంది... ఏ ఆలోచనలు వస్తున్నాయి...ఏం చేయాలనిపిస్తోంది. ఏది నీకు ఆనందాన్ని ఇస్తోంది...ఏది బాధని మిగులుస్తోంది' పిల్లలను ఇలాంటి ప్రశ్నలు వేసే ఇల్లు కానీ స్కూలు కానీ ఒక్కటైనా ఉందా?

వాళ్లలోనూ వీళ్లలోనూ ఉన్నది ఉత్తేజమే!

అర్జున్ సంతోష్‌కుమార్ అనే పదహారేళ్ల కుర్రాడు ల్యాటరా లాజిక్స్ అనే యాప్స్ డెవలప్ మెంట్, వెబ్ డెవలప్‌మెంట్ కంపెనీకి స్థాపకుడు సిఇఓ. శ్రావణ్ , సంజయ్ కుమారన్ అనే 16, 14 ఏళ్ల పిల్లలు గో డైమన్షన్స్ అనే కంపెనీకి స్థాపకులు సిఇఓ, అధ్యక్షులు. 18ఏళ్ల వయసులో శ్రీలక్ష్మీ సురేష్ ఈ-డిజైన్ టెక్నాలజీస్ సంస్థకు ఫౌండర్, సిఇఓ...ఇలాంటి టీనేజి పిల్లలు మన కళ్లముందు చాలామంది కనబడతారు. మరోవైపు ఎంతమంది పిల్లలు నీలిచిత్రాలు చూడటానికి అడిక్ట్ అయిపోయారు..ఎంతమంది టీనేజర్లు మాదకద్రవ్యాల బారిన పడి బాల్యాన్ని జీవితాన్నిపోగొట్టుకుంటున్నారు, ఎంతమంది స్కూలు వయసు దాటకముందే ప్రేమలోపడి విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారు...అనే లెక్కలు వేసుకుంటే అవి వేలు లక్షల్లోనే ఉంటాయి. పదుల సంఖ్యలో పిల్లలు పదునుగా ముందుకు వెళుతుంటే...లక్షల మంది పిల్లలు విలువైన కాలాన్ని జీవితాలను వదులుకునే దిశగా వెళుతున్నారు. అందుకే ఇలాంటి పనికిమాలిన ఛాలెంజి గేములు ఆడుతున్నారు. అందుకే టీనేజి...పిల్లలకు తల్లిదండ్రులకు సమాజానికి అందరికీ ఛాలెంజిగా మారింది.

\- వడ్లమూడి దుర్గాంబ

డేంజర్ గేమ్స్

టీనేజ్‌లోకి ప్రవేశించిన కుర్రకారుకు సాధారణంగా స్పీడ్ ఎక్కువ. ఆవేశానికి బ్రేక్ లుండవు. ఎప్పుడు ఎక్కడ యాక్సిడెంట్ అవుతుందో తెలియదు. అయ్యాక అయ్యో పాపం అనుకోవడం తప్ప చేయడానికంటూ ఏమీ ఉండ దు. ప్రస్తుతం టీనేజర్లకు ఆన్‌లైన్ గేమ్స్ ఆధారంగా జరిగే యాక్సిడెంట్లతో ఏకంగా ప్రాణాలే పోతున్నాయి. పిల్లలు కదా ...ఏదో సెల్‌ఫో న్లో కుదురుగా గేమ్స్ ఆడుకుంటున్నారని మనం కామ్‌గా కూర్చున్నా... అక్కడ జరిగేది జరిగిపోతుంది. ఒకవిధంగా చెప్పాలంటే ఆన్‌లైన్ గేమ్స్ రూపంలో డేంజర్ బెల్స్ ఓ రేంజ్లో మోగుతున్నాయి. వీటిని విన్న పేరెంట్స్ ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే జరగాల్సిన అనర్థాలు మరిన్ని జరిగిపోవడం ఖాయం.

డిఫెన్స్ ఆఫ్ ది ఏన్షియంట్ గేమ్

2015లో... రష్యాకు చెందిన రుస్తం అనే 17 ఏళ్ల కుర్రాడికి కాలు ఫ్రాక్చర్ అయింది. దీంతో అతను ఇంటి పట్టునే ఉంటు న్నాడు. ఏమీ తోచక కంప్యూటర్ లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం షురూ చేశాడు.



అందులో అతనికి డిఫెన్స్ ఆఫ్ ది ఏన్షియం ట్ గేమ్ బాగా నచ్చేసింది. అంతే... ఏక బిగిన 22 రోజుల పాటు ఆ ఆన్‌లైన్ గేమ్ ఆడేశాడు. జస్ట్ మధ్య మధ్యలో ఏదో స్నాక్స్, లైట్‌గా ఫుడ్ తినేవాడు. కాని అతని దృష్టంతా ఆ గేమ్ పైనే ఉండేది. ఒక రోజు అనుకోకుండా కుప్ప కూలిపోయాడు. హాస్పిటల్‌కు తీసుకెళ్లేసరికి అతను చనిపో యాడు. విషయం ఏంటా అని ఆరాతీస్తే మితిమీరిన ఆన్ లైన్ గేమ్స్ ఆడటమే అని రిపోర్ట్‌లో తేలింది. ఇలాంటి సంఘటనే అప్పటికే చైనాలో ఒకటి జరిగింది.

పోకెమాన్ గేమ్

ఎన్నో వివాదాలకు కేంద్రబిందువైన ఆన్ లైన్ గేమ్ ... పోకెమాన్ . గత ఏడాది ప్రపంచాన్ని ఓ కుదుపు కు దిపింది. ఈ గేమ్ పుణ్యమా అంటూ ఎంద రో పిల్లలు ,కుర్రవాళ్లు ప్రమా దాల బారిన పడ్డారు. చైనా అయితే ఈ గేమ్ ను తమ దేశంలో ఆడడానికి వీల్లేకుండా చేసింది. పోకేమాన్ అంటే జపాన్ లో పాకెట్ మాన్‌స్టర్ కు సంక్షిప్త రూపం. మనుషులు కల్పిత ప్రపంచం లో తిరగడమే పోకెమాన్ గేమ్ ఉద్దేశ్యం. ఈ ఆటకు లొకేష న్ మ్యాప్ లింకై ఉంటుంది. ఆడేవారి ఉద్దేశ్యం ఎలాగైనా సరే వీలైనన్ని ఎక్కువ పోకెమాన్‌లను సంపా దించి... పోకెమాన్ మాస్టర్ కావాలని. జంతు వులు, మాయలు, మంత్రాలు ఉండ డంతో ఆటోమేటిక్ గానే ఎక్కువగా ఈ గేమ్ పిల్లలలోకి వెళ్లిపోయింది . గ్వాటెమా లాలో ఇద్దరు అన్న ద మ్ములు ఈ గేమ్ ఆడు తూ ఓ సీక్రెట్ ప్లేస్ కు వెళ్లిపోయారు. అక్కడున్న దుండగులు జీపి యస్ సాయంతో వీరు తమల్ని పట్టుకోవడానికి వచ్చారని భావించి ఇద్దరిలో ఒకరిని కాల్చి చంపేశారు.



టచ్ మై బాడీ ఛాలెంజ్

ఆన్‌లైన్ గేమ్‌గా వచ్చి ఫిజికల్ గేమ్ గా మారిపోయిన మరో అభ్యంతరకర గేమ్... టచ్ మై బాడీ ఛాలెంజ్ .ఇది కూడా గొడవలు తెచ్చేదిగా, సమస్యలు పుట్టించేదిగా తయా రైంది. భార్యభర్తలు,లవర్స్ ఆడుకో వల్సిన ఈ ఆటను... ఫ్రెండ్స్ సమక్షంలో ఆడుకో వడం పాశ్చాత్య దేశాలలో జరుగు తుంటుంది. ఐతే ఈతరహా గేమ్స్ మనదేశంలో పబ్ కల్చర్, డ్రగ్స్ కు బాగా అలవాటుపడిన హై ఫై సర్కిల్స్ లో ఉంటుందనే టాక్ ఉంది. ఈ ఆటను ఇద్దరు ఆడాల్సి ఉంటుంది. అందుల్లో ఒకరి కళ్లకు ఇంకొకరు గంతలు కట్టి... తమ శరీర భాగాలను వారి వేలితో టచ్ చేయిస్తుంటారు. వారు టచ్ చేసిన శరీర భాగం ఏంటో స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. ఆ తర్వాత మరొకరు ఆడాలి. ఎవరికి ఎన్ని పాయింట్లు వచ్చాయో ఫైనల్ గా లెక్కగట్టి విజేతగా ప్రకటిస్తారు.



బ్లూవేల్ సూసైడ్ ఛాలెంజ్

ఈ ఆటలో ఏం చెబితే అది చేస్తూ ముందు కు పోతూ ఉండాలి మొదట చేతిపై



గాయం చేసుకోమంటాడు. ఆత ర్వాత 10 అడుగులు గోడమీద నుంచి దూకేయమంటాడు. ఇంకా ముందుకు పోతే దూకుతూ సెల్ఫీ దిగమంటాడు. ఈ స్టేజ్ లోనే మన ముంబయి కుర్రాడు మేడ పిట్టగోడమీద నుంచి క్రిందకు దూకేశాడు. రష్యాతో పాటు మిడిల్ ఈస్ట్ దేశాలలోను ఈ మృత్యుక్రీడ ఇప్పుడిప్పుడే జడలు విప్పుకుంటోంది. ఈ ఆట గురించి.. ఈసంఘటన గురించి తెలిసిన తర్వాత చాలా మంది అసలు ఈ ఆట ఏంటో తెలుసుకోవాలని తాపత్ర యపడు తున్నారు. అది ఎలాంటి ప్రమా దాలకు దారి తీస్తుందో తలచు కుంటేనే ప్రమాద ఘంటికలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమై పోతుంది. ఇవనే కాదు స్నాప్‌చాట్ స్ట్రీక్స్, సాల్ట్ అండ్ ఐస్ చాలెంజ్, మౌత్ గార్డ్ ఛాలెం జ్‌తో పాటు చార్లీ చాప్లిన్ పెన్సిల్ గేమ్ ఛాలెంజ్ , 3 ఏఎమ్ ఓవర్‌నైట్ ఛాలెంజ్‌లున్నాయి. ఇవన్నీ విద్యార్థుల పాలిట మృత్యుకుహురాలుగా మారాయి. గల్ఫ్ కంట్రీస్ ,కొరి యన్ దేశాల్లో ఉండే చట్టాల ప్రకారం ఇలాంటి గేమ్స్ ఆయా దేశాలలో నిషిద్ధం.ఇదే తరహాలో మిగతాదేశాలకు నిషిద్ధ ఆజ్ఞలు జారీ అయితే పిల్లలకు ఈ తరహా డేంజర్ గేమ్స్ తో ముప్పు తప్పుతుంది, లేకపోతే ఇలాంటి గేమ్స్ ను తయారు చేసేవారు.. ఇంకా తయారుచేస్తూనే ఉంటారు. ఆడేవారు ఆడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటూనే ఉంటారు.

డియోడరెంట్ ఛాలెంజ్

డియోడరెంట్ ఛాలెంజ్ అల్లరి పిల్లలు ఎక్కువగా ఆడే ఆన్‌లైన్ గేమ్ . దీనిని కూడా ఫిజికల్ గేమ్‌గా మార్చేశారు. ఈ గేమ్‌లో పిల్లలు రకరకాల డియోడరెంట్‌లను తమ చేతిపై స్ప్రే చేసుకుంటారు.అలాగే స్ప్రే చేసిన చోటనే మరింత ఎక్కువగా చేయడం వలన దాని మోతాదు పెరిగి ఆ శరీర భాగంలో చర్మం సమస్యకు గురవుతుంది. చివుక్కు మంటుంది. ఎవరు ఎంత ఎక్కువ మోతాదులో డియెడరెంట్ స్ప్రే చేసుకుని బాధపడకుండా ఉంటే... వారు అంత భాగా గెలిచినట్లు. డియోడరెంట్ ఛాలెంజ్ వలన యూరోపియన్ దేశాలలో పిల్లలు స్కిన్ ఎలర్జీలకు గురై ఎంతగానో బాధపడు తున్నారు.



పాస్ అవుట్ ఛాలెంజ్



యూరప్ లో సెంట్రల్ స్కూల్ పిల్లలు ఎక్కువగా ఆడే మరో మృత్యుక్రీడ. ఈ ఆటలో పార్టిసిపెంట్స్ ఎందరైనా ఉండ వచ్చు. అయితే అందరూ తమ శ్వాసను కపా లబాతి తరహా లో నాన్ స్టాప్ గా బయటకు వదిలేయాలి. ఈప్రక్రియలో గాలి పీల్చుకోకూ డదు. కొన్ని సెకన్లు అయ్యాక వెంటనే నోటిలో బొటన వేలు పెట్టుకుని అలాగే ఉండాలి. ఈ క్షణంలో చాలామంది పిల్లలు స్పృహ కోల్పో తుంటా రు. మెదడుకు రక్త ప్రసరణ సరిగా లేకపోవడంతో అంతకు మించిన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి.

కాలిఫోర్నియా నాక్ అవుట్ ఛాలెంజ్

ఇద్దరు చిన్నారులు ఎవరి సత్తా ఏంటో తెలుసుకోవాలని ఒకరిని గోడకు నిల్చుని జారబడమని చెబుతారు. అతను తన రెండు చేతులను తన ఛాతీకి రక్షణగా ఉంచుకుంటాడు. ఇంకొకడు అతని ఛాతీపై ఫోర్స్ గా నొక్కుతాడు. అతను నొక్కినంత సేపు నిల్చున్నవాడు అలాగే ఉండాలి. ఒకవేళ ఊపిరాడక క్రింద పడిపోతే అతను ఎంతసేపట్లో అలా పడిపోయాడో టైమ్ లెక్క గడతాడు. ఆ తర్వాత తనను అలా నొక్కినవాడిని వీడు కూడా సేమ్ ఆదే విధంగా నొక్కుతాడు. అతనెంత సేపు ఊపిరి బిగబట్టుకుని ఉన్నాడో చూస్తాడు. చివరకు ఎవరు ఎక్కువ సేపు ఉన్నా రో చూసి... విజేత ఎవరనేది ప్రకటిస్తారు. కాలిఫోర్ని యాలోస్కూలు విద్యార్థులు ఆడుకునే ప్రమాదకర ఆటల్లో ఇదీ ఒకటి. దీని వలన కొన్ని సందర్భాల్లో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి గుండె ఆగిపోవచ్చు.



\-సూర్యమ్ కలిదిండి

చింతన

శ్రీ కృష్ణ స్తుతి



శివుడవా! కేశవుడవా! మా
ధవుడవా! అణువువా! పరమాణువువో!
భవుడవా! కమలభవుడవో!
శివమంత్రమె మా జీవము శీలా కృష్ణా॥

తారక మంత్రము కోరిన
దొరికెను, తనివారక నోముగపాడెదమూ
నరహరి! గరుడాధీశా!
మురహర! నరకాంతక! వీరుడవే కృష్ణా॥

మానుషవేషివి! లీలా
మానుషవేషివి! నటనల మాని సి వేరా!
మానస కల్మష హారీ!
మానరులకు ఔషధమే మామవ కృష్ణా॥

నాటక సూత్రము నడిపీ
హాటక మయ చేలముతో సందడివే!
ఘోటక చలనము నాపే
పాటల నావవు నీవే నర్తన కృష్ణా॥

నీ నగుమోమే సుందర
మౌనగమై మమ్మేలును మానుష రూపా!
నీ నగవులు సిరులొలికే
తేనెలసోనలు ఇల మాతేపవు కృష్ణా॥

తెరచాపవు నీవే, వా
తెర తేనెలసోనల కురిసే తేటవిరా!
తెరలను తొలగించీ మా
నరులకు దేశికుడవు నారాయణ కృష్ణా॥

- ఊటుకూరి సుహాసిని

భారతీయ ఆధ్యాత్మికత విశిష్టం

ధర్మానికి ఈ ప్రపంచంలో ఒక దీపస్తంభంగా నిలిచింది మన భారతదేశమే. మనం ఆలోచించి చూస్తే, ఎన్నో రకాలుగా ధర్మం వివిధ శక్తుల మీద స్థిరపడింది. వేదశక్తి, దైవశక్తి, తపోశక్తి, పతివ్రతా శక్తులు కూడా ధర్మసంస్థాపనలో ఆధారభూతాలుగా నిలిచి వున్నాయి. ఒకవిధంగా ఇవన్నీ నాలుగు స్తంభాలుగా నిలుస్తున్నాయి.



దేవుడున్నాడని నమ్మేవారు ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ కోట్లాదిగా వున్నారు. ఎవరికి తోచిన విధంగా వారు దేముని పిలుచుకుంటారు. అయితే పూర్ణ విశ్వాసం మాత్రం ఆయన మీద ఉండాలి. అలా నమ్మినవారికి ఆయన తోడుగా వుండి కాపాడతాడని నమ్ముతున్నారు. వారికి ఆయన ఆశీస్సులను అందిస్తున్నాడు, రక్షణని కల్పిస్తున్నాడు. దీక్షగా ఆధ్యాత్మిక సాధన కొనసాగించగలిగితే జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించగలుగుతారు. పట్టుదలగా ప్రయత్నిస్తే జీవన్ముక్తులు కాగలరని ఎందరో మహాత్ములైనవారు నిరూపించారు. అయితే ఇందుకు సంసార బంధాలను విడనాడి ప్రయత్నించాల్సిన అవసరం లేదని ఎందరో నిరూపించారు. మన బాధ్యతను నిర్వహిస్తూ కూడా నిష్కామంగా ఫలితాన్ని ఆశించకుండా కర్మ చేస్తూ ఆ విధమైన దశకు చేరినవారున్నారు. భారతదేశంలో ముఖ్యమైన మతం హిందూమతం, అదొక మతమే కాదు. ఒక జీవనశైలి. హిందూ మతానికి మూలాధారంగా అందించబడినవే వేదాలు. ఈ వేదాల్లో ముఖ్యంగా చెప్పబడింది వ రా న వ్ర డి శ్రేయస్సే. ప్రతి ప్రాణిలోనూ దేవుని చూడటం, ప్రపంచాన్ని వసుధైక కుటుంబంగా చూడటం, మూడవది ముఖ్యంగా కర్మ సిద్ధాంతం. ప్రపంచంలోని వివిధ మతాలు, పలురకాలుగా దేముని కొలుస్తూ వున్నాయి. ఒకరు ధ్యానమార్గాన్ని ఎంచుకుంటే, మరొక మతం కరుణనూ, ఇంకొక మతం నామజపాన్ని పాటిస్తున్నాయి. అయితే అన్ని మతాలు కూడా ధర్మాన్నే అనుసరిస్తున్నాయి. ఇక సనాతన ధర్మంలో కూడా వీటికే ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. భక్తి, జ్ఞాన, వైరాగ్య మార్గాల ద్వారా కూడా భగవంతుని సాన్నిధ్యాన్ని అనుభవించవచ్చునని చెప్పబడింది. ధర్మానికి ఈ ప్రపంచంలో ఒక దీపస్తంభంగా నిలిచింది మన భారతదేశమే. మనం ఆలోచించి చూస్తే, ఎన్నో రకాలుగా ధర్మం వివిధ శక్తుల మీద స్థిరపడింది. వేదశక్తి, దైవశక్తి, తపోశక్తి, పతివ్రతా శక్తులు కూడా ధర్మసంస్థాపనలో ఆధారభూతాలుగా నిలిచి వున్నాయి. ఒకవిధంగా ఇవన్నీ నాలుగు స్తంభాలుగా నిలుస్తున్నాయి. మహిళ తన ధర్మబద్ధమైన జీవితం ఆధారంగా అన్ని యుగాల్లోనూ ఒక శక్తిగా తన విశిష్టతను నిరూపించుకుంది. భారత పౌరుడికి ముఖ్యంగా గౌరవాన్ని ఆపాదించింది అతని ధర్మబద్ధమైన జీవనవిధానమేనని తెలియాలి. భారతదేశ రాజ్యాంగం ప్రపంచదేశాల్లోనే ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించుకుని వుంది. దానికి కారణం ధర్మపరిరక్షణే ధ్యేయంగా అది రూపొందింది. అందరూ భగవంతుని బిడ్డలే. అన్నిమతాలూ దేవుని చేరుకోవ డానికే వున్నాయి. మత వివక్ష పనికిరాదని మన రాజ్యాంగం బోధించింది. ఎవరి ఇష్టానుసారం, ఎవరి సంప్రదాయం ప్రకారం వారు భగవంతుని ప్రార్థించుకోవచ్చును. ఎక్కడైనా భగవంతుని ఆరాధించవచ్చును. అది మసీదు కావచ్చును, చర్చి కావచ్చును, దేవాలయం కావచ్చును. చెట్టుక్రిందో, పుట్టవద్దో, రోడ్డుమీదనో, హిమాలయాల్లోనో, నది ఒడ్డునో ఎక్కడైనా ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా దైవాన్ని ప్రార్థించుకోవచ్చును. ఎవరిష్టం వచ్చినట్లుగా ఆయనను కొలవవచ్చును. సంపూర్ణ విశ్వాసంతో త్రికరణ శుద్ధిగా ప్రార్థన గావించాలి. ఎక్కడన్న ప్రసక్తే లేకుండా స్వామి కరుణించి కాపాడతాడు. భక్తిప్రపత్తులతో, శరణాగతి స్థాయిలో, స్వామికి అంకితమైతే ఆయన తన వద్దకు చేర్చుకుంటాడు. నిజమైన భక్తునికి వివక్ష వుండే ప్రస్తక్తే రాదు. ఏ మతమన్నది ప్రశ్నే కాదు.

ఆదిశంకరుల వారు ఒకసారి కాశీలో పవిత్రగంగలో స్నానం గావించి వస్తూ వుంటే ఒక చండాలుడు ఎదురుపడగా, 'తొలగు, తొలగు' అన్నారట. ఆ చండాలుడు తొలగమంటున్నది నా ఈ శరీరాన్నా, అంతర్లీనంగా వున్న ఆత్మనా' అని ప్రశ్నించగా శంకరస్వామి తన లోపాన్ని తెల్సుకుని భగవంతుడే ఆ రూపంలో వచ్చి జ్ఞానోదయం గావించారని సాష్టాంగ నమస్కారం గావించారట.



ఈ ప్రపంచంలో అన్ని మతాల్లోనూ మహిమాన్వితమైన మహాపురుషులున్నారు. వారంతా అవతారమూర్తులు. మానవాళి దుఃఖాన్ని పోగొట్టేవిధంగా ప్రేమతత్వాన్ని ప్రబోధించారు. సాటి మానవునికి సేవ చేయడమే ధ్యేయంగా వారి ప్రబోధాలు సాగాయి. ఇంద్రియ నిగ్రహాన్ని అలవర్చుకుని, రాగద్వేషాలకు అతీతంగా, అందరిలో దేవుని చూడగలగాలి. ప్రేమానురాగాలే ఊపిరిగా అందరితో కలిసిమెలసి, అందరిలో ఒకరిగా జీవించగలగాలి. మానవసేవయే మాధవసేవగా, సత్యం అహింసలని త్రికరణ శుద్ధిగా పాటించగలగాలి. ప్రతిక్షణమూ వీటిని గుర్తుంచుకుని భగవంతుని ధ్యానించగలగాలి. కఠోర దీక్షతో పట్టుదలతో సాధన కొనసాగిస్తూ, మౌలికమైన భారతీయ విలువలను కాపాడుకుంటూ, ఈ పుణ్య భూమ్మీద మనుగడ కొనసాగించాలి. మార్దవతకూ, ఉదారతకూ, పవిత్రతకూ, ప్రశాంతతకూ, ఆత్మపరిశీలనకూ, ఆధ్యాత్మికతకూ పరాకాష్ఠగా చెప్పుకోబడుతున్న మనదేశ ప్రత్యేకతను పరిరక్షించుకోవల్సిన బాధ్యత మనమీదనే వుంది. మనిషి మానసిక ప్రగతికి తరతరాలుగా కృషి చేసిన దేశం మన భారతదేశమే. భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచ దేశాలను ఎప్పుడూ ప్రభావితం చేస్తూనే వుంది.



- డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

భగవద్గీత



అధ్యాయం 4

శ్లోకం 18:

కర్మణ్యకర్మ యః పశ్యేత్
అకర్మణి చ కర్మ యః।
స బుద్ధిమాన్ మనుష్యేషు
స యుక్తః కృత్స్నకర్మకృత్॥

తాత్పర్యం: కర్మ యందు అకర్మను, అకర్మ యందు కర్మను చూసేవాడు మనుషులలో బుద్ధిమంతుడు. అటువంటి వాడు అన్ని రకముల కర్మల యందు నియుక్తుడైనను దివ్యస్థితి యందున్నవాడే అగును.


భాష్యం: కృష్ణచైతన్యం కలిగిన వ్యక్తి సహజంగానే అన్ని కర్మ బంధనముల నుంచి ముక్తుడై ఉంటాడు. కర్మలన్నీ శ్రీ కృష్ణుని ప్రీత్యర్థమే చేయబడి ఉండుటచే అతడు కర్మ ఫలితంగా వచ్చే సుఖదుఃఖాలకు లోను కాడు. కాబట్టి కృష్ణుని కోసం అన్ని రకాల కర్మల యందు నిమగ్నమై ఉన్నా బుద్ధిమంతుడు గానే పరిగణింపబడును. కొందరు కర్మ ఫలితాలకు భయపడి కర్మలనే త్యజిస్తారు. అట్లు కాక కృష్ణుని కొరకే కార్యములు చేయుట వలన లేదా సేవా తత్పరత వలన దివ్యానందం పొందవచ్చును. వీరే నిజమైన నిష్కాములు. శ్రీ కృష్ణుని యెడ గల నిత్య దాస్యస్వభావమే సర్వ విధములైన కర్మ ఫలముల నుండి మానవుణ్ణి ముక్తుని చేయగలదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీ శ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...

android Google play | iOS iTunes

కల్కి పలుకు



How long? No rules on time. The more aligned you are with positive feelings the quicker things happen.

దిశా నిర్దేశం లేకుండా ఎంతకాలం గడుపుతారు. మీరెప్పుడైతే సానుకూలభావనలతో ఉంటారో అప్పుడు మీ పనులు త్వరగా జరుగుతాయి.

Sri Amma Bhagavan

వివరణ: కూనపురెడ్డి అరుణ్ కుమార్

శాపం నుంచి తప్పించే పారాయణ

శ్రీకృష్ణ పరమాత్మ మానవాళికి అందించిన దివ్య సందేశం భగవద్గీత. దానిలోని ప్రతి అక్షరం పుణ్యప్రదమైనదే. అదే విధంగా గీతలోని నాల్గవ అధ్యాయం విశేష ఫలదాయకం. భగవద్గీతలోని నాలుగవ అధ్యాయం పారాయణం వల్ల కలిగే ఫలం పద్మ పురాణంలో ఈ విధంగా ఉంది.




పూర్వం వారణాసిలోని విశ్వేశ్వరుని ఆలయంలో భరతుడు అనే మహనీయుడు భగవద్గీత నాలుగవ అధ్యాయం ప్రతినిత్యం శ్రద్ధాభక్తులతో పారాయణం చేస్తూ ఉండేవాడు. ఆ పారాయణ ఫలంగా అతడు పవిత్రుడై సకల సుఖాలను, దుఃఖాలను, శీతోష్ణాది ద్వంద్వాలనూ, సమబుద్ధితో అనుభవిస్తూ ఉండేవాడు. ఒకమారు ఆతనికి మహాత్ములను సందర్శించాలనే కోరిక కలిగి వారున్న తావులను వెతుక్కుంటూ పర్యటనకు బయల్దేరాడు. అతను ప్రయాణం చేసే మార్గంలో ఒక చోట సంధ్యాసమయం కాగా అక్కడున్న రెండు పెద్ద రేగి చెట్ల కింద విశ్రమించి, నిత్యం తాను పారాయణ చేసే భగవద్గీత నాలుగవ అధ్యాయాన్ని ప్రతి రోజు మాదిరి పారాయణ చేశాడు. బయల్దేరే సమయంలో తన ముందు రాలిన రెండు రేగి పండ్లను తన సంచిలో వేసుకుని బయల్దేరాడు. అయితే ఇక్కడ ఒక చిత్రం జరిగింది. ఆ రెండు రేగి చెట్లూ ఐదు రోజుల్లో ఎండిపోయాయి. వాటిలోని జీవులు ఒక ఇంట ఇద్దరు బాలికలుగా జన్మించారు. అంతేకాదు వారికి పూర్వ జన్మ జ్ఞానం కలిగింది. ఒకమారు ఏదో పని మీద వెళుతున్న భరతుడు మరో ఊరిలో ఉన్న వారి ఇంట విడిది చేశాడు. వారు భరతునికి అర్ఘ్యపాద్యాదులిచ్చి తమ పూర్వ జన్మ వృత్తాంతం ఆయనకు ఇలా చెప్పసాగారు.

ఒకప్పుడు గోదావరీ తీరాన సత్యతవుడు అనే యోగి పుంగవుడు ఘోర తపస్సు చేస్తూ ఉండేవాడు. ఇంద్రుడు అతని తపస్సుకు భయపడి తనకు పదవీ భంగం కలుగుతుందేమోనన్న భయంతో ఇద్దరు అప్సరసలను ఆ సత్యతవుని తపస్సు భంగం చేయడానికి పంపాడు. తమ ప్రభువైన ఇంద్రుని ఆజ్ఞ మేరకు వారు సత్యతవుడు తపస్సు చేస్తున్న ప్రదేశానికి చేరుకుని తపస్సుకు భంగం కలిగించేందుకు ప్రయత్నించారు. సత్యతవుడు కోపించి వారిద్దరినీ గంగా తీరంలో రేగి చెట్లు కమ్మని శపించాడు. దానితో వారిరువురూ తాము తమ ప్రభువైన ఇంద్రుని ఆజ్ఞ మేరకు అక్కడకు వచ్చామని శాప విమోచనం కలిగించమని కోరారు. దానితో ఆయన శాంతించి, భరతుడనే మహనీయుడు మీ చెట్ల నీడన కూర్చుండి భగవద్గీత నాలుగవ అధ్యాయం పారాయణ చేసినప్పుడు అది విని మీరు పూర్వ జన్మ జ్ఞానం కలిగిన బాలికలుగా జన్మిస్తారు. మీ వృత్తాంతాన్ని భరతునికి చెప్పి ప్రతి రోజూ పారాయణ చేస్తూ క్రమంగా మీరు మీ నిజ జన్మమైన దేవతా స్త్రీలుగా మారుతారని చెప్పాడు. మీరు రేగి చెట్లుగా ఉన్న మా నీడన చేరి నాలుగవ అధ్యాయం పారాయణ చేశారు. అది విన్న కొద్ది రోజులకు మేము ఆ రూపాన్ని వదలి ఇలా బాలికలుగా మారాం అని చెప్పి ఆయనకు ప్రణమిల్లారు. ఆ తర్వాత వారు నిత్యం నాలుగవ అధ్యాయం పారాయణ చేసి ఆ పుణ్యఫలంతో తిరిగి అప్సరసలుగా మారి ఇంద్రలోకం వెళ్లిపోయారు. ఇలా భగవద్గీత నాలుగవ అధ్యాయాన్ని పఠించినవారు మానవులైనా, వృక్షాదులైనా దోష విముక్తి పొందుతారు అని పద్మ పురాణం పేర్కొంటోంది.

సేకరణ, రచన : ఆదూరి హైమావతి

ధర్మం-మర్మం

ఇంట్లో ఉన్న దేవుని పాత పటాలను ఏవిధంగా తొలగించాలి?




ఇంట్లో ఉన్న పాతపటాలను దేవుని క్యాలెండర్లను భూస్థాపితం చేయాలి లేదా జల నిమజ్జనం చేయాలి. దగ్గరలో నదులు, బావులు లేనప్పుడు ఇంట్లోనే ఓ పెద్ద పాత్రలో నీరు పోసి పటాలను, క్యాలెండర్లను వేసి ప్రతిరోజు వీలున్నప్పుడు పదిహేను నిమిషాలపాటు వాటిని కలుపుతూ తిప్పాలి. అవి కరిగి నీరుగా మారినపుడు ఆ నీరు మనింట్లోని చెట్లకు పోసి ఆ చెట్లకు కాసిన పూలను, ఫలాలను ఆ దేవతా ప్రసాదంగా స్వీకరించడం ప్రాచీనాచారం. అప్పుడు మన ప్రాచీన ఆరాధ్యమూర్తులు మన ఇంటి వాతావరణంలో కలిసి నిలిచిపోతారు. నదీ స్నానానికి వెళ్లినపుడు దేవుని పటాలను తీసుకువెళ్లి నదిలో నిమజ్జనం చేయవచ్చు.



- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

పరాత్పర రూపం



శ్రీ రమణాశ్రమం
2-5-46

ఈ మధ్యాహ్నం కొందరాంధ్రులు స్త్రీలతో సహా వచ్చి భగవత్సన్నిధిలో కొంతసేపుండి వెళ్లారు. వారిలో ఒక పురుషుడు లేచి చేతులు జోడించి "స్వామీ, మేము రామేశ్వరాది యాత్రలు చేసుకొని, అక్కడ వుండే దేవతలని సేవించి వచ్చాము. పరాత్పర స్వరూప మెటువంటిదో తమ వల్ల తెలుసుకోవాలని వున్నది. దయవుంచి తెలుపగోర ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

భగవాన్ చిరునవ్వుతో "అట్లాగా! అదే, అదే మీరు చెపుతున్నారు గదా, అన్ని దేవతలను సేవించి వచ్చామని, అన్నీ తానైనప్పటికీ, ఈ అన్నిటికీ అతీతంగా వుండేదేదో అదే పరాత్పర రూపం. అన్నిటికీ అతీతమన్నమాట. మీరా దేవాలయాలన్నీ చూడటం వల్ల ఇన్ని దేవుళ్లకు మూలమైన పరాత్పర స్వరూపం ఎటువంటిదో నన్న యోచన తట్టింది. అవన్నీ చూడకుంటే ఈ ప్రశ్న వస్తుందా?" అన్నారు. అప్పుడు శ్రీవారి ముఖ వికాసం చూస్తే పరాత్పర రూపం తాండవమాడుతూ ఉన్నదన్నమాట. ఆ కళ్లల్లోని తేజస్సు, ఆ మందహాసం చూచి తీరాలి. ఆ యువకుడికా మాటలు అర్థంగాకపోయినా శ్రీవారి కృపావీక్షణం తోటే సంతృప్తి చెంది, సహచరులతో సహా నమస్కరించి వెళ్లిపోయాడు. వారటు పోగానే భగవాన్ ఉత్సాహపూరితులై సమీప వర్తియగు ఒక భక్తునితో "ఇదుగో చూడు, వారి మాటల్లోనే యథార్థం తెలుస్తుంది. పరాత్పర రూపం అంటే పరమునకు పరమైనదేదో అదే యథార్థమని దానికర్థం. అడిగే మాటకే అర్థం తెలియదు. అర్థం తెలిస్తే జవాబు కూడా దానిలోనే ఉంటుంది" అన్నారు.

సంఘ నీతులు

శ్రీ రమణాశ్రమం
11-5-46

నిన్న ఉదయం తొమ్మిది ముప్పావుకు బయటికి వెళ్లిన భగవాన్ తిరిగి హాలు వద్దకు వచ్చేసరికి ఆశ్రమంలో పెరుగుతున్న ఒక కుక్క కొత్తగా వచ్చిన మరొక కుక్కపైన అధికార స్వరంతో అరుస్తూ, దాన్ని తఱమాలని హాలు ముందర గంతులు పెడుతూ ఉన్నది. అక్కడ ఉన్నవారంతా దాన్ని అదిలిస్తూ ఉంటే వారిపైన అధికారం చేయటం మామూలేగదా? ఇదీ అట్లాగే తన హక్కు స్థిరపరచుకొనే నిమిత్తం దానిమీద అధికారం చేస్తున్నది" అని చెప్పి ఆ పాత కుక్కను చూచి "ఎందుకురా అరుస్తావు?" పోపో"మ్మన్నారు. వారి మాటలు అర్థమైనట్లే అది తొలగిపోయింది.

ఈ ఉదయం పదిగంటలకు డాక్టర్ అనంత నారాయణరావు భార్య రమాబాయి తమ తోటలోని మామిడిపండ్లు మంచిరకమని తెచ్చి యిచ్చి "కోతులు అన్నీ యెత్తుకుపోతున్నవి. ఇవి మాత్రమే మిగలటం చేత త్వరపడి కోసి తెచ్చాను" అన్నది. భగవాన్ చిరునవ్వుతో "ఓహో, అట్లాగా, ఈ కోతులు అక్కడికిన్నీ వస్తున్నవా?" అని రవంత ఆశ్చర్యం అభినయించి, అందరి వంకా చూచి "అవును, కోతులైతే ఒక్కొక్కటే ఎత్తుకపోతవి. మనుష్యులైతే అన్నీ వొక్కసారే గ్రహిస్తారు. అదేమీ అంటే, మా హక్కంటారు. కోతులది చిన్న దొంగతనమైతే వీరిది పెద్ద దొంగతనం. ఆ విషయం గమనించక వారిని మీరు తఱుముతారు. వీరిది మహాన్యాయమైనట్లు" అన్నారు.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

సేవ





చీకటి బతుకుల్లో వెలుగు రేఖలు

- అంధకారంలో మగ్గుతున్న అతివలకు ఆసరా ఎవిడబ్ల్యూసి

దేశంలో కొన్ని ప్రాంతాలలోకి అడుగు పెట్టాలంటేనే మహిళలు భయపడుతుంటారు. ఎవరైనా ధైర్యం చేసి అడుగు పెట్టినా వారిని చెడు దృష్టితో చూసే సమాజంలో మనం జీవనం సాగిస్తున్నాం. అలాంటి ప్రాంతంలో ఒక స్వచ్ఛంద సంస్థను నడిపించడం అంటే మామూలు విషయం కాదు. తన గురించి ఎవరైనా ఏమైనా అనుకోని, తను చేసే మంచి పని నలుగురి జీవితాల్లో వెలుగు నింపాలన్న ధ్యేయంతో ముందుకు సాగింది మంజూవ్యాస్. ఆమె సంకల్ప కృషి ఫలితమే కామాటిపురాలో ఈ స్వచ్ఛంద సంస్థ ఎవిడబ్ల్యూసి. మహిళలకోసమే ఏర్పడ్డ ఈ సంస్థ చేసే పనులేమిటో, దీనినెలా స్థాపించారనే వివరాలను తెలుసుకుందాం.

''నీవు పెద్దయ్యాక ఏమవుతావు అని ఆ ప్రాంతంలో ఆడుకుంటున్న ఆరేళ్ల అమ్మాయిని అడిగితే ఎటువంటి సంకోచం లేకుండా కొరడాతో కొట్టినట్టుగా నేను బ్రోతల్ ఓనర్‌ని అవ్వాలనుకుంటున్నానని చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను'' అని మంజువ్యాస్ చెప్పారు. ఆరోజు ఆ అమ్మాయి చెప్పిన మాటలు ఆమె మెదడులో కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. ఇటువంటి పిల్లలు, మహిళలకోసం ఏదైనా చేయాలన్న తపన మనసులో మొదలైంది. ఆ ఆలోచనల ప్రతిరూపమే ఈ ఎవిడబ్ల్యూసి. ఈ సంస్థ కామాటిపురాలో రెండు బట్టలషాపుల మధ్యన, పోచమ్మదేవి గుడి దగ్గర ఉంది. అలాంటి ప్రాంతంలో ఇటువంటి సంస్థ ఒకటి ఉంటుందని ఎవరూ ఊహించరు. నిత్యం చీకటి ఘోరాలు జరిగే ప్రాంతంలో చిన్నపిల్లలు పాటలను వల్లెవేస్తుంటారు. మహిళలు కీబోర్డుమీద టైప్ చేస్తున్నారు. అక్కడ ఉన్న వారందరూ ఏదో ఒక పనిలో బిజీగానే ఉంటున్నారు. ఈ సంస్థ పూర్తిపేరు ఆర్గనైజేషన్ అప్నే ఆప్ వుమెన్ కలెక్టివ్ (ఎవిడబ్ల్యూసి). ఇది ముంబయిలోని ఫాక్‌లాండ్ రోడ్‌లో ఉంది. ఈ సంస్థ 1998లో స్థాపించబడింది. వ్యభిచార కూపంలోకి బలవంతంగా నెట్టబడినవారిని ఆ చెర నుండి విడిపించడానికి, అందులోనే మగ్గిపోతున్న వారి పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దడానికి ఈ సంస్థ ఏర్పడింది.

మంజువ్యాస్ ఆధ్వర్యంలో ఈ సంస్థ 19సంవత్సరాలుగా నడుస్తుంది. ''నేను కొంత మందిని కలిసి వారు ఈ వృత్తిలోకి ఎలా నెట్టబడుతున్నారు, అందులో వారు పడుతున్న సమస్యలు గురించి విన్నాను. వారితోనే కాదు వారి పిల్లలను కూడా కలిసి వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నాను. వారితో మాట్లాడినప్పుడే సంఘంలో విస్తరిస్తున్న ఈ వ్యభిచార కూపాన్ని రూపుమాపాలంటే ఇటువంటి సంస్థలను నెలకొల్పాలనే ఆలోచన నాకు వచ్చింది'' అని వ్యాస్ చెప్పారు. ఈ పద్దెనిమిది సంవత్సరాలలో ఈ సంస్థ 750మంది బాలికలకు, 400మంది పసిబిడ్డలకు, 3000మంది మహిళలకు జీవితాలకు మంచి మార్గం చూపించారు. ఇక్కడ ఉన్న వారందరు ఎక్కువగా కామాటిపురా ప్రాంతానికి చెందిన వారే. కాని వాళ్లు ముంబయి ప్రాంతవాసులు మాత్రం కాదు. వాళ్లను మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలనుంచే కాకుండా బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలనుంచి కూడా ఎత్తుకుని వచ్చి ఈ చీకటిలోకంలోకి నెట్టివేయబడిన అభాగినులు. వారు ఒకసారి ఈ వృత్తిలోకి వచ్చాక తిరిగి వెళ్లినా వారిని లోకం అర్థంచేసుకోకుండా ఊరినుంచి వెళ్లగొట్టడమూ, తిట్టడం వంటివి చేస్తుంటారు. వారిని సమాజంలో బతకడానికి స్వీకరించదు. వారినే కాదు వారి పిల్లలనూ కూడా బతకనీయదు. ఒక మహిళ ఈ వృత్తిలోకి దిగిందంటే మిగతా కుటుంబ సభ్యులలోని మహిళలు కూడా ఇదే వృత్తిలోకి దిగాల్సిందేనని ఒక మహిళతో మాట్లాడినప్పుడు మాకు అర్థమయింది అని వ్యాస్ చెప్పారు.

అలాంటి మహిళల బాధలను అర్థం చేసుకుని సమాజంలో బతకడానికి అవకాశమివ్వాలన్నదే మా తపన అని ఆమె చెప్పారు.

ఎవిడబ్ల్యూసి నడిపే మూడు మేజర్ ప్రోగ్రామ్‌లు

1. ఉమీద్ - 18సంవత్సరాల వయసు నుంచి ఈ వృత్తిలోని ఉన్నవారికి సంబంధించిన కార్యక్రమం
2. ఉడాన్- వ్యభిచార కూపంలో మగ్గిపోతున్న మహిళల పిల్లలు మాత్రమే కాదు కామాటిపురాలో వెనుకబడిన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే కార్యక్రమం.
3. ఉమంగ్- చిన్నపిల్లల పోషణ కార్యక్రమం. ఇందులో 2.5 నుంచి 5 సంవత్సరాల పిల్లలను చేర్చుకుంటారు.

ఉమీద్

ఇందులో పనిచేసేవాళ్లు మొదటగా చేయాల్సిందేమిటంటే ప్రతి రోజూ సంస్థ, సభ్యుల మధ్య చర్చలు జరగాలి. వాళ్లు రోజూ అలాంటి హోమ్స్‌లోని మహిళలను కలిసి వారితో మాట్లాడి ఒక అవగాహనను ఏర్పరచుకుంటారు. వాళ్లకు ఉన్న హక్కులు ఏమిటి వాటినెలా పొందాలనే విషయాలను తెలియజేసే విద్యను వారికి అందజేస్తున్నారు. ఆర్థిక అక్షరాస్యతకు కావలసిన నైపుణ్యాన్ని వారికి అందజేస్తున్నారు. వారు ఆ కూపంలో పనిచేయాలనుకున్నా లేదా బయట ఉద్యోగం కావాలన్నా వారు అవకాశం కల్పిస్తారు. కాని ఆ చీకటి కూపంలోంచి ఎంతమంది మహిళలను బయటకు తీసుకురాగలిగితే అంతమందిని తీసుకురావడమే ధ్యేయంగా పనిచేస్తుంది ఈ సంస్థ. వారు ఏవిధంగా ఈ దిగజారిన జీవితాలలోకి ప్రవేశించారన్నది మాకనవసరం. ఎన్నో సంవత్సరాలుగా ఈ వృత్తిలో ఉండిపోవడం వల్ల మానసికంగా, శారీరకంగా నిండు సున్నాగా మారిపోతారు. చాలామంది కొన్ని వ్యసనాలకు బానిసలవుతారు. కొంతమంది దానికే అంకితమవుతారు. అలాంటి వారిని మేము మీ వృత్తి మానివేయండని ఎలా చెప్పగలమని మంజు ప్రశ్నిస్తున్నారు.

వారికి గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకు సేవా ఖాతాలు ఇచ్చి, రాయడం, చదవడం నేర్పించి ఏదో ఒక ఉపాధి వైపు వారు పయనించేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె చెప్పారు.

ఎవిడబ్ల్యూసి ప్రతిరోజూ పరిశుభ్రత మీద, సురక్షిత సెక్స్‌మీద, సురక్షితంగా లేకపోతే మహిళలకు కలిగే ఇన్ఫెక్షన్స్ (ఎస్‌టిడి, హెచ్ఐవి) గురించి వారికి అవగాహన కలిగించడానికి క్లాసులు నిర్వహిస్తుంది. పీరియడ్స్ సమయంలో ఎంత సురక్షితంగా ఉండాలో వివరిస్తూ వారికి కావలసిన సానిటరీ పాడ్స్‌ను అందజేస్తుంది. ఒకవేళ ఏ మహిళకైనా ఇన్ఫెక్షన్స్ ఉంటే ఒక మెడికల్ టీమ్ వచ్చి తమ పరిధిలో ఉన్నంత వరకు వారికి వైద్యసేవలను అందజేస్తుంది. వారికి సాధ్యం కాని యెడల దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసేవలను అందజేస్తారు. వారికి పునరావాసం కల్పించడమన్నది అంత సులువేమీ కాదు. ఎవరి పరిస్థితులు ఎలా ఉంటా యో మనం నిర్ణయిం చలేం. అంచనా కూడా వేయలేం. కొంతమంది మహిళలు ఈ పని చేస్తూ వారికున్న అప్పులను తీర్చుకుంటున్నారు. వారికి మనం వైద్యసేవలను మాత్రమే అందిం చగలం. అంతకంటే ఎక్కువ ఏమీ చేయలేకపోతున్నాం. ఎవరైతే దీని నుండి పారిపో వాలను కుంటున్నారో వారికి మా సంస్థ తప్పనిసరిగా అండగా ఉంటుంది. ఇక్కడి ఉన్నవారిలో చాలామంది నిరక్షరాస్యులు, ఏ విద్య తెలియనివాళ్లు. రోజువారీవేతనం కోసం పాకులాడే జీవితాలు వాళ్లవి. వారు ఉన్న పరిస్థితులలో నమ్మకాన్ని కోల్పోతున్నారు. వారికి కావలసిన ఆపన్న హస్తాన్ని మనం అందజేస్తే వారు కూడా మంచి మార్గంలో ధైర్యంగా నిలబడతారు. వివిధ ఉద్యోగాలు నిర్వహించగలుగుతారు.

మేము మా సంస్థలో రకరకాల కార్యక్రమాల ద్వారా ఉద్యోగాలకు కావలసిన శిక్షణను ఇస్తున్నాం. వారికి శిక్షణ నివ్వడమే కాకుండా రోజువారీ ఖర్చులకోసమని వేతనం కూడా అందజేస్తున్నాం. అంతేకాదు క్లాసులు జరుగుతున్న సమయంలో భోజనం, ఉండడానికి వసతి, ప్రయాణఖర్చులను కూడా మేమే భరిస్తున్నామని ఆమె చెప్పారు. మేము ఇచ్చే శిక్షణలో ఒకటి బ్యూటీ అండ్ మేకప్. ఇందులో మొదటి బ్యాచ్‌లో 20మంది మహిళలు శిక్షణపొందారు. కాని తొమ్మిది మంది మాత్రమే మూడునెలల శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిచేసారు. ఆ తొమ్మిదిమందిని ఇంకా మెరుగైన కోర్సు నేర్చుకోవడానికి కావలసిన శిక్షణకోసం పంపించాం. అందులో



అక్కడ ఐదుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. తక్కువ మంది నైపుణ్యం సాధించారని మాకేమీ బాధలేదు. కొంతమందికైనా మంచి అవకాశాలు కల్పించ గలిగామని సంతోషపడుతున్నాం.

అందులో ఒకామె సొంతంగా బ్యూటీ పార్లర్ నడుపుకుంటోంది. ఇంకో ముగ్గురు మేకప్ బ్రాండ్‌లో ప్రధాన స్థానంలో పనిచేస్తున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ క్లాసులు కూడా ఉన్నాయి. దీనికి శిక్షణ ఎక్కువరోజులు తీసుకోవలసి ఉంటుంది. అంతేకాదు డబ్బులు కూడా అంతగా రావనే ఉద్దేశ్యంతో కొంతమందే శిక్షణకు వచ్చేవారు.

మా దగ్గర శిక్షణ తీసుకున్న ఒకామె గార్మెట్ ఫ్యాక్టరీలో దారాలు కత్తిరించే పనిలో చేరింది. ఆమె ఇప్పుడు అసిస్టెంట్ మేనేజర్‌గా అక్కడ పనిచేస్తుంది. ఇంకో ఇద్దరు కుట్టుమిషన్లను ఇంట్లోనే పెట్టుకుని ఫాల్ కుట్టడం లాంటి పనులు చేస్తున్నారు.

ఇందులో చాలామంది మహిళలు 16యేళ్ల వయసులోనే ఈ వృత్తిలోకి దించబడ్డారు. అప్పటినుంచి బ్రోతల్ ఓనర్స్‌ను తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని విఫలమయ్యారు. వారి వయసు ఇప్పుడు 35 నుండి 40యేళ్ల మధ్యలో ఉన్నారు. ప్రపంచం దృష్టిలో 40అంటే వారిని ముసలివాళ్లగానే లెక్కకడుతుంది.

చదువు విలువను తెలియజేస్తూ మేము ఇచ్చే కౌన్సెలింగ్ క్లాసుల వల్ల అక్కడ ఉన్న మహిళల్లో మార్పు వచ్చి వాళ్ల పిల్లలను కూడా చదువుకోవడానికి ఒక అవకాశం వస్తే బాగుండు అనుకుంటున్నారని సీనియర్ ప్రోగ్రామ్స్ మేనేజర్ హీతల్ జొబెన్ పుత్ర తెలిపారు.

ఉమంగ్

శిక్షణ పొందిన బాల్వాడీ టీచర్‌ను నియమించి వారి కింద పనిచేయడానికి అసిస్టెంట్లను కూడా పెట్టాం. పసిపిల్లలను ఒక్కరే చూడలేరు కదా. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనడానికి వాలంటీర్లు వచ్చేవారు. వాళ్లు చదువుకున్న విద్యార్థులైనా కావచ్చు. ఉద్యోగాలు చేసేవాళ్లయిన కావచ్చు. పిల్లలకు రెగ్యులర్ చెకప్, రోజుకు ఐదు సార్లు భోజనం, మూడునెలలకొకసారి డైట్ చార్ట్ మార్చడం వంటివి ఇక్కడ జరుగుతాయి.



మంజు వ్యాస్

వాళ్లకంతా అక్కడ ఉన్న షెడ్యూల్ ప్రకారం తినడం, ఆడుకోవడం, పడుకోవడం జరుగుతుంది. శనివారాల్లో వారిని గార్డెన్‌కి తీసుకు వెళ్లడం జరుగుతుంది. వారానికొకసారి సోషల్ స్కిల్స్, డాగ్ థెరపీ క్లాసులు ఉంటాయి.

చాలామంది పిల్లల్లో తమమీద నమ్మకమనేది తగ్గిపోతుంది. అది వారి తల్లిదండ్రుల దగ్గర నుంచి వస్తుంది. డాగ్ థెరపీ ద్వారా ప్రతి మనిషిలో ఒక నమ్మకాన్ని ఏర్పరుస్తుంది. దీనిద్వారా జంతువులను కూడా ప్రేమగా చూసుకోవాలనేది వారికి తెలుస్తుందని హీతల్ అన్నారు.

అంతేకాదు పిల్లలకు జంతువుల బొమ్మలను చూపించి గుర్తుపట్టేలా చేయడం, బొమ్మలు గీయించడం, బొమ్మలను జతపరచడం, చారిత్రాత్మక శిల్పాలను, మ్యూజియాలను వారికి చూపించి గుర్తుపట్టేలా రోజూ క్లాసులు నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు.

ఉడాన్

ఉడాన్ కార్యక్రమంలో ప్రతి బాలికకు విద్య అవసరమనేది ముఖ్య ఉద్దేశ్యం. వాళ్ల తల్లుల ఆదేశానుసారం పిల్లలు ఇంగ్లీషు, మరాఠీ మీడియం స్కూళ్లలో చదువు నేర్చుకుంటున్నారు. వాళ్ల ఫీజులు, స్టేషనరీ ఖర్చులు అన్నీ ఎవిడబ్ల్యూసి సంస్థ భరిస్తుంది. అంతేకాదు ట్యూషన్స్‌కు గాని, ఇతర ఖర్చులకైనా, కంప్యూటర్ క్లాసులకైనా, మ్యూజిక్, డ్రామా వంటి వాటికైనా ఖర్చులను భరిస్తుంది.

ఈ సంస్థ విజయాలు

ఈ సంస్థ చేస్తున్న కృషి వల్ల వందశాతం ఇక్కడ పిల్లలు చదువుకుంటున్నారు. వాళ్ల తల్లి చేసే పనిలోకి వెళ్లకుండా ఆపగలిగారు. ఇందులో శిక్షణ పొందినవారు చాలామంది అబ్రాడ్‌లోని ఫైవ్ స్టార్ హోటల్స్‌లో హెడ్ చెఫ్‌లుగా పనిచేస్తున్నారు. సోషల్ వర్కర్స్‌గా, మేనేజర్స్‌గా, ఉపాధ్యాయులుగా, అకౌంటెంట్లుగా, నర్సులుగా న్యూరో సర్జరీ హెడ్‌లుగా కూడా పనిచేస్తున్నారు. ఇందులో ఉన్న ఒకమ్మాయి బెదిరింపులమీద ఒక డాక్యుమెంటరీని తీసి యూట్యూబ్‌లో పెడితే దానికి అవార్డు కూడా వచ్చింది. వాళ్లను కనుక మీరు చూస్తే రెడ్‌లైట్ ఏరియాలో పెరిగిన పిల్లలా అని ముక్కున వేలేసుకుంటారు. ఆవిధంగావాళ్లు తమ జీవితంలో ముందుకు వెళుతున్నారని మంజు చెప్పారు. ఇక్కడ చదువుకుంటున్న అమ్మాయిలు ఎవరైనా తమకు వచ్చిన విద్యను అందరికీ పంచాలనుకుంటారు. మా పూర్వవిద్యార్థి స్పానిష్ నేర్చుకున్నారు. ఆమె వలంటీర్‌గా వచ్చి తనకు తెలిసిన పరిజ్ఞానాన్ని అందరికీ నేర్పుతుంది. ఆర్థికంగా స్థిరత్వం సంపాదించిన పిల్లలు తమ తల్లులను ఆ వృత్తుల నుంచి కూడా మాన్పించారు. ముంబయి ఊరిచివర ప్రాంతాలలో స్థలాలు, ఇళ్లు కొనుక్కున్నారు. అంతేకాదు వాళ్ల తోబుట్టువులను కూడా వీరే చూసుకుంటున్నారు.

వాళ్లు ఎంత ఉన్నతమైన సెక్టర్‌లో పనిచేసినా జీవిత మార్గం ఎప్పుడూ ఎగుడు దిగుడుగానే ఉంటుంది. మాకు ఈ సంస్థలో పనిచేయడానికి కావలసినంత స్టాఫ్ లేరు. ఇక్కడికి పనిచేయడానికి పిల్లలను తీసుకురావడం పెద్ద సమస్యగా మారింది. ఉద్యోగ అవసరమున్నా తల్లిదండ్రులు ఈ ప్రాంతం కామాటిపురా పేరు వింటేనే వణికిపోతున్నారు. ఆప్రాంతంలో తమ ఆడపిల్లలు పనిచేస్తున్నారంటే సమాజం ఏమంటుందనే ఆలోచనతో చాలామంది వెనుకంజ వేస్తున్నారని మంజు చెప్పారు. మా సంస్థ ఎంతోమంది జీవితాలను వెలుగులోకి తీసుకురాగలిగింది. కాని మనిషిలోని చెడు ఆలోచనలు మాన్చలేకపోతుంది. కాని అవి కూడా పోగొట్టడానికి తమవంతు కృషి ఎప్పటికీ చేస్తూనే ఉంటామని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పారు మంజు.

వ్యర్థాలతో ఉపాధి

చైతన్యం

మనం రోజూ పడవేసే చెత్త ఎక్కడికి వెళుతుంది? దానిని ఏం చేస్తున్నారన్న అన్న ఆలోచన ఏమైనా చేస్తున్నామా? లేదు. మనం పడవేసిన చెత్తను సాధారణంగా సముద్రంలో పడవేయడం, భూమిలో కప్పివేయడం, లేదా కాల్చడం జరుగుతుంది. కాని ఈ చెత్తను సేకరించి వాటితో రకరకాల దుస్తులను, వాడుకునే వస్తువులను తయారుచేస్తున్నారు. వినడానికే చాలా ఆశ్చర్యంగా ఉంది కదూ. కాని ఇది నిజం. అలా చెత్తను సేకరించి వాటితో వస్తువులను తయారుచేయడమే పరిశ్రమగా పెట్టుకున్న సంస్థ సాహస్ జీరో వేస్ట్. ఆ సంస్థ చేసే పనులేమిటో...దానినెవరు నిర్వహిస్తున్నారనే విషయాలను తెలుసుకుందాం.

సాహస్ జీరో వేస్ట్

ప్రతి వ్యక్తి తమ వెనుక ఏం జరుగుతుందనే విషయాలను పట్టించుకోని ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. నేడు సమాజంలో పనికిరాని చెత్తతో కూడా ఎన్నో ఉపయోగ వస్తువులను తయారుచేస్తున్నారు. అలాంటి సంస్థే సాహస్ జీరో వేస్ట్. ఆ సంస్థ సిఇఒ, సంస్థాపకురాలు 56 సంవత్సరాల విల్మా రోడ్రిగ్స్. మొదటిసారిగా మున్సిపల్ సాలిడ్ వేస్ట్ విధానం 2000లో మొదలైంది. ఆ కార్యక్రమం ద్వారా ఆమె మదిలో ఒక ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనల ప్రతిరూపమే సాహస్ ఎన్‌జీవో 2001లో ప్రారంభమైంది. ఆమె ఇంగ్లీషు భాష మాట్లాడడంలో మంచి ప్రావీణ్యురాలు. ఆ నైపుణ్యంతోనే జర్మన్ టూరిస్ట్‌గా తన జీవితం నడుపుతోంది. ఈ పనిలో భాగంగానే ఆమె దేశమంతా తిరుగుతూ ఉండేది. అలా ఆమె సందర్శించిన ఎన్నో ప్రదేశాలలో కొన్ని ఆమె మనసును ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాని ఎక్కడ చూసినా కనబడే రోడ్ల మీద చెత్తను చూసి ఆమె మనసు ఎంతో కలత చెందింది. అలా ఆమె ఆ చెత్తను గురించి ఆలోచించడం మొదలుపెట్టి, దాని సద్వినియోగానికే ఈ సాహస్ జీరో వేస్ట్ అనే సంస్థను ప్రారంభించింది. ఈ సంస్థ వాళ్లు తమకు కావలసిన చెత్తను ఆఫీసుల నుండి, ఇళ్ల నుండి సేకరించి కొత్త ప్రయోగాన్ని చేస్తున్నారు.



విల్మా రోడ్రిగ్స్

ఆమె మొదట్లో ప్రజలతో చెత్తను గురించి మాట్లాడడం చాలా ఇబ్బందికరంగా ఉండేది. కాని చాలా ఓపికగా వారికి చెత్తను తడిచెత్త, పొడిచెత్తలా రెండు రకాలుగా వేరుచేయాలని, అలా చేసి వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను అందరికీ విడమర్చి చెప్పేవారు. ఇలా అందరికీ ఈ విషయాలను తెలియజేయడం ఆమె ఒక ఛాలెంజింగ్‌గా తీసుకున్నారు.

సెగ్రేషన్ మంత్ర

ఈ సంస్థ రోజుకు 25 టన్నుల చెత్తను డంపింగ్ యార్డ్‌కు వెళ్లకుండా తమ సంస్థకు రప్పించుకుంటున్నారు. పెద్ద పెద్ద టెక్ పార్కుల నుంచి, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు, ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి చెత్తను సేకరిస్తున్నారు. ఈ సంస్థ చేసే మంచి పనులను చూసి కొంతమంది ప్రజలు, ఇతర సంస్థలు తమ ఇష్టానుసారంగా చెత్తను శ్రద్ధతో అందజేయటమే కాకుండా దానివల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుని తమవంతు సహాయంగా వాటిని సెపరేట్ చేసి కూడా ఇస్తున్నారు. సాహస్ జీరో వేస్ట్ సంస్థ మిగిలిన ఆహారపదార్థాలను వేరుచేయడానికి, ప్లాస్టిక్, నాన్‌బయోడిగ్రేడబుల్ సామాగ్రిని వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఇన్ ఆర్ఎమ్‌జెడ్ ఇకోవరల్డ్ వేరుచేస్తాయి. వీటిని కంపోస్ట్ చేయకముందే ఈవిధంగా చేస్తాయి.



చెత్త సద్వినియోగమిలా...


శోభా రాఘువ, కో ఆఫ్ సాహస్ జీరో వేస్ట్ ఎలాబరీటిస్

ఈ సంస్థ ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రపరచడం, ఖాళీ చేయడమనే విధానాలను తప్పనిసరిగా పాటిస్తుంది. ఈ చెత్తను సత్వరంగా రీసైక్లింగ్ పంపించడమే వారి బాధ్యతగా పనిచేబడుతున్నారు. సేకరించిన తడిచెత్త మొత్తాన్ని బయోగ్యాస్ పార్ట్‌నర్‌కి మెషీన్ల ద్వారా పంపిస్తారు. పొడిచెత్తను 16రకాలుగా వర్గీకరించి విడదీస్తారు. అవి రీసైక్లింగ్‌కి తోడ్పడే విధంగా వేరుచేసి ఉంచుతారు. ఉదాహరణకు ప్లాస్టిక్ బాటిల్స్‌ను పదిరకాలుగా ఉపయోగిస్తారు. అలాగే పేపరును 5 రకాలుగా విడదీస్తారు. రీసైక్లింగ్ చేసేవాళ్లు ఎలా కావాలంటే వారికి అలా అందజేస్తారు. కొంత చెత్తను విడదీయలేము, విభజించలేము. అలాంటి వాటిని ప్రభుత్వం ఆమోదించిన స్థలానికి పంపిచేస్తామని ఆమె చెప్పారు. ఈ చెత్తతో నోట్‌బుక్స్, రూఫింగ్ షీట్స్, టెట్రా ప్యాక్స్, టీషర్టులు, బ్యాగులు, ప్లాస్టిక్ బాటిల్స్‌ను తయారుచేస్తారు. వృధా ఆహారాన్ని కంపోస్ట్‌గా తయారుచేసి ఎరువుకింద పొలాలకి వాడుతున్నారు. చెత్తతో పనులేమిటని ఆలోచించకుండా వాటిని రీసైక్లింగ్ చేస్తూ పర్యావరణానికి సహాయపడుతున్న సాహస్ జీరో వేస్ట్ సంస్థను, అందులో పనిచేసేవాళ్లను మనసారా అభినందించాల్సిందే.

బరువు తగ్గించే అద్భుతమైన జ్యూస్

బొద్దుగా, లావుగా ఉన్న శరీరాన్ని చూడటానికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అలాంటి శరీరంతో నలుగురిలోకి వెళ్లలేక, ఇష్టమైన దుస్తులను ధరించి, అందంగా తయారవ్వలేక చాలా ఇబ్బందికరంగా బాధపడేవారు నేడు చాలామందే ఉన్నారు. అదనపు కొవ్వు ఆరోగ్యానికి అంత మంచిది కాదని తెలిసినా నోరు కట్టుకోలేక భారీకాయంతో బాధపడుతున్నారు. ఊబకాయం కలిగి ఉండటం వల్ల హై కొలెస్ట్రాల్, హార్ట్ అటాక్, జాయింట్ పెయిన్, ఇన్‌ఫెర్టిలిటీ మొదలగు వ్యాధులకు ఆహ్వానం పలకడానికి ముఖ్య సంకేతాలు. కాబట్టి, శరీరంలోని అదనపు కొవ్వును తొలగించుకోవడానికి ఇంటిదగ్గరే తయారు చేసుకునే ఈ జ్యూస్ చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనిని రోజూ తాగితే ఒక నెలలో ఆరు కేజీల బరువు తగ్గవచ్చని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఆ జ్యూస్ ఏమిటో, దానినెలా తయారుచేస్తారో తెలుసుకుం దాం...

హెల్త్ టిప్



కావలసిన పదార్థాలు

ఫ్రెష్ క్యారెట్ జ్యూస్- అరగ్లాసు
ఆపిల్ జ్యూస్- అరగ్లాసు
అల్లం జ్యూస్- అరగ్లాసు

తయారుచేసే విధానం

పైన సూచించిన పదార్థాలను మిక్సీ జార్‌లో వేసి గ్రైండ్ చేసుకోవాలి. మూడు జ్యూస్‌లను బాగా కలిపి ఒక సీసాలో భద్రపరచుకోవాలి. దీనిని ప్రతిరోజూ ఉదయం పరగడుపున బ్రేక్‌ఫాస్ట్ కు ముందు తాగాలి. అయితే ఈ మిశ్రమాన్ని క్రమం తప్పకుండా ప్రతీరోజూ తాగాలి. అలాగే ఈ హోంమేడ్ జ్యూస్ మరింత ఎఫెక్టివ్‌గా పనిచేయాలంటే, జీవనశైలిలో కొన్ని మార్పులు కూడా చేసుకోవాలి. రోజూ ఒక గంట వ్యాయామం చేసి, ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. ఆయిల్ ఫుడ్స్‌కు దూరంగా ఉంటే ఈ జ్యూస్ మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. బరువు తగ్గించుకోవడానికి తయారుచేసుకునే హోంమేడ్ క్యారెట్, యాపిల్, అల్లం జ్యూస్ బాడీ ఫ్యాట్ కరిగించడంలో అద్భుతమైనది. ఈ హోం మేడ్ జ్యూస్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉండడం వల్ల జీవక్రియలు చురుకుగా పనిచేయడానికి సహాయపడుతుంది. దాంతో వేగంగా బరువు తగ్గుతారు. అదనంగా, ఈ జ్యూస్‌లో ఉండే ఫైబర్ కంటెంట్ శరీరంలోని ఎక్సెస్ బాడీ కొవ్వును కరిగిస్తుంది. మరింకెందుకాలస్యం! మీరు కూడా ఈరోజు నుంచే మొదలుపెట్టి మీ బరువును త్వరగా తగ్గించుకోండి.

అలాంటి సందర్భాన్ని ఆస్వాదిస్తా



అనుష్క శర్మ

నటిగా తను చేస్తున్న పాత్రలే ఆలోచింపజేస్తాయంటోంది బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ. హిందీ తెరపై అగ్ర నాయికగా కొనసాగుతున్న అనుష్క... విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటోంది. 'ఎన్‌హెచ్ 10' లాంటి ప్రయోగాత్మక చిత్రాల్లోనూ మెప్పించింది. అనుష్క శర్మ నటించిన కొత్త చిత్రం 'జబ్ హ్యారీ మెట్ సెజల్'. షారుక్ ఖాన్‌తో కలిసి అనుష్క నటించిన మూడో చిత్రమిది. ఈ చిత్రంలో పంజాబీ అమ్మాయి సెజల్ పాత్రలో అనుష్క కనిపించనుంది. యూరప్ పర్యటనకు వెళ్లిన సెజల్...అక్కడి గైడ్ హ్యారీతో ప్రేమలో పడటం ఈ చిత్ర మూల కథాంశం. 'జబ్ హ్యారీ మెట్ సెజల్' ఈ శుక్రవారం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా తన పాత్ర గురించి అనుష్క మాట్లాడుతూ...'ఇది నాకు ఇష్టమైన చిత్రం. సెజల్ చాలా ప్రత్యేకమైన పాత్ర. ఎక్కువగా ఆలోచించదు. కొన్ని విలువలు పాటిస్తుంది. నా వ్యక్తిగత జీవితానికి సెజల్ కొంత దగ్గరగా ఉంటుంది. నేను నటిస్తున్న పాత్రలు కొన్నిసార్లు నా నమ్మకాలను, స్వభావాన్ని ప్రశ్నిస్తుంటాయి. అలాంటి సందర్భాలను ఆస్వాదిస్తాను. పాత్రల తీరుతెన్నులు పూర్తిగా అర్థం చేసుకుంటాను. అలా చేయగలిగితేనే తెరపై సహజంగా నటించగలను.' అని చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు తనను గుర్తుపట్టడంపై అనుష్క స్పందిస్తూ.... 'స్పెయిన్, ఇజ్రేల్ లాంటి దేశాలకు వెళ్లినా అక్కడి ప్రజలు నన్ను గుర్తుపడతారు. నా సినిమాల్లోని పాటలకు డాన్సులు చేస్తారు. అది బాలీవుడ్ సినిమా గొప్పదనం. అందులో నేను భాగమవడం గౌరవంగా భావిస్తాను.' అని చెప్పింది.

దర్శకుడిగా నాది ప్రత్యేక శైలి



క్లాస్ మాస్ హీరోల్లాగే...దర్శకులూ వేర్వేరుగా ఉంటారు. ఈ విభజనతో చూస్తే టాలీవుడ్‌లో క్లాస్ డైరక్టర్లు తక్కువ. ఉన్నవాళ్లలో స్టార్ హీరోలతో క్లాస్ సినిమాలు చేసి మెప్పించగల దర్శకులు సుకుమార్. 'ఆర్య' నుంచి 'నాన్నకు ప్రేమతో' వరకు ఆయన ప్రయాణం భిన్నంగానే సాగుతోంది. దర్శకుడిగానే కాక...నిర్మాతగా సుకుమార్ తన అభిరుచి చాటుకుంటున్నారు. ఆయన నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ నుంచి వస్తున్న కొత్త చిత్రం 'దర్శకుడు' ఆగస్టు 4న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సుకుమార్ చిత్ర విశేషాలు తన కెరీర్ సంగతులు తెలిపారు...

- సుకుమార్

☞ మా అన్నయ్య కొడుకు అశోక్ చాలా రోజులుగా సహాయ దర్శకుడిగా పనిచేస్తానంటూ నన్ను అడుగుతుండేవాడు. ఓ చిన్న అంశాన్ని చెప్పి కథ రాసుకురమ్మన్నాను. అతను రాసింది చదివి బాగుందనిపించింది. దీన్ని సినిమాగా చేద్దామని నిర్ణయించాం. అలా 'దర్శకుడు' ప్రారంభమైంది.

☞ వృత్తి పట్ల అమితమైన ఇష్టం, తన ప్రేమ...ఈ రెండు విషయాల మధ్య నలిగిపోయే పాత్ర కథానాయకుడిది. సినిమా మీద ఇష్టంతో నాతో సహా చాలా మంది దర్శకులు వ్యక్తిగత జీవితానికి తక్కువ సమయం కేటాయిస్తుంటారు. అక్కడ మనస్పర్థలు మొదలవుతాయి. ఇందులో కథానాయకుడు వృత్తిగత, వ్యక్తిగత జీవితాలను ఎలా సమతూకం చేసుకున్నాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఇలాంటిది నా జీవితంలోనూ జరిగింది. మా ఆవిడను షాపింగ్‌కు తీసుకెళ్లి, పావుగంటలో కొనుక్కోవడం అయిపోయింది. ఆమె అడిగిందల్లా నాకు నచ్చింది అని చెప్పాను.

☞ 'ఆర్య 2' చిత్రీకరణలో హీరోయిన్ వేసుకోవాల్సిన ఓ డ్రెస్ కోసం నాలుగుగంటలు పట్టింది. అప్పుడు మా ఆవిడ కోపంతో నావైపు చూసిన చూపు ఇంకా గుర్తుంది.

☞ అశోక్ బాగా నటించాడు. భావోద్వేగాల సన్నివేశాల్లో ఆకట్టుకునేలా నటించాడు. మూడొంతుల వరకు పాత్రకు న్యాయం చేశాడు. ఈ సినిమా విజయాన్ని బట్టి అతనికి భవిష్యత్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. సినిమా చూశాను. విజయంపై ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. మంచి కథ కాబట్టి బలంగా హిట్ అవుతుందని చెప్పగలుగుతున్నాను.

☞ దర్శకుడిగా నా ప్రభావం సినిమాలో ఏదీ ఉండదు. నేను సెట్లో పనిచేస్తుండటం అశోక్ చాలాసార్లు చూశాడు. అలా అతనికి తెలియకుండా నా శైలి అలవాటు అయి ఉండొచ్చు. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా దేవిశ్రీప్రసాద్ ఉంటే మరో స్థాయికి 'దర్శకుడు' వెళ్లి ఉండేది. కానీ ఇంత చిన్న చిత్రానికి దేవిని తీసుకుంటే...మా స్నేహాన్ని వాడుకున్నట్లు ఉంటుందని భావించి నేనే వద్దనుకున్నాను. అయితే సాయి కార్తీక్ మంచి సంగీతాన్ని అందించాడు. దేవిశ్రీ ప్రసాద్ ఫోన్ చేసి అడిగాడు. ఎందుకు తీసుకోలేదని. ఇలా చెప్పానికి...నువ్వు ఎలాంటి సినిమా చేసినా చెప్పు...నేనేమి అనుకోను. ఇలా వేరే వాళ్లను తీసుకుంటేనే బాధపడతాను అన్నాడు. త్వరలో చేయబోతున్న చిత్రానికి దేవి ఉంటాడు.

☞ 'రంగస్థలం 1985' 40 శాతం చిత్రీకరణ పూర్తి అయ్యింది. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్. పల్లెటూరిలో జరుగుతున్న కథ కాబట్టి ప్రయోగాత్మక చిత్రం అనుకోవద్దు. కథ పల్లెటూరి నేపథ్యంలో జరుగుతుంది. రామ్‌చరణ్‌తో అలాంటి పాత్ర కొత్తగానే ఉంటుంది కదా. ఈ సినిమా చిత్రీకరణ మాకొక ఆహ్లాదకరమైన అనుభవం. ముఖ్యంగా నా ఆరోగ్యం చాలా బాగుంది. కాలుష్యం లేదు. ఫోన్ సిగ్నల్స్ కూడా ఉండేవి కావు. కొన్ని ప్రాంతాల్లో మేము షూటింగ్ చేస్తున్న విషయం కూడా ఎవరికీ తెలియదు.

☞ నాకు పల్లెటూరు వాతావరణం అంటే ఇష్టం. ఆ నేపథ్యంలో సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. నేను చేసిన 'ఆర్య', '100 పర్సెంట్ లవ్' సినిమాల్లోనూ పాటల్లో, కొన్ని సన్నివేశాల్లో పల్లె వాతావరణం కనిపిస్తుంటుంది. ఇక ఈ తరహాలో పూర్తిస్థాయి సినిమా 'రంగస్థలం 1985'. చరణ్, సమంత పాత్రలు చాలా బాగుంటాయి. సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం.

☞ నా సినిమాల్లో కల్పన, వాస్తవికత కలిసి ఉంటాయి. 'నాన్నకు ప్రేమతో' చిత్రంలో ఎన్టీఆర్ ఫైట్ చేస్తున్నప్పుడు కౌంటులు పడుతుంటాయి. ఇది కథానాయకుడి మేథస్సు ఎంత అనేది చూపించే ప్రయత్నం. దర్శకుడిగా నా శైలి ఇది.

☞ సుకుమార్ రైటింగ్స్ పతాకంపై ఇంకా ఎక్కువ సినిమాలు నిర్మించాలి. చాలా కథలు విన్నాను. అయితే దర్శకుడిగా నాకు సమయం లేదు. ఇన్ని కథలు విని, నిర్ణయాలు తీసుకునేంత తీరిక దొరకలేదు. అందుకే నా బ్యానర్‌లో నిర్మాణాలు నెమ్మదించాయి.

☞ దర్శకుడిగా ఓ సినిమా పూర్తయ్యాకే కొత్త కథను రాయడం మొదలు పెడతాను. సింగిల్ లైన్‌లో చాలా కథలు ఉన్నా...వాటిని విస్తృతి చేశాకే మరో సినిమాకు వెళ్తాను. బయోగ్రఫీ సినిమాలు ఎక్కువగా వస్తుండటం మార్పునకు సంకేతం. సైన్స్ ఫిక్షన్ సినిమా చేయాలని ఉంది.

ప్రేమను వదిలిపెట్టని కుర్రాడి కథ



జయజానకినాయక చిత్రం ప్రేక్షక హృదయాలను తాకుతుందన్న అభిప్రాయాన్ని దర్శకుడు బోయపాటి శ్రీను వ్యక్తంచేశారు. బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్‌ప్రీత్‌సింగ్ నాయకానాయికలుగా ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. బిగ్ సీడీ, ఆడియో సీడీలను వి.వి.వినాయక్ ఆవిష్కరించి, తొలి సీడీని బోయపాటి శ్రీనుకు అందించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ, జీవితంలో కష్టం వచ్చిన ప్రతీసారి ప్రేమను వదిలేస్తాం. కానీ ప్రేమించాను కాబట్టి ప్రేమను వదిలిపెట్టను అనే కుర్రాడి కథతో ఈ చిత్రం ఉంటుంది. తన తండ్రిని, తల్లిని, అన్నను ఎలా ప్రేమించాడో, వారు ఎక్కడున్నా ఎలా బావుండాలని కోరుకుంటాడో అలాగే తాను ప్రేమించిన అమ్మాయి బావుండాలని కోరుకునే పాత్ర అతనిది. ఈ పాత్రలో చక్కటి నటనను కనబరిచారు శ్రీనివాస్. సినిమాను చూసిన ప్రేక్షకులు ఇది నిజమేనని ఒప్పుకుంటారు. మంచి నటులు, సాంకేతిక నిపుణులు కుదిరారు. నిర్మాత ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడలేదు. ఇప్పుడు నేను అంగీకరించిన సినిమాలు పూర్తి కాగానే మళ్లీ ఆయన నిర్మాతగా మరో మంచి సినిమా చేస్తానని మాట ఇస్తున్నా అని అన్నారు.

ముఖ్యఅతిథి వి.వి. వినాయక్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో ఏడు పాటలుంటే ఏడు పాటలూ బావున్నాయి. ఇందుకు దేవిశ్రీప్ర సాద్‌ను అభినందించాలి. ఈ సినిమా లెజెండ్ అంత గొప్ప విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నా అని అన్నారు.

హీరో బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, నా కెరీర్ ప్రారంభంలో బోయపాటి వంటి దర్శకుడు ఇచ్చిన సపోర్ట్ మరచిపోలేను. ఎంత పెద్ద స్టార్‌తో అయినా ఆయన సినిమా చేయగలరు. అయితే నన్ను నమ్మి నాతో ఈ సినిమా చేసినందుకు ఆయనకు రుణపడి ఉంటాను. నాన్న నా కలను ఆయన కలగా తీసుకుని నిజం చేశారు. చిత్రం బాగా రావడానికి కృషిచేసిన చిత్రబృందానికంతటికీ ధన్యవాదాలు అని అన్నారు. నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, బోయపాటి గురించి ఎంత మాట్లాడినా తక్కువే. ఆయన లేకుంటే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ప్రేక్షకుల అంచనాలు, ఊహలకు తగ్గకుండా ఈ చిత్రం ఉంటుంది. హీరో శ్రీనివాస్ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. దేవిశ్రీప్రసాద్ వృత్తిపట్ల అంకితభావం ఉన్న సంగీత దర్శకుడు. ఆయన అందించిన ఏడు పాటలు ఎంతో గొప్పగా ఉన్నాయి అని అన్నారు. కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ, జానకి పాత్రను నాకిచ్చిన బోయపాటికి కృతజ్ఞతలు. మంచి భావోద్వేగాలు ఉండే కొత్తరకమైన పాత్రలో ఇందులో నటించాను అని చెప్పారు. దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ, ఈ టైటిల్ వినగానే లవ్‌లో పడిపోయాను. అంతలా ఆకట్టుకునే టైటిల్‌ను పెట్టారు బోయపాటి. ఆయనతో కలిసి చేస్తున్న నాలుగవ చిత్రమిది అని అన్నారు. ఈ వేడుకలో జగపతిబాబు, శరత్‌కుమార్, వాణీవిశ్వనాథ్, తరుణ్ అరోరా, రచయిత రత్నం, రిషి పంజాబి, సాహిసురేష్, ప్రేమ్‌రక్షిత్, కోటగిరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.నారాయణమూర్తి కొత్త చిత్రం అన్నదాత సుఖీభవ

తనదైన పంథాలో సినిమాలను తెరకెక్కించే ఆర్.నారాయణమూర్తి తాజాగా అన్నదాత సుఖీభవ పేరుతో ఓ చిత్రం రూపొందిస్తున్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించి, వారు పండించిన పంటకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలనే ప్రధానాంశంతో ఆయన ఈ చిత్రాన్ని మలచనున్నారు. కాగా త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానుందని మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆర్.నారాయణమూర్తి వెల్లడించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. రైతేరాజు అని అంటారు. కానీ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం బాధాకరం. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాలు కొన్ని పథకాలు ప్రవేశపెట్టినా అత్యంత ముఖ్యమైన గిట్టుబాటు ధరను కల్పించకపోవడం వల్ల వారు ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. ఈ అంశాలను కథావస్తువుగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నాం. దీనికి గద్దర్, వంగపండు, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ సాహిత్యాన్ని అందించారు అని చెప్పారు.



అమెరికా నేపథ్యంలో



శతృఘ్న రాయపాటి, స్టెఫానీ, జోసెలిన్ నాయకానాయికలుగా రమ్స్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం గ్రీన్‌కార్డ్. సింహ ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీనివాస్‌గుప్తా, మోహన్.ఆర్., నరసింహ, నాగశ్రీనివాసరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు రమ్స్ మాట్లాడుతూ, వీసా తీసుకుని అమెరికాకు చేరుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. గత పదిహేనేళ్లుగా అమెరికాలో నేను గమనించిన పరిస్థితులను ఆధారంగా చేసుకుని ఈ కథను తయారుచేసుకున్నాను. పిల్లలను అమెరికాకు పంపాలనుకునే తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా ఇది. 90 శాతం సినిమాను అమెరికాలోనే చిత్రీకరించాం. ఆద్యంతం సరదాగా సాగే సినిమా ఇది. అమెరికా జీవితాన్ని, అక్కడే ఉన్నవారికి తెలియని చాలా విషయాలను ఇందులో చూపిస్తున్నాం. ఇండియాలో కూడా అమెరికాలాగే గన్ కల్చర్ వచ్చేసింది. ఆ కల్చర్ పోవాలని కూడా ఈ సినిమాలో చూపించబోతున్నాను అని అన్నారు.

సీనియర్ నటుడు చలపతిరావు మాట్లాడుతూ, దర్శకుడు రమణారెడ్డి కూడా అమెరికా వెళ్లి రమ్స్‌గా పేరు మార్చుకున్నారు. లోగడ రియల్‌స్టోరి సినిమాకు ఆయన దర్శకత్వం వహించారు. గ్రీన్‌కార్డ్ కోసం ఎన్ని తిప్పలు పడతారనే కాన్సెప్ట్‌తో ఈసినిమా రూపొందించబడింది. ఇందులో నేను హీరో తండ్రి పాత్రలో నటించాను అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నరసింహ, పంపిణీదారుడు బాబు, ఎన్.ఆర్.ఐ.లు మ్యాథ్యూస్, ఏంజెలినా తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ తొలి వారంలో 'లచ్చి'

వ్యాఖ్యాత జయంతి నాయికగా నటించిన చిత్రం 'లచ్చి'. జయంతి ఈ చిత్రానికి నిర్మాణ బాధ్యతలూ వహించింది. ఈశ్వర్ దర్శకత్వం వహించారు. హార్రర్ కామెడీ తరహాలో 'లచ్చి' తెరకెక్కింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపారు. నాయిక, నిర్మాత జయంతి మాట్లాడుతూ...'గతంలో టీవీ కార్యక్రమాలు నిర్మించిన అనుభవంతో సినిమా నిర్మాణాన్ని చేపట్టాను. కథ నచ్చి నేనే ప్రధాన పాత్రలో నటించాను. హార్రర్ కామెడీ చిత్రాలు చాలా వస్తున్నాయి. కానీ 'లచ్చి' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. కథంతా లచ్చి పాత్ర చుట్టూనే తిరుగుతుంది. కావాల్సినంత హాస్యం కథనంలో ఉంది. ఎంవీ రఘు సినిమాటోగ్రఫీ, మరుదూరి రాజా మాటలు చిత్రానికి ఆకర్షణ అవుతాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ తొలివారంలో సినిమాను తెరపైకి తీసుకొస్తాం.' అన్నారు. తేజస్వినీ, దిలీప్, చంద్రమోహన్, పూర్ణిమ, శివ ప్రసాద్, రఘుబాబు తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.



జయంతి

యధార్ధ సంఘటన ప్రేరణగా



నరసింహ నంది

లక్షలాది రైతు కుటుంబాలకు గేదె జీవనాధారం కావడం చూస్తున్నదే. ఎన్నో పేద రైతుల కుటుంబాల్లో గేదెను సొంత కొడుకులా చూసుకుంటుంటారు. అలాంటి గేదె యాక్సిడెంట్ కారణంగా మృత్యువాత పడితే ఆ కుటుంబం ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటుంది. ఆ గేదె చనిపోవడానికి కారణమైన ఎం.ఎల్.ఏ. తనయుడికి ఎలాంటి శిక్ష పడిందన్న కథాంశంతో బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు నరసింహ నంది చెప్పుకొచ్చారు. లోగడ 1940లో ఒక గ్రామం, హైస్కూల్, కమలతో నా ప్రయాణం, లజ్జ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆయన తాజాగా రూపొందించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు.

ఆ సంఘటన తర్వాత ఈ కథ పుట్టింది

ఇరానియన్ చిత్రం ది కౌ ఈ చిత్రానికి చేసేందుకు ఓ స్ఫూర్తి. ఒక జంతువుకి, మనిషికి ఉన్న అనుబంధం ఎలాంటిది అనేది ఆ సినిమాలో చూపించారు. నేను కళ్లారా చూసిన ఓ యథార్థ సంఘటన కూడా ఈ సినిమా చేసేందుకు కారణమైంది. ఓ సారి నేను మా ఊరికి వెళ్తున్నప్పుడు నలుగురు కుర్రాళ్ళు వేగంగా కారుని నడుపుతూ ఓ గేదెను యాక్సిడెంట్ చేసి వెళ్లిపోయారు. కనీసం వారు కారును కూడా ఆపలేదు. ఆ గేదె చనిపోయింది. ఆ గేదె తాలుకూ మనిషి వచ్చి బాధపడుతుంటే వెంటనే పోలీస్ కేసు పెట్టండని నేను సూచించాను. ఈ సంఘటన తర్వాత నాకు వచ్చిన ఆలోచనలో నుంచి పుట్టిందే ఈ కథ.

సహజత్వానికి దగ్గరగా ఉండే పాత్రలు

కొత్తవాళ్లతో చేస్తేనే ఈ కథకు న్యాయం జరుగుతుందనిపించింది. పాతవారైతే ఆ పాత్రలలో ఒదిగిపోవాలంటే వారికున్న ఇమేజ్ అడ్డు రావచ్చు. ఇక ఇందులోని పాత్రలన్నీ సహజత్వానికి చాలా దగ్గరగా ఉంటాయి. ఓ గ్రామంలో ఎలా ఉంటారో అలానే వారి పాత్రలు ప్రవర్తిస్తాయి. ఈ చిత్రం షూటింగ్ అంతా బుడ్డారెడ్డిపల్లి గ్రామంలోనే చేశాం. ఆ గ్రామానికి చెందినవారు చాలా గొప్పవారయ్యాని చెబుతారు. దాదాపు 200 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రామం అది. పైపెచ్చు టైటిల్ కూడా విభిన్నంగా ఉంటుందని అలా పెట్టాం.

నా గత చిత్రాలకంటే ఈ చిత్రం వేగంగా ఉంటుంది

ఇంతకుముందు నేను తీసిన చిత్రాలు స్లో నేరేషన్‌తో నెమ్మదిగా సాగాయి. కానీ ఈ చిత్రం వేగంగా ఉంటుంది. ఇందులో పాత్రలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇందులో మీడియా మీద చల్లా భాగ్యలక్ష్మి రాసిన పాటకు చాలా మంచి స్పందన లభించింది. మొత్తంమీద ఓ మంచి కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల ఆదరణకు నోచుకుంటుందన్న నమ్మకం ఉంది.

తదుపరి చిత్రం

తెలుగు భాషకు సంబంధించిన కథాంశంతో ఉత్పలమాల ఉత్తరం రాసింది అనే చిత్రం చేస్తున్నాను. ఇప్పటికి మూడొంతులు పూర్తయింది అంటూ ఇంటర్వ్యూ ముగించారు.



బాలకృష్ణ అభిమానులు, వాళ్ల కుటుంబ సభ్యులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు భవ్య క్రియేషన్స్ సంస్థ తెలిపింది. బాలకృష్ణ 101వ చిత్రంగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో నిర్మాత వెనిగళ్ల ఆనంద్ ప్రసాద్ నిర్మిస్తున్న 'పైసా వసూల్' సినిమా సెప్టెంబర్ 1న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా 101 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల బాలకృష్ణ అభిమానులు దర్శకుడు పూరీ జగన్నాథ్, నిర్మాత ఆనంద్ ప్రసాద్‌లను హైదరాబాద్‌లో కలిశారు.

భయపెడుతూ నవ్వించే దెయ్యాలు

శ్రీనాథ్ మాగంటి, సాక్షికక్కర్, రచనస్మిత్, రుచిపాండే నాయకానాయికలుగా రచ్చ రవి, కిరాక్ ఆర్.పి. కీలక పాత్రల్లో తెరకెక్కిన చిత్రం ఇదేం దెయ్యం. వి.రవివర్మ దర్శకుడు. ఏ.వి.రమణమూర్తి సమర్పణలో చిన్మయనంద ఫిల్మ్స్ పతాకంపై ఎస్.సరిత నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు రవివర్మ మాట్లాడుతూ, ఈ చిత్రం కామెడీ చాలా హైలైట్‌గా ఉంటుంది. హారర్ సన్నివేశాలు ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తాయి. సినిమాను చూసిన ప్రేక్షకులు ఎంతో బాగా ఎంజాయ్ చేస్తారు అని అన్నారు. హీరో శ్రీనాథ్ మాగంటి మాట్లాడుతూ, హాస్యానికి పెద్దపీట వేస్తూ రూపొందించిన చిత్రమిది. భయపడే సన్నివేశాలు కూడా అదేస్థాయిలో ఉంటాయి అని అన్నారు. సంగీత దర్శకుడు బాలుస్వామి మాట్లాడుతూ, మా చిత్రంలోని దెయ్యాలు భయపెడుతూనే నవ్విస్తాయని చెప్పారు. ఆ సన్నివేశాలన్నీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. హీరోయిన్ సాక్షి కక్కర్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు నేను నటించిన సినిమాలన్నింటికంటే భిన్నమైన పాత్రను ఇందులో పోషించానని చెప్పారు.



శ్రీనాథ్ మాగంటి, సాక్షి కక్కర్